

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 204

బుధవారం 15-10-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



వద్దిక.. ఓవర్ ఒద్దిక బెటర్!

జెన్ ఆల్ఫాలో కొందరు ఎక్కువగా ఇన్‌ఫ్లుయెన్సర్స్‌ను, వాళ్లు చూస్తున్న రీల్స్, షార్ట్స్, షోస్‌లోని క్యారెక్టర్స్‌ను అనుకరిస్తుంటారు. ఈ తీరు కొందరికి అతిగా... అసహజంగా అమర్యాదగా తోచవచ్చు. ఇంకొందరికి ముచ్చటగా అనిపించవచ్చు. ఈ రెండిటికీ ఉదాహరణగా ఇటీవల వైరల్ అయిన కౌన్ బనేగా కరోడ్‌పతి 17 వ సీజన్ 'కేబీసీ జూనియర్స్' లో ఓ చిన్నారి పార్టిసిపెంట్ వీడియోను చూపిస్తున్నారు.

- IIలో

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 15-10-2025

“పఠనాభిరుచి కేవలం ఆహ్లాదానికి సంబంధించిన విషయం మాత్రమే కాదని, అభిజ్ఞా వ్యాయామం (కాగ్నిటివ్ ఎక్సర్‌సైజ్) అని శాస్త్రీయ అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. ‘ పుస్తక పఠనం అనేది మెదడులో ఇన్‌ఫర్మేషన్ ప్రాసెసింగ్‌కు సంబంధించి కొత్త మార్గాలను సృష్టిస్తుంది’ అంటున్నారు డెవలప్‌మెంటల్ సైకాలజీ అండ్ కాగ్నిటివ్ న్యూరోసైన్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ గ్రెగోయిర్.”


ప్రతీకాత్మక చిత్రం

వద్దిక... ఓవర్ ఒద్దిక బెటర్!

పేరెంటింగ్‌పై చర్చ

ఇది వైరల్ కాలం! సర్వైలెన్స్ కెమెరాల మధ్య బిగ్ బాస్ హౌస్ ఉన్నట్టే జెన్ ఆల్ఫా కూడా తమను సోషల్ మీడియా ఫ్రేమ్‌లో ఫిక్స్ చేసుకుంది! అందుకే వాళ్లు ఎక్కువగా ఇన్‌ఫ్లుయెన్సర్స్‌ను, వాళ్లు చూస్తున్న రీల్స్, షార్ట్స్, షోస్‌లోని క్యారెక్టర్స్‌ను అనుకరిస్తుంటారు. ఈ తీరు కొందరికి అతిగా... అసహజంగా అమర్యాదగా తోచవచ్చు. ఇంకొందరికి ముచ్చటగా అనిపించవచ్చు. ఈ రెండిటికీ ఉదాహరణగా ఇటీవల వైరల్ అయిన కౌన్ బనేగా కరోడ్‌పతి 17 వ సీజన్ ‘కేబీసీ జూనియర్స్’ లో ఓ చిన్నారి పార్టిసిపెంట్ వీడియోను చూపిస్తున్నారు. దీనిపై కామెంట్లు, కాంప్లిమెంట్లను పక్కన పెడితే ఈ వీడియో.. జెన్ ఆల్ఫా పేరెంటింగ్ కి సంబంధించి ఓ చర్చను లేవనెత్తింది...

కేబీసీలో ఇదీ జరిగింది..
కౌన్ బనేగా కరోడ్‌పతి17వ సీజన్‌లోని ‘కేబీసీ జూనియర్స్’ హాట్ సీట్‌లో ఓ బుడతడు కూచున్నాడు. చుట్టూ కెమెరాలు.. ఆడియెన్స్.. ఎదురుగా 83 ఏళ్ల పాపులర్ పర్సనాలిటీ.. ఎవర్‌గ్రీన్ సెలబ్రిటీ అమితాబ్ బచ్చన్.. అయినా ఎలాంటి బెరుకు లేకుండా చాలా రిలాక్స్‌డ్‌గా.. ఇంకా చెప్పాలంటే ఆ కూర్చోవడంలోనే అందరి అటెన్షన్‌ను గ్రాబ్ చేశాడా పిల్లాడు. వాడి ఆత్మవిశ్వాసానికి ముచ్చటపడుతూ అమితాబ్ ‘హాట్ సీట్‌లో కూర్చోవడం ఎలా ఉంది?’ అనడిగారు. ‘ఎక్సయిటెడ్‌గా ఉన్నాను కానీ.. మీరు రూల్స్ చెబుతూ కూర్చోకండి.. నాకు ఈ షో రూల్స్ అన్నీ తెలుసు.. నేరుగా పాయింట్‌కి వచ్చేద్దాం’ అన్నాడు. ఆ జవాబు హోస్ట్ అయిన అమితాబ్‌ను ఖంగుతినేలా చేసింది. అయినా తమాయించుకుని షోని ప్రొసీడ్ చేశాడు. మొదటి ప్రశ్న అడిగి ఆప్షన్స్ ఇచ్చేలోపే జవాబు చెప్పి ఆప్షన్స్ లేకుండానే నా ఆన్సర్‌ని లాక్ చేసేయ్ డాన్స్.. ఆప్షన్ ఏదైనా ఈ ఆన్సర్ లాక్ చేసెయ్’ అన్నాడు అమర్యాదగా. ఆ తర్వాత ప్రశ్న అడిగేముందు ఏదో చెప్పబోతున్న అమితాబ్‌ను‘మీరు ప్రశ్న యితే అడగండి ముందు’ అన్నాడు అదే ధోరణిని కొనసాగిస్తూ. అదే ప్రవర్తనతో ఆ పిల్లాడు అలా అయిదవ ప్రశ్న దాకా వచ్చాడు. 25 వేలు వచ్చే అయిదవ ప్రశ్న ‘వాల్మీకి రామాయణంలోని మొదటి కాండ ఏది?’ కి ఆప్షన్స్ అడిగాడు ఆ కుర్రాడు.‘బాల కాండ.. అయోధ్య కాండ.. కిష్కింధ కాండ.. యుద్ధ కాండ’ అంటూ నాలుగు ఆప్షన్స్‌ను చదివారు అమితాబ్. వెంటనే ‘బి.. అయోధ్యకాండ’ అని చెబుతూ ‘ఒక్కసారి కాదు ఈ ఆన్సర్‌ను నాలుగుసార్లు లాక్ చేయండి’ అన్నాడు పిల్లాడు. ‘సారీ.. తప్పు చెప్పావ్.. కరెక్ట్ ఆన్సర్ బాలకాండ’ అన్నారు అమితాబ్. ఈసారి ఆ పిల్లాడు ఖంగు తిన్నాడు.

ఆ బాబు వయసు పదేళ్లు. అయిదవ తరగతి చదువుతున్నాడు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఉంటాడు. ఆ పిల్లాడు జవాబులు చెబుతూంటే ఆడియెన్స్ గ్యాలరీలో ఉన్న అతని తల్లిదండ్రులు కొడుకువైపు మురిపెంగా.. గర్వంగా చూడసాగారు.

ఈ కార్యక్రమాన్ని వీక్షించిన వాళ్లు సోషల్ మీడియాలో రెండురకాలుగా స్పందించారు. కొందరు ‘జ్ఞానం ఒక్కటే ఉంటే సరిపోదు.. కాసింత వినయం, సంస్కారం కూడా ఉండాలి’,‘అది కాన్ఫిడెన్స్ కాదు ఓవర్ కాన్ఫిడెన్స్.. ’, ‘చదువు కన్నా ముందు పిల్లలకు మర్యాద, మన్నన నేర్పాలి’, ‘అమ్మో... పిల్లాడు కాదు... మహా ముదురు’ అంటూ, ఇంకొందరు ‘అయిదు నిమిషాల ఫుటేజ్ చూసి పిల్లాడి బిహేవియర్‌ని జడ్జ్ చేయడమేంటీ?’, ‘పేరెంట్స్ పిల్లాడికి కాస్త మర్యాదగా నడుచుకోమని చెప్పి ఉంటే బాగుండేది’ అంటూ కామెంట్ చేశారు.

బ్రేక్ పడాల్సిన ఫ్లేస్ ఇల్లు...



‘ఇలాంటి ప్రవర్తన ఉన్న ట్రెండ్‌ను 6 -13 ఏళ్ల పిల్లల్లో ఎక్కువగా చూస్తాం. ఇది బుద్ధిమాంద్యం లేదా ఏడీహెచ్‌డీ ఏమాత్రం కాదు. డిఫరెంట్‌గా కనిపించాలనే తాపత్రయం, పదిమంది దృష్టిని ఆకర్షించాలన్న లక్ష్యం. ఒక్క మాటలో చెప్పాలంటే డిఫరెంట్ బిహేవియర్‌తో సోషల్ మీడియా అటెన్షన్‌ను గ్రాబ్ చేయడమన్న మాట. దీనికి ఇండివిడ్యువలిస్ట్‌గా పెరగడం, ఓవర్ కాన్ఫిడెన్స్.. ఓవర్ ఆటిట్యూడ్ బిహేవియర్ కారణం. వాళ్లు సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్, రీల్స్ షార్ట్స్ లోని క్యారెక్టర్లను అనుకరిస్తూ తమ సహజత్వాన్ని మరచిపోతారు. ఆ ప్రభావంతో అందరూ గౌరవిస్తున్న వాళ్ల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తూ అందరి దృష్టిని ఆకర్షించాలనుకుంటారు. అందులో భాగమే పెద్దవాళ్లను ఏకవచనంతో సంబోధించడం, అన్నీ తమకే తెలుసన్నట్లుండటం, వయసుకు మించి మాట్లాడటం లాంటివి. ఇలాంటి పిల్లల ప్రవర్తనను చక్కదిద్దక పోగా దాన్ని వాకి తెలివితేటలుగా అభివర్ణిస్తూ ప్రోత్సహిస్తుంటే ఇదిగో ఇలాగే ఓవర్ కాన్ఫిడెంట్‌గా తయారవుతారు. ఈ తీరును మొక్కగా ఉన్నప్పుడే తుంచేయాలి. దీనికి బ్రేక్ పడాల్సిన ఫ్లేస్ ఇల్లు.. బ్రేక్ వేసి ఆ ప్రవర్తనను సరిచేయాల్సిన వాళ్లు తల్లిదండ్రులే.

- డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి
కన్సల్టెంట్ చైల్డ్ అండ్ అడల్ట్ సైకియాట్రిస్ట్, హైదరాబాద్

ఆ ట్రైనింగ్ పేరెంట్సే ఇవ్వాలి...



‘ఆ బుడతడి వీడియో చాలా వైరల్ అయింది. వైరల్ అయిన వీడియో కూడా జస్ట్ ఒక టూ త్రీ మినిట్స్ క్లిప్పింగ్ అంతే! దాన్నిబట్టే ఆ పిల్లాడి ప్రవర్తనను, పేరెంటింగ్‌ను జడ్జ్ చేయడం కరెక్ట్ కాదని నా ఉద్దేశం. ట్రోల్ చేయడం కూడా తప్పే. అది పిల్లాడి మీద, అతని తల్లిదండ్రుల మీదా తీవ్ర ప్రభావం చూపిస్తుంది. అయితే.. ఆ పిల్లాడిలో ఇంపల్సివిటీ కనిపిస్తోంది. దాన్ని కంట్రోల్ చేసుకోవాలి. ఆ ట్రైనింగ్ పేరెంట్సే ఇవ్వాలి.

- వర్ష వేములు, సైకోథెరపిస్ట్

● భ్రమణ కాంక్ష



రైలుతో... ఆమె చెట్టపట్టాలు

మోనిషా రాజేష్...
42 ఏళ్ల ఈ ట్రావెల్ రైటర్‌కు గత 15 సంవత్సరాలుగా రైలే ఇల్లు. 2010లో ఆమె 80 రైళ్లలో దేశమంతా తిరిగి ‘అరౌండ్ ఇండియా ఇన్ 80 ట్రైన్స్’ పుస్తకం రాశారు. ఆ తర్వాత లోకమంతా 80 రైళ్లలో చుట్టేసి ‘అరౌండ్ ద వరల్డ్ ఇన్ 80 ట్రైన్స్’ రాసి సంచలనం సృష్టించారు. ఇప్పుడు స్త్రీలు రాత్రిపూట చేసే రైలు ప్రయాణాలు ఎలా ఉంటాయో ప్రపంచమంతా తిరిగి ‘మూన్‌లైట్ ఎక్స్‌ప్రెస్’ వెలువరించారు. ఈ రైలు ప్రయాణాల ప్రేమికురాలి పరిచయం...

‘భారతదేశాన్ని చూడాలంటే రైలులోనే చూడాలి’ అంటారు మోనిషా రాజేష్. యు.కె.లో స్థిరపడ్డ ఈ మాజీ జర్నలిస్టు ఇప్పుడు పూర్తిగా ‘ట్రావెల్ రైటర్’గా మారారు. ఆశ్చర్యకరంగా ఆమె తన కెరీర్‌కు ‘రైలు’ను ఒక ఆధారంగా మలుచుకున్నారు. అంటే పుస్తకాలు అమ్ముడవగా వచ్చే డబ్బు ఆమెకు రైలు ద్వారా వస్తున్నట్టే. ‘హఠాత్తుగా నాకు ఏమర్థమైందంటే నా పుస్తకాలకు రైలు కంటే మించిన కథానాయకుడు లేడని’ అంటారామె నవ్వుతూ. ఆమె తాజా పుస్తకం ‘మూన్‌లైట్ ఎక్స్‌ప్రెస్ – అరౌండ్ ద వరల్డ్ బై నైట్ ట్రెన్’ మార్కెట్‌లోకి వచ్చింది. ప్రపంచంలోని అనేక దేశాలలో రాత్రి జర్నీల ద్వారా ట్రెన్‌లలో సంచారం చేస్తూ తాను చూసిన ప్రపంచాన్ని పరిచయం చేశారు మోనిషా. ఇప్పటివరకూ ‘రైలు’ ప్రయాణాల ఆధారంగా ఆమెవి నాలుగు పుస్తకాలు వచ్చాయి.

మొదటిసారి రైలుతో ప్రేమ

మోనిషా తల్లిదండ్రులది చెన్నై. ఇద్దరూ డాక్టర్లు. అయితే యు.కెలోని నార్‌ఫోక్‌లో స్థిరపడ్డారు. మోనిషా అక్కడే పుట్టి పెరిగింది. ఆమెకు 9 ఏళ్లు ఉన్నప్పుడు తల్లిదండ్రులు రెండేళ్ల పాటు వెనక్కు వచ్చి చెన్నైలో ఉన్నారు కాని ఆ సమయంలో మోనిషాకు దేశం గురించి తెలుసుకునే అవకాశం రాలేదు.

తర్వాత ఆమె చదువు సాగి, జర్నలిస్టుగా మారాక, 2010 లో మరోసారి ఇండియాకు వచ్చారు. ‘నా దేశాన్ని చూడాలి అని నేను అనుకున్నప్పుడు విమాన ప్రయాణం బడాయి వద్దనుకున్నాను. రోడ్డు సేఫ్ కాదు. అందుకే రైలు ప్రయాణం ఎంచుకున్నాను. 90 రోజుల పాస్ తీసుకుని రైళ్లలో తిరగడం మొదలైన రెండు నెలల్లోనే నాకు అర్థమైపోయింది భారత దేశంలో రైలు ప్రయాణం అద్భుతమని. అందుకే ఈసారి ఒక ప్లాన్‌తో వచ్చి 80 ట్రైన్లలో తిరిగి ‘అరౌండ్ ఇండియా ఇన్ 80 ట్రైన్స్’ పుస్తకం రాశాను. దానికి బోల్డంత పాఠకాదరణ, అవార్డులు లభించాయి. ఆ ఉత్సాహం నన్ను రైలులో ప్రపంచ యాత్ర చేసేలా చేసింది’ అని తెలిపారు మోనిషా. ఆమె ఇండియాలో తిరుగుతూ కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో భువనేశ్వర్ నుంచి హైదరాబాద్‌కు వచ్చారు.. మోనిషా రైలు మార్గం ఉన్న ప్రతి దేశంలో తిరుగుతూ ‘అరౌండ్ ద వరల్డ్ ఇన్ 80 ట్రైన్స్’ పుస్తకం రాశారు. ఇప్పుడు రాత్రి ప్రయాణాలు ఉన్న రైళ్లలో ప్రయాణించి ‘మూన్‌లైట్ ఎక్స్‌ప్రెస్’ పుస్తకం రాశారు.



ధన్యమయ్యే ప్రయాణం

‘నేను భారతదేశమంతా సెకండ్ క్లాస్ ట్రైన్‌లో తిరిగాను. భారతదేశం అర్థం కావాలంటే ట్రైను ప్రయాణం చేయాలి. అదీగాక మనుషులు విమాన ప్రయాణాలతో విసుగెత్తారు. కోవిడ్ వల్ల లాక్‌డౌన్ వచ్చి ముగిశాక ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు భ్రమణకాంక్ష పెరిగింది. లోకం చూద్దాం అనుకుంటున్నారు. దానికి గొప్ప మార్గం రైలే. యూరప్‌లో 2015 నాటికి రాత్రి ప్రయాణాలు ఉండే స్లీపర్ ట్రైన్‌లు బంద్ చేశారు. ఇప్పుడిప్పుడే అవి తిరిగి మొదలయ్యాయి. స్త్రీలు ఒంటరిగా రాత్రిళ్లు రైలు ప్రయాణాలు చేయడం, జీవితాన్ని ఆస్వాదించడంలో భాగమే’ అంటారు మోనిషా.

ప్రకృతి కన్నులు

‘టర్కీ నుంచి ఆర్మేనియా వరకూ 26 గంటల పాటు సాగే రైలు ప్రయాణం అద్భుతం. టర్కీ సౌందర్యం మొత్తం అక్కడ చూడొచ్చు. ఇక అత్యుత్తమ రైలు ప్రయాణమంటే నార్వే దేశానికి వెళ్లాలి. అక్కడ రైలు కంపార్ట్‌మెంట్లు ఇల్లంత సౌకర్యంగా ఉంటాయి. భోజనం ఏది కావాలంటే అది దొరుకుతుంది. అదొక్కటే కాదు రాత్రి మూడు గంటలకు రైలు అద్దాల్లో నుంచి సూర్యోదయం చూడొచ్చు. ఇలా మరెక్కడ సాధ్యం?’ అంటారు మోనిషా.

● కాస్త సరదాగా

ర్యాంప్‌పై స్వీట్ వాక్



- మోడల్స్: శ్రీ గులాబ్ జామ్ గారు, శ్రీ మోతీచూర్ లడ్డుగారు...

స్వీట్లు లేని దీపావళిని ఊహించలేము. మరి దీపావళిని పురస్కరించుకొని ఫ్యాషన్ షోలో మిఠాయిలు పాల్గొంటే ఎలా ఉంటుంది? స్వీట్లు ఏమిటి? ఫ్యాషన్ షో ఏమిటి అని ఆశ్చర్యపోతున్నారా? ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) తలుచుకుంటే ఏదైనా సాధ్యమే కదా! ఒక ఏఐ ఆర్టిస్ట్ దీపావళి స్వీట్స్‌కు మోడల్స్‌గా అందమైన రూపాలను ఇచ్చి ఫ్యాషన్ షోలో పాల్గొనేలా చేశాడు. కాజు కట్లీ వయ్యారపు నడకతో ఫ్యాషన్ షో మొదలవుతుంది. ఆ తరువాత శ్రీయుత మిల్క్ కేక్ గారు, మిస్ బర్ఫీ కుమారి గారు, శ్రీమతి మోతిచూర్ లడ్డుగారు కూడా వస్తారు. చీర ధరించి ర్యాంప్ వాక్ చేసిన సోన్ పాపిడీ గారితో షో ముగుస్తుంది. ఆన్‌లైన్ లో షేర్ చేసిన ఈ ఏఐ జనరేటెడ్ వీడియో నెటిజనులలో నవ్వులు పూయిస్తుంది.

● బై మిస్టేక్

‘క్యాన్’తార



ఒక పౌరాణిక సినిమాలో ఏదో సీన్‌లో దూరంగా రైలు వెళుతున్న దృశ్యం, మరో సినిమాలో కరెంట్ తీగలు కనిపించడం గురించి సరదాగా మాట్లాడుకుంటారు.
తాజా విషయానికి వస్తే... ‘కాంతార’ సినిమాలో ఒక సీన్ వైరల్ అయింది.

కాంతార కథ రాజుల కాలం నాటిది. ఆ కాలంలో వాటర్‌క్యాన్‌లు ఉండే ఛాన్స్ లేదు. అయితే ఈ సినిమాలో విందుభోజనాలకు సంబంధించిన ఒక సీన్‌లో దూరంలో వాటర్ క్యాన్ కనిపిస్తుంది. ఇప్పుడు ఈ మోడ్రన్ ప్లాస్టిక్ క్యాన్ ఇంటర్‌నెట్‌లో టాకింగ్ పాయింట్ అయింది.

‘ఆ కాలంలో ప్లాస్టిక్ లేనే లేదు. నిజానికి ప్లాస్టిక్ ఎప్పుడు పుట్టిందంటే, ప్లాస్టిక్ పితామహుడు ఎవరంటే’ ఇలాంటి జనరల్ నాలెడ్జ్ విషయాలతో పాటు... ‘ఫలానా సినిమాలో ఫలాన పొరపాటును మీరు గమనించారా?’లాంటి విషయాలెన్నో సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు.

ఇక ఈ ప్లాస్టిక్ క్యాన్ సీన్‌పై మీమ్స్ సంగతి సరే సరి. ‘ఇది బడా బ్లండర్ ఏమీ కాదు. పెద్ద సినిమా అన్నాక చిన్న తప్పులు సహజమే’ అని ఒక యూజర్ మూవీ మేకర్స్‌ని సమర్థించాడు.

● లీగల్

మీ మాజీ భార్య భర్తపై మీరు కేసు వేయొచ్చు!

నా భార్య మరొకరితో సంబంధం పెట్టుకొని నా నుంచి విడాకులు తీసుకుంది. విడాకుల కేసులో నేను తనకు ఫలానా వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది అని పేరుతో సహా చెప్పినప్పటికీ, తనకు అలాంటివేమీ లేవని కోర్టును నమ్మించింది. దాంతో నేను పదిలక్షల రూపాయలు భరణంగా చెల్లించవలసి వచ్చింది. మా విడాకులు అయిన 7 నెలలకే తను అదే వ్యక్తిని పెళ్లి చేసుకుంది. తను నా భార్యగా ఉన్నప్పుడు వారు కలిసి తీసుకున్న ఫోటోలు కొన్ని పెళ్లి వీడియోలో పెట్టి ఇంటర్నెట్లో కూడా పెట్టుకున్నారు. నన్ను మానసిక క్షోభకి గురి చేసినందుకు నేను నా మాజీ భార్య ప్రస్తుత భర్తపై కేసు వేయవచ్చా? ఎందుకంటే, ఇటీవలే పేపర్‌లో తైవాన్‌లో భార్య ప్రియుడిపై భర్త కోర్టులో దావా వేయగా కోర్టు అతనికి పరిహారం కూడా చెల్లించమని చెప్పిందని ఒక వార్త చదివాను. మనదేశంలో కూడా అలా చేసే వీలుందా?

- సంపత్, హైదరాబాద్

రెండు వారాల క్రితం ఇలాంటి ఒక కేసు గురించి మన పత్రికలో కూడా సమాధాన రూపంగా చెప్పాను. వివాహేతర సంబంధాలు చట్టరీత్యా నేరాలుగా పరిగణించక పోయినప్పటికీ, సివిల్ దావాలు/పరిహారాలు కోరడానికి భారతీయ చట్టాలలో ఎటువంటి అడ్డంకీ లేదు. మారుతున్న సామాజిక పరిణామాల దృష్ట్యా, వివాహేతర సంబంధాలు ఇకపై సివిల్ కోర్టుకు చేరే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

మీరు మీ మాజీ భార్య ప్రియుడి మీద (ప్రస్తుతం ఆమె భర్త) ఖచ్చితంగా కేసు వేయవచ్చు. పరిహారం కూడా కోరవచ్చు. ఇటీవలే ఢిల్లీ హైకోర్టు తన తీర్పులో ఒక భార్య తన భర్త ప్రియురాలిపై వేసిన దావా చెల్లుతుంది అని పేర్కొంది. అయితే మీరు కేసు వేసిన తర్వాత, మీ మాజీ భార్యకి, తన భర్తకి సంబంధం ఉండేదనే విషయాన్ని ఖచ్చితమైన సాక్ష్యాధారాలతో రుజువు చేయవలసి ఉంటుంది. కోర్టును ఎవరు ఆశ్రయిస్తే వారే తమ పక్షం వాదనని వాస్తవాలేనని రుజువు చేసుకోవాల్సి ఉంటుంది! కేవలం గతంలో వారిద్దరూ కలిసి తీసుకున్న కొన్ని ఫొటోల ఆధారంగా మాత్రమే మీరు కేసు గెలవడం కొంత కష్టమే! అయితే, అసలు మీ మాజీ భార్యకు అతనితో పెళ్లికి ముందు పరిచయమే లేదు అతను ఎవరో నాకు తెలియదు’’ వంటి సమాధానాలు చెప్పి ఉన్నట్లయితే, మీ డైవర్స్ కేసులో జరిగిన వాదోపవాదాలను ఆధారంగా తీసుకొని మీ తరపు సాక్ష్యాలుగా కూడా కోర్టు ముందు ఉంచవచ్చు. ఇవన్నీ ఒకవేళ రుజువు అయినట్లయితే మీకు మానసిక క్షోభ కలిగించినందుకు గాను, ఆర్థికంగా కూడా మీరు నష్టపోయినందుకు గాను, మీరు తగిన పరిహారం పొందే అవకాశం లేకపోలేదు. మీరు కేసు వేయాలి, తగిన సాక్ష్యాధారాలతో రుజువు చేయగలను అనుకుంటే, మీ మాజీ భార్యని కూడా కేసులో పార్టీ చేయండి. ఇంతవరకు ఇలాంటి కేసులు లేకపోయినప్పటికీ, ఇటీవలే మన భారతీయ కోర్టులు ఇచ్చిన తీర్పుల ఆధారంగా మీ కేసు విచారణకు మాత్రం అర్హత సాధించింది. కేసు గెలవడం ఓడిపోవడం తర్వాత సంగతి. అన్ని సాక్ష్యాధారాలు, ముఖ్యంగా మీ డైవర్స్ కేసులో మీ మాజీ భార్య ఇచ్చిన వాంగ్మూలాలు/ క్రాస్ ఎగ్జామినేషన్‌లో తను చెప్పిన సమాధానాలు వంటివి నిక్షిప్తపరిచి ఒక లాయర్‌ను సంప్రదిస్తే మీకు ఉపశమనం లభించవచ్చు.



- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది
మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాల కోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

● వైల్డ్ లైఫ్ ఆర్టిస్ట్

కాంక్రీట్ వనాలు పెరిగిపోతున్న నేటిరోజుల్లో వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందన్నది తెలిసిందే. ఈ క్రమంలో సెల్ఫ్ ఆర్టిస్ట్‌గా పేరొందిన మీరట్ వాసి దీక్షా చౌహాన్ అడవి జంతువుల జీవన వ్యథను, బతుకు పోరాటాన్ని తన హైపర్ రియలిస్టిక్ చిత్రాలతో మన కళ్లకు కడుతోంది. స్థిరమైన ఆదాయాన్ని ఇచ్చే ఇంజినీరింగ్ ఉద్యోగాన్ని వదిలి, చిన్నప్పుడు హాబీగా నేర్చుకున్న పెయింటింగ్‌తో దోస్తీ చేసింది. ఏ టేబుల్ మీద అయితే ల్యాప్‌టాప్‌తో సాఫ్ట్‌వేర్ వర్క్ చేసేదో అదే టేబుల్‌ను కాన్వాస్‌గా మార్చుకుంది. ఐదేళ్లుగా తన బ్రష్ స్ట్రోక్స్‌తో అడవి జంతువులకు గొంతుకగా మారిన దీక్ష పెయింటింగ్ కళ దేశ సరిహద్దులను దాటి ప్రపంచ వన్యప్రాణి ప్రేమికులకు చేరువయింది. ఉపాధితో పాటు ఉపయుక్తమైన మార్గాన్ని ఎంచుకున్న దీక్ష నేడు ఎంతోమంది యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది.



వన్యప్రాణులకు కుంచెతో ప్రాణం



‘ఒక కళాకారిణిగా నేను దేనికీ కట్టుబడి లేనట్టు ఎదుటివారికి అనిపిస్తుంది. కానీ, నేను ప్రతి దానితో కనెక్టివ్‌గా ఉన్నాను. దేనికీ దూరం కాలేదు’ అని చెబుతుంది 29 ఏళ్ల దీక్ష చౌహాన్. ఐదేళ్ల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి, తిరిగి పెయింట్ బ్రష్ పట్టుకుంది. అందమైన సినరీలు, పోర్ట్రెయిట్‌లు పెయింట్ చేస్తూ అడవి జంతువులవైపు దృష్టి సారించింది. ఒక ఉన్నతమైన ప్రయోజనాన్ని కలిగించే మార్గాన్ని అన్వేషిస్తూ అడవి జీవుల వ్యథలను చిత్రీకరిస్తూ, వాటికి గొంతుకలా మారింది.

మూలాలకు చేరుకున్న కళ

దీక్ష పెయింట్ బ్రష్ అందుకోవడానికి ముందు సంగీతం, నృత్యం కళలు ఉన్న ఇంట్లో పెరిగింది. కళ ఒక కాలక్షేపానికి కాదు, అది ప్రపంచాన్ని చూపే ఒక మార్గం అని తెలుసుకుంది. ఇంజినీరింగ్ విద్య డిగ్రీకి కొలమానంగా, ఉపాధిని పొందడానికి ఒక మార్గంగా చూపుతున్నప్పటికీ ఒక చోట తనను తాను బంధించుకోలేనని నిర్ణయించుకుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా కెరీర్‌ను కొనసాగిస్తున్న ఆమె కళాకారిణిగా వెనక్కి తిరిగి చూసుకుంది. సంతృప్తిగా సాగుతున్న ఈ కళా ప్రయాణం తనను తన మూలాలకు తిరిగి చేర్చిందనుకుంది.

సృజనాత్మకత పరిరక్షణ

దీక్ష వన్యప్రాణుల చిత్రాలు చాలా వాస్తవికంగా ఉంటాయి. ఆ చిత్రాలను చూసేవారు వెంటనే ఉలిక్కిపడతారు. పులి చూపులు మన మీదకు దూకేలా అనిపిస్తాయి. ఖడ్గమృగాన్ని ఒకసారి తాకి చూద్దాం అనుకుంటారు. పక్షులు ఆకాశం మధ్యలో ఆగిపోయినట్లు కనిపిస్తాయి. అయినప్పటికీ అవన్నీ కదలికలతో సజీవంగా ఉంటాయి. దీక్ష చూపే సున్నితమైన సృజన, సాంకేతిక నైపుణ్యంతో మనల్ని జంతువులతో కనెక్ట్ అయ్యేలా చేస్తుంది. అంతరించిపోతున్న జాతులను రక్షించేందుకు, వాటి ఆవాసాలను సంరక్షించే చొరవకు మద్దతును ఇస్తుంది. దాడికి గురైన మూగప్రాణుల వెతలను కళ్లకు కడుతుంది. ఎన్నో చిత్ర ప్రదర్శనలు, సోషల్ మీడియా, జంతు పరిరక్షకుల సహకారంతో ఆమె తన ప్రతిభను ప్రజలకు చేరవేస్తుంది. మూగజీవాలకు –ప్రజలకు మధ్య వారిధిగా తన కళను ఉంచుతుంది. ఆమె కళ జంతుజాలం మనుగడ, దుర్బలత్వం, మనుషుల ప్రమేయం .. ఇలా కథలుగా చూపుతుంది.

ప్రపంచ గుర్తింపు

దీక్ష చేస్తున్న కళా సేవ మన దేశ హద్దులను దాటి ప్రపంచం గమనించేంతగా వెళ్లింది. అన్ని ఖండాలలోని కళారాధకులను చేరుకుంది. కళా సేకరణదారులు, వన్యప్రాణుల రక్షకులు ఆమె సృజనను అర్థం చేసుకున్నారు. జీవ నాణ్యత, మనుగడ, వాటి ఆధారంగా ఉండే లక్ష్యానికి కూడా ఆకర్షితులయ్యారు. ఆమె కాన్వాసులు చాలా మంది చూడని అటవీ ప్రపంచానికి చేరువ చేసింది. స్వరం లేని మూగజీవాలకు తన కళ స్వరం ఇవ్వగలదని దీక్ష నమ్ముతుంది. ఆమె ప్రతి బ్రష్ స్ట్రోక్ ఒక వాదనను వినిపిస్తుంది. ప్రతి పెయింట్ ఒక సందేశాన్ని ఇస్తుంది. ప్రేక్షకులు ఆమె పెయింటింగ్స్ ముందు నిలబడినప్పుడు వారు చిత్రాలను మాత్రమే కాదు దీక్ష కళ్లతో అడవిని వీక్షిస్తున్నారు. అడవి జీవుల కష్టాలను అర్థం చేసుకుంటున్నారు. ఆమె తన స్ట్రోక్స్‌తో మూగజీవాల మనుగడకు పాటు పడేలా చేస్తోంది. ఆమె తన కళ ద్వారా ఉత్కంఠభరితమైన రచనలను కూడా సృష్టిస్తుంది. టాలెంట్‌ను ఇలా కూడా చూపవచ్చు అని ఎంతో మందికి తన కళ ద్వారా రుజువు చేస్తోంది.

బులియన్ (బంగారం 10 గ్రా.; వెండి కిలో) అక్టోబర్ 14న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,31,310	1,30,340	1,28,350	1,30,840	1,31,000	1,29,000
బంగారం (22 క్యారెట్లు)	1,18,42	1,17,950	1,17,650	1,21,400	1,20,520	1,18,250
వెండి	1,97,000	1,85,400	2,06,000	1,85,400	1,85,000	2,06,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.



'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 204

బుధవారం 15-10-2025



లాంఛనం ముగిసింది

వెస్టిండీస్‌పై రెండో టెస్టులో నెగ్గి సిరీస్‌ను 2–0తో క్లీన్‌స్వీప్ చేసిన భారత్ -16లో



టెక్ దిద్దే కొలువులు

తయారీతోపాటు 7 రంగాలపై ప్రభావం. డబ్ల్యూఈఎఫ్ నివేదిక -17లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



సూపర్‌వుడ్!

ఉక్కు కంటే ఏకంగా 10 రెట్లు పటిష్టమైన చెక్కను అమెరికా శాస్త్రవేత్తల బృందం విజయవంతంగా సృష్టించింది.

వివరాలు 6లో ▸



ఐజీ ఆత్మహత్య కేసులో ట్విస్ట్

ఆత్మహత్యకు పాల్పడ్డ హరియాణా ఐజీ పూరన్‌కుమార్‌పై అవినీతి కేసును దర్యాప్తు చేస్తున్న ఓ ఏఎస్‌ఐ ఆత్మహత్య చేసుకున్నారు.

వివరాలు 6లో ▸



20 ప్రాణాలు బుగ్గిపాలు

రాజస్తాన్‌లోని జైసల్మేర్ సమీపంలో ఓ బస్సుకు మంటలు అంటుకోవడంతో 20 మంది సజీవదహనమయ్యారు.

వివరాలు 6లో ▸



'టిమ్స్'కు కార్పొరేట్ లుక్

త్వరలో అందుబాటులోకి రానున్న 'టిమ్స్' ఆస్పత్రులను కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో ప్రభుత్వం తీర్చిదిద్దనుంది.

వివరాలు 14లో ▸

న్యూస్‌రీల్

18న గ్రూప్–2 విజేతలకు నియామక పత్రాలు



టీజీఎస్‌పీఎస్సీ ద్వారా ఎంపికైన 783 మంది గ్రూప్–2 విజేతలకు ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు.

- వివరాలు 3లో▶

నేడు మాగంటి సునీత నామినేషన్



జూబ్లీహిల్స్ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య సునీత బుధవారం నామినేషన్ వేయనున్నారు. తొలిసెట్ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించనున్నారు.

- వివరాలు 2లో▶


ఏఐ వచ్చినా మన ఉద్యోగాలు సేఫ్!



ఏఐ రాకతో ఉపాధి కోల్పోతామన్న ఆందోళన ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగుల్లో నెలకొంది. అయితే ఈ విషయంలో భారత్‌లో 6.4 శాతం ఉద్యోగాలకే ఏఐ ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని వరల్డ్ బ్యాంక్ వెల్లడించింది.

- వివరాలు 8లో▶

బనకచర్ల డీపీఆర్ చట్టవిరుద్ధం



పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు డీపీఆర్ రూపకల్పన కోసం ఏపీ ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించడం చట్టవిరుద్ధమని తెలంగాణ ప్రభుత్వం ఆక్షేపించింది. ఈ ప్రాజెక్టును చేపట్టకుండా ఏపీని కట్టడి చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని స్పష్టం చేసింది.

- వివరాలు 7లో▶



కాకినాడకు చెందిన శ్రీనివాస్ వచ్చే ఏడాది తన కుమార్తె పెళ్లి కోసం అప్పోసప్పో చేసి బంగారం కొందామనుకున్నాడు. ఈ ఏడాది జనవరిలో రేటు దాదాపు రూ.78,000 స్థాయిలో ఉండగా గోల్డ్ షాప్‌నకు వెళ్లి కూడా కాస్త తగ్గితే కొందామనుకొని వెనక్కి వచ్చేశాడు. అంతే అక్కడి నుంచి కనకం పూనకం వచ్చినట్లు పెరుగుతూనే ఉంది. దీంతో చేసేదేమీ లేక ఈమధ్యే రూ.1,20,000 రేటుతో మూడు తులాలు కొన్నాడు. విచిత్రమేంటంటే ఆర్నెల్ల క్రితం అదే సొమ్ముకు అయిదు తులాలు వచ్చేది! అరెరే ఎంత తప్పు చేశానే.. అంటూ ఇప్పుడు ఆవేదన చెందుతున్నాడు.



ఇక హైదరాబాద్‌వాసి నగేష్ కష్టాలు వేరు. వచ్చే నెలలో బాగా దగ్గరి బంధువుల ఇంట్లో పెళ్లి ఉంది. రెండేళ్ల క్రితం కుమారుడి పెళ్లిలో వారు తులం గోల్డ్ ప్రైజ్ చదివించారు. అప్పుడు రేటు 60,000. ఇప్పుడు పెళ్లిలో వాళ్లు పెట్టినంతైనా తిరిగి చదివించాలి.. లేదంటే పరువు పోతుంది. కొనాలంటే రూ.1.3 లక్షల పైమాటే. దీంతో రేటు తగ్గుతుందేమోనని ఆశగా ఎదురుచూస్తున్నాడు. పుత్తడి మాత్రం తగ్గేదేలే అంటూ పరుగులు తీస్తుండటంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు.

పసిడి పండుగ

- బంగారం @ రూ. 1.30 లక్షలు
- ఒక్క రోజులో మరో రూ. 2,850 పెరుగుదల
- వెండి రూ. 1,85,000

17లో



ఓ మై గోల్డ్!

బంగారం ధరలపై సామాన్యుల బెంబేలు

సాక్షి, బిజినెస్‌డెస్క్: సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో బంగారం ఇప్పుడు పెద్ద గుదిబండగా మారిందనేందుకు ఇవి కేవలం మచ్చుకు మాత్రమే. నాన్‌స్టాప్ ర్యాలీతో పసిడి ప్రకంపనలు సృష్టిస్తోంది. ఏడాది క్రితం రూ.78,000 స్థాయిలో ఉన్న 10 గ్రాముల (తులం) బంగారం రేటు తాజాగా రూ.1.3 లక్షలకు చేరి 'నగ'ధగలాడిపోతోంది. రోజుకో కొత్త శిఖరాలకు దూసుకెళ్తోంది. ఇన్వెస్టర్లకు ఇది కనకవర్షం కురిపిస్తున్నప్పటికీ... తులమో పలమో కొందామనుకునే సామాన్యులకు మాత్రం దిక్కుతోచని పరిస్థితి. ఈ ఏడాది ఇప్పటిదాకా దేశీయంగా పసిడి ధర 67 శాతం ఎగబాకింది. బంగారం రేటు రెండేళ్లలో రెట్టింపైతే... వెండి ఏడాదిలోపే డ'బుల్'ర్యాలీ మిగతా 2వ పేజీలో ▶

- టారిఫ్ వార్.. భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలతో రేటు పైపైకి
- సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్ల దాహం కూడా కారణమే.. ధరలకు మరింత ఆజ్యం పోస్తున్న రూపాయి పతనం
- ఈ ఏడాది ఇప్పటికే 67 శాతం పైగా ఎగసిన పుత్తడి.. రేసు గుర్రంలా వెండి.. ఏడాదిలో డ'బుల్'బాజా..
- శుభకార్యాల నేపథ్యంలో దేశీయంగా కొనుగోళ్ల డిమాండ్
- త్వరలో తులం పసిడి రూ.2 లక్షలకు చేరుతుందన్న అంచనాలు

లొంగిపోయిన మల్లోజుల..

60 మంది అనుచరులతో మహారాష్ట్రలో లొంగుబాటు

- సోమవారం రాత్రి 10 గంటలకు గడ్చిరోలి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు..
- 7 ఏకే–47 సహా 54 తుపాకులు పోలీసులకు అప్పగింత
- లొంగిపోయినవారిలో ముగ్గురు డీకేఎస్‌జెడ్‌సీ సభ్యులు
- పదిమంది డివిజినల్ కమిటీ సభ్యులు ఉన్నట్లు పోలీసుల వెల్లడి.. 16న అధికారికంగా ప్రకటించనున్న మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్
- 1980 నుంచి పీపుల్స్‌వార్ ద్వారా సాయుధపోరాటం మొదలు
- 2011లో సోదరుడు మల్లోజుల కోటేశ్వర్‌రావు ఎన్‌కౌంటర్
- అనారోగ్యం, పార్టీతో రాజకీయ విభేదాలతోనే లొంగుబాటు



మల్లోజుల వేణుగోపాల్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/ సాక్షి, పెద్దపల్లి: తొలితరం మావోయిస్టు అగ్రనేత, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను మహారాష్ట్ర పోలీసులకు లొంగిపోయారు. ఆయన తలపై రూ.6 కోట్ల వరకు రివార్డు ఉంది. 60 మంది అనుచరులతో కలిసి ఆయన గడ్చిరోలి పోలీసుల ఎదుట లొంగిపోయారు. వేణుగోపాల్‌తోపాటు లొంగిపోయిన మావోయిస్టులందరినీ సోమవారం రాత్రి 10 గంటల సమయంలో హోద్రి గ్రామం నుంచి పోలీస్ వాహనాల్లోనే గడ్చిరోలి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు తరలించినట్లు పోలీస్ వర్గాలు తెలిపాయి. లొంగిపోయినవారిలో ముగ్గురు దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ (డీకేఎస్‌జెడ్‌సీ) సభ్యులు, పదిమంది డివిజినల్ కమిటీ సభ్యులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అయితే, మల్లోజుల లొంగుబాటును మహారాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఈ నెల 16న మీడియా సమావేశంలో అధికారికంగా ఈ విషయాన్ని వెల్లడించనున్నారని సమాచారం. మల్లోజుల భార్య, గడ్చిరోలి దళ సభ్యురాలు తారక్క 2024 డిసెంబర్ 31న లొంగిపోయారు. ఆపరేషన్ కగార్ వల్ల పార్టీ ఆనవాళ్లు లేకుండా తుడిచిపెట్టుకుపోవడంతో ఇక పోరాడలేమని గ్రహించి మావోయిస్టు పార్టీలో కొందరు లొంగుబాట పట్టారు. మల్లోజుల కూడా సాయుధ మిగతా 13వ పేజీలో ▶

జూబ్లీహిల్స్ ఓట్ చోరీపై నేడు హైకోర్టుకు..

బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి



కాంగ్రెస్ అభ్యర్థి సోదరుడికి వేర్వేరు చోట్ల ఓట్లు ఉన్నట్లు చూపుతున్న కేటీఆర్

- ఓట్‌చోరీపై రాహుల్ గాంధీ స్పందించాలి
- కాంగ్రెస్ అభ్యర్థి తమ్ముడికే మూడు ఓట్లు ఉన్నాయి
- ఉప ఎన్నికలో ఏకంగా 23 వేల ఓట్లు ఎలా పెరిగాయని నిలదీత

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గంలో నమోదైన నకిలీ ఓటర్లను వెంటనే తొలగించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. డూప్లికేట్ ఓటర్ల నమోదు ద్వారా అక్రమాలకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు జాబితా విశ్వసనీయత ప్రశ్నార్థకమైన నేపథ్యంలో కేంద్ర ఎన్నికల కమిషన్ వెంటనే స్పందించాలన్నారు. తాము లేవనెత్తిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని సమగ్ర దర్యాప్తు చేయాలన్నారు. ఓట్ చోరీకి సంబంధించిన రుజువులను తమ పార్టీ కార్యకర్తల సహకారంతో రెండు రోజుల వ్యవధిలోనే ప్రజల ముందు పెట్టామన్నారు. అయినా ఎన్నికల కమిషన్ ఎందుకు తొలగించడం లేదని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్ ఓటరు జాబితాలో చోటుచేసుకున్న అక్రమాలపై మంగళవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తాము రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి ఫిర్యాదు చేసి 24 గంటలు దాటినా కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి స్పందన రాకపోవడంతో బుధవారం హైకోర్టును ఆశ్రయిస్తున్నట్లు కేటీఆర్ చెప్పారు.

అసాధారణంగా ఓట్లు పెరిగాయ్..

'తెలంగాణ ఓట్ చోరీ అంశంపై రాహుల్ గాంధీ స్పందించాలి. బిహార్‌లో ఓటు చోరీ జరిగితే తెలంగాణలో ఓట్ల చోరీ ద్వారా మిగతా 2వ పేజీలో ▶

అందరూ కొత్త వారే..

- డీసీసీ అధ్యక్షులుగా ఉన్న వారికి మళ్లీ అదే పదవి ఇవ్వొద్దని నిర్ణయం
- పార్టీ ప్రజాప్రతినిధుల దగ్గరి బంధువులకు నో చాన్స్
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, మహిళా నాయకులకు ప్రాధాన్యత
- ని'బంధనాలు' విధించిన ఏఐసీసీ
- జూమ్ మీటింగ్‌లో మీనాక్షి, మహేశ్ గౌడ్ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: వరుసగా రెండోసారి డీసీసీ అధ్యక్షుడు కావాలనుకుంటున్న నేతల ఆశలపై ఏఐసీసీ నీళ్లు చల్లింది. పార్టీలో సీనియార్టీ, ప్రస్తుతం అనుభవిస్తున్న పదవులు, సామాజిక వర్గాలు, బంధుత్వాలు, ఇతర అంశాలతో పని లేకుండా ప్రస్తుతం డీసీసీ అధ్యక్షులుగా ఉన్న వారెవరినీ మళ్లీ అదే పదవిలో నియమించబోమని స్పష్టం చేసింది. అంటే అందరూ కొత్త వారే ఉంటారు. దీంతో చాలామంది ఆశావహుల్లో నైరాశ్యం నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా మిగతా 2వ పేజీలో ▶



ఎన్‌ఓసీల దందా బంద్!

- చెరువులకు అడ్డగోలుగా ఎన్‌ఓసీల జారీపై కొరడా
- హైదరాబాద్ నుంచి 55 మంది ఇంజనీర్లు ఆన్‌డ్యూటీపై ఇతర జిల్లాలకు...
- జిల్లాల నుంచి హైదరాబాద్‌కు మరో 51 మంది ఓడీపై
- నీటిపారుదల శాఖ సంచలన నిర్ణయం
- జలసౌధ కార్యాలయ మహిళా ఇంజనీర్‌కు మినహాయింపు!

3లో





'సాక్షి' నిలిపివేతపై సుప్రీం సీరియస్

దీనిపై ఏపీ ప్రభుత్వం సమాధానం ఇవ్వాల్సిందేనని స్పష్టీకరణ

బాబు సర్కార్ కౌంటర్ దాఖలు చేయకపోవడంపై ధర్మాసనం తీవ్ర అసహనం

వెంటనే పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశం



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో 'సాక్షి'టీవీ ప్రసారాల నిలిపివేతపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏపీ ప్రభుత్వం తరఫున ఒక ప్రైవేట్ మల్టీసిస్టమ్ ఆపరేటర్ ఎలా వాదిస్తారు అని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఏపీ ప్రభుత్వం వెంటనే ఈ విషయంలో తన వైఖరిని తెలియజేస్తూ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించింది. ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆయుధంగా వాడుకుంటూ.. తమ చానల్‌ను ప్రజలకు చేరకుండా అణచివేస్తున్నారంటూ 'సాక్షి'టీవీ యాజమాన్యం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ, జస్టిస్ అతుల్ ఎస్.చందూర్‌కర్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది.

ప్రజలను, కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారు..

పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది నీరజ్‌కిషన్ కౌల్ వాదనలు వినిపిస్తూ.. 'సాక్షి టీవీ ప్రసారాలను ఏపీ ప్రభుత్వం పూర్తిగా అడ్డుకుంటోంది. తన అధికారాన్ని, యంత్రాంగాన్ని ఒక ఆయుధంగా ప్రయోగించి సాక్షి చానల్‌ను ప్రజలకు దూరం చేస్తోంది. మా ప్రసారాలు ఎక్కడా కనిపించడం లేదు. కొందరు ఎమ్మెస్వోలు నిబంధనల ప్రకారం 'అలా కార్టే'పద్ధతిలో చానళ్లను అందిస్తున్నామని చెప్పడం కేవలం కంటితుడుపు చర్యే. కోర్టు విచారణకు రెండు రోజుల ముందు మాత్రమే మా చానల్‌ను అందుబాటులోకి తెస్తున్నారు. విచారణ ముగిసిన వెంటనే మళ్లీ ప్రసారాలు నిలిపివేస్తున్నారు. ఇది ప్రజలను, కోర్టును తప్పుదోవ పట్టించడమే' అని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.

ప్రభుత్వం తరఫున ప్రైవేట్ ఆపరేటర్ ఎలా వాదిస్తారు?

ఎమ్మెస్వో తరఫు న్యాయవాది ఆర్యమ సుందరం స్పందిస్తూ.. తాము నిబంధనల ప్రకారమే నడుచుకుంటున్నామని చెప్పారు. పిటిషనర్ చానల్‌ను మిగతా 8వ పేజీలో ▶

క్లుప్తంగా...

నేడు హనుమకొండకు సీఎం రేవంత్‌రెడ్డి

దొంతి మాధవరెడ్డి మాతృమూర్తి సంస్మరణ కార్యక్రమానికి హాజరు



సాక్షి, హైదరాబాద్‌: సీఎం రేవంత్‌రెడ్డి బుధవారం హనుమకొండ జిల్లాకు వెళ్లనున్నారు. నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాతృ మూర్తి సంస్మరణ కార్యక్రమానికి హాజరయ్యేందుకు సీఎం హనుమకొండకు వెళ్తున్నారని, ఈ కార్యక్రమం అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి వస్తారని సీఎంఓ మంగళవారం వెల్లడించింది.

సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుంది

టీపీసీసీ చీఫ్‌ మహేశ్‌ గౌడ్‌



సాక్షి, న్యూఢిల్లీ: స్థానిక ఎన్నికల్లో బీసీ లకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో వెన కడుగు వేయకుండా ముందుకు సాగుతు న్నామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌ కుమార్‌ గౌడ్‌ అన్నారు. మంగళవారం సుప్రీంకోర్టు సీనియర్‌ అడ్వొకేట్‌ అభిషేక్‌ మను సింఘ్వీతో సుప్రీం కోర్టులోనే మహేశ్‌గౌడ్‌ భేటీ అయ్యారు. రాజకీయంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే జీవో 9పై ప్రభుత్వం తరఫున గట్టి వాదనలు వినిపించాలని సింఘ్వీని మహేశ్‌ గౌడ్‌ కోరారు. అనంతరం కోర్టు ఆవరణలో పీసీసీ చీఫ్‌ మీడియాతో మాట్లా డారు. 'హైకోర్టు తీర్పును సవాల్‌ చేస్తూ సోమ వారం అర్ధరాత్రి తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్‌ లీవ్‌ పిటిషన్‌ (ఎస్‌ ఎల్‌పీ)దాఖలు చేసింది. ఈ అంశంపై అభిషేక్‌ సింఘ్వీతో అన్ని విషయాలను కూలంకషంగా చర్చించాం. ఈనెల 16 కేసు విచారణకు వచ్చే అవకాశం ఉంది. సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నాం. సీఎం రేవంత్‌ నేతృత్వంలో ముందుకు వెళ్తున్నాం' అని మహేశ్‌గౌడ్‌ చెప్పారు.

రేపు రాష్ట్ర మంత్రివర్గ భేటీ

సాక్షి, హైదరాబాద్‌: సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈనెల 16న మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. పంచాయతీరాజ్‌ ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్ల వివాదంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించి తదుపరి కార్యాచరణను సిద్ధం చేయనున్నారు. ఎస్‌ఎల్‌బీసీ సొరంగాల నిర్మాణం ప్రాజెక్టు నిర్మాణ సంస్థతో ఒప్పందం రద్దుతో పాటు కొత్త టెక్నాలజీతో సొరంగం తవ్వకాలకు అనుమతించడం, ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు పనుల పునరుద్ధరణలో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్‌ నిర్మాణం, దేవాదుల ప్రాజెక్టులోని పలు ప్యాకేజీల అంచనాల పెంపు, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లకి మరమ్మతుల నిర్వహణ తదితర అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.

వచ్చే ప్రభుత్వంలో నేనే రైల్వే మినిస్టర్‌

చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



తాండూరు టౌన్‌: వచ్చే ప్రభుత్వంలో తానే రైల్వే మంత్రిని అవుతానని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వ్యాఖ్యానించారు. వికారాబాద్‌ జిల్లా నవాంద్గి (బషీరాబాద్‌) రైల్వే స్టేషన్‌లో పలు ఎక్స్‌ప్రెస్‌ రైళ్ల నిలపడం లేదని, దీంతో జిల్లా ప్రజలకు అసౌకర్యం కలు గుతోందని విలేకరులు అడిగిన ప్రశ్నకు పైవిధ ంగా బదులిచ్చారు. మంగళవారం ఆయన తాండూరులో మాట్లాడుతూ, రాబోయే ప్రభుత్వం మనదేనని, అప్పుడు నేనే రైల్వే మినిస్టర్‌ అయి, అన్ని రైళ్లను ఆపేలా చూస్తా నని స్పష్టం చేశారు. తాను చేసిన పోరాటంతోనే ప్రస్తుతం నవాంద్గి స్టేషన్‌లో రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌ నిలుస్తోందన్నారు. హుబ్లీ ఎక్స్‌ప్రెస్‌ రైలు సైతం నిలపాలని రైల్వే జనరల్‌ మేనేజర్‌కు లేఖ రాశానని, రెండు వారాల్లో ఆ శుభవార్త కూడా వింటామని వెల్లడించారు. సంగెంకలాన్‌లో చెట్టినాడ్‌ సిమెంట్‌ ఫ్యాక్టరీ కారణంగా నష్టపోయిన గ్రామస్తులకు పరిహా రం ఇవ్వాలని విశ్వేశ్వర్‌రెడ్డి డిమాండ్‌ చేశారు.

ఓ మై గోల్డ్‌!

▶ మొదటి పేజీ తరువాయి

చేయడం గమనార్హం. ఈ ఏడాది ఆరంభంలో కేజీ వెండి ధర రూ.89,000 కాగా, ఇప్పుడు ఏకంగా రూ.1.85 లక్షలకు చేరింది. అంటే ఏకంగా 107 శాతం ఎగబాకిందన్న మాట! ఇదిలా ఉంటే, మరో మూడు నెలల పాటు పెళ్లిళ్ల బాజా మోగనుండటం... కొనుగోలుదారుల్లో గుబులు పుట్టిస్తోంది. ధరాభారంతో వివాహాలు, ఇతర శుభకార్యాల ఖర్చులు తడిసిమోపెడవుతాయంటూ ఆందోళన చెందుతున్నారు. 'ఈ ఏడాది పసిడి రేటు అమాంతం లక్ష రూపాయలను దాటేయడంతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. కూతురు పెళ్లి కోసం నాలుగు తులాల బంగారం పెడదామనుకుంటే ఇప్పుడున్న రేటుతో తులంతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది' అని కాజీపేటకు చెందిన మణెమ్మ తన గోడు వెళ్లబోసుకున్నారు.

పెట్టుపోతలు... గుదిబండ

గృహ ప్రవేశాలు, వోణీ ఫంక్షన్లు, బారసాలలు ఇలా ఏ శుభకార్యమైన ఎంతో కొంత బంగారం, వెండి గిఫ్టుల వంటి పెట్టుపోతలు కామన్‌. గోల్డ్, సిల్వర్‌ జోడు గుర్రాల్లా దూసుకుపోతుండటంతో చాలా వరకు ఫంక్షన్లలో ఇప్పుడు వీటి ఊసే ఎత్తలేని పరిస్థితి. పావు తులం కొనాలన్నా కనీసం రూ. 35 వేలకు తక్కువ అవ్వడం లేదు. దీంతో చాలా మంది ఐదు.. పది.. పాతిక వేలు చదివించి 'మమ'అనిపించుకుంటున్నారు. గతంలో తమ బంధువులు పెట్టినంతగా చదివించకపోతే నలుగురిలో మాట వస్తుందన్న భయం ఒక పక్క... పోనీ పెడదామంటే ఆర్థికంగా ఇబ్బంది మరోపక్క మధ్యతరగతి కుటుంబాలను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. 'మా పెద్ద అమ్మాయికి దగ్గరి బంధువులు బంగారం, వెండి వస్తువులను చదివించారు. ఇప్పుడు వారి ఇళ్లలో ఫంక్షన్‌ అయితే అంతే బంగారం, వెండి ఆభరణాలను చేయించలేకపోతున్నాం. అందుకే వారు పెట్టిన వస్తువులకు ఖరీదు చేసి నగదును కట్నంగా చదివిస్తున్నాం'అని హనుమకొండకు చెందిన కత్తుల కవిత వాపోయారు. ఇదిలా ఉంటే, చిన్నాచితకా బంగారం షాపులపైగా రేటు ప్రభావం తీవ్రంగా ఉంది. ధర అమాంతం పెరిగిపోవడంతో కొనుగోళ్లు పడిపోయాయని, బిజినెస్‌ అంతగా నడవడం లేదని గోల్డ్‌ షాపుల వాళ్లు గగ్గోలు పెడుతున్నారు.

గోల్డెన్‌ ర్యాలీ ఎందుకంటే...

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత మొదలుపెట్టిన టారిఫ్‌ వార్‌తో ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి మరింత పెరిగిపోయింది. ఉక్రెయిన్‌–రష్యా యుద్ధానికి తోడు పశ్చిమాసియాలో భగ్గుమన్న ఉద్రిక్తతలతో అప్పటికే ఎగబాకిన రేట్లకు వాణిజ్య యుద్ధం మరింత ఆజ్యం పోసింది. దీంతో సురక్షిత పెట్టుబడి సాధనమైన బంగారం వైపు అందరూ పరుగులు తీస్తున్నారు. ఈ ఏడాది జనవరిలో అంతర్జాతీయంగా ఔన్స్‌ 2,600 డాలర్లు ఉండగా.. అంతకంతకూ పెరుగుతూ తాజాగా 4,190 డాలర్ల ఆల్‌టైమ్‌ గరిష్టాన్ని తాకింది. అంటే 10 నెలల్లో 61 శాతం జంప్‌ చేసింది. తాజాగా అమెరికా–చైనా మధ్య టారిఫ్‌ యుద్ధం మరింత తీవ్రం కావడంతో బంగారం భగభగలాడిపోతోంది. మరోపక్క, గత కొన్నేళ్లుగా పసిడి ఉత్పత్తి మందగించి.. భూగర్భ నిల్వలు అడుగంటుతున్నాయి. ఆభరణాల డిమాండ్‌ అంతకంతకూ పెరుగుతూనే ఉంది. ప్రపంచ దేశాలు డాలర్లలో వాణిజ్యానికి క్రమంగా చెల్లు చెప్పడంతో పాటు తమ విదేశీ కరెన్సీ నిల్వల్లో డాలర్‌ నిధులను తగ్గించుకుంటున్నాయి. ఫలితంగా డీ–డాలరైజేషన్‌ జోరందుకుంది. ఆర్థిక అనిశ్చితి, యుద్ధ భయాలతో పాటు కరెన్సీ క్షీణతకు విరుగుడుగా బంగారం నిల్వలను సెంట్రల్‌ బ్యాంకులు పెంచుకుంటూ పోతున్నాయి. గత పదేళ్లలో ప్రపంచవ్యాప్తంగా సెంట్రల్‌ బ్యాంకులు సగటున ఏటా 800 టన్నులు కొనడం గమనార్హం. మన ఆర్‌బీఐ వద్ద కూడా పసిడి నిల్వలు 880 టన్నులకు ఎగబాకాయి. ఇలా సరఫరా మందగించి.. డిమాండ్‌ విపరీతంగా పెరిగిపోవడమే గోల్డెన్‌ రన్‌కు ప్రధాన కారణం. అంతేకాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఇన్వెస్టర్లు అనిశ్చితుల్లో ఆదుకునే సురక్షిత సాధనాల్లోకి, ముఖ్యంగా ఎక్స్ఛేంజ్‌ ట్రేడెడ్‌ ఫండ్స్‌ (ఈటీఎఫ్‌)లోకి తమ పెట్టుబడులను తరలిస్తున్నారు. సెప్టెంబర్‌ చివరి నాటికి ప్రపంచ గోల్డ్‌ ఈటీఎఫ్‌ల విలువ 472 బిలియన్‌ డాలర్లకు ఎగబాకడం పెట్టుబడుల జోరుకు నిదర్శనం. మరోపక్క, వడ్డీరేట్లను తగ్గించాలంటూ ట్రంప్‌ పోరు పెడుతుండటంతో అమెరికా సెంట్రల్‌ బ్యాంక్‌ వడ్డీరేట్ల కోతకు సై అంది. ఏడాది కాలంలో ఫెడ్‌ రేటును 1 శాతం పైగా తగ్గించే అవకాశం ఉండటం కూడా బంగార ధరలకు మరింత బూస్ట్‌ ఇస్తోంది.

రూపాయి వాత!

అంతర్జాతీయంగా బంగారం ధరలు ఒకవైపు మోతమోగిస్తుండటమే.. దేశీయంగా అంతకుమించి రూపాయి వాత పెడుతోంది. డాలరుతో రూపాయి విలువ అంతకంతకూ బక్కచిక్కుతూ పసిడి ధరను దేశీయంగా మరింత ఎగదోస్తోంది. మూడేళ్ల క్రితం డాలరుతో రూపాయి మారకం విలువ 80 వద్ద ఉండగా... ఇప్పుడు ఏకంగా 88.82 ఆల్‌టైమ్‌ కనిష్టాలకు జారిపోయింది. అంటే రూపాయి పతనం దెబ్బకు మనం మరో రూ.10,000 అదనంగా చెల్లించుకోవాల్సి వస్తోందన్నమాట!

పసిడి 'పుంతలు' ఇలా..

(10 గ్రాముల మేలిమి బంగారం రేటు)

సంవత్సరం	ధర
2000	4,400
2005	7,000
2010	18,500
2015	26,350
2019	35,220
2020	48,650
2021	50,045
2022	52,950
2023	60,300
2024	78,300
2025	1,30,800

వెండి వెలుగుల తీరిదీ..

(కేజీ రేటు)

సంవత్సరం	ధర
2000	7,900
2005	10,675
2010	27,255
2011	78,600
2012	56,290
2015	37,825
2020	63,435
2021	62,572
2022	55,100
2023	78,600
2024	95,700
2025	1,85,000

ఈ పరుగు ఎందాకా..?

ట్రంప్‌ అధికారంలో ఉన్నంత కాలం ఆర్థిక అనిశ్చితులకు తెరపడే సూచనలు కనిపించడం లేదు. టారిఫ్‌ వార్‌కు తోడు ఏ రోజు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారోనన్న భయాలు అటు మార్కెట్లతో పాటు ఇన్వెస్టర్లకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఫెడ్‌ వడ్డీ రేట్ల కోతను కొనసాగిస్తే.. డాలరు మరింత బలహీన పడే అవకాశాలున్నాయని, ఇది బంగారం మరింత పెరిగేందుకు దోహదం చేస్తుందని విశ్లేషకులు చెబుతున్నారు. గోల్డ్‌మన్‌ శాక్స్‌ వచ్చే ఏడాది చివరికి గోల్డ్‌ అంచనాలను ఇప్పుడున్న 4,300 డాలర్ల నుంచి ఏకంగా 4,900 డాలర్లకు పెంచింది. బ్యాంక్‌ ఆఫ్‌ అమెరికా 2026 అంచనా 5,000 డాలర్లు. దీని ప్రకారం చూస్తే, మన దగ్గర రేటు రూ.1.75 లక్షలను తాకొచ్చు. ఇక జెఫరీస్‌ ఈక్విటీ స్ట్రాటజీ గ్లోబల్‌ హెడ్‌ క్రిస్టోఫర్‌ ఉడ్‌ సైతం బంగారం ధరలు ఇక్కడి నుంచి మరింత పెరగొచ్చని అభిప్రాయపడ్డారు. రానున్న కాలంలో ఔన్స్‌ 6,600 డాలర్లకు చేరుకోవచ్చని అంచనా వేశారు అంటే మన దగ్గర అక్షరాలా రూ.2–2.5 లక్షలకు దూసుకుపోయే అవకాశం ఉంది. రూపాయి గనుక ఇంకా బక్కచిక్కితే పసిడి ధర మరింత కాంతులీనడం ఖాయమంటున్నారు విశ్లేషకులు!

వస్తువులకు బదులు నగదు ఇస్తున్నాం..



నాలుగేళ్ల క్రితం పెద్ద అమ్మాయి పెళ్లి చేశా. రూ.30 లక్షల వరకు అ య్యాయి. నాలుగు రోజుల క్రితం చిన్న అమ్మాయి పెళ్లి చేశాం. పెద్ద అమ్మాయికి పెట్టినట్లుగా నగలు చేయించలేకపోయాం. నాలుగేళ్ల క్రితం 10 గ్రాముల బంగారం రూ.50 వేలు. ఇప్పు డు రూ.1.20 లక్షలు అయ్యింది. మా ఆదాయం మాత్రం అప్పుడు ఇప్పుడు ఒకేలా ఉంది. పెద్ద అమ్మాయికి దగ్గరి బంధువులు బంగారం, వెండి వస్తువులను చదివించారు. ఇప్పుడు వారి ఇళ్లలో ఫంక్షన్‌ అయితే ఆభరణాలను చేయించలేకపోతున్నాం.

– కత్తుల కవిత, హనుమకొండ

ధరాభారంతో ఆందోళన...



బంగారం, వెండి ధరలు రోజురోజుకూ పెరిగిపోతుండటంతో ఆందోళనగా ఉంది. నాలుగేళ్ల క్రితం మా ఇంట్లో ఫంక్షన్‌ చేసినప్పుడు మా దగ్గరి బంధువులు బంగారు, వెండి ఆభరణాలు పెట్టారు. ప్రస్తుతం మా బంధువులకు చెందిన వివాహ శుభ కార్యాలు ఉన్నాయి. మా ఫంక్షన్‌కు వారు పెట్టిన విధంగా మే ము పెట్టాలంటే ప్రస్తుతం వెండి, బంగారం ధర రెట్టింపు అయింది. పెట్టుపోతల విషయంలో ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురికావాల్సి వస్తోంది.

– కొలిపాక సునీత, స్టేషన్‌ఘన్‌పూర్‌, జనగామ జిల్లా

ధర తగ్గితే కొంటాం..



త్వరలో చెల్లి వివాహం ఉంది. వివాహంలో అధిక ఖర్చు బంగారానిదే. రేటు భారీగా పెరిగిపోవడం వల్ల కాస్తోకూస్తో కొని సరిపెట్టుకుంటున్నాం. భవిష్యత్‌లో ధరలు తగ్గితే అప్పుడు మళ్లీ కొంటాం. మధ్య తరగతి కుటుంబాలు ప్రత్యామ్నాయ ఆభరణాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి వస్తోంది.

– అనిల్‌ రెడ్డి, అన్నెపర్తి, నల్లగొండ

ముందే కొనుక్కుంటే మేలు..



బంగారం ధరలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. ఇది ఇలాగే కొనసాగితే సామాన్యులకు ఇక అందని ద్రాక్షే. త్వరలో కూతురు వివాహం చేయాలనుకుంటున్నాము. రేట్లు ఇంకా పెరుగుతాయనే ఆలోచనతో ఇప్పుడే నగలు కొనేస్తున్నాము.

– నంద్యాల సరిత, నల్లగొండ

బిజినెస్‌ పడిపోయింది..



2022లో 24 క్యారెట్‌ బంగారం 10 గ్రాముల రేటు రూ.52 వేల స్థాయిలో ఉండగా.. ఇప్పుడది రూ.1.3 లక్షల పైకి ఎగసింది. దీంతో పుత్తడి కొనాలంటే ప్రజల్లో ఆందోళన నెలకొంది. బంగారం కొనే వారి సంఖ్య తగ్గి షాపుల్లో గిరాకీ లేదు.

– చొక్కారపు వెంకన్న, గోల్డ్‌ షాపు యజమాని, నల్లగొండ

సాక్షి, నెట్‌వర్క్‌

అందరూ కొత్త వారే..

▶ మొదటి పేజీ తరువాయి

జిల్లా కాంగ్రెస్‌ అధ్యక్ష నియామకాల ప్రక్రియ జోరందుకున్న వేళ మంగళవారం జూమ్‌ మీటింగ్‌ వేదికగా రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌, టీపీసీసీ చీఫ్‌ మహేశ్‌ గౌడ్‌ ఈ విషయాన్ని వెల్లడించారు. ఏఐసీసీ ఆదేశాల మేరకు ఇప్పుడు డీసీసీ అధ్యక్షులుగా ఉన్న వారెవరూ రెండోసారి నియ మితులు కాబోరని, వారు దరఖాస్తు చేసుకోవద్దని సూచించారు. దీంతోపాటు డీసీసీ అధ్యక్ష నియామకాల కు ఏఐసీసీ అనేక ని'బంధనాలు'పెట్టింది. మీనాక్షి, మహేశ్‌గౌడ్‌ డీసీసీ అధ్యక్షులతో వెల్లడించిన వివరాలు ఇలా...

- డీసీసీ అధ్యక్షులుగా దరఖాస్తు చేసుకోవాలంటే కనీసం ఐదేళ్లపాటు నిరంతరాయంగా పార్టీలో పనిచేయాలి. అదేవిధంగా క్రమశిక్షణతో పనిచేసి ఉండాలి. ఎలాంటి క్రమశిక్షణా చర్యలు వారిపై సిఫారసు చేసి ఉండకూడదు. ఒకవేళ అలాంటి నేతలు దరఖాస్తు చేసుకుంటే ఏఐసీసీ పరిశీలకులే ఆ దరఖాస్తులను తిరస్కరిస్తారు.
- ప్రజా ప్రతినిధులుగా ఉన్నవారి దగ్గరి బంధువులు, కుటుంబ సభ్యులకు కూడా ఈసారి అవకాశాల్లేవు.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా నేతలకు ప్రాధాన్యత ఉంటుంది.
- ఏఐసీసీ పరిశీలకులుగా జిల్లాలకు వచ్చిన వారితో జాగ్రత్తగా మసులుకోవాలి. ఏఐసీసీ పరిశీలకులతో వ్యక్తిగత సంభాషణలు చేయొద్దు. ప్రైవేటుగా సమావేశాలు పెట్టుకోవద్దు.
- ఎట్టి పరిస్థితుల్లో డీసీసీ అధ్యక్ష పదవుల కోసం అభిప్రాయ సేకరణ సమావేశాలను నాయకుల ఇళ్లలో లేదా వారి సొంత కార్యాలయాల్లో నిర్వహించడానికి వీల్లేదు. పార్టీ కార్యాలయాల్లో గానీ కార్యకర్తలకు అందుబాటులో ఉండే ఇతర ప్రాంతాల్లో గానీ నిర్వహించాలి.
- ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ ఇచ్చిన ఆదేశాలను తు.చ. తప్పకుండా పాటించాలి.
- అదేవిధంగా ఏఐసీసీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓట్‌చోరీ క్యాంపెయిన్‌ను విస్తృతం చేయాలని, ప్రతి గ్రామంలో కనీసం 100 మంది చేత సంతకాలు చేయించి టీపీసీసీకి పంపాలని మీనాక్షి, మహేశ్‌గౌడ్‌ ఆదేశించారు.

సీఎంతో మీనాక్షి భేటీ

డీసీసీ నియామకాలు, సుప్రీంలో కేసుపై చర్చ



సాక్షి, హైదరాబాద్‌: ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌ రెడ్డితో.. కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌ మంగళవారం రాత్రి సమావేశమయ్యారు. సీఎం నివాసంలో దాదాపు అర్ధగంటకు పైగా జరిగిన ఈ భేటీలో.. రాష్ట్రంలో జరుగుతున్న డీసీసీ నియామకాల ప్రక్రియపై మాట్లాడారని తెలిసింది. ఆయా జిల్లాల వారీగా డీసీసీ అధ్యక్ష నియామకాల ప్రక్రియ జరుగుతున్న తీరు గురించి ఉభయులు చర్చించారని సమాచారం. దీంతోపాటు మంగళవారం సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం పక్షాన దాఖలు చేసిన స్పెషల్‌ లీవ్‌ పిటిషన్‌పై కూడా ఇద్దరు నేతలు మాట్లాడుకున్నారని, కేసులో పార్టీ పక్షాన కోర్టులో వ్యవహరించాల్సిన తీరు గురించి చర్చించారని తెలిసింది.

జూబ్లీహిల్స్‌ ఓట్‌ చోరీపై నేడు హైకోర్టుకు..

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్నికల్లో గెలవాలని కాంగ్రెస్‌ చూస్తోంది.అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం దొంగ ఓట్లతో ఎన్నికల్లో గెలవాలని యత్నిస్తోంది. కాంగ్రెస్‌ పార్టీ శ్రేణులు కింది అధికారులతో కుమ్మక్కైన అంశాన్ని రాహుల్‌ గాంధీ పరిగణనలోకి తీసుకొని ఇక్కడ జరిగిన దొంగ ఓట్ల అంశంపై స్పందించాలి. జూబ్లీహిల్స్‌ ఉప ఎన్నిక సందర్భంగా 23 వేల ఓట్లు పెరిగాయని ఎన్నికల సంఘం చెబుతోంది. మరో 12 వేల ఓట్లు తొలగించామని చెబుతున్నా అసాధారణంగా ఓట్లు పెరగడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థిగా ఎంపికైన వ్యక్తి అక్రమంగా ఓటరు ఐడీ కార్డులను పంపిణీ చేయడంపై ఎన్నికల సంఘం కేసు కూడా నమోదు చేసింది. కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి నవీన్‌కుమార్‌ యాదవ్‌ సొంత తమ్ముడు వెంకట్‌ ప్రవీణ్‌ యాదవ్‌కు మూడు ఓట్లు ఉన్నాయి. ఈ వ్యవహారంలో ఎన్నికల అక్రమాల కోసం కిందిస్థాయి అధికారులను కాంగ్రెస్‌ ఉపయోగించుకుందనే అనుమానం ఉంది. ఎన్ని రకాల కుట్రలు, కుతంత్రాలు చేసినా బీఆర్‌ఎస్‌ పార్టీ అభ్యర్థి విజయం సాధిస్తారు'అని కేటీఆర్‌ పేర్కొన్నారు.

సునీతపై కాంగ్రెస్‌ నీతిమాలిన విమర్శలు

మాగంటి సునీత ఆవేదనపై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్‌ నేతలు ఎంత సిగ్గులేనివారో సమాజం చూస్తోందని కేటీఆర్‌ అన్నారు. కుటుంబ పెద్దను కోల్పోయినా.. జూబ్లీహిల్స్‌ లాంటి ఒక పెద్ద కుటుంబాన్ని ఇచ్చిందంటూ భావోద్వేగానికి గురైన సునీతపై కాంగ్రెస్‌ నేతలు అవాకులు, చవాకులు పేలడం దారుణమన్నారు. సునీత భర్త చనిపోయి ఇప్పటికి ఆరు నెలలు కూడా కాలేదన్నారు. ఒక మహిళగా, కుటుంబ పెద్దను కోల్పోయిన బాధ, ఆవేదన ఆమెకు ఉండవా? అని ఆయన ప్రశ్నించారు. మాగంటి గోపీనాథ్‌ కుమార్తెపై కూడా అక్రమ ఎన్నికల కేసు పెట్టడం కాంగ్రెస్‌ పార్టీ నీతిలేని రాజకీయాలకు నిదర్శనమన్నారు.

నా పదవి పోయినా సరే..

మద్యం దుకాణాలను విచ్చలవిడిగా నడవనివ్వను: రాజగోపాల్‌రెడ్డి



మునుగోడు: 'నాకు పదవులు ముఖ్యం కాదు.. నా పదవి పోయినా సరే.. నేను మాత్రం నా మునుగోడు నియోజకవర్గంలో మద్యం దుకాణాలు విచ్చలవిడిగా నడవనిచ్చే ప్రసక్తే లేదు'అని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మద్యం దుకాణాలు ప్రజలు నివాసాలుండే చోట ఏర్పాటు చేసి.. ఉదయం నుంచే సిట్టింగ్‌ రూమ్‌ల్లో మద్యం తాగేందుకు అనుమతి ఇవ్వడంతో ఆ చుట్టుపక్కల ఉండే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అందుకే తాను ఆ మద్యం దుకాణాలను గ్రామ శివారులో ఏర్పాటు చేయాలని సూచిస్తున్నానని తెలిపారు. మునుగోడు నియోజకవర్గానికి సంబంధంలేని వారు టెండర్లు వేయొద్దని, స్థానికులే టెండర్లు వేయాలని సూచిస్తున్నానని చెప్పారు. స్థానికులు టెండర్లు వేసి తన సూచనల ప్రకారం గ్రామ శివారులో దుకాణాలు ఏర్పాటు చేసుకొని సిట్టింగ్‌లు లేకుండా కేవలం మద్యం మాత్రమే విక్రయించాలన్నారు. తన సూచనలు పాటిస్తామ నుకునేవారు మాత్రమే మద్యం టెండర్లు వేయాలన్నారు. మద్యం పాలసీ పేదవర్గాల ఆరోగ్యానికి హాని కలిగించేలా ఉందని, దానిని ప్రక్షాళన చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

నేడు మాగంటి సునీత నామినేషన్‌

- బీఫామ్‌తో పాటు రూ.40 లక్షల చెక్కు ఇచ్చిన కేసీఆర్‌
- 19న భారీ ర్యాలీతో మరోమారు నామినేషన్‌



మాగంటి సునీతకు బీఫామ్‌ అందజేస్తున్న కేసీఆర్‌. చిత్రంలో సబిత, పద్మారావు, ముఠా గోపాల్, కాలేరు వెంకటేశ్, భాస్కర్‌రావు తదితరులు

సాక్షి, హైదరాబాద్‌: జూబ్లీహిల్స్‌ బీఆర్‌ఎస్‌ అభ్యర్థిగా దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌ భార్య సునీత బుధవారం నామినేషన్‌ దాఖలు చేయనున్నారు. హంగూఆర్భాటానికి తావు లేకుండా తొలిసెట్‌ నామినేషన్‌ పత్రాలు రిటర్నింగ్‌ అధికారికి సమర్పిస్తారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మరో నలుగురితో వెళ్లి నామినేషన్‌ వేస్తారు. ఈ నెల 19న మరో సెట్‌ నామినేషన్‌ పత్రాల దాఖలు సందర్భంగా భారీ ర్యాలీ నిర్వహణకు బీఆర్‌ఎస్‌ సన్నాహాలు చేస్తోంది. పార్టీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కేటీఆర్‌, హరీశ్‌రావుతో పాటు పార్టీ ముఖ్య నేతలందరూ ఈ ర్యాలీలో పాల్గొంటారని బీఆర్‌ఎస్‌ వర్గాలు వెల్లడించాయి. కాగా మాగంటి సునీత మంగళవారం ఎర్రవల్లి నివాసంలో పార్టీ అధినేత కేసీఆర్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్‌ చేతుల మీదుగా సునీత బీఫామ్‌ను అందుకున్నారు. ఎన్నికల ఖర్చు కోసం పార్టీ తరఫున సునీతకు రూ.40 లక్షల చెక్కును కూడా కేసీఆర్‌ అందజేశారు. ఈ కార్యక్రమంలో గోపీనాథ్‌ కుటుంబ సభ్యులతోపాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, పద్మారావుగౌడ్‌, ఎమ్మెల్యేలు కాలేరు వెంకటేశ్‌, ముఠా గోపాల్‌, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు తదితరులు ఉన్నారు.

సానుభూతి కోసమే సునీత కన్నీళ్లు

మంత్రి పొన్నం ప్రభాకర్‌ వ్యాఖ్య.. మేయర్‌ విజయలక్ష్మి అభ్యంతరం



మాట్లాడుతున్న పొన్నం. చిత్రంలో నవీన్‌ యాదవ్‌

వెంగళరావునగర్‌: 'సోదరి మాగంటి సునీతను చూస్తుంటే నాకు చాలా జాలిగా ఉంది.. అయితే ఆమె కన్నీళ్లు పెట్టుకుని సానుభూతి పొందాలని ప్రయత్నిస్తున్నారు'.. అని మంత్రి పొన్నం ప్రభాకర్‌ వ్యాఖ్యానించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం రహమత్‌నగర్‌లో జరిగిన సభలో బీఆర్‌ఎస్‌ అభ్యర్థి మాగంటి సునీత తన భర్త మాగంటి గోపీనాథ్‌ను గుర్తు చేసుకుని ఉద్వేగానికి లోనై కన్నీటి పర్యంతమయ్యారు. ఈ నేపథ్యంలో మంగళవారం యూసుఫ్‌గూడలోని మహమూద్‌ ఫంక్షన్‌ హాల్లో జరిగిన వెంగళరావునగర్‌, యూసుఫ్‌గూడ డివిజన్ల బూత్‌ కమిటీ సమావేశాల్లో పొన్నం ప్రభాకర్‌.. బీఆర్‌ఎస్‌ అభ్యర్థి సునీత కన్నీటిపై విమర్శలు చేశారు. రాజకీయ లబ్ధి కోసమే సునీతను ఓదారుస్తున్నట్లు కేటీఆర్‌, హరీశ్‌రావులు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. రాజకీయాల కోసం సునీతను ఇబ్బంది పెట్టడం భావ్యం కాదన్నారు. ఆమెతో కన్నీరు పెట్టిస్తూ ఓట్లు దండుకోవాలని బీఆర్‌ఎస్‌ చూస్తోందన్నారు. కాగా.. పొన్నం వ్యాఖ్యలపై సభానంతరం మేయర్‌ గద్వాల్‌ విజయలక్ష్మి, కార్పొరేటర్‌ విజయారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. బీఆర్‌ఎస్‌ అభ్యర్థి సునీతను ఏడిపించకండని, ఆమె కన్నీరు పెట్టుకోవడంపై మాట్లాడకుండా ఉండటం మంచిదని సూచించారు. కాగా.. తాను తప్పుగా మాట్లాడలేదని, కేటీఆర్‌, హరీశ్‌రావుల డ్రామాల గురించి చెప్పానని మంత్రి స్పష్టం చేశారు.

ఆడబిడ్డను అవమానించిన మంత్రులు క్షమాపణ చెప్పాలి


మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌



సాక్షి, హైదరాబాద్‌: జూబ్లీహిల్స్‌ బీఆర్‌ఎస్‌ అభ్యర్థి మాగంటి సునీత ఏడుపు డ్రామా ఆడుతున్నారని మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌ చేసిన వ్యాఖ్యలపై మాజీమంత్రి వి.శ్రీనివాస్‌ గౌడ్‌ మండిపడ్డారు. బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్సీ తాతా మధు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌ భాస్కర్‌తో కలిసి మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'మంత్రి తుమ్మల మనిషేనా, ఆయనకు మానవత్వం ఉందా. తన ప్రసంగం సందర్భంగా ప్రజల నుంచి వచ్చిన స్పందన చూసి మాగంటి సునీత కన్నీళ్లు పెట్టుకున్నారు. ఆమెను కొడుకు, కూతురు ఓదారిస్తే డ్రామా అంటారా. మరో మంత్రి పొన్నం ప్రభాకర్‌ కూడా దుర్మార్గపు వ్యాఖ్యలు చేశారు. సునీతతో పాటు భర్తలను కోల్పోయిన మహిళలకు మంత్రులు తుమ్మల, పొన్నం క్షమాపణ చెప్పాలి' అని శ్రీనివాస్‌గౌడ్‌ డిమాండ్‌ చేశారు. మహిళా లోకాన్ని అవమానించేలా తుమ్మల, పొన్నం మాట్లాడుతున్నారని తాతా మధు మండిపడ్డారు.

అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్‌కు సెంటిమెంట్‌ ఉండదు

నాడు ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల కన్నీళ్లు కనిపించలేదా?: ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



సాక్షి, హైదరాబాద్‌: బీఆర్‌ఎస్‌ అధికారంలో ఉండగా ఉప ఎన్నికలు జరిగిన సమయంలో చనిపోయిన ఎమ్మెల్యేల కుటుంబ సభ్యుల కన్నీళ్లు కేటీఆర్‌కు గుర్తుకు రాలేదా అని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు కేటీఆర్‌కు సెంటిమెంట్లు లేవని, అధికారం పోయాక మాత్రం కన్నీళ్లు గుర్తొస్తున్నాయని విమర్శించారు. గతంలో ఖైరతాబాద్‌, నారాయణఖేడ్‌, పాలేరు ఎమ్మెల్యేలు చనిపోయినప్పుడు బీఆర్‌ఎస్‌ ఎలా పోటీ చేసిందో కేటీఆర్‌ చెప్పాలని డిమాండ్‌ చేశారు. మంగళవారం సీఎల్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, జూబ్లీహిల్స్‌ ఉప ఎన్నికల నేపథ్యంలో కేటీఆర్‌ అండ్‌ టీం డ్రామాలు మొదలుపెట్టిందని విమర్శించారు. కాంగ్రెస్‌ పార్టీని ఎదుర్కోవడం చేతకాక అభ్యర్థి నవీన్‌ యాదవ్‌ లక్ష్యంగా సోషల్‌ మీడియాలో అనుచిత ప్రచారం చేస్తున్నారన్నారు.

జూబ్లీహిల్స్‌ ఎన్నికల్లో పోటీ చేస్తాం

కాంగ్రెస్‌ అభ్యర్థిని ఓడిస్తాం.. ట్రిపుల్‌ఆర్‌ నిర్వాసితుల జేఏసీ



జేఏసీని ఎన్నుకున్న ట్రిపుల్‌ఆర్‌ బాధితులు

నవాబుపేట: జూబ్లీహిల్స్‌ ఉప ఎన్నికలో పోటీ చేసి అధికార కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థిని ఓడిస్తామని వికారాబాద్‌ జిల్లా నవాబుపేట మండలానికి చెందిన ట్రిపుల్‌ఆర్‌ బాధితులు ప్రకటించారు. చించల్‌పేట, చిట్టిగిద్ద, దాతాపూర్‌, యావాపూర్‌ గ్రామాలకు నిర్వాసితులు మంగళవారం జేఏసీగా ఏర్పడ్డారు. చించల్‌పేటలో సమావేశమై మాజీ సర్పంచ్‌ కృష్ణారెడ్డిని జేఏసీ చైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. ప్రాణాలైనా ఇస్తాం కానీ ట్రిపుల్‌ఆర్‌కు వ్యవసాయ భూములు ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. బాధితుల్లో చిన్న, సన్నకారు రైతులే ఎక్కువగా ఉన్నారని, ఉన్న ఎకరం, అరెకరం భూమి పోతే ఎలా బతకాలన్నారు.

ఎన్‌ఓసీల దందా బంద్!

చెరువులకు అడ్డగోలుగా ఎన్‌ఓసీల జారీపై కొరడా

- హైదరాబాద్ నుంచి 55 మంది ఇంజనీర్లు ఓడీపై ఇతర జిల్లాలకు
- జిల్లాల నుంచి హైదరాబాద్‌కు మరో 51 మంది ఓడీపై
- నీటిపారుదల శాఖ సంచలన నిర్ణయం



సాక్షి, హైదరాబాద్: రాజధానిలోని చెరువులు, కుంటల ఫుల్‌ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలోని భూముల్లో అక్రమ నిర్మాణాలకు అనుమతిస్తూ అడ్డగోలుగా నిరభ్యంతర పత్రాలు (ఎన్‌ఓసీ) జారీ చేశారని వచ్చిన ఆరోపణలపై రాష్ట్ర ప్రభుత్వం కొరడా ఝుళిపించింది. వరుసగా ఎన్‌ఓసీల కుంభకోణాలు వెలుగులోకి రావడంతో హైదరాబాద్ సర్కిల్ సీఈ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాలని నిర్ణయించింది. నీటిపారుదల శాఖ హైదరాబాద్ సర్కిల్ సీఈ పరిధిలో పనిచేస్తున్న క్షేత్రస్థాయి ఇంజనీర్లలో ఒకరు మినహా మిగిలిన వారందరినీ ఆన్‌డ్యూటీ (ఓడీ)పై జిల్లాలకు పంపింది. అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ), అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ), డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (డీఈఈ), ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఈఈ), సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్‌ఈ), డిప్యూటీ సీఈ హోదాలో హైదరాబాద్ సీఈ పరిధిలో పనిచేస్తున్న మొత్తం 55 మంది ఇంజనీర్లను హైదరాబాద్ బయటి ప్రాంతాలకు పంపింది. వారి స్థానంలో పనిచేసేందుకు జిల్లాల్లో పనిచేస్తున్న 51 మంది ఇంజనీర్లను ఆన్‌డ్యూటీపై హైదరాబాద్ సీఈ కార్యాలయానికి పంపింది. ఈ మేరకు నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు ఉద్యోగుల సర్దుబాటు కొనసాగుతుందని చెప్పారు. గండిపేట సబ్ డివిజన్ డీఈఈగా, హైదరాబాద్‌లోని జలసౌధ కార్యాలయం ఎస్టేట్ అధికారిగా దీర్ఘకాలంగా పనిచేస్తున్న ఓ మహిళా ఇంజనీర్‌కు మాత్రమే ప్రత్యేక మినహాయింపు కల్పించడం పట్ల నీటిపారుదల శాఖ వర్గాలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. గండిపేట పరిధిలో రూ.వేల కోట్లు విలువ చేసే నీటిపారుదల శాఖ భూములు పెద్దఎత్తున కబ్జాలకు గురయ్యాయని, వాటిని స్వాధీనం చేసుకోవాలని ఇటీవల మంత్రి ఉత్తమ్ ఆదేశించిన విషయాన్ని కొందరు ఇంజనీర్లు గుర్తు చేస్తున్నారు. నాలుగేళ్లుగా గండిపేట సబ్ డివిజన్‌లో పనిచేస్తున్న ఇంజనీర్‌ను అక్కడే కొనసాగిస్తూ క్షేత్రస్థాయి పోస్టుల్లో పనిచేస్తున్న ఇంజనీర్లందరినీ పంపడం వెనక మతలబు ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

ఓడీపై ఎందుకంటే..

పైరవీలు, రాజకీయ పలుకుబడితో కార్యాలయం పరిధిలో దీర్ఘకాలంగా తిష్టవేసి అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలుండడంతో క్షేత్రస్థాయిలో ఇంజనీర్లందరినీ బదిలీ చేయాలని మంత్రి ఆదేశించినట్టు తెలిసింది. బదిలీలపై అమల్లో ఉన్న నిషేధాన్ని ఉల్లంఘిస్తూ బదిలీలు నిర్వహిస్తే సంబంధిత ఉద్యోగుల జీతాలను ఆర్థిక శాఖ నిలుపుదల చేసిన ఘటనలు ఇటీవల చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతానికి ఆన్‌డ్యూటీపై ఇతర ప్రాంతాలకు పంపి నిషేధం ఎత్తేశాక బదిలీ ఉత్తర్వులు జారీ చేయాలని ఆ శాఖ నిర్ణయం తీసుకుంది.

నేపథ్యం ఇదీ...

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మంఖాల్ గ్రామంలోని కొత్తకుంట చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలకు ఎన్‌ఓసీ జారీ చేయడంపై ఇటీవల నీటిపారుదల శాఖ విచారణ జరిపించగా ఎన్నో సంచలన అంశాలు వెలుగు చూశాయి. కొత్తకుంట చెరువు ఎఫ్‌టీఎల్ 8.284 ఎకరాల్లో విస్తరించి ఉండగా 2.08 ఎకరాలేనంటూ ఎన్‌ఓసీ జారీ చేసినట్లు తేలింది. ఈ వ్యవహారంపై ఆరోపణలు రావడంతో ఎన్‌ఓసీ జారీకి సంబంధించిన రికార్డులను మాయం చేసేసినట్టు రుజువైంది. ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొన్న హైదరాబాద్ సర్కిల్ సీఈ కె.ధర్మాను గతంలోనే ప్రభుత్వం పోస్టు నుంచి తొలగించి కొత్త పోస్టింగ్ కేటాయించలేదు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో ఏఈఈ వి.గంగరాజు ఏడాది కాలంగా విధులకు గైర్హాజరవుతున్నారు. డీఈఈ కె.జగదీశ్వర్, ఈఈ కె.బన్సీలాల్, ఎస్ఈ హైదర్ ఖాన్‌కు సైతం ఈ వ్యవహారంలో పాత్ర ఉన్నట్టు విచారణలో తేలింది. వీరిలో గంగరాజు, కె.జగదీశ్వర్‌ను ప్రభుత్వం ఓడీపై ఇతర జిల్లాలకు పంపింది.

వర్గీకరణతోనే సామాజిక న్యాయం

అధికారులతో మంత్రి దామోదర సమీక్ష



సాక్షి, హైదరాబాద్ : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణతో విద్యావకాశాల్లో సామాజిక న్యాయం సాధ్యపడిందని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఇంతకాలం ప్రొఫెషనల్ కోర్సుల్లో నామమాత్రంగానే ఇది అమలు జరిగిందన్నారు. ఈ ఏడాది మెడికల్, ఇంజనీరింగ్ వంటి ప్రొఫెషనల్ కోర్సుల్లో సముచిత సంఖ్యలో సీట్లు వచ్చాయని చెప్పారు. రిజర్వేషన్ల అమలు తీరుపై మంత్రి విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితా రాణా, ఉస్మానియా, జేఎన్‌టీయూ, అంబేడ్కర్ వర్సిటీ వీసీలు కుమార్, కిషన్‌కుమార్‌రెడ్డి, ఘంటా చక్రపాణిలతో మంగళవారం సమీక్షించారు. ఈసారి బావురి, మెహతర్, మాంగ్, బేడ బుడగ జంగం తదితర అత్యంత వెనుకబడిన కులాల పిల్లలకు ప్రభుత్వ మెడికల్, ఇంజనీరింగ్ కాలేజీల్లో కన్వీనర్ కోటాలో సీట్లు వచ్చాయని అధికారులు మంత్రి దృష్టికి తెచ్చారు. విద్యతోనే అట్టడుగు వర్గాల అభివృద్ధి సాధ్యమని మంత్రి తెలిపారు. అందుకే వర్గీకరణ చేపట్టామన్నారు. దశాబ్దాల వర్గీకరణ కలను నెరవేర్చుకోవడం, మొదటి ఏడాదిలోనే వర్గీకరణ ఫలాలు ఆయా కులాలకు అందడం మరింత ఆనందాన్ని ఇస్తోందన్నారు.

18న గ్రూప్-2 విజేతలకు నియామక పత్రాలు

సీఎస్ రామకృష్ణారావు వెల్లడి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీఎస్‌పీఎస్సీ) ద్వారా ఎంపికైన 783 మంది గ్రూప్–2 విజేతలకు ఈనెల 18న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియామక పత్రాలు అందించనున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. శిల్పకళా వేదికలో నిర్వహించనున్న ఈ కార్యక్రమం ఏర్పాట్లపై సంబంధిత ఉన్నతాధికారులతో సచివాలయంలో మంగళవారం సీఎస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. నియామక పత్రాలు అందుకునే వారిలో 16 శాఖలకు చెందిన అభ్యర్థులు ఉన్నందున ఈ కార్యక్రమానికి మంత్రులందరినీ ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి అభ్యర్థితోపాటు వారి కుటుంబ సభ్యులను సాయంత్రం 4 గంటలలోపు శిల్పకళా వేదికలో అనుమతించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నియామక పత్రాలు పొందే అభ్యర్థులు 30 ఏళ్ల సర్వీస్‌లో ఉంటారు కాబట్టి, వీరికి ప్రభుత్వ సర్వీస్ పట్ల ఉన్నత భావన కలిగేలా కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్య కార్యదర్శులు బెనహర్ మహేష్ దత్ ఎక్కా, రిజ్వీ, సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శులు లోకేశ్ కుమార్, టీకే శ్రీదేవి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ప్రియాంక పాల్గొన్నారు.



నువ్వు సూర్యుడిలా ప్రకాశించాలనుకుంటే, మొదట సూర్యుడిలా మండాలి.
- ఎ.పి.జె. అబ్దుల్ కలామ్

సాక్షి
బుధవారం, 15 అక్టోబర్ 2025

శాశ్వత శాంతికి నిరీక్షణ

గత రెండేళ్లుగా అపారమైన ప్రాణనష్టాన్నీ, కనీవినీ ఎరుగని విధ్వంసాన్నీ చవిచూసిన గాజా ఇప్పుడు ప్రశాంతంగా ఉంది. ఇజ్రాయెల్–హమాస్‌ల మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం ద్వారా సమకూరిన విజయాన్ని శాంతిగా మలచుకోవాల్సిన బాధ్యత మీదేనంటూ ఇజ్రాయెల్ పార్లమెంటు కెనెసెట్‌నుద్దేశించి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పటం... ఆయన గత కాలపు అధ్యక్షులందరికన్నా గొప్ప స్నేహితుడని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ కీర్తించటం ప్రపంచ ప్రజానీకమంతా వీక్షించింది. హమాస్ చెరలో మిగిలిన 20మంది ఇజ్రాయెల్ పౌరులూ విడుదల కావటం, అటు ఇజ్రాయెల్ జైళ్లలో మగ్గుతున్న దాదాపు 10,000 మంది పాలస్తీనా పౌరుల్లో 1,718 మందిని ఆ దేశం విడుదల చేయటం పూర్తయింది. విముక్తులై సొంతగడ్డపై అడుగుపెట్టిన బందీలకూ, ఖైదీలకూ లభించిన అపూర్వ స్వాగతాలు గమనిస్తే వారి కోసం అయినవారు ఎంత ఆత్రంగా నిరీక్షించారో అర్థమవుతుంది. బందీలది రెండేళ్ల చెర అయితే... ఖైదీలది అంతకన్నా చాలా ఎక్కువ. వారిలో మూడేళ్ల నుంచి ఇరవయ్యేళ్ల వరకూ జైళ్లలో మగ్గుతున్నవారున్నారు. పలువురికి తిరిగి పాలస్తీనాలో అడుగుపెట్టేందుకు అనుమతి లేదంటూ ఈజిప్టుకు తరలించారు. అసలు చాలామందికి వెళ్లి నివసించేందుకు కొంపా గోడూ లేవు. అవన్నీ క్షిపణి దాడుల్లో కుప్పకూలాయి.

శాంతి అంటే కేవలం యుద్ధం లేకపోవటమో, కాల్పుల విరమణకు అంగీకరించటమో కాదు. పశ్చిమాసియాకు సంబంధించినంతవరకూ అదెంత మాత్రమూ సరిపోదు. ఎందుకంటే అక్కడ ఎంత త్వరగా కాల్పుల విరమణ ఒప్పందం కుదురుతుందో, అంత త్వరగానూ ఉల్లంఘనలు కూడా మొదలైపోతాయి. యుద్ధానికీ, యుద్ధానికీ మధ్య ఏర్పడే తాత్కాలిక ఉపశమనంగా అది మారిపోయింది. 1978లో అమెరికా అధ్యక్షుడిగా ఉన్న జిమ్మీ కార్టర్ కాలంలో కుదిరిన క్యాంప్ డేవిడ్ ఒప్పందం మొదలుకొని ఇందుకు ఎన్ని ఉదాహరణలైనా చూపవచ్చు. చిత్రమేమంటే 1993లో కుదిరిన ఓస్లో–1 ఒప్పందం ద్వారా ఇజ్రాయెల్ ఉనికిని పాలస్తీనా విమోచన సంస్థ (పీఎల్ఓ) గుర్తించగా, పాలస్తీనా ప్రజలకు 'నిజమైన ప్రతినిధి'గా పీఎల్ఓను ఇజ్రాయెల్ గుర్తించింది. కానీ అందువల్ల పీఎల్ఓకు ఒరిగింది లేకపోగా, అది వలసవాద పోలీసు దళంగా మిగిలింది. దాన్ని నీరుగార్చేందుకు అనంతర కాలంలో హమాస్‌కు పురుడుపోసింది కూడా ఇజ్రాయెలే. 1995 నాటి ఓస్లో–2 ఒప్పందమూ ఇంతే. ఇలా ఇరుపక్షాల మధ్యా కుదిరిన మధ్యవర్తిత్వాలూ, రాజీలూ అసంఖ్యాకం. కానీ వైమానిక, క్షిపణి దాడులు వాస్తవం... శాంతి మిథ్య. ఇజ్రాయెల్‌కు నిరంతరాయంగా అమెరికా సైనిక సాయం అందుతూనే ఉంటుంది. హమాస్ ఉగ్రదాడి తర్వాత 2023 నుంచి ఇంతవరకూ ఇజ్రాయెల్‌కు లభించిన అమెరికా సైనిక సాయం విలువ 2,200 కోట్ల డాలర్ల పైమాటే.

తాజా ఒప్పందం హమాస్ 72 గంటల్లో తన దగ్గరున్న బందీలందరినీ విడుదల చేయాలని, చనిపోయివుంటే మృతదేహాలు అప్పగించాలని నిర్దేశించింది. కానీ మొత్తం 20 అంశాల్లోనూ ఇజ్రాయెల్‌కు నిర్దిష్ట కాలపరిమితిని సూచించే ప్రతిపాదనలేవీ లేవు. అసలు స్వతంత్ర పాలస్తీనా ఏర్పాటుపై స్పష్టత లేదు. ధ్వంసమైన ఆవాసప్రాంతాల పునర్నిర్మాణం సంగతి, జవాబుదారీతనం ఊసు లేదు. ఒక రియల్ ఎస్టేట్ ప్రాజెక్టుగా గాజాను తీర్చిదిద్దుతామని ఇప్పటికే ట్రంప్ చెప్పారు. దాని ప్రసక్తి ఇందులో లేకపోయినా చివరకు ఆ దిశగా పావులు కదిపేలా పరిణామాలు ఉండబోతాయన్నది స్పష్టం. అటు షర్మ్ అల్ షేక్‌లో ఆర్భాటంగా జరిగిన శిఖరాగ్ర శాంతి సదస్సుకు నెతన్యాహూ రాకపై తుర్కియే, ఇరాక్‌లు అభ్యంతరం చెప్పటంతో చివరి నిమిషంలో ఆయన ఆగిపోవటమైనా... ఈ సదస్సుకు ఆఖరి నిమిషంలో ఆహ్వానం అంది వచ్చిన పాలస్తీనా అధ్యక్షుడు మహ్మూద్ అబ్బాస్ ప్రేక్షకుడిగా మిగిలిపోవటమైనా జరగబోయేదేమిటో సూచిస్తోంది. ఫ్రాన్స్ అధ్యక్షుడు మెక్రాన్ చొరవ తీసుకుని ట్రంప్ దగ్గరకు ఆయన్ను తీసుకెళ్లటం, వారిద్దరూ కొన్ని సెకన్లు సంభాషించుకోవటం చిన్నపాటి ఓదార్పు. ఎన్ని లోటుపాట్లున్నా ఇప్పుడు కుదిరిన ప్రశాంతత శాశ్వతం కావాలని ఆశించనివారంటూ వుండరు. అది సాకారం కావాలంటే ప్రపంచ ప్రజాభిప్రాయం ఇంకా పదునెక్కాలి. దురాక్రమణలు కనుమరుగై స్వేచ్ఛాయుత పాలస్తీనా దిశగా అడుగులు పడాలి.


గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు ఆశ్వయుజ మాసం, **తిథి:** బ.నవమి ప.2.41 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** పుష్యమి సా.4.46 వరకు, తదుపరి ఆశ్లేష, **వర్జ్యం:** తె.5.25 నుండి 7.00 వరకు (తెల్లవారితే గురువారం). **దుర్ముహూర్తం:** ప.11.24 నుండి 12.11 వరకు. **అమృత ఘడియలు:** 10.33 నుండి 12.06 వరకు.

సూర్యోదయం : 5.56
సూర్యాస్తమయం: 5.37
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

శాంతి పర్వమా?

సందర్భం



సి. ఉదయ్ భాస్కర్

గాజా కాల్పుల విరమణ అంగీకారం అక్టోబర్ 10 నుంచి అమలులోకి వచ్చింది. ఇజ్రాయెల్‌పై 2023 అక్టోబర్ 7న జరిగిన హమాస్ దాడికి ప్రతిగా ఇజ్రాయెల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) పాలస్తీనియన్లను ఊచకోత కోయడం ఆగింది. ట్రంప్ కుదిర్చిన ఈ కాల్పుల విరమణను ఒక అత్యవసర కారణం రీత్యా స్వాగతించవలసి ఉంది. కొడిగడుతున్న మానవతా దీపానికి రెండు చేతులు అడ్డుపెట్టేందుకు ఈ సంధిని సమర్థించవలసి ఉంది.

పాలస్తీనా పౌరులపై రెండేళ్ళుగా మోతాదుకు మించి సాగుతున్న దాడుల్లో 67,000 మందికి పైగా పాలస్తీనియన్లు హతులయ్యారు. పౌరులు, సైనికులతో కలిపి సుమారు 2,000 మంది ఇజ్రాయెలీలు ప్రాణాలు కోల్పోయారు. మొత్తం 55 లక్షల పాలస్తీనియన్లలో సుమారు ఇరవై లక్షల మంది నిర్వాసితులయ్యారని ఐక్యరాజ్య సమితి, మానవతా సంస్థలు, స్థానిక అధికారుల అంచనా.

మానవ కల్పిత మహా విపత్తు

గాజా శిథిలాల కుప్పగా మారింది. కరవు కాటకాలతో జనం సతమతమవుతున్నారు. ఇతర ప్రాంతాలకు పారిపోయిన పాలస్తీనియన్లు కాల్పుల విరమణ అమలులోకి రావడంతో గాజా నగరానికి, షేక్ రద్వాన్ వంటి ప్రాంతాలకు తిరిగి వస్తున్నారు. నుసేరత్, ఖాన్ యూనిస్ వంటి దక్షిణ ప్రాంత శిబిరాల నుంచి మిగిలిన అరకొర సామాను వేసుకుని అల్ రషీద్ వంటి ఉత్తర ప్రాంతాలకు నడక సాగిస్తున్నారు. ఇక్కడి పరిస్థితులను 'మానవ కల్పిత మహా విపత్తు'గా ఐరాస అభివర్ణించింది. ఇపుడు గాజాలోకి రోజూ 600 సహాయ సామగ్రి ట్రక్కులు వస్తున్నాయి కనుక, ఈ కాల్పుల విరమణ ఫలితంగా కరవు తీవ్రత కొద్దిగా తగ్గవచ్చు. సహాయ సామగ్రి రాక పెరగడం, రఫా, ఇతర కూడలి మార్గాలను తిరిగి తెరవడం వల్ల, గాజాలో మిగిలినవారి కష్టాలకు తాత్కాలికంగానైనా ఉపశమనం లభించవచ్చు.



అయితే, వాస్తవ పరిస్థితులు ఇప్పటికీ గుబులు రేకెత్తించేవిగానే ఉన్నాయి. సుస్థిర శాంతితో పాటు, సామాజిక–రాజకీయ న్యాయం పాలస్తీనియన్లకు అందని మావి పండుగానే మిగిలిపోవచ్చు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూను ఒక రకంగా బలవంతంగానే ఈ కాల్పుల విరమణకు ఒప్పించారు. ట్రంప్, ఇతర ప్రాంతీయ భాగస్వాములు (ఈజిప్టు, ఖతార్, సౌదీ అరేబియా) ఊహిస్తున్నంత సుందర స్వప్నం సాకారం కాకపోవచ్చు. అయినప్పటికీ, పెడ మొహంతో ఉన్న నెతన్యాహూను బలవంతంగానైనా చర్చలకు కూర్చోబెట్టినందుకు ట్రంప్‌ను ఎంతో కొంత అభినందించాల్సిందే.

> యుద్ధానంతరం గాజా పునర్నిర్మాణానికయ్యే మొత్తం వ్యయం వచ్చే పదేళ్లలో 53.2 బిలియన్ డాలర్ల మేరకు ఉండవచ్చని అధికారిక అంచనాలు వెల్లడిస్తున్నాయి. పాలస్తీనాకు అంత పెద్ద మొత్తాలను ఎలా అందుబాటులోకి తెస్తారో ఈ దశలోనే చెప్పడం కష్టం.

పునర్నిర్మాణం ఎలా?

శిథిలాలను తొలగించి, గాజాను పునర్నిర్మించే పనికి శ్రీకారం చుట్టడం తక్షణ ప్రాధాన్యం కావాలి. యుద్ధానంతరం గాజా పునర్నిర్మాణానికయ్యే మొత్తం వ్యయం వచ్చే పదేళ్ళలో 53.2 బిలియన్ డాలర్ల మేరకు ఉండవచ్చని అధికారిక అంచనాలు వెల్లడిస్తున్నాయి. ఐరాసకు చెందిన నష్టాలు – అవసరాల తాత్కాలిక సత్వర మదింపు సంస్థ, యూరోపియన్ యూనియన్, ప్రపంచ బ్యాంక్ కలసి ఆ రకమైన లెక్కకు వచ్చాయి. అవి 2023 అక్టోబర్ నుంచి 2024 అక్టోబర్ వరకు వాటిల్లిన నష్టాలను దృష్టిలో పెట్టుకుని ఆ అంచనాకు వచ్చాయి. పాలస్తీనాకు అంత పెద్ద మొత్తాలను ఎలా అందుబాటులోకి తెస్తారో ఈ దశలోనే చెప్పడం కష్టం.

ఐరాస పరిధికి బయట ఈ ఒడంబడిక కుదరడంతో, ఇది ఎంతవరకు ముందు సాగుతుందనే సందేహాలు రేకెత్తుతున్నాయి. దీన్ని బలమైన ప్రాంతీయ పక్షాల మద్దతుతో అమెరికా నేతృత్వాన సాగిన చొరవగానే చూస్తున్నారు. గాజాకు బయటనున్న స్థావరాల నుంచి హమాస్ ఏ విధంగా నియమాలను పాటిస్తుందో పర్యవేక్షించే ఒక బహుళ దేశీయ సైనిక సమన్వయ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. దీనిలో అమెరికా దళాలు కూడా 200 వరకు ఉంటాయి. తాత్కాలిక టెక్నికల్ పాలనా బృందానికి బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ నాయకుడిగా ఉంటారు. ఇది ట్రంప్ శైలిలో నయా సామ్రాజ్యవాద పోకడను సూచిస్తోంది.

ఈ ఒప్పందానికి భారత్ కూడా మద్దతు తెలిపింది. మొదటి దశకు శుభారంభం చేసినందుకు నెతన్యాహూను ప్రధాని మోదీ ప్రశంసించారు.

సంక్లిష్టమైన శాంతి పరిరక్షక కార్యకలాపాల్లో పాల్గొన్న అనుభవం భారతదేశానికి ఉంది. కొరియా యుద్ధ విరమణ (1953) నుంచి తదుపరి ఐరాస ప్రత్యేక విధుల్లో భారత్ పాలుపంచుకుంది. విపత్తుల సహాయ కార్యక్రమాల్లో భారత్ తన సమర్థతను విజయవంతంగా నిరూపించుకుంది. కనుక, గాజాకు ఇపుడు ఎంతో అవసరమైన అంతర్జాతీయ పునర్నిర్మాణ పనులకు భారత్ చేదోడువాదోడు కాగలదు.


కాల్పుల విరమణ ఒడంబడిక తాత్కాలికమైనది, విఘాతాలకు లోనుకాగల అవకాశం ఉన్నది. ఇది 2023 అక్టోబర్‌లో యుద్ధం మొదలైన తర్వాత సంధి కుదర్చడానికి సాగుతున్న మూడవ పెద్ద ప్రయత్నం. రెండు ప్రయత్నాలు గతంలో విఫలమయ్యాయి. ఈసారైనా సత్ఫలితాలు ఇస్తుందా?

నిజానికి, ఐరాస ఆధ్వర్యంలోకి ఈ సంక్లిష్ట ఒప్పందాన్ని తీసుకురావడం వాంఛనీయం. కానీ, అటువంటి పరిణామానికి ఉన్న అవకాశం చాలా తక్కువ.

వ్యాసకర్త 'సొసైటీ ఫర్ పాలసీ స్టడీస్' డైరెక్టర్

నవోదయమేనా?

అభిప్రాయం



టంకశాల అశోక్

ఒక సమస్య పట్ల తీవ్రమైన వైఖరిని తీసుకుని, అందుకు పరిష్కారం అని చెప్పే దానిలో కనిపించే కొద్దిపాటి మంచిని కూడా తిరస్కరించటం ఒక ధోరణి. జరిగిన మంచిని ఒక ముందడుగుగా భావించి మరింత ముందుకు పోజూడటం మరొక ధోరణి. వీటిలో ఏ సమస్య పట్ల ఏ ధోరణి తీసుకోవాలనేది అందుకు సంబంధించిన వివిధ అంశాలపై ఆధారపడి ఉంటుంది.

రెండేళ్ళుగా సాగుతున్న గాజా యుద్ధానికి శాంతియుత పరిష్కారం అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ నెల 9న వైట్‌హౌస్‌లో ప్రకటించిన 20 అంశాల ప్రణాళికపై 13వ తేదీన ఈజిప్టులోని షర్మ్ అల్‌షేక్ పట్టణంలో తనతోపాటు, ఈజిప్ట్, ఖతార్, తుర్కియే ప్రభుత్వాధినేతలు సంతకాలు చేసి ఆమోదించారు. ఆ ముగ్గురూ హమాస్, ఇజ్రాయెల్ మధ్య చర్చలకు మధ్య వర్తిత్వం వహించినవారు. దశలు దశలుగా అమలుకు రాగలదనే ఆ 20 అంశాల ప్రణాళికలో మొదటి దశ ఈ 9–13 తేదీల మధ్య అమలు జరిగింది కూడా! అందులో భాగంగా ఉభయ పక్షాలు కాల్పులను విరమించాయి. బందీలను, ఖైదీలను విడుదల చేసుకున్నాయి.

మూల సమస్య విస్మరణ

హమాస్, ఇజ్రాయెల్ స్వయంగా ప్రకటించినట్లు, ట్రంప్ చొరవ, బలిమి లేనిదే ఇది ఎంత మాత్రం జరిగేది కాదు. హమాస్ ఎన్ని త్యాగాలతో ఎంత పట్టుదలగా పోరాడినా, స్వయంగా అరబ్ దేశాలే ద్వంద్వ వైఖరిని చూపుతున్న స్థితిలో ఇజ్రాయెల్‌ను ఓడించటం సాధ్యమయ్యేది కాదు. ఇజ్రాయెల్ ఒకవేళ హమాస్ సహా గాజా ప్రజలందరినీ తుడిచిపెట్టినా పాలస్తీనా జాతి, స్వదేశ ఆకాంక్షల సమస్య పరిష్కారమయ్యేది కాదు. అయినప్పటికీ ఆ విధంగా తుడిచి పెడతాము, గ్రేటర్ ఇజ్రాయెల్‌ను ఏర్పాటు చేస్తాము తప్ప, స్వతంత్ర పాలస్తీనా ప్రసక్తి ససేమిరా లేదన్నది నెతన్యాహూ వైఖరి. అందువల్ల, మొదటి నుంచి ఎన్ని ఊగిసలాటలాడినా చివరకు ఒక నిర్దిష్టమైన ప్రణాళికను ప్రకటించి, దాని అమలు పర్యవేక్షణకు కూడా సిద్ధపడిన నాయకుడు ట్రంప్.

ఇవీ మనకు కనిపిస్తున్న వాస్తవాలు. లేదా వాస్తవాలలో కొన్ని. తక్కిన వాస్తవాలేమిటో చూద్దాము. అన్నింటికన్నా ప్రధానమైనది, దశాబ్దాల ఘర్షణలకు మూలకారణమైన స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పాటు. దాని గురించి ట్రంప్ 20 అంశాలలో గల ప్రస్తావన అత్యంత అస్పష్టమైన రీతిలో, ఎటువంటి కాలవ్యవధి లేకుండా, చిట్టచివరన వస్తుంది. షర్మ్ అల్‌షేక్ సమావేశం తర్వాత విడుదల అయిన సంయుక్త ప్రకటనలోనూ పాలస్తీనా దేశం ప్రస్తావన లేదు. ఇజ్రాయెలీలకు, పాలస్తీనియన్లకు సమాన హక్కులు అవసరమని, గాజా సమస్య మొత్తం పాలస్తీనా సమస్యలో భాగమని మొక్కుబడిగా అనటం మినహా వారికి స్వయం నిర్ణయాధికారం ఉందని ఎక్కడా పేర్కొనలేదు. ఇటీవలనే పాలస్తీనాను గుర్తించిన బ్రిటన్ దేశపు విద్యా మంత్రి బ్రిడ్జెట్ ఫిలిప్స్, రెండు స్వతంత్ర దేశాలు అవసరమన్నారు. ఆ తర్వాత జోర్డాన్ రాజు అబ్దుల్లా, ఈజిప్టు అధ్యక్షుడు అబ్దుల్ ఫతే ఆ మాట అన్నారు. కానీ, ఆ మాట ట్రంప్‌తో అనిపించటం గానీ, సంయుక్త ప్రకటనలో చేర్చటం గానీ, ఆ మేరకు 20 అంశాల ప్రణాళికలో మార్పులు జరిపించటం గానీ చేయలేకపోయారు.

> ఇజ్రాయెలీలకు, పాలస్తీనియన్లకు సమాన హక్కులు అవసరమని మొక్కుబడిగా అనటం మినహా వారికి స్వయం నిర్ణయాధికారం ఉందని ఎక్కడా పేర్కొనలేదు. రెండు స్వతంత్ర దేశాలు ఉండాలన్న మాటను ట్రంప్‌తో అనిపించటం గానీ, సంయుక్త ప్రకటనలో చేర్చటం గానీ చేయలేదు.

ఇంకా అపనమ్మకమే...

ఈ అస్పష్టమైన, అయోమయమైన పరిస్థితుల మధ్య ఏవైనా ఆశారేఖలున్నాయా? మళ్ళీ ట్రంప్‌ను చూద్దాము. సమస్య పరిష్కారం కోసం ప్రయత్నించటంలో ప్రపంచాభిప్రాయపు ఒత్తిడి కూడా పనిచేసిందని ఒక మాట అన్నారాయన. ఇజ్రాయెల్ సేనలు 'చంపు, చంపు, చంపు' అన్నట్లుగా వ్యవహరించాయని వ్యాఖ్యానించారు. వాషింగ్టన్ నుంచి టెల్ అవీవ్‌కు ప్రయాణిస్తూ మార్గమధ్యంలో మీడియాతో, గాజా యుద్ధం ఇక శాశ్వతంగా ముగిసిందని ప్రకటించారు. తాము బందీలను విడుదల చేసిన తర్వాత ఇజ్రాయెల్ తమపై తిరిగి దాడులు జరపవచ్చునని హమాస్ సందేహించగా, అటువంటిది జరగబోదని వారికి మధ్యవర్తుల ద్వారా హామీ ఇచ్చారు. హమాస్ నిరాయుధీకరణ షరతును సడలించి, వారు గాజాలో అంతర్గత శాంతిభద్రతలను నిర్వహించవచ్చునని అంగీకరించారు. వీటన్నింటి క్రమంలో నెతన్యాహూ ఎక్కడికక్కడ మొండితనంతో వ్యవహరించగా కఠినంగా మాట్లాడి దారికి తెచ్చారు.

ఇటువంటివన్నీ పరిగణించినప్పుడు ఏమని భావించాలి? 3 వేల సంవత్సరాల సమస్య ఒక కొలిక్కి వచ్చిందని, మొత్తం పశ్చిమాసియాకే నవోదయం కలిగిందని, ఇది ఇక శాశ్వతమని అంటున్న ట్రంప్ మాటలు, తనకు సాధారణంగా మారిపోయిన అతిశయోక్తి ప్రాగల్భ్యమా? లేక, పాలస్తీనా ఏర్పాటు ఇక ఆపలేదనిదని గుర్తించి ఆ దిశగా తెర వెనుక నర్మగర్భమైన దౌత్యనీతిని నడుపుతుండటమా? అందువల్ల, మొదటి దశ అమలు వరకు ట్రంప్‌ను అభినందిస్తూనే, ఆయన ప్రకటించినట్లు ఇది శాశ్వత నవోదయం అనదగ్గ సంపూర్ణ సూర్యోదయం అనే నమ్మకం మాత్రం ఇంకా కలగటం లేదనాలి.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ టాక్

కారున్న పేదలు



అభివృద్ధి చెందిన దేశం అంటే పేదలకు కార్లున్న దేశం కాదు. ధనికులు ప్రజా రవాణా ఉపయోగించే దేశం. సామర్థ్యం కలిగిన దేశం అంటే ఆర్థికంగా పటిష్ఠంగా, ప్రతిష్ఠాత్మకంగా ఉన్న దేశం కాదు. సమస్త మానవాళి జీవితాలనూ కల్లోలాల నుంచి కాపాడగలిగే శక్తి ఉన్న దేశం.

– గుస్తావో పెట్రో, కొలంబియా అధ్యక్షుడు

టైమ్ రిపేర్



ఒకానొక సమయంలో నటిగా నేను ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయాను. మళ్లీ పని చేయటం కష్టంగా అనిపించింది. ప్రతి అడుగులోనూ తడబడ్డాను. చివరికి పరిస్థితులు మెల్లగా చక్కబడ్డాయి. అయితే అందుకు కొంత సమయం పట్టింది. సమయమే మన 'టైమ్'ని రిపేర్ చేస్తుంది.

– ఫాతిమా సనా షేక్, నటి

ఇద్దరూ ఒకటే!



ఉగ్రవాదులకూ, ఉగ్రవాదాన్ని ప్రేరేపించే వాళ్లకూ మధ్య తేడా ఏమీ లేదు. ఓటమిని విజయంగా చిత్రీకరించి ప్రపంచానికి ప్రదర్శించేవారి బెదిరింపులకు భారత్ భయపడదు. ఢిల్లీ–ఇస్లామాబాద్‌ల మధ్య ఏ మూడవ పక్షం మధ్యవర్తిత్వానికీ భారత్ అవకాశం ఇవ్వదు.

– పెటల్ గహ్లోత్, ఐరాసలో ఇండియా కార్యదర్శి

తాత గారు



హాయ్! నేను ట్రంప్ మనవరాలిని. యూఎస్‌కి ఆయన అధ్యక్షుడు కావచ్చు. నాకు తాతగారు. ఆయన గురించి యూఎస్ కంటే నాకే ఎక్కువ తెలుసు. ఆయన ప్రేమగలవారు. కానీ మీడియా ఆయన్ని వేరేలా చూపించాలని ప్రయత్నించటం నాకు బాధను కలిగిస్తోంది.

– కై మేడిసన్ ట్రంప్, ఇంటర్నెట్ సెలబ్రిటీ

ప్రతి బిడ్డా...



ప్రపంచంలోని ఉద్రిక్తతల భూభాగంలో జన్మించినందుకు ఏ బిడ్డా శిక్షను అనుభవించకూడదు. ప్రతి బిడ్డకూ మంచి జీవితాన్ని గడిపే హక్కు ఉంది. ఆ హక్కులు నెరవేరేలా చూసే నైతిక బాధ్యత శాంతియుతంగా ఉన్న ఇతర దేశాల పైన కూడా ఉంటుంది.

– పీటర్ పెల్లెగ్రిని, స్లొవేకియా అధ్యక్షుడు

చెప్పుడు రాతలు



భారత్ వంటి సంప్రదాయవాద దేశాలపై వచ్చే వార్తా కథనాలు అగ్రదేశాలు గుడ్డిగా నమ్మేస్తాయి. ఉదా: అన్ని రంగాలలో భారతీయులు ఉద్యోగాలను కొల్లగొడుతున్నారని అమెరికా పత్రికల్లో ఒక వార్త వస్తే, వెంటనే బ్రిటిష్ పత్రికలు దానిని అందిపుచ్చుకుని, ప్రచురించేస్తాయి.

– సిద్ వెంకట రామకృష్ణన్, పాత్రికేయ విశ్లేషకుడు

ప్రాణాలు నిలిపే అదృష్టం

ఇన్ బాక్స్

అదృష్టం ఊరికే రాదు. ఎవరైనా దాన్ని అందుకోవడానికి సిద్ధంగా ఉంటేనే అంది వస్తుంది. ఒక ప్రాణం కాపాడటం అలాంటి అదృష్టమే. దానికి వైద్యుడే కానక్కర లేదు. కొద్దిపాటి అవగాహన, కొంచెం శిక్షణ దొరికితే ప్రతీ పౌరుడూ ప్రాణం నిలపగలడు.

మొదట నా సొంత అనుభవానికి వద్దాం. వైద్యునిగా, ప్రత్యేకించి అనస్థీషియా (మత్తువైద్యం) నిపుణుడిగా ఎవరికైనా అరుదుగా దక్కే అదృష్టం నాకు దక్కింది. అదేమిటంటే నా చేతిలో నా తండ్రి ప్రాణం తిరిగి రావడం! నేను 2001లో ఎంపీగా ఉన్న రోజుల్లో ఒక అధికారిక పర్యటనలో ఉండగా మా పల్లెటూరు పాలికవలస నుండి ఫోన్ వచ్చింది... నాన్నకు బాగులేదని. పార్వతీపురం నుండి ఆ ఊరు నలభై కిలోమీటర్లు. అప్పటికే నాన్న బీపీ పేషెంట్ కనుక ఎందుకైనా మంచిదని అత్యవసర మందులు పట్టుకుని బయలుదేరాను. ఇంటికి చేరి మూడు నిమిషాలు అయిందో లేదో నాన్నకు గుండె, ఊపిరి ఆగిపోయాయి (కార్డియాక్ అరెస్ట్). వెంటనే ఆయన్ని సరైన పొజిషన్‌లో ఉంచి నోటితో శ్వాస అందిస్తూ, గుండెపై బలంగా నొక్కుతూ అత్యవసర ప్రక్రియ చేపట్టాను. కాసేపటికి ఆయన గుండె కొట్టుకోవడం, ఊపిరి తీసుకోవడం మళ్లీ మొదలైంది. గండం గట్టెక్కింది. మిగతా వైద్యం కోసం హాస్పిటల్‌కు తక్షణం పంపే ఏర్పాట్లు చేశాను. ఇదంతా ప్రత్యక్షంగా చూస్తున్న గ్రామీణులకే కాదు, బాగా చదువుకున్న అనుచరులకు, సెక్యూరిటీ సిబ్బందికి కూడా వింత. నాకు పట్టరాని ఆనందం. తలుచుకుంటే ఇప్పటికీ అంతే ఆనందం.




గుండె, ఊపిరి ఆగిపోయిన క్షణాల్లో అందించే ప్రాథమిక అత్యవసర ప్రక్రియ (కార్డియో పల్మనరీ రిససిటేషన్) క్లిష్టమైన ప్రక్రియ కాదు. ఎవరైనా నేర్చుకోగలరు. గతంలో అది వైద్యులకే పరిమితమైన విద్య. ఇప్పుడు అందరూ నేర్చుకోవాల్సిన ప్రాథమిక నైపుణ్యం. ఎందుకంటే ఆ మొదటి క్షణాల్లో అందించే వైద్య సహాయం ద్వారా ఎన్నో ప్రాణాలు కాపాడగలం. రోగిని గట్టి బల్లపై లేదా రోడ్డుపై పడుకోబెట్టడం, ఛాతీపై తగు బలంతో నిమిషానికి 100 సార్లు చేతులతో ఒత్తిడి ఇవ్వడం, అభ్యంతరం లేకపోతే నోటికి నోటి ద్వారా శ్వాస అందించడం లాంటి వాటితో ఒక ప్రాణాన్ని తిరిగి తీసుకురావచ్చు. ఈ నైపుణ్యాలపై విద్యార్థుల్లో, పౌరులందరిలో అవగాహన కల్పించాలి. ప్రస్తుతం ఈ దిశగా జరుగుతున్న కృషి ప్రాథమిక స్థాయిలో ఉంది. ప్రభుత్వం, పౌర సమాజం దృష్టి పెడితే ప్రజారోగ్య కోణంలో సమాజానికి చాలా మేలు జరుగుతుంది.

– డా॥ డి.వి.జి. శంకరరావు I మాజీ ఎంపీ
(రేపు ప్రపంచ అనస్థీషియా దినోత్సవం)

'నోబెల్ శాంతి'... అమెరికా కాంతి!

డేటా పాయింట్

ప్రపంచంలో అత్యధిక నోబెల్ శాంతి పురస్కారాలను అమెరికన్లు గెలుచుకున్నారు. మన దేశం నుంచి ముగ్గురికి వచ్చింది. మదర్ థెరీసా, 14వ దలైలామా, కైలాశ్ సత్యార్థి (2014లో పాకిస్తాన్‌కు చెందిన మలాలా యూసఫ్‌జాయ్‌తో సంయుక్తంగా) పొందారు.



భగవంతుడు నిష్పక్షపాతి

జ్యోతిర్మయం

ఒకడు కోటీశ్వరుల ఇంట్లో జన్మిస్తాడు. వానిని చూసి పేదవాడంటాడు – దేవునికి పక్షపాతముందని! లేకపోతే తనను పేదవానిగా, అతనిని ధనికునిగా ఎందుకు పుట్టిస్తాడని ప్రశ్నిస్తాడు. ఒకసారి పరమహంస యోగానంద ఒక కథ చెబుతారు.

ఒక రాజుండేవాడు. ఆయన తన ప్రధానమంత్రి పట్ల చాలా ప్రేమను, గౌరవాన్ని కనబరచే వాడు. మిగిలిన వారికి అసూయ కలిగి, రాజు గారికి పక్షపాతముందని గుసగుసలాడేవారు. రాజు గారి చెవిన ఆ విషయం పడింది. మరుసటి రోజు అందరూ సమావేశమై ఉండగా దూరంలో సంగీతం వినబడింది. అక్కడ ఏమి జరుగుతున్నదో కనుక్కొని రమ్మని ఒకనిని పంపాడు రాజు. అతడు వెళ్ళి వచ్చి అక్కడొక వివాహం జరుగుతున్నదని చెప్పాడు ఆ వ్యక్తి. ఎవరు పెళ్ళి చేసుకొంటున్నారని రాజు ప్రశ్నించాడు. ఆ వ్యక్తి 'తెలీదు' అన్నాడు. కనుక్కొని రమ్మని మరొకనిని పంపించాడు రాజు. ఆ వ్యక్తి తిరిగి వచ్చి ఫలానా వారిదని చెప్పాడు. రాజు మరొక్క ప్రశ్న వేశాడు. ఆ వ్యక్తి జవాబు చెప్పలేక ఊరికే నిల్చున్నాడు. కనుక్కొని రమ్మని మరొక్క వ్యక్తిని రాజుగారు పంపారు. అతడు వచ్చిన తర్వాత ఇంకొక ప్రశ్న వేస్తే జవాబు లేదు. చివరకు రాజు గారు తన ప్రధానమంత్రిని పంపారు. ఆయన వెళ్ళి వచ్చాడు. రాజు గారు అడిగిన ప్రతి ప్రశ్నకూ వివరంగా జవాబులు చెప్పాడు. అప్పుడు రాజు 'ఇప్పుడు మీకు అర్థమైందా నేను ఆయన పట్ల ఎందుకు గౌరవాన్ని చూపుతానో?' అని అందర్నీ చూస్తూ అడిగాడు. అందరూ తలలు దించుకున్నారు. (పుట 292: మానవుడి నిత్యాన్వేషణ–పరమహంస యోగానంద).

ఒక సాధారణ రాజుగారి చర్యకే ఇంతటి బలమైన కారణముంటే సర్వజ్ఞుడైన భగవంతుడు నిష్కారణంగా ఎవరికైనా ఇస్తాడా, చేస్తాడా?

– రాచమడుగు శ్రీనివాసులు


Prestige
సొంతం చేసుకోవాలనిపించే ఆవిష్కరణలు,
ధరలు చూస్తే మాత్రం
పండగ చేసుకుంటారు
కుకింగ్ ని ఇష్టపడేవారు,
ప్రెస్టీజ్ ని ఎలా కాదనగలరు.
Years of Prestige
కొనండి*
స్వచ్ఛ్ బ్లాక్
గ్యాస్ స్టవ్
ప్రెస్టీజ్
శుభ
ఉత్సవం
సెప్టెంబర్ 10 – అక్టోబర్ 31, 2025
₹6 255.00 విలువైన
స్వచ్ఛ్ ట్రై-ప్లై ఫ్లిప్ ఆన్
ప్రెషర్ కుక్కర్ 5లీ
ఉచితంగా*
కొనండి
2-ఇన్-వన్ ఎయిర్‌ఫ్లిప్
ఎయిర్ ఫ్రైయర్ & గ్రిల్లర్
MRP: ₹17 995.00
ఎయిర్ ఫ్రై మోడ్
గ్రిల్ మోడ్
మరియు పొందండి
₹10 645.00 విలువైన
ఎండ్యూరా 6 జార్ 1000W
ఉచితంగా*
కొనండి
న్యూట్రి జెల్ 450W @ఫెస్టివ్
ఆఫర్ ధర₹2 295.00
కొనండి
ప్రోవో ఫ్లస్ 900 చిమ్నీ
@35% తగ్గింపు
MRP: ₹47 695.00
మరియు పొందండి
₹20 495.00 విలువైన
స్వచ్ఛ్ ఎఫిసియా
కన్వర్టిబుల్ హాబ్
4 బర్నర్
ఉచితంగా*
మరిన్ని ఉత్తేజకరమైన
ఆఫర్లను చూడటానికి
స్కాన్ చేయండి
CUSTOMER CARE NO
080-60004411
Scan to find Prestige Xclusive stores
Shop Online on
shop.ttkprestige.com
ttk
Prestige Xclusive
Alwal: Ph: 9849776540; Attapur: Ph: 9246118777; Alkapuri X Road, Ph: 9100014635; Balanagar: Ph: 9866993073; Balapur: Ph: 8008857035; Beeramguda: Beside Khaman, Ph: 9000300266, 040-35179032; Begumpet: Ph: 7702864300, 040-40125929; Bandlaguda (Nagole): Ph: 7330648666; Boduppal: Ph: 9849776541; Bowinpally: Ph: 9866025388; B N Reddy Nagar, Ph: 7207001355; Bachupally: Ph: 9848288300; Champapet: Ph: 9703075111; Dammaiguda: Ph: 9052490634; Dilsukhnagar: Ph: 9246114922; Dr. A. S. Rao Nagar, Ph: 9291333300; 03, Dr .A. S. Rao Nagar, Ph: 8125065333; Esi Erragadda: Ph: 040-23702269, 9441252567; Gajularamaram: Ph: 78421 91923; Habsiguda: Ph: 040-402274716, 9502250985; Hayathnagar, Ph: 09440980890, Hydernagar: Ph: 9381095556; Narayanaguda: Ph: 7799343774; Khairatabad: Ph: 9502652070; Khajaguda: Ph: 9390527577; Kondapur: Ph: 8885552184; Kompally: Ph: 9697433444; Kphb Colony, Ph: 040-48523222; Kukatpally (Near Ushamullapudi Kaman), Ph: 040-2316216, 9441252567; Kushaiguda: Ph: 9440579551; Lb Nagar: Ph: 9000103111; Lingampally: Ph: 8688542107; Madinaguda: Near Bata, Ph: 040-48513308; Madinaguda: (Opp To Madinaguda Church), Ph: 9989233466; Malkajgiri: R K Nagar, Ph: 040-42100136; Malakpet: Ph: 9100014638; Maredpally Picket, Ph: 9849499537; Manikonda, Ph: 9849028192; Narsingi: Ph: 9849112557; Nallagandla: Ph: 7382191923; Neredmet 'X' Road, Ph: 8500522294; Nizampet: Ph: 7416059699; Old Alwal: Ph: 9849664049; Paradise Circle, Ph: 9542970857; Pragathinagar, Ph: 9177345689; Ramanthapur: Ph: 9014373123; Rampally X Road, Ph: 8328311762; Sri Krishnanagar: Ph: 040-40062169, 9441252567; Santoshnagar: Ph: 910044243O; Suncity, Ph: 7416642333; Suchitra: Ph: 8790590846; Shamshabad: Ph: 9676899277; Tirumalgiri: Ph: 040-274806; Tolichowki: Ph: 8885552183; Uppal: Ph: 7330993030; Vidyanagar: Ph: 7601032934; Vanasthalipuram: Ph: 9030670622, 9052757075; Quthbullapur: Ph: 7997635855; Yapral: 09550364551.
Also Available At: Amberpet: Vardhaman Kitchen World, Ph: 9912142260; Ameerpet: Sri Vinayaka Steel Palace, Ph: 9390233996; Chintalbasti: Sri Laxmi Venkateswara Steel, Ph: 23393720; Sri Laxmi Narasimhaswamy, Ph: 9949912904; Chilakalguda: Vasavi Steel Palace, Ph: 9849640935; Dilsuknagar: Metro Home Needs, Ph: 9395393970; Sanjay Steel Bazar, Ph: 9885591931; Gachibowli: Sharth City Mall-Kitchen Hub, Ph: 7331199941; Jntu: Home Store, Ph: 8106827623; Kphb: Shiv Home World, Ph: 91336 04440; Sreepirgal Electronics, Ph: 9703388988; Chandra Prabhu Home Appliances, Ph: 9032309832; Nallkunta: Vishal Shopping Centre, Ph: 9949003162; Sanathnagar: Agromech Industries, Ph: 92462 22812; For Distribution Enquires Contact: Anil.Br, Ph: 9866390002; Franchise Enquires Solicited, Contact: Sanandan Jalali, Ph: 7204457541.

మీ అభివృద్ధిలో భారత్

విశ్వసనీయ భాగస్వామి

- మంగోలియా అధ్యక్షుడు ఖురెల్‌సుఖ్ ఉఖ్నాతో ప్రధాని మోదీ వ్యాఖ్య
- ఇరువురు నేతల మధ్య కొనసాగిన ద్వైపాక్షిక చర్చలు
- మంగోలియా పౌరులకు ఉచితంగా ఈ–వీసాలిస్తామన్న మోదీ


ప్రధాని మోదీతో ఉఖ్నా కరచాలనం

న్యూఢిల్లీ: మంగోలియా దేశాభివృద్ధిలో భారత్ విశ్వసనీయ భాగస్వామి పాత్ర పోషిస్తుందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. నాలుగురోజుల భారత పర్యటనలో భాగంగా మంగళవారం ఢిల్లీకి చేరుకున్న మంగోలియా అధ్యక్షుడు ఉఖ్నా ప్రధాని నరేంద్ర మోదీతో చర్చలు జరిపారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక ఉఖ్నా భారత్‌కు రావడం ఇదే తొలిసారి. ఇరువురి ద్వైపాక్షిక చర్చల తర్వాత మోదీ మాట్లాడారు. '' భారత్, మంగోలియా బంధం కేవలం ద్వైపాక్షికం కాదు. అంతకుమించిన గాఢమైన, ఆత్మీయ, ఆధ్యాత్మిక బంధం. మన ఇరుదేశాల భాగస్వామ్యం ఇరుదేశాల ప్రజల సత్సంబంధాల్లో ప్రతిబింబిస్తోంది. భారత్ అందించిన 1.7 బిలియన్ డాలర్ల ఆర్థికసాయంతో మంగోలియాలో చేపట్టిన చమురు శుద్ధి కర్మాగారం ప్రాజెక్ట్ ఆ దేశ ఇంధన రక్షణకు మరింత భద్రత చేకూరుస్తుంది. విదేశాల్లో భారత్ చేపట్టిన అతిపెద్ద అభివృద్ధి భాగస్వామ్య ప్రాజెక్ట్ ఇదే. ఇందులో మంగోలియా సిబ్బందితోపాటు 2,500 మందికిపైగా భారతీయ నిపుణులు పనిచేస్తూ ఈ ప్రాజెక్ట్‌ను సుసాధ్యం చేస్తున్నారు. ఇది మాత్రమేకాకుండా ఎన్నో అంతర్జాతీయ వేదికలపై ఇరు దేశాల భాగస్వాములుగా కొనసాగుతున్నాయి. ఇండో–పసిఫిక్‌లో స్వేచ్ఛా, సులభతర, సమగ్రత వాణిజ్యానికి ఇరుదేశాలు కృషిచేస్తున్నాయి. గ్లోబల్ సౌత్ వాణిని గట్టిగా ఇరుదేశాలు గట్టిగా వినిపిస్తున్నాయి. మంగోలియా పౌరులకు భారత్ ఉచితంగా ఈ–వీసాలను అందించనుంది'' అని మోదీ చెప్పారు.

పలు రంగాల్లో పరస్పర సహకారం

ఈ సందర్భంగా ఉఖ్నా భారత్‌ను పొగిడారు. ''స్వచ్ఛ ఇంధన రంగంలో భారత్ అద్భుతంగా నాయకత్వ పాత్ర పోషిస్తోంది. ముఖ్యంగా అంతర్జాతీయ సౌరకూటమిలోనూ భారత్ తనదైన కీలక భూమిక పోషిస్తోంది'' అని శ్లాఘించారు. తర్వాత మోదీ మాట్లాడారు. ''బౌద్ధమతం విషయంలో ఇరుదేశాలు తోబుట్టువులే. గౌతమ బుద్ధుడి ముఖ్య శిష్యులైన సరిపుత్ర, మౌద్గల్యాయనల పవిత్ర అవశేషాలు వచ్చే ఏడాది మంగోలియాకు భారత్ అప్పగించనుంది. గండన్ బౌద్ధారామానికి భారత్ త్వరలో ఒక సాంస్కృతిక ఉపాధ్యాయుడిని పంపనుంది. ఆయన అక్కడి బౌద్ధ ప్రాచీన ప్రతులను అధ్యయనం చేయనున్నారు. మంగోలియాలో బౌద్ధమత వ్యాప్తికి నాటి బిహార్‌లోని పురాతన నలంద విశ్వవిద్యాలయం ఎంతగానో సాయపడింది. ఇప్పుడు అదే రీతిలో గండన్ మఠం, నలంద వర్సిటీల మధ్య అనుసంధానాన్ని మెరుగుపరుస్తాం ''అని మోదీ చెప్పారు. ''లద్దాఖ్ స్వయంప్రతిపత్తి పర్వతప్రాంత అభివృద్ధి మండలి, మంగోలియాలోని అర్హాంగాయ్ ప్రావిన్స్‌ల మధ్య సాంస్కృతిక బంధం బలపడేందుకు మంగళవారం ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాం. రక్షణ మొదలు భద్రత, ఇంధనం, గనులు, సమాచార సాంకేతికత, విద్య, ఆరోగ్యం, సంస్కృతిక సహకార రంగాల్లో ఇరుదేశాల భాగస్వామ్యం, పరస్పర సహకారం మరింత బలపడింది'' అని మోదీ అన్నారు. 1955లో ఇరుదేశాల మధ్య దౌత్యసంబంధాలు మొదలయ్యాయి.

సూపర్‌వుడ్!

- ఉక్కు కంటే 10 రెట్లు పటిష్టమైంది
- రసాయన చర్యతో సృష్టించిన పరిశోధకులు



వాషింగ్టన్: ఉక్కు కంటే ఏకంగా 10 రెట్లు పటిష్టమైన చెక్కను అమెరికా శాస్త్రవేత్తల బృందం విజయవంతంగా సృష్టించింది. దీనికి సూపర్‌వుడ్ అని పేరుపెట్టింది. సాధారణ కలపనే రసాయన చర్యకు గురిచేసి అత్యంత పటిష్టమైన, కఠిన కలపగా రూపాంతరం చెందించారు. మౌలిక వసతుల రంగంలో నాణ్యమైన, ఎక్కువ కాలం పాడవకుండా ఉండే మన్నికైన కలపకు విపరీతమైన డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో స్టీల్‌ను తలదన్నేలా కలపను సృష్టించి అమెరికా శాస్త్రవేత్తలు ఔరా అనిపించారు. ఈ బృందానికి ప్రఖ్యాత మెటీరియల్ సైన్స్ నిపుణుడు లియాంగ్‌బింగ్ హూ సారథ్యం వహించారు. ఈ పరిశోధన ఫలితాలు ప్రఖ్యాత 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. చెట్టు కలపకు పటిష్టతను, రంగును ఇచ్చే లిగ్నిన్ అనే పదార్థాన్ని కలప నుంచి తొలగించి ఆ చెక్కకు చెక్కుచెదరని పటిష్టతను ఆయన ఆపాదించగలిగారు. ఇందుకోసం హూ బృందం వినూత్నమైన పద్ధతిని అవలంభించింది. సహజ కలప చెక్క నుంచి లిగ్నిన్, హెమీ సెల్యూలోజ్‌లను తొలగించేందుకు ఆ చెక్కలను తొలుత సోడియం హైడ్రాక్సైడ్, సోడియా సల్ఫేట్ ద్రావకంలో ఉడకబెట్టారు. తర్వాత అదే వేడిమీద చెక్కలను సమతల పరికరంతో గట్టిగా అదిమారు. దీంతో కలపలోని కణాల సవ్యఅమరిక ధ్వంసమై అన్నీ ఒక్కదగ్గరకు చేరిపోయాయి. దీంతో సెల్యూలోజ్ నానోకణాలు చిక్కగా ఒకే దగ్గరకు చేరి కలప ఉక్కులాగా గట్టిపడింది. ఇది ఏకంగా స్టీల్ కంటే 10 రెట్లు గట్టిగా ఉన్నట్లు పలు పరీక్షల్లో నిర్ధారణ అయింది. తేమను తట్టుకుంటూ సులువుగా విరిగిపోకుండా చెక్క మరింత దృఢత్వాన్ని సంతరించుకుంది. ఈ చెక్క బరువు సైతం సాధారణ చెక్క బరువులో ఆరోవంతే ఉండటం విశేషం. తక్కువ బరువు ఉండటంతో భూకంపాల వంటి సందర్భాల్లో ఈ చెక్కతో నిర్మించిన ఇళ్లు అంత త్వరగా కంపనాలకు గురికావు. అత్యంత తేలికగా ఉండటంతో నిర్మాణంలో ఉపయోగించడం సైతం చాలా సులువు. ఇల్లు, కార్యాలయాల ఫర్నిచర్, ఇంటీరియల్ పనుల్లో రెండు సాధారణ చెక్కలు నట్లు, బోల్ట్‌లతో జతచేసినప్పుడు అవి త్వరగా పాడవుతుంటాయి. ఈ సమస్యకు ఈ కొత్తతరహా కలపతో చెక్ పెట్టొచ్చని కంపెనీ చెబుతోంది. సూపర్‌వుడ్ పేరిట ఈ చెక్కను అమెరికాలోని మేరీల్యాండ్‌లోని ఫ్రెడెరిక్ ప్రాంతంలో వాణిజ్యపరంగా తయారుచేయనున్నారు. హూ సహ వ్యవస్థాపకునిగా ఉన్న ఇన్వెంట్‌వుడ్ అనే సంస్థ ఈ కలపను తయారుచేయనుంది.

సాధారణ కలప కంటే 20 రెట్లు శక్తివంతం

లియాంగ్‌బింగ్ హూ పదేళ్ల క్రితమే ఇలా పటిష్టమైన చెక్క కోసం ప్రయోగాలు మొదలెట్టారు. ''భూమిపై అత్యధికంగా లభ్యమయ్యే సహజ పాలిమర్‌గా సెల్యూలోజ్‌ను చెప్పొచ్చు. ఇది కలపలో మెండుగా ఉంటుంది. దీని సాయంతో ఉక్కులాంటి చెక్కను తయారు చేయాలని గతంలోనే భావించా. 2017లోనే ఈ తరహా ప్రయోగం చేశా. ఇన్నాళ్లకు వాణిజ్యపర ఉత్పత్తికి సిద్ధమయ్యాం'' అని హూ చెప్పారు.

20 ప్రాణాలు బుగ్గిపాలు

బస్సు ప్రమాదంలో సజీవదహనమైన ప్రయాణికులు

- మరో 16 మందికి తీవ్ర గాయాలు
- రాజస్తాన్‌లోని జైసల్మీర్ సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని
- తలో రెండు లక్షల ఎక్స్‌గ్రేషియా విడుదల


అగ్ని కీలల్లో బస్సు


పూర్తిగా కాలిపోయిన బస్సు

జైసల్మీర్: దాదాపు 57 మంది ప్రయాణికులతో మొదలైన ఒక ప్రైవేట్ బస్సు ప్రయాణం అత్యంత విషాదాంతంగా ముగిసింది. బస్సు వేగంగా దూసుకెళ్తున్నప్పుడు ఒక్కసారిగా అంటుకున్న అగ్నికీలలు రెప్పపాటులో బస్సును ఆవహించి అందులోని 20 మంది ప్రయాణికుల ప్రాణాలు తీశాయి. రాజస్థాన్‌లోని జైసల్మీర్ నగరం సమీపంలో మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో జైసల్మీర్–జోధ్‌పూర్ జాతీయరహదారిపై ఈ ఘోర అగ్నిప్రమాదం జరిగింది. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం బస్సు వెనక భాగంలో షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో ఒక్కసారిగా పెద్ద ఎత్తున పొగ రావడం మొదలైంది. బస్సు అత్యంత వేగంగా వెళ్తుండటంతో గాలులు తోడై మంటలు చెలరేగి వేగంగా బస్సును చుట్టుముట్టాయి. డ్రైవర్ గమనించి బస్సును రహదారిపై ఒక పక్కకు ఆపి అందర్నీ అప్రమత్తంచేసేలోపే 20 మంది ప్రయాణికులు ఆ మంటలకు సజీవ దహనమయ్యారు. 16 మంది ప్రయాణికులకు తీవ్రస్థాయిలో కాలిన గాయాలయ్యాయి. వీరిలో కొందరి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. విషయం తెల్సుకున్న అగ్నిమాపక, ఆర్మీ సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను సమీప ఆస్పత్రులకు తరలించారు. మార్గమధ్యంలో ఇతర వాహనాలు, ట్రాఫిక్ అడ్డుతగలకుండా గ్రీన్‌చానల్ ఏర్పాటుచేశారు. జోధ్‌పూర్ ఆస్పత్రిలో గాయపడిన ప్రయాణికులకు పూర్తిస్థాయిలో చికిత్స, సహాయ సహకారాలు అందించాలని రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. పరిస్థితిని సమీక్షించేందుకు సీఎం జైసల్మీర్‌కు చేరుకున్నారు.

మొత్తంగా కాలిపోయిన బస్సు

తొలుత మంగళవారం మధ్యాహ్నం జైసల్మీర్ నుంచి బస్సు జోధ్‌పూర్‌కు బయల్దేరింది. బయల్దేరిన 10 నిమిషాలకే బస్సు అగ్ని ప్రమాదానికి గురైందని పోఖ్రాన్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే ప్రతాప్ పురీ మీడియాతో చెప్పారు. వేగంగా వెళ్తున్న బస్సులో చెలరేగిన మంటలు గాలుల ధాటికి రెప్పపాటులో మొత్తంగా అంటుకోవడంతో ప్రమాదతీవ్రత భారీస్థాయిలో ఉంది. మంటలకు బస్సు మొత్తం కాలిపోయింది. బస్సులో పడుకుని ప్రయాణించే విభాగం మొత్తం కాలిబూడిదైంది. కొందరి ప్రయాణికుల మృతదేహాలు అగ్నికికాలిపోయి మాంసం ముద్దలుగా మారిపోయాయి. డీఎన్‌ఏ పరీక్షల తర్వాతే మృతదేహాలను కుటుంబసభ్యులు అప్పగించనున్నారు. విషయం తెల్సి ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు తలో రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన వారికి తలో రూ. 50,000 అందజేయనున్నారు. ప్రమాదంపై రాష్ట్ర గవర్నర్ హరిబావూ బగాదే సైతం తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదానికి గురైన బస్సును కొత్త యజమాని కేవలం ఐదు రోజుల క్రితమే కొనుగోలు చేసినట్టు వార్తలొచ్చాయి. ప్రమాద సమయంలో బస్సు నుంచి పెద్ద ఎత్తున మంటలు, దట్టంగా పొగ వెలువడుతున్న వీడియో ప్రస్తుతం వైరల్‌గా మారాయి.

స్వల్పంగా తగ్గిన గజరాజుల సంఖ్య

న్యూఢిల్లీ: డీ–ఆక్సీరైబో న్యూక్లిక్ యాసిడ్(డీఎన్‌ఏ) ఆధారిత తొలి ఏనుగుల గణనతో వన్యప్రాణుల వాస్తవిక సంఖ్య బట్టబయలైంది. 2017 ఏడాది గణాంకాల ప్రకారం భారత్‌లో అడవుల్లో 27,312 ఏనుగులు జీవిస్తున్నట్లు తేలింది. తాజాగా దేశంలో తొలిసారిగా చేపట్టిన డీఎన్‌ఏ ఆధారిత గణాంకాల్లో వీటి సంఖ్య కాస్తంత తగ్గింది. ప్రస్తుతం అడవుల్లో 22,446 ఏనుగులు ఉన్నట్లు 'ది ఆలిండియా సింక్రొనస్ ఎలిఫెంట్ ఎస్టిమేషన్–2025' ప్రకటించింది. డీఎన్‌ఏ ఆధారిత సర్వేను 2021 ఏడాదిలో మొదలెట్టగా నాలుగేళ్ల ఆలస్యంగా మంగళవారం ఈ నివేదిక వెలువడింది. సంక్లిష్టమైన జన్యు డేటాను సేకరించడం, తర్వాత ఆ గణాంకాలను విశ్లేషించడంతో నివేదిక రూపకల్పన ఆలస్యమైందని కేంద్ర ప్రభుత్వ అధికారులు వెల్లడించారు. '' కర్ణాటకలో గరిష్టంగా 6,013 ఏనుగులు ఉన్నాయి. అస్సాం(4,159), తమిళనాడు (3,136), కేరళ(2,785), ఉత్తరాఖండ్(1,792 ఏనుగులు) తర్వాతి వరుసలో ఉన్నాయి. త్రిపురలో కేవలం 153 ఏనుగులే అడవుల్లో ఉన్నాయి.

స్నేహితుడిపై అనుమానం, అరెస్ట్

- గ్యాంగ్‌రేప్ జరగలేదని పోలీసుల ప్రకటన
- ఆరుగురిలో ఒక్కరు మాత్రమే రేప్ చేశారని ప్రాథమిక అంచనా
- ఫోరెన్సిక్ నివేదిక తర్వాతే కేసులో స్పష్టత వస్తుందన్న పోలీస్ విభాగం

దుర్గాపూర్/కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో తీవ్ర చర్చనీయాంశమైన దుర్గాపూర్ గ్యాంగ్‌రేప్ ఉదంతం కొత్త మలుపు తీసుకుంది. తనను ఐదుగురు గ్యాంగ్‌రేప్ చేశారని బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలంతో షేక్ సఫీఖుల్, షేక్ నసీరుద్దీన్, అబూ బౌరీ, ఫిర్దౌస్ షేక్, షేక్ రియాజుద్దీన్‌లను అరెస్ట్‌చేసిన పోలీసులు తాజాగా బాధితురాలి స్నేహితుడిని అరెస్ట్‌చేశారు. ఘటన జరిగిన తీరుపై బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలానికి, స్నేహితుడు ఇచ్చిన సమాధానాలకు పొంతన లేకపోవడంతో అతడిని మంగళవారం సాయంత్రం బెంగాల్ పోలీసులు అరెస్ట్‌చేశారు. అయితే బాధితురాలిపై సామూహిక అత్యాచారం జరగలేదని, క్లాస్‌మేట్ అయిన ఈ స్నేహితుడు మాత్రమే రేప్ చేశాడని ప్రాథమిక అంచనాకు వచ్చామని పోలీసులు చెప్పారు. నిందితులందరి దుస్తులు, ఘటనాస్థలిలో లభించిన ఆధారాలను ఫోరెన్సిక్ పరీక్షకు పంపించామని నివేదిక వచ్చాకే కేసులో స్పష్టత వస్తుందని అసన్‌సోల్–దుర్గాపూర్ పోలీస్ కమిషనర్ సునీల్ కుమార్ చౌదరి చెప్పారు. చౌదరి మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఘటన జరిగిన రోజు గంటన్నర ఆలస్యంగా తమ కూతురి స్నేహితుడు తమకు సమాచారం ఇచ్చాడని, అతనిపైనా తమకు అనుమానం ఉందని బాధితురాలి తండ్రి అక్టోబర్ 10వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో చివరకు ఆ స్నేహితుడు సైతం అరెస్ట్‌కావడం గమనార్హం. దుర్గాపూర్ పట్టణ శివారులోని ప్రైవేట్ ఎంబీబీఎస్ కళాశాల హాస్టల్ నుంచి దూరంగా ఉన్న ధాబాలో భోజనం చేసేందుకు ఈ స్నేహితుడే బాధితురాలిని బయటకు తీసుకెళ్లగా గ్యాంగ్‌రేప్ జరిగిందని కేసు నమోదవడం తెల్సిందే. డిప్యూటీ పోలీస్ కమిషనర్ అభిషేక్ గుప్తా సారథ్యంలోని బృందం సీన్ రీక్రియేషన్ కోసం ఐదుగురు నిందితులను మంగళవారం మధ్యాహ్నం ఘటనాస్థలికి తీసుకెళ్లి ప్రశ్నించింది. ఈ మొత్తం ప్రక్రియను వీడియోలో చిత్రించారు. ఈ సందర్భంగా ఐదుగురు నిందితులు విడివిడిగా చెప్పిన సమాధానాలకు పొంతన కుదరలేదు. దీనికితోడు బాధితురాలు ముగ్గురిలో కేవలం ఒక్కరే రేప్ చేశారని తొలుత వాంగ్మూలం ఇవ్వడం, తర్వాత ఐదుగురు రేప్ చేశారని మరోలా వాంగ్మూలం ఇవ్వడం, స్నేహితుడు పొంతనలేని సమాధానాలు చెప్పడంతో అనుమానంతో ఆ స్నేహితుడిని అరెస్ట్‌చేశామని కమిషనర్ చెప్పారు. ''బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలాలు, లభించిన ఆధారాలు, నిందితుల స్టేట్‌మెంట్లను గమనిస్తే ఇది గ్యాంగ్‌రేప్ కాదని అర్థమవుతోంది. ఒక్కరు మాత్రమే అఘాయిత్యానికి పాల్పడ్డారని తెలుస్తోంది'' అని కమిషనర్ వ్యాఖ్యానించారు.

వాంగ్మూలాలకు, సీసీటీవీ ఫుటేజీకి కుదరని లంకె

నిందితులు, బాధితురాలు ఇచ్చిన వాంగ్మూలాలకు, సీసీటీవీలో ఉన్న దృశ్యాలకు సైతం పొంతన కుదరకపోవడం ఈ కేసులో సంక్లిష్టతను మరింత పెంచుతోంది. ఐదుగురు నిందితులు తనను లాక్కెళ్లినప్పుడు స్నేహితుడు పారిపోయాడని బాధితురాలు వాంగ్మూలం ఇచ్చింది. కానీ బాధితురాలు, స్నేహితుడు అసలేం జరగనట్లు, ముఖాల్లో ఎలాంటి ఆందోళన, బాధ లేకుండా హాస్టల్‌కు తిరిగొచ్చినట్లు ఘటన తర్వాత హాస్టల్ గేటు దగ్గరి సీసీటీవీ ఫుటేజీలో రికార్డయింది. రేప్ వేళ పెనుగులాటలో బాధితురాలి దుస్తులు చిరిగిపోవడమో, జుట్టు చిందరవందరగా ఉండటమో లాంటివి లేకుండా బాధితురాలు ఆ వీడియోలో మామూలుగానే కనిపించింది. తనకు హాని జరిగిందని బాధితురాలు హాస్టల్ గేటు వద్ద ఉన్న సెక్యూరిటీ సిబ్బందికి ఫిర్యాదుచేసినట్లు ఫుటేజీలో కనిపించలేదు. వాళ్ల సాయం కోరినట్లుగా కూడా లేదు. ''ఘటన తర్వాత బాధితురాలి ఫోన్ నుంచి స్నేహితునికి ఆగంతకులు ఫోన్ చేసి రమ్మన్నారు. ఫోన్ తిరిగి ఇవ్వాలంటే రూ.3,000 ఇవ్వాలని బాధితురాలిని డిమాండ్‌చేశారు. ఆమె వద్ద ఉన్న రూ. 200 లాగేసుకున్నారు'' అని కమిషనర్ వెల్లడించారు.

ఐజీ ఆత్మహత్య కేసులో ట్విస్ట్

- ఆయనపై అవినీతి ఆరోపణలు చేస్తూ ఓ ఏఎస్‌ఐ ఆత్మహత్య
- పూరన్ సన్నిహిత కానిస్టేబుల్ సుశీల్‌ను అరెస్టు చేసింది ఇతడే
- హరియాణా డీజీపీ శత్రుజీత్‌ను సెలవుపై పంపిన ప్రభుత్వం
- తాత్కాలిక డీజీపీగా ఓపీ సింగ్‌కు బాధ్యతలు
- పూరన్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శించిన రాహుల్‌గాంధీ


సందీప్‌కుమార్

చండీగఢ్: హరియాణా సీనియర్ పోలీస్ అధికారి, ఇన్‌స్పెక్టర్ జనరల్ (ఐజీ) పూరన్‌కుమార్ కుమార్ ఆత్మహత్య వ్యవహారంలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. పూరన్‌కుమార్‌పై వచ్చిన అవినీతి ఆరోపణపై విచారణ దర్యాప్తు జరుపుతున్న రోహ్‌తక్ ఏఎస్‌ఐ సందీప్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నారు. అంతకుముందు ఆయన పూరన్ కుమార్‌పై తీవ్రమైన అవినీతి ఆరోపణలు చేశారు. సందీప్‌కుమార్ మృతదేహాన్ని రోహ్‌తక్‌లోని ఆయన నివాసంలో గుర్తించారు. మృతదేహం వద్ద మూడు పేజీల లేఖతోపాటు ఆయన మొబైల్‌లో ఆరు నిమిషాల సెల్ఫీ వీడియో లభించాయి. అందులో ఆయన పూరన్‌కుమార్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తనను కులం పేరుతో వేధించారని ఆరోపిస్తూ పూరన్ కుమార్ తన ఆత్మహత్య లేఖలో పేర్కొన్న 8 మంది పోలీస్ అధికారుల్లో ఒకరైన రోహ్‌తక్ ఎస్పీ బిజర్నియా ఎంతో నిజాయితీగల మంచి వ్యక్తి అని సందీప్‌కుమార్ తన ఆత్మహత్య లేఖలో పేర్కొనటం గమనార్హం. సందీప్‌కుమార్ తన రివాల్వర్‌తో కాల్చుకుని మరణించాడని రోహ్‌తక్ ప్రస్తుత ఎస్పీ ఎస్ఎస్ భోరియా తెలిపారు. 'మా డిపార్ట్‌మెంట్‌లో సందీప్‌కుమార్ ఎంతో కష్టపడి పనిచేసే నిజాయితీగల వ్యక్తి'అని చెప్పారు. సందీప్ ఆత్మహత్య లేఖ గురించి మీడియా ప్రశ్నించగా.. దాని గురించి ఇప్పుడే మాట్లాడటం సమస్యలకు దారితీస్తుందని, ఫోరెన్సిక్ బృందం దర్యాప్తు జరుపుతోందని పేర్కొన్నారు. కాగా, తన మరణంతో అయినా దేశం నిజం తెలుసుకుంటుందని సందీప్ తన సెల్ఫీ వీడియోలో పేర్కొన్నారు. 'పూరన్‌కుమార్ అవినీతిపరుడు. అందుకు అనేక సాక్ష్యాలు ఉన్నాయి. దర్యాప్తులో వివక్షను నిరసిస్తూ నేను ప్రాణత్యాగం చేస్తున్నాను. ఆ అవినీతి కుటుంబాన్ని అస్సలు వదలొద్దు. కులరాజకీయాలతో వ్యవస్థను హైజాక్ చేస్తున్నారు' అని అందులో పేర్కొన్నాడు. లిక్కర్ కాంట్రాక్టర్ నుంచి పూరన్‌కుమార్ తరఫున రూ.2.5 లక్షలు లంచం తీసుకున్నాడని ఆరోపణలు ఎదుర్కొంటున్న కానిస్టేబుల్ సుశీల్‌కుమార్‌ను అరెస్టు చేయటంలో సందీప్‌కుమార్ కీలకంగా వ్యవహరించారు. కాగా, పూరన్‌కుమార్‌పై కుల వివక్ష ఆరోపణలు ఎదుర్కొంటున్న రాష్ట్ర డీజీపీ శత్రుజీత్ కపూర్‌ను నాయబ్‌సింగ్ సైనీ ప్రభుత్వం సెలవుపై పంపింది. ఆయన స్థానంలో తాత్కాలిక డీజీపీగా 1992 బ్యాచ్ ఐపీఎస్ అధికారి ఓపీ సింగ్‌కు బాధ్యతలు అప్పగించింది.

మోదీ రాతిగుండె కరగదా?: రాహుల్

పూరన్‌కుమార్ కుటుంబాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. పూరన్ కుమార్‌ను కులం పేరుతో వేధించి ఆత్మహత్యకు కారణమైన అధికారులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. భర్త మృతదేహానికి గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించేందుకు పూరన్‌కుమార్ సతీమణి, సీనియర్ ఐఏఎస్ అధికారి అమ్‌నీత్ పీ కుమార్, ఆయన ఇద్దరు కుమార్తెలు వారాలుగా ఎదురు చూస్తున్నారని.. అయినా ప్రధాని మోదీ, సీఎం సైనీ రాతి మనసులు కరగటం లేదని ఆరోపించారు. ఎంత చదువుకున్నా, ఎంత ప్రజ్ఞా పాటవాలు ఉన్నా, జీవితంలో ఎంత ఎత్తుకు ఎదిగి నా ఈ దేశంలో దళితులపై అణచివేత తప్పదని పూరన్‌కుమార్ ఆత్మహత్య ఘటన నిరూపిస్తోందని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు.

71 మందితో బీజేపీ మొదటి జాబితా

- స్పీకర్ నంద్ కిశోర్ యాదవ్‌కు మొండిచేయి
- దశాబ్దం తర్వాత డిప్యూటీ స్పీకర్ సమ్రాట్‌కు అవకాశం

పట్నా/న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల అభ్యర్థుల ప్రకటనలో అధికార ఎన్డీయే ముందంజలో ఉంది. కూటమిలోని బీజేపీ మంగళవారం అందరినీ ఆశ్చర్యపరుస్తూ 9 మంది మహిళలు సహా 71 మందితో కూడిన మొదటి జాబితా విడుదల చేసింది. ఇందులో ఏడు పర్యాయాలు ఎమ్మెల్యే, సీనియర్ నేత, అసెంబ్లీ స్పీకర్ నంద్ కిశోర్ యాదవ్(72)కు చోటు కల్పించలేదు. బదులుగా దశాబ్దకాలంగా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయని డిప్యూటీ స్పీకర్ సమ్రాట్ చౌదరికి కాషాయ పార్టీ అవకాశమిచ్చింది. ఆరోగ్యం, న్యాయ శాఖల మంత్రి, ఎమ్మెల్సీ మంగళ్‌పాండేని ఈసారి సివాన్ టికెట్టిచ్చి అసెంబ్లీ బరిలోకి దించింది. సమ్రాట్ చౌదరి, మంగళ్ పాండేలు గతంలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షులుగా పనిచేసిన వారే కావడం విశేషం. అదేవిధంగా, నంద్ కిశోర్ యాదవ్ సిట్టింగ్ స్థానం పట్నా సాహిబ్ స్థానాన్ని పెద్దగా పరిచయం లేని పార్టీ రాష్ట్ర కార్యదర్శి సంజయ్ కుమార్‌కు బీజేపీ కేటాయించింది. సిట్టింగుల్లో కనీసం పది మందికి రెండో విడత అవకాశం దక్కలేదని బీజేపీ వర్గాలు తెలిపాయి.

పేర్లు ప్రకటించకుండానే అభ్యర్థులకు నితీశ్ టికెట్లు

జేడీయూ చీఫ్, బిహార్ సీఎం నితీశ్ కుమార్ గత సంప్రదాయాన్ని పక్కనబెట్టి, నేరుగా అభ్యర్థులకు టికెట్లు ఇచ్చేస్తున్నారు. ఎన్డీయేలో సీట్ల కేటాయింపులో తలెత్తిన తీవ్ర విభేదాలే ఇందుకు కారణమని చెబుతున్నారు. గతంలో ఆయన మీడియా సమావేశంలో అభ్యర్థుల పేర్లను ప్రకటించేవారు. తాజాగా నితీశ్ మంగళవారం ఎందరికి టికెట్లు ఇచ్చేశారనే విషయం స్పష్టం కానప్పటికీ సీఎం నివాసం నేతలతో నిండిపోయింది. టికెట్లు అందిన వారిలో కొందరు ఇప్పటికే నామినేషన్లు కూడా దాఖలు చేశారు. అయితే, ఎన్డీయే ఐక్యంగానే ఉందంటూ భాగస్వామ్య పక్షాల నేతలు చెబుతున్నారు.

మడగాస్కర్‌లో సైనిక కుట్ర అధ్యక్షుడి తొలగింపు

అంటననారివో: జెన్ జెడ్ ఆందోళనలతో అట్టుడుకుతున్న మడగాస్కర్‌లో సైనిక తిరుగుబాటు జరిగింది. అధ్యక్షుడు ఆండ్రీ రజోలినా పదవి నుంచి ఉద్వాసనకు గురయ్యారు. రజోలినాను అభిశంసిస్తూ పార్లమెంట్ తీర్మానం ఆమోదించింది. ఆ వెంటనే ఆయన గుర్తు తెలియని ప్రాంతానికి వెళ్లిపోయారు. తిరుగుబాటుకు నేతృత్వం వహించిన క్యాప్‌శాట్ సైనిక విభాగం నేత కల్నల్ మైకేల్ రండ్రియానిరినా మీడియా సమక్షంలో ఒక ప్రకటన చేశారు. అధికారం తమ చేతుల్లోకి వచ్చిందన్నారు. మిలటరీ, పోలీసు ఉన్నతాధికారులతో ఏర్పాటయ్యే కౌన్సిల్ ప్రభుత్వాన్ని నడిపిస్తుందని ప్రకటించారు. త్వరలోనే ప్రధానిని కూడా నియమి స్తామన్నారు. అత్యున్నత న్యాయస్థానం అధికారాలను రద్దు చేశామన్నారు. రెండేళ్లలోగా దేశంలో రెఫరెండం జరిపిస్తా న్నారు. దీంతో, రాజధానిలో ప్రజలతోపాటు సైనికులు సంబరాలు చేసుకున్నారు.

కూటమిలో తేలని సీట్ల లెక్కలు

కాంగ్రెస్, ఆర్జేడీ మధ్య కుదరని ఏకాభిప్రాయం

సాక్షి, న్యూఢిల్లీ: బిహార్ ఎన్నికల్లో సీట్ల పంపకాలపై ఆర్జేడీ–కాంగ్రెస్ నేతృత్వంలోని మహాఘట్‌బంధన్‌లో అస్పష్టత కొనసాగుతోంది. అధికార ఎన్డీయేలోని ప్రధాన పక్షం బీజేపీ ఇప్పటికే 71 స్థానాలకు అభ్యర్థులను సైతం ప్రకటించగా ఇండియా కూటమి ఇంకా పోటీచేసే స్థానాలపైనే సిగపట్లు పడుతోంది. మరో రెండ్రోజుల్లో నామినేషన్ల ప్రక్రియ ముగియనుండటంతో బుధ, గురువారాల్లో ఈ అంశాన్ని తేల్చాలని మిత్రపక్షాలు తేల్చి చెబుతున్నాయి. రాష్ట్రంలోని మొత్తం 243 సీట్లకు గానూ కాంగ్రెస్ గతేడాది పోటీ చేసిన సంఖ్యతో సమానంగా సీట్లను కోరుతోంది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ 70 సీట్లలో పోటీచేసి 19 చోట్ల నెగ్గింది. ఈసారి సైతం తమకే అంతే స్థానాలను కోరుతుండగా, ఆర్జేడీ మాత్రం 54–55 సీట్లకు మాత్రమే ఆఫర్ ఇస్తోంది. ఇదే అంశమై సోమవారం ఏఐసీసీ పెద్దలతో జరిగిన చర్చల సందర్భంగా మరో 3 స్థానాలు ఇచ్చేందుకు ఆర్జేడీ నేత తేజస్వీయాదవ్ అంగీకరించినట్లు తెలుస్తోంది. అయితే, తమకు కనీసంగా 65 స్థానాలైనా ఇవ్వాలని కాంగ్రెస్ పట్టుబట్టినట్లు సమాచారం. దీనిపై బుధ, గురువారాల్లో స్పష్టత వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.

తేజస్వీ జోక్యంతో టికెట్లు ఇవ్వడం ఆపేసిన లాలు

ఆర్జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్ సోమవారం రాత్రి పార్టీ నేతలకు టికెట్లు ఇవ్వడం ప్రారంభించారు. ఇది సరైన విధానం కాదంటూ కుమారుడు తేజస్వీ యాదవ్ అడ్డుకోవడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. అప్పటికే టికెట్లు అందుకున్న నేతలు తిరిగి ఇవ్వాలని తేజస్వి కోరారు. ఇందుకు స్పందించింది కొందరే. గత వారమే జేడీయూ నుంచి ఆర్జేడీలో చేరిన సునీల్ సింగ్ మంగళవారం నామినేషన్ కూడా దాఖలు చేశారు. టికెట్ల వ్యవహారంపై ఆర్జేడీ, కాంగ్రెస్ నేతల మధ్య సామాజిక మాధ్యమాల వేదికగా ఆరోపణలు, ప్రత్యారోపణలు కూడా నడుస్తున్నాయి.

కర్నాటక కాంగ్రెస్ ఎమ్మెల్యేకు సుప్రీంలో ఊరట

న్యూఢిల్లీ: కర్నాటకలోని మలూర్ స్థానం నుంచి ఎన్నికైన కాంగ్రెస్ ఎమ్మెల్యే కేవై నంజెగౌడకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఈయన ఎన్నిక చెల్లదంటూ కర్నాటక హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను అత్యున్నత న్యాయస్థానం పక్కనబెట్టింది. 2023 ఎన్నికల్లో పోలైన ఓట్ల రీకౌంటింగ్ చేపట్టాలని ఈసీని ఆదేశించింది. వివరాలను సీల్డు కవర్‌లో తమకు అందజేయాలని కోరింది. స్వయంగా ఫలితాన్ని ప్రకటించవద్దని కూడా ఈసీకి స్పష్టం చేసింది. జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చిల ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. తీర్పు వెలువడే వరకు కేవై నంజెగౌడ ఎమ్మెల్యేగా కొనసాగవచ్చని స్పష్టం చేసింది. ఓట్ల లెక్కింపులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ 2023 ఎన్నికల్లో తన ప్రధాన ప్రత్యర్థి, బీజేపీకి చెందిన కేఎస్ మంజునాథ గౌడ వేసిన పిటిషన్‌పై కర్నాటక హైకోర్టు సెప్టెంబర్ 16వ తేదీన వెలువరించిన తీర్పును నంజెగౌడ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఈ మేరకు ధర్మాసనం తీర్పు వెలువరించింది. అదే సమయంలో, మంజునాథ గౌడకు నోటీసులు జారీ చేసింది. అప్పటి ఎన్నికలో నంజెగౌడ 248 ఓట్ల తేడాతో విజయం సాధించారు.



కోతకు గురైన 'ఉదండాపూర్' కట్ట

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పరిధిలో నిర్మిస్తున్న ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయి. ఇటీవలి వర్షాలకు కట్ట కోతకు గురై పగుళ్లు ఏర్పడటంతో పాటు.. పలుచోట్ల నీరు లీకవుతోంది. భారీ కట్ట నిర్మాణం నాసిరకంగా చేపట్టడంతో.. కట్టపై ఒక్కోచోట దాదాపు 20 అడుగుల మేర గోతులు ఏర్పడ్డాయి. నిర్మాణంలో నాణ్యత పాటించకుండా నాసిరకం మట్టిని వినియోగించడం.. అందులోని రాళ్లను తీయకుండా రోలింగ్ చేయడంతో వానలకు కట్ట దెబ్బతిన్నట్లు తెలుస్తోంది. కట్ట నుంచి నీరు లీకవుతుండడం, వర్షాలతో నీరు పొలాల్లోకి చేరడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.

పోలవరం ముంపుపై సర్వే జరపండి

కృష్ణా గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్‌కు పీపీఏ లేఖ

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రభావంతో తెలంగాణ భూభాగంలో ఏర్పడనున్న ముంపు ప్రభావంపై ఉమ్మడి సర్వే నిర్వహించాలని కృష్ణా గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ (కేజీబీవో)ను పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) కోరింది. ఈ మేరకు పీపీఏ సభ్య కార్యదర్శి ఈ నెల 9న హైదరాబాద్‌లోని కేజీబీవో సీఈకి లేఖ రాశారు. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) కింద కేజీబీవో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తోంది. గతంలో కేంద్ర జలసంఘం ఆదేశం మేరకు గోదావరిలో వరదలు తగ్గుముఖం పట్టాక ఉమ్మడి సర్వే నిర్వహించాలని కేజీబీవోకు పీపీఏ సూచించింది. పోలవరం బ్యాక్‌వాటర్‌తో కిన్నెరసాని, ముర్రెడు వాగులకు ఉండనున్న ముంపు ప్రభావంపై గతంలో నిర్వహించిన సర్వే తరహాలోనే.. మిగిలిన 6 వాగులపై ఏర్పడే ప్రభావంపై సైతం సర్వే నిర్వహించాలని కేంద్ర జలసంఘం నిర్ణయించింది.

బనకచర్ల డీపీఆర్ చట్టవిరుద్ధం

- ప్రాజెక్టుపై ఏపీ ముందుకు వెళ్లకుండా అడ్డుకోవాలి
- ప్రాజెక్టుకు అనుమతుల ప్రక్రియను చేపట్టరాదు
- కేంద్ర జలశక్తి శాఖకు తెలంగాణ ప్రభుత్వం లేఖ
- అత్యవసర సమావేశం నిర్వహించాలని పీపీఏకు మరో లేఖ

సాక్షి, హైదరాబాద్: పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) రూపకల్పన కోసం తాజాగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించడం పూర్తిగా చట్టవిరుద్ధమని తెలంగాణ ప్రభుత్వం ఆక్షేపించింది. ఈ ప్రాజెక్టును చేపట్టకుండా ఏపీని కట్టడి చేయాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ ముఖ్యకార్యదర్శి రాహుల్ బొజ్జా మంగళవారం కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శి కాంతారావుకు లేఖ రాశారు. కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) 2010, 2017లో జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం 75 శాతం నీటి లభ్యత ఆధారంగానే కొత్త ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాల్సి ఉందని గుర్తు చేసింది. దీనికి విరుద్ధంగా వరద జలాల ఆధారంగా ప్రతిపాదించిన పోలవరం–బనకచర్ల ప్రాజెక్టుకు అనుమతుల జారీ అంశాన్ని ఏ ప్రాతిపదికన పరిశీలిస్తారని కేంద్రాన్ని ప్రశ్నించింది. ఇప్పటికే ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ), సీడబ్ల్యూసీ, గోదావరి యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ), కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)తో పాటు ప్రభావిత రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకించాయని గుర్తు చేసింది. ఏపీ సమర్పించిన పోలవరం–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు ప్రిఫీజిబిలిటీ నివేదిక (పీఎఫ్ఆర్)ను పరిశీలించరాదని కేంద్రాన్ని కోరింది. పోలవరం ప్రాజెక్టుకు తెలంగాణ సమ్మతి ఇచ్చినట్టు పరిగణించాలని పేర్కొంటూ రాష్ట్ర పునర్విభజన చట్టంలో పొందుపరిచిన సెక్షన్ 90 (3)ని ఉల్లంఘించి ఈ ప్రాజెక్టును ఏపీ ప్రతిపాదించిందని అభ్యంతరం తెలిపింది. పోలవరం ప్రాజెక్టుకు తెలంగాణ ఇచ్చిన సమ్మతి పోలవరం–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుకు వర్తించదని స్పష్టం చేసింది. ఇదే చట్టంలోని సెక్షన్-30(2) ద్వారా పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించడంతో పాటు ఈ ప్రాజెక్టు ఆపరేషన్ ప్రొటోకాల్‌ను సైతం కేంద్రమే ఖరారు చేసిందని గుర్తు చేసింది. వీటన్నింటినీ ఉల్లంఘిస్తూ ఏపీ ప్రతిపాదించిన పోలవరం–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుకు అనుమతుల జారీ ప్రక్రియను చేపట్టరాదని కేంద్రాన్ని కోరింది.

అత్యవసర సమావేశం నిర్వహించాలి

ఏపీ అక్రమంగా నిర్మించతలపెట్టిన పోలవరం–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టుపై చర్చించడానికి అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)ని తెలంగాణ రాష్ట్రం కోరింది. ఈ మేరకు రాష్ట్ర నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) అంజాద్ హుస్సేన్ ఈ నెల 10న లేఖ రాశారు. గోదావరి ట్రిబ్యునల్ తీర్పు, ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టు ద్వారా 484.5 టీఎంసీల గోదావరి జలాల తరలింపునకు మాత్రమే అనుమతి ఉండగా, దీనికి విరుద్ధంగా ప్రతిపాదించిన పోలవరం–బనకచర్ల ప్రాజెక్టు డీపీఆర్ రూపకల్పన కోసం ఏపీ టెండర్ ప్రకటన జారీ చేసిందని అభ్యంతరం తెలిపారు. దీని వల్ల ప్రభావితం కానున్న గోదావరి పరీవాహకంలోని రాష్ట్రాలతో తక్షణమే అత్యవసర సమావేశం నిర్వహించాలని లేఖలో కోరారు. బనకచర్ల ప్రాజెక్టు డీపీఆర్ రూపకల్పన కోసం ఏపీ టెండర్లను ఆహ్వానించడం పట్ల అభ్యంతరం తెలుపుతూ ఈఎన్సీ అంజాద్ హుసేన్ ఈ నెల 10న కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ అతుల్ జైన్‌కు మరో లేఖ రాశారు.

రెండేళ్లలో దేవాదుల పూర్తి: ఉత్తమ్



సాక్షి, హైదరాబాద్: దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని నిర్దేశిత గడువు మేరకు రెండేళ్లలో పూర్తి చేసి ప్రాజెక్టు కింద ప్రతిపాదించిన మొత్తం 5.57 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటి సరఫరా చేస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఉత్తర, మధ్య తెలంగాణ ప్రాంత తాగునీటి అవసరాలూ తీరుతాయన్నారు. మంత్రి సీతక్క, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజాప్రతినిధులతో కలిసి మంగళవారం సచివాలయంలో దేవాదుల ప్రాజెక్టుపై సమీక్షించారు. భూపాలపల్లి జిల్లా గంగారాం గ్రామంలో గోదావరి నుంచి 38.16 టీఎంసీల జలాలను తరలించి హనుమకొండ, వరంగల్, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, జనగామ, యాదాద్రి, సూర్యాపేట, సిద్దిపేట జిల్లాల్లోని 5.57 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడానికి ఈ ప్రాజెక్టును చేపట్టగా, ఇప్పటికే 3.17 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోందని అధికారులు మంత్రికి వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా భూగర్భ జలాలు వృద్ధి చెంది మరో 58,028 ఎకరాలు సాగులోకి వస్తాయని, దీంతో మొత్తం 6.14 లక్షల ఎకరాలకు సాగునీరు అందినట్టు అవుతుందన్నారు. రూ.14,269.63 కోట్ల అంచనాతో ప్రాజెక్టును చేపట్టగా, ఆ తర్వాత రూ.18,500 కోట్లకు పెంచారని తెలిపారు. మూడో దశ కింద కొత్త పంప్‌హౌస్‌లు, సొరంగాలు, రిజర్వాయర్లు నిర్మించి మొత్తం 25.73 టీఎంసీలను తరలించి 2.39 లక్షల ఎకరాలకు సాగునీరు సరఫరా చేసే పనులు పురోగతిలో ఉన్నాయన్నారు. భూసేకరణతోపాటు లైనింగ్, మెకానికల్ పనులను పూర్తి చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. కాంట్రాక్టర్లకు ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించాలన్నారు.

బనకచర్ల ప్రాజెక్టును ఆపాలని లేదా?: హరీశ్

పాత తేదీలతో లేఖలు రాయడంతో ప్రయోజనమేంటి?



సాక్షి, హైదరాబాద్: పాత తేదీలతో కేంద్రానికి లేఖలు రాస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి బనకచర్ల ప్రాజెక్టును ఆపే ఉద్దేశం లేదా అని మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ సెప్టెంబర్ 23న సీఎం రేవంత్‌రెడ్డికి రాసిన లేఖలో బనకచర్ల పీఎఫ్ఆర్ టెక్నో ఎకనామికల్ అప్రైజల్ ప్రక్రియలో ఉందని, అనుమతులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయని మంగళవారం ఓ ప్రకటనలో చెప్పారు. 'ఇదే విషయాన్ని ఈనెల 11న తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో లేవనెత్తినా ప్రభుత్వంలో కదలిక కనిపించలేదు. ఈ నెల 6న ఏపీ ప్రభుత్వం బనకచర్ల డీపీఆర్ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసినా సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ కేంద్రానికి లేఖ రాయలేదు. కానీ ప్రస్తుతం పాత తేదీతో ఈఎన్సీ, సీడబ్ల్యూసీకి లేఖ రాయ డం వల్ల లాభమేంటి. ఈ నెల 11న నేను ప్రెస్‌మీట్ పెట్టిన మూడు రోజుల తర్వాత పాత తేదీతో లేఖ విడుదల చేయడం సిగ్గుచేటు' అని హరీశ్‌రావు సూచించారు.

తనయుడి తిట్లతో తల్లి ఆత్మహత్య

దోమకొండ: తరచూ కుమారుడు తిడుతుండటంతో మనస్తాపానికి గురైన తల్లి ఆత్మహత్య చేసుకుంది. కామారెడ్డి జిల్లా దోమకొండ మండల కేంద్రంలో జరిగిన ఈ సంఘటనపై ఎస్‌ఐ స్రవంతి తెలిపిన వివరాలివి. మండల కేంద్రానికి చెందిన చింతల సాయిలు తన తల్లి చింతల లక్ష్మి(70)ను తరచూ తిడుతూ ఇంట్లో నుంచి వెళ్లగొట్టాడు. తిండి పెట్టకుండా తల్లిని వేధించాడు. సూటిపోటి మాటలతో ఎందుకు బతికున్నావ్.. చనిపో అంటూ దూషించేవాడు. దీంతో తీవ్ర మనోవేదనకు గురైన లక్ష్మి జీవితంపై విరక్తి చెంది.. సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు లక్ష్మి మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విచారణలో కుమారుడు తల్లిని తిట్టడం, చనిపొమ్మంటూ వేధించడంతో ఆమె మనోవేదనకు గురయినట్లు తేలిందని ఎస్‌ఐ వివరించారు. పోలీసులు సాయిలుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

సాగర్ ప్రాజెక్టును పరిశీలించిన సీడబ్ల్యూసీ డైరెక్టర్

నాగార్జునసాగర్: సాగర్ ప్రాజెక్టును మంగళవారం సీడబ్ల్యూసీ (సెంట్రల్ వాటర్ కమిషన్) డైరెక్టర్ ఆశిష్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్ రోహిత్‌సింగ్ సందర్శించారు. డ్యాం అంతర్భాగంలో గల గ్యాలరీలలో నీటి జాలు పరిమాణం ప్రకారం వెళ్తోందా? స్పిల్‌వే ఎలా ఉంది? తదితర విషయాలను డ్యాం ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది ఎగువ నుంచి ఎంతమేరకు నీరు వచ్చి చేరింది. దిగువకు ఎంత విడుదల చేశారు. క్రస్ట్‌గేట్ల పనితీరు తదితర అంశాలను అడిగారు. ప్రధాన డ్యాంతో పాటు ఎర్తుడ్యాం నుంచి జాలు ఏమేరకు వెళ్తుంది? కుడి, ఎడమ కాల్వలకు విడుదల చేసిన నీటి లెక్కలు తదితర అంశాలపై డ్యాం ఇంజనీర్లతో సమీక్షించారు. వీరి వెంట డ్యాం ఏఈలు కృష్ణయ్య, స్వర్ణ, జేఈ సత్యనారాయణ ఉన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు రైతుల మృతి

హసన్‌పర్తి/లింగాలఘణపురం: హనుమకొండ, జనగామ జిల్లాల పరిధిలో విద్యుదాఘాతంతో ఇద్దరు రైతులు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌కు చెందిన జక్కుల రాజు (35) స్థానికంగా రెండెకరాల భూమిని కౌలుకు చేస్తూ ఓ ఆసామి వద్ద కూలీ పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం రాత్రి ఆసామి పొలం వద్ద విద్యుత్ మోటారు ఆన్ చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అక్కడికక్కడే చనిపోయాడు. మరో ఘటనలో జనగామ జిల్లా లింగాలఘణపురం మండలం రామచంద్రగూడానికి చెందిన కొత్త సుధాకర్‌రెడ్డి (65) తన పొలం వద్ద ట్రాన్స్‌ఫార్మర్ ఫీజు వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాడు. సమీపంలోని రైతులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు.

ఇద్దరు పిల్లలను చంపి తల్లి ఆత్మహత్య



సాయిలక్ష్మి (ఫైల్)

బాలానగర్: ఓ కన్నతల్లి తన ఇద్దరు కవల పిల్లలను చంపి, ఆపై తానూ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం ఉదయం జరిగింది. సీఐ టి.నరసింహరాజు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మానగర్ ఫేజ్–2లో సాయిలక్ష్మి (27), అనిల్‌కుమార్ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి కవల పిల్లలు అయిన అబ్బాయి చేతన్ కార్తికేయ (2), అమ్మాయి లాస్యవల్లి ఉన్నారు. అబ్బాయి బుద్ధిమాంద్యంతో పుట్టడంతో పిల్లల విషయంలో భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతూ ఉండేవి. ఈ క్రమంలో సాయిలక్ష్మి తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఇద్దరు పిల్లల గొంతునులిమి చంపేసింది. అనంతరం భవనంలోని మూడవ అంతస్తు నుంచి కిందికి దూకి ఆత్మహత్యకు పాల్పడింది.

ఎలాగూ శిక్ష పడుతుందని.. ఘోరానికి పాల్పడ్డాడు

- గిరిజన మహిళ హత్యాచారం కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుడిపై ఏడు కేసులు..13వ తేదీన జీవితఖైదు విధించిన కోర్టు




కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ మున్సిపాలిటీ: హత్య కేసులో తనకు ఎలాగైనా శిక్ష పడుతుందని భావించిన ఓ నిందితుడు మరో ఘాతుకానికి పాల్పడ్డాడు. గిరిజన మహిళకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లి హత్యాచారం చేశాడు. సంచలనం సృష్టించిన మెదక్ జిల్లా కొల్చారం మండలం పాతశెట్టిపల్లి వద్ద జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. హత్యకు గల కారణాలు తెలుసుకొని పోలీసులు సైతం నివ్వెరపోయారు. మంగళవారం మెదక్ జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఈ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సేవాలాల్ తండాకు చెందిన ఫకీరానాయక్.. ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం అంబోజిగూడ తండాలో ఉంటున్నాడు. ఈనెల 11న మెదక్‌లో అడ్డాపైకి వచ్చిన సంగాయిగూడ తండాకు చెందిన గిరిజన మహిళను పనికోసమని చెప్పి బస్సులో కొల్చారం మండలం ఏడుపాయల కమాన్ వద్ద ఉన్న అటవీ ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెను చెట్టుకు కట్టేసి అత్యాచారం చేసి, బండ రాయితో కొట్టి వెళ్లిపోయాడు. కొనఊపిరితో ఉన్న ఆమెను పోలీసులు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు మెదక్‌లోని పాత బస్టాండ్ వద్ద గల ఓ వైన్స్ వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. పాత నేరస్తుడు ఫకీరానాయక్‌ను అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించారు. నిందితుడిపై ఇది వరకే ఏడు కేసులు ఉన్నాయి. మహిళ హత్య కేసుకు సంబంధించిన కేసులో శిక్ష పడుతుందన్న ఉద్దేశంతో తన కామవాంఛ తీర్చుకోవాలనుకున్నాడు. ఆమె నిరాకరించడంతో పైశాచికంగా వ్యవహరించాడు. ఆమె ఒంటిపై ఉన్న బట్టలు తీసి చెట్టుకు కట్టేసి అత్యాచారం చేసి, అక్కడే ఉన్న రాయితో కొట్టి చంపాడు. మహిళను హత్యచేసిన సమయంలో ఎత్తుకెళ్లిన ముక్కు పుడక, హత్యకు ఉపయోగించిన రాయి, కట్టె, చర్చి వద్ద వదిలేసిన దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 2020లో జరిగిన హత్య కేసులో సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడు ఫకీరానాయక్‌కు జీవిత ఖైదుతోపాటు రూ.15వేల జరిమానా విధించారు.

ఏఐ వచ్చినా.. మన ఉద్యోగాలు సేఫ్!

- కేవలం 6.4% ఉద్యోగాలకే ఏఐ ప్రత్యామ్నాయం
- కొత్త సాంకేతికత రాకతో 15.6% జాబ్స్ మెరుగు
- ఏఐ జాబ్ పోస్టింగ్స్‌లో టాప్‌-2లో హైదరాబాద్
- ప్రపంచ బ్యాంకు తాజా నివేదికలో వెల్లడి





ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రాకతో ఉపాధి కోల్పోతాం అన్న భావన చాలామందిలో ఉంది. ఒక్క భారత్‌లోనే కాదు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగుల్లో ఈ ఆందోళన నెలకొంది. ఈ విషయంలో మనం సేఫ్! భారత్‌లో కేవలం 6.4 శాతం ఉద్యోగాలకు మాత్రమే ఏఐ ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని ప్రపంచ బ్యాంక్ నివేదిక వెల్లడించింది. అంటే కృత్రిమ మేధ రాకతో భారతీయులపై ప్రతికూల ప్రభావం అతి తక్కువే అన్నమాట. పైగా ఈ నూతన సాంకేతికత వల్ల 15 శాతానికిపైగా ఉద్యోగాలు మరింత మెరుగుపడతాయని వివరించింది. ఏఐ నియామకాల్లో దేశంలో బెంగళూరు తర్వాత హైదరాబాద్ పోటీపడుతుండడం విశేషం. ఇక ఏఐ పరివర్తనలో దక్షిణ ఆసియాలో భారత్ ముందంజలో దూసుకెళుతోంది.

- సాక్షి, స్పెషల్ డెస్క్

దేశాల వారీగా ఏఐ రాకతో వివిధ రంగాల్లో మెరుగుపడే ఉద్యోగాలు, ప్రభావితం అయ్యే జాబ్స్, ఏమాత్రం ప్రభావం లేని విభాగాల శాతం

దేశం	ఏఐతో మెరుగు	ప్రభావితం	ప్రభావం చూపనివి
దక్షిణాసియా	15.4	6.7	77.9
భారత్	15.6	6.4	78.1
లాటిన్ అమెరికా, కరేబియన్	16.7	21.3	62.0
యూరప్, మధ్య ఆసియా	17.5	20.3	62.2
సబ్ సహారన్ ఆఫ్రికా	10.3	13.0	76.7
తూర్పు ఆసియా, పసిఫిక్	11.4	10.7	77.9
మధ్యప్రాచ్యం, ఉత్తర ఆఫ్రికా	14.6	8.1	77.3





ఏఐ సంసిద్ధత సూచిక (శాతాల్లో) ఏం చెబుతోందంటే..

మార్కెట్	ఏఐ సంసిద్ధత	ప్రభుత్వ సన్నద్ధత
భారత్	49.25	62.81
దక్షిణాసియా (భారత్ మినహా)	41.01	38.78
ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలు	42.11	39.11
అభివృద్ధి చెందిన దేశాలు	71.32	72.62

ఏఐ రాకతో భారత్‌లో **15.6** శాతం ఉద్యోగాలు మరింత మెరుగుపడతాయి.

6.4 శాతం జాబ్స్‌ను మాత్రమే ఏఐ కైవసం చేసుకుంటుంది.

సాంకేతిక సేవలకు పేరొందిన బెంగళూరు, హైదరాబాద్‌లలో ఏఐ సంబంధ ఉద్యోగాలు కేంద్రీకృతమయ్యాయి.

మొత్తం జాబ్ పోస్టింగ్స్‌లో ఏఐ సంబంధ ఉద్యోగాల వాటా మన దేశంలో **5.8** శాతం.

ఏఐ జాబ్స్‌లో జాతీయ సగటును మించి నాలుగు నగరాలు ముందంజలో ఉన్నాయి.

క్లుప్తంగా...

సింగరేణి కార్మికులకు 17న దీపావళి బోనస్

సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు ఈనెల 17న దీపావళి (పీఎల్ఆర్) బోనస్ చెల్లించనున్నారు. ఏటా కార్మికులకు చెల్లించే బోనస్‌పై కొన్నాళ్ల కిందటే కోల్ ఇండియా స్థాయిలో ఒప్పందం కుదిరింది. కోల్ ఇండియా వ్యాప్తంగా బొగ్గు పరిశ్రమల్లో దసరా సమయంలోనే బోనస్ చెల్లించినా, అప్పుడు సింగరేణిలో లాభాల వాటా చెల్లించారు. పీఎల్ఆర్ బోనస్‌ను ఏటా మాదిరిగానే దీపావళికి చెల్లించనున్నట్లు ప్రకటించారు.

రైజింగ్ సర్వేలో ఉద్యోగులు పాల్గొనాలి

సర్క్యులర్ జారీ చేసిన సీఎస్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమ రంగంలో అగ్రగామిగా నిలబెట్టేందుకు రాష్ట్రప్రభుత్వం తెలంగాణ రైజింగ్ విజన్–2047 డాక్యుమెంట్‌ను రూపొందిస్తోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలిపారు. ఈ డాక్యుమెంట్ తయారీలో రాష్ట్రంలోని ప్రతి పౌరుడిని భాగస్వామి చేయాలనేది సీఎం రేవంత్‌రెడ్డి ఆకాంక్ష అని, అందులో భాగంగా చేపట్టిన సర్వే (ప్రజాభిప్రాయ సేకరణ)లో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. విజన్–2047 సర్వేలో రాష్ట్రంలోని ప్రతి ఉద్యోగి పాల్గొని తమ విలువైన సలహాలు, సూచనలు అందించాలని, ఈనెల 25 వరకు జరిగే ఈ సర్వేలో పాల్గొని సర్వే లింక్, క్యూఆర్ కోడ్‌ను తమ కార్యాలయాల్లో ప్రదర్శించడంతో పాటు విస్తృత ప్రచారం కల్పించాలని సూచించారు. http//www.telangana.gov.in/telanganarising/అనే లింక్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఆ సర్వేలో పాల్గొనాలని సీఎస్ పేర్కొన్నారు.

బీజేపీ నుంచి కిషన్‌రెడ్డి బయటికొస్తారు: రాజాసింగ్

సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి బీజేపీ నుంచి బయటకు రావడం ఖాయమని గోషా మహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ జోస్యం చెప్పారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కిషన్‌రెడ్డిపై నిప్పులు చెరిగారు. ప్రతీ నియోజక వర్గంలో జోక్యం చేసుకోవడం కిషన్‌రెడ్డికి అలవాట న్నారు. వ్యూహాత్మకంగా తనను బయటకు పంపారని ఆరోపించారు. కిషన్‌రెడ్డి కూడా ఏదో ఒక రోజు పార్టీ నుంచి బయటికి వస్తారని స్పష్టం చేశారు.

25 నుంచి కవిత 'జన జాగృతి' యాత్ర

నేడు యాత్ర పోస్టర్ విడుదల

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఈనెల 25 నుంచి 'తెలంగాణ జన జాగృతి' యాత్రను చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. మూడు విడతల్లో సాగే ఈ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను కవిత బుధవారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో ఆవిష్కరించనున్నారు. ఈ యాత్ర తొలి విడతలో ఉమ్మడి జిల్లా కేంద్రాల మీదుగా సాగుతుంది. 25న నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ప్రారంభమయ్యే ఈ యాత్ర వచ్చే ఏడాది ఫిబ్రవరి 13న సరూర్‌నగర్‌లో జరిగే బహిరంగ సభతో ముగుస్తుంది.

18న రాష్ట్రవ్యాప్త బంద్‌కు అందరూ సిద్ధం కావాలి

దాసు సురేశ్ పిలుపు

సాక్షి, హైదరాబాద్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల లక్ష్యంగా ఈనెల 18న తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త బంద్‌కు అందరూ సిద్ధం కావాలని బీసీ జేఏసీ కో చైర్మన్, బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేశ్ పిలుపునిచ్చారు. మంగళవారం కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో సురేశ్ పాల్గొని మాట్లాడారు. ఈనెల 15నుంచి రాష్ట్రంలోని అన్ని గ్రామాలు, మండలాలు, నియోజకవర్గాలు, జిల్లా కేంద్రాల్లో రెండ్రోజులపాటు 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం 'చాయితో చర్చ' అనే కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. బీసీ రిజర్వేషన్ల పెంపునకు, 50 శాతం సీలింగ్ ఎత్తేయడానికి 17న రాజ్యాంగ సవరణ కోసం అంబేడ్కర్ విగ్రహాలకు అభ్యర్థన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. కాగా, తెలంగాణ ఉద్యమకారుడు సట్ల ప్రభాకర్‌ను సమితి రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించారు.

'ఐక్లౌడ్' పాస్‌వర్డ్ ఇవ్వాల్సిందే..

- ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్ రావును ఆదేశించిన సుప్రీంకోర్టు
- విచారణకు పూర్తిగా సహకరించాలని నిర్దేశం



సాక్షి, న్యూఢిల్లీ: ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ టి.ప్రభాకర్ రావుకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. విచారణకు ఆయన ఏమాత్రం సహకరించడం లేదని, ఆయనకు మంజూరు చేసిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టులో వాడీవేడిగా వాదనలు జరిగాయి. దర్యాప్తునకు సహకరించాల్సిందేనని స్పష్టం చేసిన సర్వోన్నత న్యాయస్థానం, కీలకమైన 'ఐక్లౌడ్' ఖాతా పాస్‌వర్డ్‌ను ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో రీసెట్ చేసి, అధికారులకు అందించాలని ప్రభాకర్ రావును ఆదేశించింది. అయితే, అరెస్టు నుంచి ఆయనకు కల్పించిన మధ్యంతర రక్షణను పొడిగిస్తూ తాత్కాలిక ఊరటనిచ్చింది. జస్టిస్ బి.వి.నాగరత్న, జస్టిస్ ఆర్.మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం ముందు ప్రభుత్వం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, ప్రభాకర్ రావు తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదించారు.

ఆధారాల ధ్వంసంపై తీవ్ర ఆరోపణలు

ప్రభాకర్‌రావు దర్యాప్తును పక్కదారి పట్టించేందుకు ఉద్దేశపూర్వకంగా ఆధారాలను ధ్వంసం చేశారని తుషార్ మెహతా చెప్పారు. 'ఎన్నికల ఫలితాలకు మూడు రోజుల ముందు, అంటే నవంబర్ 29, 2023న, 50 కొత్త హార్డ్ డిస్కులను కొనుగోలు చేశారు. ఆ తర్వాత పాత 36 హార్డ్ డిస్కులలోని కీలక సమాచారాన్ని ధ్వంసం చేశారు' అని చెప్పారు. కీలకమైన ఐదో ఫోన్ గురించి ప్రశ్నిస్తే, 'నా ఏడాది మనవడు ఆడుకుంటూ కిందపడేసి పగలగొట్టాడు' అని చెప్పడం నమ్మశక్యంగా లేదన్నారు. అంతేగాక ప్రభాకర్‌రావు విచారణకు సహకరించడం లేదని, ముఖ్యంగా ఐక్లౌడ్ పాస్‌వర్డ్ విషయంలో తప్పుదారి పట్టిస్తున్నారని చెప్పారు. పాస్‌వర్డ్ మర్చిపోయానని చెప్పడం నమ్మశక్యంగా లేదని, ఎందుకంటే ఫోన్‌ను ఫార్మాట్ చేయడానికి పాస్‌వర్డ్ అవసరమని పేర్కొన్నారు. ఆయన నుంచి నిజాలు రాబట్టడం కష్టంగా ఉందని, అందువల్ల కస్టోడియల్ విచారణకు అనుమతించాలని కోరారు. దామా శేషాద్రి నాయుడు వాదనలు వినిపిస్తూ 'ఐక్లౌడ్ పాస్‌వర్డ్‌ను ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో రీసెట్ చేసి ఇవ్వడానికి ఎలాంటి అభ్యంతరం లేదు. ఈ కేసు విచారణలో బయటి వ్యక్తులు (ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎంపీలు) జోక్యం చేసుకుంటున్నారు. అందుకే మొత్తం ప్రక్రియను వీడియో రికార్డింగ్ చేయాలి' అని చెప్పారు.

సహకరించాల్సిందేనన్న ధర్మాసనం

'దర్యాప్తు అనేది కేవలం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశం. ఇందులో ప్రైవేట్ వ్యక్తుల ప్రమేయం ఉండకూడదు. నిందితుడిగా దర్యాప్తునకు సహకరించడం మీ బాధ్యత' అని ప్రభాకర్ రావు తరఫు న్యాయవాదికి ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభాకర్ రావు కోరిన అదనపు రక్షణలను తిరస్కరించిన జస్టిస్ నాగరత్న, 'పరిధిని విస్తరించవద్దు' అని వ్యాఖ్యానించారు. ప్రభాకర్ రావు నోటీసు అందిన వెంటనే దర్యాప్తు అధికారుల ముందు హాజరు కావాలని స్పష్టంచేశారు. కేసు తదుపరి విచారణను నవంబర్ 18కి వాయిదా వేశారు.

'సాక్షి' నిలిపివేతపై సుప్రీం సీరియస్

▶ మొదటి పేజీ తరువాయి

'అలా కార్టే' విధానంలో అందిస్తున్నామని తెలిపారు. దీనిపై జస్టిస్ నరసింహం అసహనం వ్యక్తం చేశారు. 'అసలు ఆరోపణలు ఎదుర్కొంటున్నది రాష్ట్ర ప్రభుత్వం. అలాంటప్పుడు, ప్రభుత్వం తరఫున ఒక ప్రైవేట్ ఆపరేటర్ ఎలా వాదిస్తారు? ఇది ఎంతమాత్రం సరికాదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తమ వైఖరిని తెలియజేస్తూ కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఆదేశించారు. ప్రైవేట్ వ్యక్తులు ప్రభుత్వానికి బదులుగా సమాధానం చెప్పడాన్ని తాము అంగీకరించబోమని హెచ్చరించారు. ప్రధాన ఆరోపణలు రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్నందున.. ఈ కేసులో వారే స్వయంగా సమాధానం చెప్పాలని ధర్మాసనం తేల్చిచెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ స్పందన అత్యంత కీలకమని పేర్కొంది. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం పూర్తి వివరణతో కౌంటర్ దాఖలు చేసేందుకు.. విచారణను వాయిదా వేస్తున్నట్లు ధర్మాసనం ప్రకటించింది. పిటిషనర్ తరఫు న్యాయవాది అభ్యర్థన మేరకు తదుపరి విచారణను వీలైనంత త్వరగా చేపట్టేందుకు ధర్మాసనం అంగీకరించింది.

వస్తున్నాం.. వెళుతున్నాం

ఏదైనా బాధ్యత అప్పచెప్పండంటున్న ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు.. విషయం విద్యాశాఖ కార్యదర్శి దృష్టికి

సాక్షి, హైదరాబాద్: ఉన్నత విద్యామండలిలో వైస్ చైర్మన్లు తీవ్ర నిరాశతో ఉన్నారు. తాము చేయడానికి ఏ పనీ ఉండటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఉన్న విధులేంటో చెప్పాలని ప్రశ్నిస్తున్నారు. ప్రతిరోజూ రావడం, వెళ్లడం మినహా ఎలాంటి బాధ్యతలు అప్పగించలేదంటున్నారు. వైస్ చైర్మన్లు ఈ విషయాన్ని ఏకంగా విద్యాశాఖ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. త్వరలో ముఖ్యమంత్రి కార్యాలయానికి ఫిర్యాదు చేసేందుకు సిద్ధమవుతున్నారు. తమ ఆవేదనను సీఎంకు తెలియజేస్తామని విద్యాశాఖ కార్యదర్శి భరోసా ఇచ్చినట్టు ఓ వైస్ చైర్మన్ తెలిపారు. ఉన్నత విద్యామండలికి చైర్మన్‌తోపాటు కార్యదర్శి, ఇద్దరు వైస్ చైర్మన్లు ఉంటారు. వీరిలో ఒకరు వీసీ–1 అయితే, ఇంకొకరు వీసీ–2గా వ్యవహరిస్తారు. గతంలో వీసీ–1 డిగ్రీ ఆన్‌లైన్ అడ్మిషన్ల (దోస్త్) బాధ్యతలు చేపట్టేవారు. గత చైర్మన్ హయాంలో వీసీ–2గా ఉన్న వ్యక్తి, మంత్రి సిఫారసుతో వీసీ–1గా ఆదేశాలు తెచ్చుకున్నారు. దీంతో వీసీ–2 అధికారులకు ఫిర్యాదు చేశారు. అప్పట్నుంచీ దోస్త్ బాధ్యతలు చైర్మన్ పరిధిలోనే ఉంటున్నాయి. కొత్త చైర్మన్ కూడా ఇదే ఆనవాయితీ కొనసాగిస్తున్నారు. ఇంజనీరింగ్ యాజమాన్య కోటా సీట్ల ర్యాటిఫికేషన్ వ్యవహారంలో తమను భాగస్వామ్యం చేయాలని వీసీలు కోరారు. ఈ అవకాశం ఇవ్వకపోవడంపై ఒక వీసీ తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. కొన్ని నెలల క్రితం ఆయన నగరంలో పలు ఇంజనీరింగ్, ఎంబీఏ సంస్థలను తనిఖీ చేశారు. కాలేజీల్లో అవకతవకలున్నాయని ఓ నివేదిక రూపొందించారు. ఈ నివేదికపై కనీస చర్యలు లేవని ఆయన అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఒకేరోజు రూ.1.08 కోట్ల జరిమానా

టికెట్ లేని ప్రయాణికుల నుంచి వసూలు

సాక్షి, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే పరిధిలో టికెట్ లేకుండా రైళ్లలో ప్రయాణిస్తున్న వారి నుంచి ఒకేరోజు ఏకంగా రూ.కోటికి పైగా మొత్తం జరిమానాగా వసూలు చేశారు. ఒక రోజు జరిపిన తనిఖీలో ఇంతపెద్ద మొత్తం వసూలు కావటం భారతీయ రైల్వేలోనే రికార్డుగా నిలిచింది. దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఇతి పాండే ఆదేశం మేరకు.. మంగళవారం జోన్‌లోని సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజన్‌లలో సిబ్బంది విస్తృత తనిఖీలు జరిపారు. టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారిని గుర్తించి 16,105 కేసులు నమోదు చేసి జరిమానాగా రూ.1.08 కోట్లను వసూలు చేశారు. ఆరో తేదీన జరిపిన తనిఖీల్లో రూ.92.4 లక్షలు జరిమానాగా వసూలు చేశారు. విజయవాడ డివిజన్ పరిధిలో అత్యధికంగా రూ.36.91 లక్షలు, గుంతకల్లు డివిజన్లో రూ.28 లక్షలు, సికింద్రాబాద్ డివిజన్లో రూ.27.9 లక్షలు, గుంటూరు డివిజన్లో రూ.6.46 లక్షలు, హైదరాబాద్ – రూ.4.6 లక్షలు, నాందేడ్ రూ.4.08 లక్షల చొప్పున జరిమానా వసూలైంది.

విద్యార్థులను బయటకు పంపొద్దు

మంత్రి అడ్లూరితో కలిసి కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో డిప్యూటీ సీఎం భట్టి



సాక్షి, హైదరాబాద్: బెస్ట్ అవైలబుల్ పాఠశాలలు, జిల్లా యంత్రాంగం మధ్య కుదిరిన ఒప్పందాల్లో ఏవైనా ఇబ్బందులు వస్తే..జిల్లా యంత్రాంగాన్ని సంప్రదించాలే తప్ప.. విద్యార్థులను బయటకు పంపడానికి వీల్లేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. జిల్లాల కలెక్టర్లు, జిల్లా విద్యాధికారులు..ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవాలని, ఈ పాఠశాలలకు ఎంపికైన విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ పాఠశాలల్లోనే కొనసాగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బెస్ట్ అవైలబుల్ స్కీం ప్రగతిని వారితో సమీక్షించారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ ప్రజాప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. బెస్ట్ అవైలబుల్ స్కీం కింద పాఠశాలల వారీగా ఉన్న బకాయిల వివరాలను వెంటనే పంపాలని కలెక్టర్లకు సూచించారు. బకాయిల్లో కొంత మొత్తాన్ని వెంటనే విడుదల చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. విద్య, వైద్య రంగాలపై కలెక్టర్లు సీరియస్‌గా దృష్టి సారించాలని, పెండింగ్ బిల్లులు ఏమైనా ఉంటే ఆర్థికశాఖ దృష్టికి తీసుకురావాలని డిప్యూటీ సీఎం కలెక్టర్లకు సూచించారు. డీఈవోలు వెంటనే అన్ని బెస్ట్ అవైలబుల్ స్కూళ్లను సందర్శించాలని భట్టి ఆదేశించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎంత ఉంది? ప్రభుత్వ నిబంధనలు సరిగా పాటిస్తున్నారా? లేదా? ఆయా పాఠశాలల్లో వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నాయి? వెంటనే నివేదిక సమర్పించాలన్నారు. గడిచిన ఏడు సంవత్సరాలుగా బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదివిన విద్యార్థుల వివరాలు సేకరించాలని సూచించారు. ప్రస్తుతం ఆ విద్యార్థులంతా ఎక్కడ ఉన్నారు.. ఏం చేస్తున్నారు, ఉన్నత విద్యకు వెళ్లారా ?లేదా? తదితర వివరాలు సేకరించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్లు, అధికారులు స్వయంగా పర్యవేక్షించి బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కొనసాగుతున్న పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడాలని మంత్రి లక్ష్మణ్ అధికారులను కోరారు. సమావేశంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితారాణా, సాంఘిక సంక్షేమశాఖ సెక్రెటరీ బుద్ధ ప్రకాశ్, సాంఘిక సంక్షేమశాఖ కమిషనర్ క్షితిజ తదితరులు పాల్గొన్నారు.

ఓటుకు నోటు కేసు విచారణ నేటికి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఓటుకు నోటు కేసులో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను సర్వోన్నత న్యాయస్థానం బుధవారానికి వాయిదా వేసింది. ఈ కేసును అవినీతి నిరోధక చట్టం కింద కాకుండా.. ఎన్నికల చట్టాల నియమావళి కింద విచారణ చేపట్టాలని కోరుతూ 2021, జూలై 22న రేవంత్‌రెడ్డి, ఈ కేసులో తన పేరును తొలగించాలని కోరుతూ అదే ఏడాది ఏప్రిల్ 13న సండ్ర వెంకట వీరయ్య సుప్రీంకోర్టులో వేర్వేరుగా స్పెషల్ లీవ్ పిటిషన్లు దాఖలు చేశారు. ఆ రెండు పిటిషన్లు మంగళవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చాయి. అయితే, సీనియర్ కౌన్సిల్ అందుబాటులో లేరని, కాబట్టి విచారణను వాయిదా వేయాలని పిటిషనర్ల తరఫు న్యాయవాది విజ్ఞప్తి చేయగా ధర్మాసనం అంగీకరించింది.

బీసీ రిజర్వేషన్లపై 17న చలో రాజ్‌భవన్

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకోవడాన్ని సీపీఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పేర్కొన్నారు. వెంటనే 42 శాతం రిజర్వేషన్ల అమలు బిల్లును కేంద్రం ఆమోదించి, పార్లమెంట్‌లో చట్టాన్ని తీసుకురావాలని, 9వ షెడ్యూల్‌లో రిజర్వేషన్ల ఏర్పాటుకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో ఈ నెల 17న చలో రాజ్‌భవన్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పార్టీ శ్రేణులకు, బీసీ వర్గాలకు, సామాజిక శక్తులకు, సంస్థలకు, వ్యక్తులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర శాసనసభలో బీసీ రిజర్వేషన్ల బిల్లును బీజేపీ ఆమోదిస్తూనే కేంద్రంలో మాత్రం అడ్డుకుంటున్నదని జాన్‌వెస్లీ ఆరోపించారు.

తెలంగాణ బంద్‌కు సంపూర్ణ మద్దతు: కోదండరాం



సాక్షి, హైదరాబాద్: బీసీ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 18న తలపెట్టిన తెలంగాణ బంద్‌కు తెలంగాణ జన సమితి (టీజేఎస్) సంపూర్ణ మద్దతు తెలుపుతుందని టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం అన్నారు. బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ ఆర్ కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్, వైస్‌చైర్మన్ నారగోని తదితరులు మంగళవారం టీజేఎస్ కార్యాలయంలో కోదండరాంను కలిశారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రాజకీయ పార్టీలతో కలిసి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఈ సమావేశంలో చర్చించారు. ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ కోదండరాం బీసీల ఉద్యమానికి అండగా ఉండాలని కోరారు. జాజుల శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ అఖిలపక్ష నేతలను ఢిల్లీకి తీసుకువెళ్లి ప్రధాని, రాష్ట్రపతిలను కలిసే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోపగాని శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నూనెగింజల పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి

రైతులు సమతుల్య ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలి: తుమ్మల



వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు

సాక్షి, హైదరాబాద్: అధిక ఆదాయాన్నిచ్చే నూనెగింజల పంటల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్– ఆయిల్ సీడ్స్ (ఎన్ఎంఈఓ–ఓఎస్) పథకం కింద 8 జిల్లాల రైతులకు 100 శాతం సబ్సిడీతో వేరుశనగ విత్తనాలు పంపిణీ చేసే కార్యక్రమాన్ని మంగళవారం ఆయన సచివాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జాతీయ నూనె గింజల పథకాన్ని ఈ సంవత్సరంలో రూ. 66.67 కోట్లతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఈ యాసంగి సీజన్‌లో 45,350 ఎకరాల్లో 38,434 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలను 100 శాతం సబ్సిడీతో ఎంపిక చేసిన రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. రూ. 46.14 కోట్లతో మహబూబ్‌నగర్, వనపర్తి, జోగుళాంబ గద్వాల్, నారాయణపేట, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, వికారాబాద్, నల్లగొండ జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అధిక ఆదాయాన్నిచ్చే పంటలైన నూనె గింజలు, ఆయిల్ పామ్, ఉద్యానవన పంటల వైపు రైతులు దృష్టి పెట్టాలని కోరారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించి, సమతుల్య ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలన్నారు. రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్న వివిధ జిల్లాల రైతులతో నూనె పంటల సాగులో వారి అనుభవాలను పంచుకొన్నారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన పది మంది రైతులకు విత్తనాలు అందచేసిన తుమ్మల వారితో ముచ్చటించారు. అనంతరం సీసీఐ రూపొందించిన 'కపాస్ కిసాన్' యాప్ గురించి రైతులకు వివరించారు.

యాదగిరిగుట్టలో 22 నుంచి కార్తీకమాసం వేడుకలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో ఈనెల 22 నుంచి నవంబర్ 20వ తేదీ వరకు కార్తీక మాసం వేడుకలను నిర్వహించనున్నట్లు ఈఓ జి.రవి నాయక్ వెల్లడించారు. ఈ నేపథ్యంలో యాదగిరిగుట్టకు దిగువన ఉన్న శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తిచేయాలని అన్ని విభాగాల అధికారులకు సూచించారు. శ్రీసత్యనారాయణస్వామి వ్రత మండపంలో 22 నుంచి వచ్చే నెల 20 వరకు ఆరు బ్యాచ్‌లుగా వ్రతాలను జరిపిస్తామని తెలిపారు. వచ్చే నెల 5న కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఉదయం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు 8 బ్యాచ్‌లుగా వ్రతాలు ఉంటాయన్నారు. పౌర్ణమి సందర్భంగా కొండపైన ప్రధానాలయం, శివాలయాల్లో ఆకాశ దీపారాధన పూజలుంటాయని వెల్లడించారు. కార్తీక మాసంలోని ప్రతి శని, ఆదివారాల్లో అదనంగా 1,000 మందికి అన్నప్రసాదం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.



పాఠశాల ఎదుట విద్యార్థుల ఆందోళన

పాఠశాలలకు తాళం వేసి.. నిరసన తెలిపి..

తరగతి గదుల నిర్మాణాలు పూర్తిచేయాలని విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

ముదిగొండ: తరగతి గదుల నిర్మాణాలు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలనే డిమాండ్‌తో ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని ముదిగొండ మండలం యడవల్లిలో తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళనకు దిగారు. యడవల్లిలో ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు ఒకే ప్రాంగణంలో కొనసాగుతున్నాయి. అయితే విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక కొన్నాళ్ల కిందట భవన నిర్మాణాన్ని మొదలుపెట్టారు. ఈ భవనం పూర్తికాకపోవడంతో ఇరుకు గదులతో ఇబ్బంది పడుతున్నామంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు మంగళవారం టెంట్ వేసి ప్లకార్డులతో బైఠాయించారు. పాఠశాల గేట్లకు తాళాలు వేసి ఉపాధ్యాయులు లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. రెండు గంటల పాటు ఆందోళన చేపట్టినా ఎంఈఓ రాకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తంచేశారు. చివరకు ఎంఈఓ రమణయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం కె.శాంతి, ఎస్సై కృష్ణ ప్రసాద్ చేరుకుని తల్లిదండ్రులు, గ్రామస్తులతో మాట్లాడారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.



భద్రాద్రి జిల్లా సుదిమళ్ల రైతు వేదిక వద్ద బారులు తీరిన రైతులు

యూరియా లేదు.. స్లిప్పులే ఇస్తాం!

అధికారుల తీరుతో రైతుల ఆగ్రహం

ఇల్లెందు రూరల్: యూరియా కష్టాలు రైతులను ఇంకా వీడలేదు. వరి పొలాలు పొట్ట దశకు చేరుకోవాల్సిన సమయంలో.. యూరియా కొరతతో సక్రమంగా ఎదగడం లేదని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. తాజాగా యూరియా వచ్చిందని తెలియడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం సుదిమళ్ల రైతు వేదికకు మంగళవారం తెల్లవారుజామునే పెద్ద సంఖ్యలో రైతులు చేరుకుని బారులు తీరారు. తీరా అధికారులు వచ్చాక ఇప్పుడు స్లిప్పులు మాత్రమే ఇస్తున్నామని, ఈనెల 24, 29 తేదీల్లో యూరియా వస్తుందని చెప్పడంతో రైతులు మండిపడ్డారు. పంటకు ఇప్పుడు యూరియా వేయకుంటే ఆ తర్వాత వేసినా ప్రయోజనం ఉండదని, తక్షణమే యూరియా పంపిణీ చేయాలని పట్టుబట్టారు. అయితే ప్రస్తుతం నిల్వ లేనందున దిగుమతి కాగానే పంపిణీ చేస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో స్లిప్పులు తీసుకుని వెళ్లిపోయారు.

ఆఖరిమజిలీ అంటే గుండె'చెరువే'!



చెరువు నీటిలో నడుచుకుంటూ వెళ్తున్న గ్రామస్తులు

గజ్వేల్: ఆఖరి మజిలీకీ కష్టాలు తప్పడం లేదు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో అంత్యక్రియలు జరపాలంటే చెరువు నీటిలో వెళ్లాల్సిందే. గ్రామంలోని పాండువుల చెరువు పక్కన ఉన్న స్థలంలో ఎవరైనా చనిపోతే ఖననం, దహన సంస్కారాలు చేస్తుంటారు. ప్రస్తుతం చెరువు నిండటం వల్ల మంగళవారం గ్రామానికి చెందిన మెతుకు పెద్ద సత్తెమ్మ అంత్యక్రియలను బంధువులు, గ్రామస్తులు సుమారు 300 మీటర్ల మేర నీటిలో నుంచి నడుచుకుంటూ అవతలి వైపునకు వెళ్లి పూర్తి చేశారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం స్పందించి అంత్యక్రియలు జరిపే ప్రదేశంలో వసతులతోపాటు నీటిని దాటేందుకు వీలుగా కల్వర్టు నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ జరపండి

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్) నిధుల దుర్వినియోగం ఆరోపణలపై విచారణ చేపట్టాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. అంతకుముందు అధికారులకు వినతిపత్రం సమర్పించాలని పిటిషనర్‌కు స్పష్టంచేస్తూ.. ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)లో విచారణ ముగించింది. విచారణ చేపట్టడానికి విద్యాశాఖ ముఖ్యకార్యదర్శికి మూడు నెలల సమయం ఇచ్చింది. సికింద్రాబాద్‌కు చెందిన దుర్గం రవీందర్ ఈ పిల్ దాఖలు చేశారు.

సాక్షి హైదరాబాద్

బుధవారం । 15 । అక్టోబర్ । 2025



కెమెరాలు ఉన్నా.. ఫలితం సున్నా!
నగరంలో సొత్తు సంబంధిత నేరగాళ్లు కొత్త పంథాను అనుసరిస్తున్నారు. తమ నేరానికి సంబంధించిన ఆధారాలు మిగలకుండా జాగ్రత్తపడుతున్నారు. -10లో



చరిత్రకు కేరాఫ్.. మనసుకు టేకాఫ్..
చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్, గోల్కొండ కోటలే కాదు.. కాలగమనంలో మరుగున పడిపోయిన మరెన్నో చారిత్రక కట్టడాలు నిశ్శబ్దంగా దర్శనమిస్తున్నాయి. - సిటీప్లస్‌లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం 30.0/22.0
నగరంలో బుధవారం ఉదయం చలిగాలులు వీస్తాయి. పగటిపూట పొడి వాతావరణం ఉంటుంది. గరిష్టంగా 30, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

బీఆర్ఎస్‌లోకి అలీ మస్కతి



అలీ మస్కతిని బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

చార్మినార్: మస్కతి డెయిరీ ప్రొడక్ట్స్ డైరెక్టర్, కాంగ్రెస్ నాయకుడు అలీ మస్కతి మంగళవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో ఆ పార్టీలో చేరారు. అప్పట్లో మజ్లిస్ ఫ్లోర్ లీడర్‌గా పని చేసిన స్వర్గీయ ఇబ్రాంహీం బిన్ అబ్దుల్లా మస్కతి కుమారుడైన అలీ మస్కతి టీడీపీతో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. 2009 అసెంబ్లీ ఎన్నికల్లో చార్మినార్ నుంచి టీడీపీ టికెట్‌పై పోటీ చేసి మజ్లిస్ అభ్యర్థికి గట్టి పోటీ ఇచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆయన కాంగ్రెస్‌లో చేరారు. ఆ పార్టీలో తనకు సరైన ప్రాధాన్యం లభించడంలేదంటూ ప్రస్తుతం బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పాతబస్తీ కోట్ల అలీజాలోని కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్‌ను మైనారిటీలకు మరింత చేరువ చేస్తానన్నారు.

నామినేషన్ కేంద్రాన్ని సందర్శించిన కర్ణన్



బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్-2లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక నామినేషన్ కేంద్రాన్ని మంగళవారం జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి ఆర్వీ కర్ణన్ సందర్శించారు. బందోబస్తును తనిఖీ చేశారు. సౌకర్యాలపై ఆరా తీశారు. సంబంధిత ఎన్నికల అధికారులు, సిబ్బందితో ఏర్పాట్లపై చర్చించారు.

రెండో రోజూ 11 నామినేషన్లు



బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో రెండో రోజైన మంగళవారం కూడా 11 నామినేషన్లు దాఖలయ్యాయి. 10 మంది అభ్యర్థులు, 11 నామినేషన్లు దాఖలు చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా వేముల విక్రమ్‌రెడ్డి రెండో రోజు సైతం మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. మంగళవారం నామినేషన్ దాఖలు చేసిన వారిలో స్వతంత్ర అభ్యర్థులుగా బింగి రాములు, కందాడి మణిపాల్‌రెడ్డి, పబ్బతి శ్రీకృష్ణ, గౌంటి శ్రీకాంత్, మూల్యా సంజీవులు, పానుగోటు లాలాసింగ్, పాట పార్టీ అభ్యర్థిగా వెంకట్‌రెడ్డి, అన్నా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మహమ్మద్ మసూర్ అలీ, శ్రమజీవి పార్టీ అభ్యర్థిగా జాజుల భాస్కర్, ఆల్‌ఇండియా కిసాన్ జనతా పార్టీ అభ్యర్థిగా చంద్రశేఖర్‌లు నామినేషన్లు దాఖలు చేశారు.

'సెల్‌ఫోన్ డ్రైవింగ్'పై స్పెషల్ డ్రైవ్

రెండ్రోజుల్లో నగరంలో 2,345 కేసులు

సాక్షి, సిటీబ్యూరో: సెల్‌ఫోన్ డ్రైవింగ్ కారణంగా 2023లో 23 రోడ్డు ప్రమాదాలు జరగ్గా... ముగ్గురు అసువులు బాశారు. మరో 26 మంది క్షతగాత్రులయ్యారు. ఒకప్పుడు కేవలం సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడిపే డ్రైవర్లు మాత్రమే రోడ్లపై కనిపించే వాళ్లు. అయితే ప్రస్తుతం మారిన పరిస్థితుల నేపథ్యంలో సెల్‌ఫోన్ చూస్తూ డ్రైవింగ్ చేసే వారి సంఖ్యా పెరిగింది. ఈ విషయాన్ని గమనించిన నగర కొత్వాల్ సజ్జనర్ ఈ నెల 7న కీలక ఆదేశాలు జారీ చేశారు. డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్‌లో వీడియోలు చూసే, ఇయర్ ఫోన్లు వినియోగించే డ్రైవర్లపై చర్యలు తీసుకోవాల్సిందిగా ట్రాఫిక్ పోలీసులకు స్పష్టం చేశారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న సిటీ ట్రాఫిక్ విభాగం సంయుక్త పోలీసు కమిషనర్ డి.జోయల్ డేవిస్ సోమ, మంగళవారాల్లో ప్రత్యేక డ్రైవ్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నుంచి ఆదివారం వరకు సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై మొత్తం 80,555 కేసులు నమోదయ్యాయి. కేవలం ఈ రెండు రోజుల్లో వీటి సంఖ్య 2,345గా ఉంది. ఈ డ్రైవ్ కొనసాగుతుందని, ఉల్లంఘునులను న్యాయస్థానంలోనూ హాజరు పరుస్తామని జోయల్ డేవిస్ ప్రకటించారు. నగరవాసులు సైతం ఇలాంటి తీవ్రమైన ఉల్లంఘనలపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసు అధికారిక 'ఎక్స్' హ్యాండిల్ లేదా ట్రాఫిక్ హెల్ప్‌లైన్ 9010203626, ఈ–చలాన్ హెల్ప్ డెస్క్ 8712661690కు సమాచారం ఇవ్వాలని సమాచారం ఇవ్వాలని, లేదా ఫొటోలు, వీడియోలు పంపాలని అధికారులు కోరారు.

మైనారిటీ ఓట్లు చీల్చేనా!



జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల బరిలో సోషల్ వర్కర్

- క్రౌడ్ ఫండింగ్‌తో పేదలకు చేయూత
- పేద మైనారిటీ వర్గాల్లో గట్టి పట్టున్న సల్మాన్‌ఖాన్
- ప్రధాన రాజకీయ పార్టీల ఓటు బ్యాంక్‌పై ప్రభావం
- మారుతున్న రాజకీయ సమీకరణలు

సాక్షి, సిటీబ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రధాన పక్షాల మైనారిటీ ఓటు బ్యాంక్‌కు గండి పడనుందా? అంటే అవుననే రాజకీయ పరిస్థితులు నెలకొంటున్నాయి. ఈ నియోజక వర్గంలో మైనారిటీ ఓట్లు కీలకం. మొత్తం ఓట్లలో 24 శాతానికిపైగా మైనారిటీ ఓటర్లు గెలుపు ఓటములపై తీవ్ర ప్రభావం చూపనున్నారు. అధికార కాంగ్రెస్, బీఆర్ఎస్‌తో పాటు మజ్లిస్ పార్టీకి మైనారిటీల్లో గట్టి పట్టు ఉంది. ఈసారి మజ్లిస్ ఉప ఎన్నికల బరికి దూరం పాటిస్తూ కాంగ్రెస్‌కు మద్దతు ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అధికార కాంగ్రెస్‌కు మైనారిటీ ఓటు బ్యాంక్‌తో పాటు మజ్లిస్ ఓటు బ్యాంక్ కూడా కలిసి వచ్చే అవకాశాలు ఉంటాయి. ఇక బీఆర్ఎస్ మైనారిటీ ఓటు బ్యాంక్‌పై ఆశలు పెట్టుకుంది. ఈ నేపథ్యంలో ఉప ఎన్నికల బరిలో సోషల్ వర్కర్ సల్మాన్‌ఖాన్ ఎన్నికల బరిలో దిగుతుండటంతో ప్రధాన పక్షాల మైనారిటీ ఓటు బ్యాంక్‌పై తీవ్ర ప్రభావం చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు. స్థానికుడైన సల్మాన్ క్రౌడ్ ఫండింగ్‌తో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతుండటంతో నిరుపేద మైనారిటీల్లో గట్టి పట్టు ఉంది. యువత ఫాలోయింగ్ కూడా బాగానే ఉంది. సల్మాన్ ఎన్నికల బరిలో ఉంటే మొత్తం మీద 20 శాతంపైగా కుటుంబాలు అతని వైపు మొగ్గు చూపే అవకాశాలు లేకపోలేదని రాజకీయ పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

మైనారిటీ ఓటర్లు 96 వేలపైనే

జూబ్లీహిల్ నియోజకవర్గంలో మొత్తం 3.98 లక్షల ఓటర్లు ఉండగా అందులో 96 వేలపైగా మైనారిటీ ఓటర్లు ఉన్నారు. దీంతో మైనారిటీ ఓటర్లే గెలుపు ఓటములను నిర్ణయించే శక్తిగా మారారు. మజ్లిస్ పార్టీ గతంలో పాగా వేసేందుకు ప్రయత్నించింది. మొదటి సారి 2014 ఎన్నికలలో నవీన్ యాదవ్‌ను బరిలో దింపగా 41,656 ఓట్లు దక్కించుకొని స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి తప్పలేదు. ఆ తర్వాత 2018లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో దోస్తీ కారణంగా పోటీకి దూరం పాటించడంతో నవీన్ యాదవ్ పార్టీకి రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆయనకు 18,817 ఓట్లు వచ్చాయి.. 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ కార్పొరేటర్‌ను ఎన్నికల బరిలో దింపినా.. పెద్దగా ప్రభావం చూపలేదు. మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థిగా భారత క్రికెటర్ దిగ్గజం అజహరుద్దీన్ ఎన్నికల బరిలో దిగడంతో మైనారిటీ ఓట్లు చీలిపోయాయి. బీఆర్ఎస్‌కు మైనారిటీ ఓటు బ్యాంక్ కలిసి రావడంతో ఎన్నికల్లో గట్టెక్కగలిగింది. సిట్టింగ్ ఎమ్మెల్యే మృతితో ఉప ఎన్నిక అనివార్యమైంది. గతంలో మజ్లిస్ నుంచి పోటీ చేసిన నవీన్ ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిగా ఎన్నికల బరిలో దిగుతున్నారు. ఈసారి మజ్లిస్ ఎన్నికల బరికి దూరం పాటిస్తూ కాంగ్రెస్‌కు మద్దతిచ్చే అవకాశం ఉన్నా.. సోషల్ వర్కర్ సల్మాన్ ఎన్నికల బరిలో దిగడం మింగుడు పడని అంశంగా తయారైంది.

'స్టిక్కర్ల'పై స్పందించిన హెచ్ఆర్సీ

సీఎస్, డీజీపీ సహా పలువురికి నోటీసులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో సంచరిస్తున్న అనేక వాహనాలపై వివిధ రకాలుగా హ్యూమన్ రైట్స్ సంబంధిత సంస్థల పేర్లు, ప్రభుత్వం చిహ్నాలతో పాటు వివిధ గుర్తులు కనిపిస్తున్నాయి. వీటిలో అనేకం ప్రైవేట్ వాహనాలే. దీన్ని ట్రాఫిక్ పోలీసులు, ఆర్టీఏ అధికారులు ఏమాత్రం పట్టించుకోవట్లేదు. ఇలాంటి మూడు వాహనాలను చూసిన మానవ హక్కుల కమిషన్ (హెచ్ఆర్సీ) సీరియస్‌గా తీసుకుంది. 'హ్యూమన్ రైట్స్ కమిషన్' అనే పేరు, ప్రభుత్వ చిహ్నాలు, అడ్వకేట్, ప్రెస్ గుర్తులు అనధికారికంగా వాడుకలో ఉన్నట్లు గుర్తించింది. దీనిపై మంగళవారం సుమోటోగా కేసు నమోదు చేసింది. ఇలాంటి చర్యలు స్టేట్ ఎంబ్లమ్ ఆఫ్ ఇండియా యాక్ట్‌తో పాటు మోటారు వాహనాల చట్టానికి విరుద్ధమని స్పష్టం చేసింది. ఇలాంటి వాహనాలపై అవసరమైన చర్యలు తీసుకుంటూ సమగ్ర నివేదికల్ని వచ్చే నెల 24 నాటికి సమర్పించాలని ప్రధాన కార్యదర్శి, డీజీపీ, రవాణా శాఖ కమిషనర్, బార్ కౌన్సిల్, సమాచార–ప్రజా సంబంధాల శాఖతో పాటు రిజిస్ట్రార్ ఆఫ్ సొసైటీస్‌ను ఆదేశించింది. హెచ్ఆర్సీ దృష్టిలోకి వెళ్లిన మూడు వాహన యజమానుల నుంచీ వివరణ కోరింది.



హెచ్ఆర్సీ నోటీసులు జారీ చేసిన కార్లలో ఒకటి

గర్భస్రావంతో ప్రాణం తీశారు

వైద్యం వికటించి బాధితురాలి మృతి

- యువతి ప్రేమికుడు, ఆర్ఎంపీ అరెస్టు



మృతురాలు మౌనిక (ఫైల్) | హోంగార్డు మధుసూదన్ | ఆర్ఎంపీ పద్మజ

శంషాబాద్ రూరల్: ప్రేమ పేరుతో ఓ యువతిని గర్భవతిని చేసిన హోంగార్డు.. గర్భస్రావం కోసం ఆర్ఎంపీతో చికిత్స చేయించాడు. అది వికటించి బాధితురాలు మృతి చెందిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో హోంగార్డుతో పాటు మహిళా ఆర్ఎంపీని పోలీసులు అరెస్టు చేశారు. ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఫరూక్‌నగర్ మండలం రాయికల్ గ్రామానికి చెందిన బ్యాగరి మౌనిక (29) ప్రైవేటు ఉద్యోగం చేస్తోంది. ముచ్చింతల్‌కు చెందిన బానూరి మధుసూదన్ పోలీస్ శాఖలో శంషాబాద్ ఫింగర్ ప్రింట్ విభాగంలో హోంగార్డుగా పని చేస్తున్నాడు. మౌనికను ప్రేమిస్తున్నానంటూ ఏడేళ్ల నుంచి ఆమెతో సన్నిహితంగా ఉన్నాడు. ఈ క్రమంలో మౌనిక గర్భం దాల్చగా.. నాలుగు రోజుల క్రితం విషయం అతనికి తెలిసింది. దీంతో గర్భం తొలగించడానికి మౌనికను పాల్మాకులలో ఉన్న ఆర్ఎంపీ పద్మజ వద్దకు తీసుకువచ్చి అబార్షన్ చేయించాడు. వైద్యం వికటించి మౌనికకు తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమెను నగరంలోని మరో ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లాడు. చికిత్స పొందుతూ మౌనిక ఈ నెల 13న మృతి చెందింది. మృతురాలి తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు వీరిపై లైంగిక దాడి, ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేశారు. మంగళవారం నిందితులు మధుసూదన్, ఆర్ఎంపీ పద్మజను అరెస్టు చేశారు.


1950 హెల్ప్‌లైన్, ఎన్‌జీఆర్ఎస్ ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికల నేపథ్యంలో, ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారం కోసం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ప్రత్యేకంగా 1950 హెల్ప్‌లైన్, జాతీయ ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (ఎన్‌జీఆర్ఎస్)ను ఏర్పాటు చేశారు. 1950 హెల్ప్‌లైన్ ద్వారా ప్రజలు ఓటర్ల జాబితా, పోలింగ్ సెంటర్లు, ఎపిక్ కార్డులు, మోడల్ కోడ్ ఉల్లంఘనలు, ప్రలోభాల అంశాలు మొదలైన వాటికి సంబంధించిన సమాచారం పొందడమే కాకుండా, ఫిర్యాదులు నమోదు చేయవచ్చు. 1950 హెల్ప్‌లైన్‌కు ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు 433 కాల్స్ రాగా 379 కాల్స్‌కు సమాధానం ఇచ్చినట్లు జీహెచ్ఎంసీ పేర్కొంది.

పర్యాటక మూసీకి.. పరుగులు తీసేలా..

నగరం నలువైపుల నుంచి సులువుగా వెళ్లేలా..

- రేడియల్ రోడ్లతో నలువైపులా అనుసంధానం
- గండిపేట నుంచి ఫిల్మ్ సిటీ వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు
- కొత్వాల్‌గూడ నుంచి లగచర్ల వరకు రహదారి
- చందన్‌వెల్లి, సీతారాంపూర్ సెజ్‌లతో అనుసంధానం



సాక్షి, సిటీబ్యూరో: మూసీ సుందరీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోంది. మూసీలో స్వచ్ఛమైన నీరు ప్రవహించేలా చేయడంతో పాటు నది పరీవాహక ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు. ఈ పర్యాటక మూసీకి నగరం నలువైపుల నుంచి సులువుగా చేరుకునేలా పటిష్టమైన రహదారి వ్యవస్థ ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించారు. ఈ మేరకు తొలి దశలో మూసీకి పునరుజ్జీవం కల్పించనున్న గండిపేట నుంచి పలు మార్గాలలో గ్రీన్‌ఫీల్డ్ రహదారులను నిర్మించనున్నారు. దీంతో ఎలాంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నగరం నలుదిక్కుల నుంచి మూసీకి రాకపోకలు సులువవుతాయని అధికారులు భావిస్తున్నారు.

గండిపేట టు ఫిల్మ్ సిటీ..

మూసీ పునరుజ్జీవం ప్రాజెక్ట్‌లో భాగంగా తొలి దశలో జంట జలాశయాల నుంచి బాపూ ఘాట్ వరకు 21.5 కి.మీ. మేర అభివృద్ధి చేయనున్నారు. ఇందులో ఫేజ్–1ఏ కింద హిమాయత్‌సాగర్ నుంచి బాపూ ఘాట్ వరకు 9.5 కి.మీ., ఫేజ్–1 బీ కింద ఉస్మాన్‌సాగర్ నుంచి బాపూ ఘాట్ వరకు 11 కి.మీ. వరకు ఉంటుంది. కంపుకొట్టే మూసీలో స్వచ్ఛమైన నీరు ప్రవహించేలా చేయడంతో పాటు నది పరీవాహక ప్రాంతమైన గండిపేటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా నగరం నలువైపులా గండిపేటకు రాకపోకలు సులువుగా సాగేలా కొత్త రహదారులను నిర్మించాలని మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎంఆర్‌డీసీఎల్) అధికారులు ప్రతిపాదించారు. నగరంలోని ఓఆర్ఆర్‌ను ఓఆర్ఆర్‌తో అనుసంధానించమే లక్ష్యంగా పలు రేడియల్ రోడ్లను అభివృద్ధి చేయనున్నారు. ఇందులో భాగంగా గండిపేట నుంచి ఫిల్మ్ సిటీ వరకూ మూసీ వెంట కొత్త రోడ్డును నిర్మించనున్నారు. దీంతో గండిపేట సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నుంచి ఫిల్మ్ సిటీ వద్ద ఓఆర్ఆర్ వరకు ప్రస్తుత దూరం 85 కి.మీ.గా ఉండగా.. ఈ ప్రతిపాదిత రోడ్డుతో ట్రాఫిక్ అడ్డంకులు లేకుండా ఏకంగా 30 కి.మీ. దూరం తగ్గుతుంది.

'గేట్ వే ఆఫ్ హైదరాబాద్'..

దేశానికి ముఖద్వారమైన 'గేట్ వే ఆఫ్ ముంబై' తరహాలో తెలంగాణకు 'గేట్ వే ఆఫ్ హైదరాబాద్' ఐకానిక్ నిర్మాణాన్ని ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ నిర్ణయించిన సంగతి తెలిసిందే. ప్రపంచ పర్యాటకులను స్వాగతించేలా హిమాయత్‌సాగర్ సమీపంలో గాంధీ సరోవర్ వద్ద ఈ నిర్మాణాన్ని ఏర్పాటు చేయనున్నారు. ప్రతిపాదిత గేట్ వే ఆఫ్ హైదరాబాద్‌ను కనెక్టివిటీ హబ్‌గా అభివృద్ధిపరుస్తారు. ఈ ఐకానిక్ నిర్మాణం నుంచి కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్లను కలుపుతూ చందన్‌వెల్లి, సీతారాంపూర్ సెజ్‌లకు రేడియల్ రోడ్‌తో అనుసంధానించనున్నారు. ఈ కొత్త గ్రీన్‌ఫీల్డ్ రోడ్ ఔటర్ రింగ్ రోడ్‌ను చించోలి హైవేకు కలుపుతుంది.

అదృష్టం కలిసి రావాలని..

ఈ నెల 16, 17, 18వ తేదీల్లో దశమి.. ఏకాదశి.. ద్వాదశి... నామినేషన్లు భారీగా పడే అవకాశం

శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఆయా అభ్యర్థులు నమ్మే స్వాములు, పంచాంగ కర్తలు వారి జాతకం, నక్షత్రం ప్రకారం ఏ రోజు, ఏ సమయంలో వేస్తే అదృష్టం వరిస్తుందో తెలుసుకొని నామినేషన్లు వేయడానికి సిద్ధమవుతున్నారు. దీంతో ఆయా స్వామీజీలు, పంచాంగ కర్తలు, జ్యోతిషులు బిజీబిజీగా మారి వారికి తగు సలహాలు, సూచనలు, ఏదైనా సమస్య ఉండే దానికి చేయాల్సిన పరిహారాలు కూడా చెబుతున్నారు. కొందరు నేతలు మా అభ్యర్థే గెలవాలని పూజలు, హోమాలు చేయడానికి సిద్ధమవుతున్నారు. దాదాపు వందల దాకా నామినేషన్లు పడే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. తొలి రెండు రోజుల్లోనే 20 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయడం విశేషం. అయితే.. 16, 17, 18 తేదీల్లో దశమి, ఏకాదశి, ద్వాదశి మంచి రోజులు కావడంతో ఆయా పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు అధికంగా నామినేషన్లు వేసే అవకాశం ఉంది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ఈ నెల 17న నామినేషన్ వేయనున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బీఆర్ఎస్ బుధవారం కొందరు నేతలతో కలిసి నామమాత్రపు నామినేషన్ వేసి, 18వ తేదీలోపు పార్టీ క్రియాశీల నేతలతో కలిసి నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.



పర్యాటకం

పరిఢవిల్లేలా..

శేరిలింగంపల్లిలో సందర్శనీయ ప్రాంతాలపై ప్రత్యేక ఫోకస్

- ఈ సర్కిల్లోని ఐదు మార్గాల్లో పారిశుద్ధ్య చర్యలు
- రోడ్లపై చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన
- ప్రైవేటు ఏజెన్సీకి పనుల బాధ్యతలు
- అంచనా వ్యయం ఏడాదికి రూ. 6.84 కోట్లు

ఎంపిక చేసిన మార్గాలు
1.సీఓడీ జంక్షన్ – ఐటీసీ కోహినూర్ (దుర్గం చెరువు కేబుల్‌బ్రిడ్జి): 5.8 కి.మీ
2. బయోడైవర్సిటీ ఫ్లైఓవర్ : 5 కి.మీ
3. బొటానికల్ గార్డెన్ ఫ్లైఓవర్ మూడువైపులా: 5 కి.మీ
4. గూగుల్ బిల్డింగ్ నుండి సైబర్ టవర్ సర్కిల్ : 4 కి.మీ
5. శిల్పా ఫ్లైఓవర్ రెండు వైపులా: 5 కి.మీ

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో పారిశుద్ధ్యం మెరుగవడం లేదు. అధికారులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నప్పటికీ చెత్త సమస్య తీరడంలేదు. ఆకాశ హర్మ్యాలను తాకే అద్దాల మేడలున్నా, ఐటీ కంపెనీలు సహా పేరెన్నికగన్న కంపెనీలు ఎన్ని ఉన్నా చెత్త కుప్పలు నగర అందాన్ని, ప్రతిష్ఠను దెబ్బతీస్తున్నాయి. ఈ నేపథ్యంలో నగరాన్ని సందర్శించే వారు చూడాలనుకునే ప్రదేశాలున్న శేరిలింగంపల్లి సర్కిల్‌లో తొలుత పేరెన్నికగన్న ఐదు మార్గాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. సదరు మార్గాల్లో చెత్త కనపడకుండా శుభ్రంగా ఉంచడం జీహెచ్ఎంసీ వల్ల కాదని భావించి, ప్రైవేటు కాంట్రాక్టు ఏజెన్సీకి బాధ్యతలప్పగించేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు గాను సంవత్సరానికి దాదాపు రూ.6.84 కోట్లు ఖర్చు కాగలదని అంచనా. పనులు చేసేందుకు ఎంపికయ్యే ఏజెన్సీ.. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడమే కాకుండా రోడ్లపై చెత్త వేయకుండా ప్రజలకు తగిన అవగాహన కల్పించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో కొత్తగా పబ్లిక్ టాయ్‌లెట్స్ సదుపాయం కూడా కల్పించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. సదరు ప్రాంతాల్లో చెత్తతో పాటు ఇతరత్రా మట్టి, మలినాలు, నిర్మాణ వ్యర్థాలు లేకుండా పర్యవేక్షించాలి.

ఐటీ హబ్ అయినా..

ప్రముఖ ఐటీ కంపెనీలు, ఆధునిక మౌలిక వసతులు, జీవన ప్రమాణాలతో నగరంలో శేరిలింగంపల్లికి ప్రాధాన్యం ఉన్నప్పటికీ, చెత్త మాత్రం అన్ని ప్రాంతాల మాదిరిగానే ఉండటంతో పర్యాటకులు ప్రయాణించే ఐదు మార్గాల్లో రూ.24.80 కిలోమీటర్ల దూరాన్ని ప్రైవేటు నిర్వహణకు ఇవ్వనున్నారు. ఏడాదిపాటు పరిశుభ్రతా ప్రమాణాలు పాటిస్తూ సదరు ప్రాంతాల్లో చెత్తాచెదారాలు లేకుండా చూడాలి. ఇందుకుగాను రూ.6.84 కోట్ల వ్యయం కాగలదని అంచనా వేశారు.

అంతర్జాతీయ ప్రమాణాలే లక్ష్యంగా..

- రాష్ట్ర ప్రభుత్వం పర్యాటకానికి ఎంతో ప్రాధాన్యమినిస్తుండగా, ఆయా ప్రదేశాల పరిసరాల్లో పరిశుభ్రత లోపిస్తోంది. దీంతో పర్యాటకంపై ప్రభావం పడుతోంది. వ్యాపార సంస్థలు, పాదచారులు, వాహనదారులు చెత్తను రహదారులపైనే పారేస్తుండటం ఇందుకు కారణం. ఎప్పటి చెత్త అప్పుడు తొలగించేందుకు ఎంపికయ్యే ఏజెన్సీ ప్రత్యేక సిబ్బందితో మూడు షిఫ్టుల్లో పరిశుభ్రత పనులు చేయాల్సి ఉంటుంది.
- ప్రతి 2 కిలోమీటర్లకు పర్యవేక్షణ సిబ్బంది ఉండాలి. అందరికీ ఫేస్ రికగ్నిషన్ హాజరును అమలు చేయాలి. చెత్త తొలగింపు వాహనాలు, మిషనరీ, అవసరమైన అన్ని పరికరాలుఉండాలి. సేకరించిన చెత్తను సంబంధిత స్టోరేజీ పాయింట్లకు తరలించాలి. రోడ్ల వెంబడి 100 లీటర్ల సామర్థ్యం కలిగిన తడి–పొడి చెత్త డబ్బాలుండాలి. నిబంధనల కనుగుణంగా పరిశుభ్రత చర్యలు 24 గంటలపాటు ఉండాలి. లేని పక్షంలో జరిమానాలు విధిస్తారు. రోడ్ల వెంబడి చెత్త ఉన్నా, నిర్మాణ కూల్చివేతల వ్యర్థాలున్నా పబ్లిక్ టాయ్‌లెట్ల నిర్వహణ బాగా లేకున్నా రూ.1000 చొప్పున జరిమానా విధిస్తారు.

కల్చరల్ గ్రిడ్‌గా మూసీ..

మూసీకి పూర్వవైభవం తీసుకురావాలంటే కేవలం నదిలో స్వచ్ఛమైన నీరు పారేలా చేయడం మాత్రమే కాదు.. నదిలో మురుగు నీరు చేరకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. ఇందులో భాగంగా నది చుట్టూ మురుగు నీటి శుద్ధి కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు. అలాగే నదిలో గోదావరి జలాలను పారేలా చేసేందుకు మల్లన్నసాగర్ ఆనకట్ట నుంచి 20 టీఎంసీల నీటిని తరలించి ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్‌లను నింపే ప్రయత్నాలను ప్రభుత్వం చేపట్టింది. మూసీని బహుళ ప్రయోజనకారిగా తీర్చిదిద్దాలని సీఎం రేవంత్ ఆదేశాల మేరకు తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు మరో ఆర్థిక చక్రంగా చేయనున్నారు. దశల వారీగా ఈ ప్రాజెక్టును హెచ్ఎండీఏ పరిధిలోని 55 కి.మీ. మూసీ నదిని పునరుజ్జీవం కల్పించనున్నారు. మూసీని వాటర్ గ్రిడ్‌గా మాత్రమే కాకుండా సాంస్కృతిక గ్రిడ్‌గా కూడా అభివృద్ధి చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రభుత్వం మంచిరేవుల లోని శివాలయం, పాత బస్తీలోని మసీదు, సిఖ్‌చావనీలోని గురుద్వార, ఉప్పల్‌లోని మెదక్ కేథడ్రల్ తరహాలో చర్చిని అభివృద్ధి చేస్తారు.

నేరాల తీరుతెన్నులు అధ్యయనం చేయండి

- ప్రత్యేక విభాగాలతో సమీక్షలో అదనపు సీపీ (నేరాలు) శ్రీనివాసులు

సాక్షి, సిటీబ్యూరో: 'ఏదైనా ఓ నేరం జరిగినప్పుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టడం, నిందితుల్ని అరెస్టు చేయడమే కాదు..ఆయా నేరాల తీరుతెన్నుల్ని సమగ్రంగా అధ్యయనం చేయాలి. అప్పుడే వాటి నిరోధానికి అవసరమైన వ్యూహాన్ని సిద్ధం చేయగలం' అని నగర అదనపు పోలీసు కమిషనర్ (నేరాలు) ఎం.శ్రీనివాసులు అన్నారు. గత వారం బాధ్యతలు స్వీకరించిన ఆయన మంగళవారం వివిధ ప్రత్యేక విభాగాలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నేరగాళ్లు ఎప్పటికప్పుడు సరికొత్త టెక్నాలజీ వినియోగిస్తూ దర్యాప్తు అధికారులకు సవాల్ విసురుతున్నారని అభిప్రాయపడ్డారు. సైబర్ నేరాలు, ఆర్థిక నేరాలతో పాటు మహిళలపై జరిగే నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తులో ఉత్తమ విధానాలు అవలంబించాలని కోరారు. బాధితుల పక్షపాతిగా ఉండాలని, ప్రతి కేసు దర్యాప్తునూ పారదర్శకంగా చేయాలని స్పష్టం చేశారు. నగర నేర పరిశోధన విభాగంతో (సీసీఎస్) పాటు సైబర్ క్రైమ్, మహిళ భద్రత విభాగాలను మరింత పటిష్టం చేయనున్నట్లు పేర్కొన్నారు. కేవలం కేసుల నమోదు, నిందితుల అరెస్టు మాత్రమే కాకుండా ఆయా నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచడానికి సైబర్ క్రైమ్ పోలీసులు పని చేయాలని శ్రీనివాసులు ఆదేశించారు. ఈ సమావేశంలో సైబర్ క్రైమ్ డీసీపీ దార కవిత, మహిళ భద్రత విభాగం డీసీపీ ఎన్జేపీ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఇబ్రహీంపట్నం: సీజేఐ గవాయ్‌పై దాడి అంటే రాజ్యాంగం, పార్లమెంట్, దేశం మొత్తంపై జరిగిన దాడిగా చూడాల్సిందేనని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. సీజేఐపై దాడిని నిరసిస్తూ కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు సామెల్ అధ్యక్షతన మంగళవారం ఇబ్రహీంపట్నంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి సామెల్‌తోపాటు కార్యదర్శి ప్రకాశ్ కారత్, బీఎస్పీ నాయకుడు కొండ్రు రఘుపతి, తెలంగాణ ఉద్యమకారులు బోసుపల్లి వీరేశ్‌కుమార్, రాములు, మారయ్య, పూస ల సంఘం రాష్ట్ర నాయకుడు పురుషోత్తం, రజక సంఘం నాయకుడు ముదిగొండ అజయ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దాడి చేసిన.. దాని వెనుకల ఉన్న నిందితులను కఠినంగా శిక్షిస్తేనే భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఉంటాయన్నారు. సమావేశంలో వెంకటేశ్, బండి సత్తయ్య, కాలె గణేశ్, కాళ్ల జంగయ్య, ఎం. రాజు, కరుణాకర్ పాల్గొన్నారు.



కెమెరాలు ఉన్నా.. ఫలితం సున్నా!

నానాటికీ తెలివి మీరుతున్న నేరగాళ్లు

- ఎలాంటి ఆధారాలు దొరక్కుండా నేరాలు
- సొత్తుతో పాటు డీవీఆర్‌లు సైతం తస్కరణ
- 'బ్రిలియంట్' ఉదంతమే తాజా ఉదాహరణ
- కొన్ని మెళకువలు పాటించాలి: పోలీసులు

సాక్షి, సిటీబ్యూరో: నగర శివార్లలోని అబ్దుల్లాపూర్‌మెట్‌లో ఉన్న బ్రిలియంట్ విద్యా సంస్థలు సెక్యూరిటీకి ప్రాధాన్యం ఇచ్చాయి. తమ ఆవరణతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో కలిపి మొత్తం 200 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకున్నాయి. గత గురువారం దీని కార్యాలయం నుంచి రూ.1.07 కోట్లను ఓ దొంగ ఎత్తుకుపోయాడు. పోలీసులకు ఎలాంటి ఆధారాలు చిక్కకూడదనే ఉద్దేశంలో సీసీ కెమెరాల ఫీడ్ రికార్డు అయ్యే డిజిటల్ వీడియో రికార్డర్ (డీవీఆర్) కూడా ఎత్తుకుపోయాడు.

- సైబర్ క్రిమినల్స్ మాత్రమే కాదు..సొత్తు సంబంధ నేరాలు చేసే నేరగాళ్లు సైతం నానాటికీ తెలివి మీరుతున్నారు. తాము చేసిన క్రైమ్‌కు సంబంధించి ఎలాంటి ఆధారాలు మిగలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అందులో భాగంగా వెలుగులోకి వస్తున్న కొత్త ట్రెండ్ డీవీఆర్‌లు మాయం చేయడం. కేవలం బ్రిలియంట్ కేసులోనే కాదు ఇటీవల కాలంలో అనేక ఉదంతాల్లో ఈ ధోరణి కనిపించిందని పోలీసులు చెప్తున్నారు. అంతర్రాష్ట్ర ముఠాల నుంచి స్థానిక చిల్లర నేరగాళ్ల వరకు ప్రతి ఒక్కరూ దీన్ని అనుసరిస్తున్నారు. ప్రజలు కొన్ని కనీస జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ఈ కేటుగాళ్లకు చెక్ చెప్పవచ్చని సూచిస్తున్నారు.

సమయానుకూలంగా రూట్ మారుస్తూ...

ఏదైనా నేరం జరిగినప్పుడు దర్యాప్తులో భాగంగా చిన్న క్లూ అయినా సంపాదించాలని పోలీసులు ఎలా ఆలోచిస్తారో...ఏ చిన్న ఆధారం వదలకూడదని నేరగాళ్లూ ఎత్తులు వేస్తుంటారు. ఇందులో భాగంగానే ఒకప్పుడు తమ వేలి, కాలి ముద్రలు దొరక్కుండా జాగ్రత్తపడేవారు. అప్పట్లో పోలీసుల దర్యాప్తునకు ఇవే కీలకం కావడంతో చేతికి గ్లౌజులు, కాళ్లకు ప్లాస్టిక్ కవర్లు కట్టుకుని 'రంగం'లోకి దిగేవాళ్ళు. ఆ తర్వాతి రోజుల్లో పోలీసు జాగిలాలకు తమ జాడ చిక్కకుండా ఘటనాస్థలాల్లో కారం చల్లడం వంటి ఉదంతాలు వెలుగు చూశాయి. కొన్నేళ్ల క్రితం సికింద్రాబాద్‌లోని ఆర్‌పీకే లాడ్జిలో జరిగిన ఎన్ఆర్ఐ కుటుంబం హత్య కేసు సహా మరెన్నో నేరస్థలాల్లో కారం కనిపించింది. ప్రస్తుతం పోలీసుల దర్యాప్తు తీరు మారింది. అనేక కేసుల్లో సీసీ కెమెరాలే కీలక ఆధారాలు ఇస్తున్నాయి. దీంతో దొంగలు తొలినాళ్లల్లో సీసీ కెమెరాలకు చిక్కకుండా ముఖానికి మాస్కులు, ముసుగులు వేసుకునే వారు. ఆపై వాటిని ధ్వంసం చేయడం చేశారు. ఈ 'కాలక్రమంలో' భాగంగా ఇటీవల కాలంలో కనిపిస్తున్న ట్రెండ్ డీవీఆర్‌ల చోరీ.

అది ఎత్తుకుపోతే అంతే...

పోలీసులు చేస్తున్న ప్రచారమో, ప్రజల్లో వస్తున్న చైతన్యమో.. ఏదైతేనేం ప్రస్తుతం దుకాణదారులతో పాటు ఇంటి యజమానులూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. ప్రజలు, వ్యాపారులు ఏర్పాటు చేసుకునే సీసీ కెమెరాలకు సంబంధించి డీవీఆర్ అత్యంత కీలకమైంది. సీసీ కెమెరాలు రికార్డు చేసే దృశ్యాలు (ఫీడ్) ఆద్యంతం అందులోనే నిక్షిప్తమవుతాయి. చోరీ చేసిన నేరగాళ్లు సొత్తుతో పాటు దీన్ని కూడా పట్టుకుపోతే దర్యాప్తునకు అవసరమైన ఆధారాలు చెరిగిపోయినట్లే. చోరీ జరిగిన ప్రాంతానికి చుట్టుపక్కల, సమీపంలో ఇతర సీసీ కెమెరాలు లేకపోతే దాదాపు ఆధారాలు కనుమరుగైనట్లే. గతంలో అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతంలోనే ఓ వైన్ షాపులో చోరీ సందర్భంలోనూ ఇలానే జరిగింది. ఇలాంటి సందర్భాల్లో దర్యాప్తు కష్టసాధ్యంగా, కాలయాపనతో కూడినదిగా మారుతోంది. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకున్న పోలీసుల విభాగం కొన్ని కీలక సూచనలు చేస్తోంది.

ఫోన్‌లో సేవ్ చేసుకుంటే...

ఇటీవల కాలంలో అందుబాటులోకి వస్తున్న, అనేక మంది ఏర్పాటు చేసుకుంటున్న సీసీ కెమెరాల్లో అత్యధికం ఐపీ బేస్ట్ పరిజ్ఞానంతో పని చేస్తున్నాయి. యజమానులు తాము ఎక్కడ ఉన్నప్పటికీ తమ ఇంట్లో, దుకాణంలో ఏ జరుగుతోందో చూడటానికి అనువుగా ఇంటర్‌నెట్ ఆధారంగా పని చేసే వీటిని ఏర్పాటు చేసుకుంటున్నారు. అనునిత్యం వీరి సెల్‌ఫోన్‌తో కనెక్ట్ అయి ఉండే ఈ కెమెరాల ఫీడ్‌ను యజమానులు ఎక్కడున్నా చూడగలుగుతున్నారు. దీన్ని సద్వినియోగం చేసుకుంటూ, సెల్‌ఫోన్స్ లేదా మెమొరీ కార్డ్స్ సామర్థ్యం పెంచుకుంటూ మరికొన్ని చర్యలు తీసుకోవాలని పోలీసులు కోరుతున్నారు. ఫోన్‌లో కనిపించే ఫీడ్ కనీసం 48 గంటల పాటు సేవ్ అయ్యేలా సెట్టింగ్ చేసుకోవాలని సూచిస్తున్నారు. అలా చేయడం ద్వారా చోరీ చేసిన తర్వాత తమ వెంట డీవీఆర్‌ను ఎత్తుకుపోయినా సెల్‌ఫోన్‌లో రికార్డు అయి ఉండే ఫీడ్ ఆధారంగా దర్యాప్తు ముందుకు వెళ్తుంది.

మరో ప్రాంతంలో ఏర్పాటూ మార్గమే...

సెల్‌ఫోన్‌లో సేవింగ్ విధానం ఇళ్లల్లో ఉన్న సీసీ కెమెరాలకు సరిపోతుంది. అదే దుకాణాల విషయానికి వస్తే అన్నింటి ఫీడ్‌ను ఇలా సేవ్ చేసుకోవడం సాధ్యం కాదు. కెమెరాల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పుడు ఆ ఫీడ్ భద్రపరచడానికి మెమొరీ కార్డ్ సామర్థ్యం చాలకపోవచ్చు. దీన్ని దృష్టిలో పెట్టుకుని 'పక్కన ఏర్పాట్లు' చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఒక దుకాణంలో ఉన్న సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్ పక్కన ఉన్న మరో దుకాణంలో ఉండేలా చూసుకోవాలని, పెద్ద సంస్థలు మరో ప్రాంతంలో బ్యాకప్ పెట్టుకోవాలని కోరుతున్నారు. ఇలా చేయడం ద్వారా ఒకవేళ చోరీ జరిగి దొంగలు ఆ దుకాణంలోని డీవీఆర్ ఎత్తుకుపోయినా ఇబ్బంది ఉండదని వివరిస్తున్నారు. పక్కపక్క ఇళ్లల్లో చోరీలు తరచుగా వెలుగు చూస్తున్నా...దుకాణాల్లో ఈ తరహాలో జరగడం అత్యంత అరుదని, దీంతో ఈ విధానం వల్ల ఫలితాలు ఉంటాయని స్పష్టం చేస్తున్నారు. ఈ కోణంలో పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.

అబుదాబి విమానం మళ్లింపు

శంషాబాద్: అబుదాబి నుంచి వచ్చిన విమానం బెంగళూరుకు మళ్లించిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. 6ఈ1149 విమానం అబుదాబి నుంచి బయలుదేరి అర్ధరాత్రి 11.50 గంటలకు శంషాబాద్ విమానాశ్రయంలో దిగాల్సి ఉండగా ఎయిర్‌పోర్టులోఉన్న ట్రాఫిక్ రద్దీ కారణంగా బెంగళూరు విమానాశ్రయానికి మళ్లించారు. తిరిగి కొన్ని గంటల తర్వాత విమానం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. అలాగే సాంకేతిక సమస్యతో మరో విమానం ఆలస్యంగా బయలుదేరిన సంఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి కన్నూర్‌కు బయలుదేరాల్సిన ఇండిగో విమానంలో సాంకేతిక సమస్య చోటు చేసుకోవడంతో నిర్దిష్ట సమయానికి రెండు గంటలు ఆలస్యంగా బయలుదేరినట్లు ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మాక్‌డ్రిల్



శంషాబాద్: విమానాశ్రయంలో బాంబులు పెడితే వివిధ ఏజెన్సీలన్నీ సమన్వయంగా సమస్యను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై శంషాబాద్ విమానాశ్రయంలో మంగళవారం మాక్‌డ్రిల్‌ను నిర్వహించారు. కేంద్ర పారిశ్రామిక భద్రతా దళాలు ప్రతి సంవత్సరం నిర్వహించిన మాదిరిగా ఈ ఏడాది బాంబులు పెడితే కలిగే నష్టం..దానిని నివారించే విధానంపై డ్రిల్ చేపట్టారు. కార్గో ఏరియాలో చేపట్టిన ఈ డ్రిల్‌లో సీఐఎస్ఎఫ్ అధికారుల బృందంతో పాటు రక్ష సెక్యూరిటీ, వైద్యులు, రాష్ట్ర పోలీసులు, ప్రత్యేక పోలీసులు పాల్గొన్నారు. తనిఖీలు, నిర్వీర్యం, వైద్యసాయం తదితర అంశాలపై మాక్‌డ్రిల్ విజయవంతంగా పూర్తిగా చేశారు.

ఇంట్లో దాచిన ఎయిర్‌గన్, తల్వార్ స్వాధీనం



సనత్‌నగర్: ఓ వ్యక్తి తన ఇంట్లో దాచుకున్న ఎయిర్‌గన్, తల్వార్లను సనత్‌నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం...భరత్‌నగర్‌లో నివాసం ఉంటున్న చంద్రకాంత్ (42) ఇటీవల అదే ప్రాంతానికి చెందిన కొందరితో గొడవపడ్డారు. వారు దాడి చేసి కొట్టడంతో తీవ్ర గాయాలపాలై ఆస్పత్రిలో చేరాడు. బాధితుడు చంద్రకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు. ఇదిలా ఉంటే చంద్రకాంత్ ఇంట్లో గన్, తల్వార్ ఉన్నట్లు కొందరు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం ఇంట్లో సోదాలు చేసిన పోలీసులకు ఓ ఎయిర్‌గన్‌తో పాటు తుప్పుపట్టిన తల్వార్ లభించింది. దీంతో మారణాయుధాల చట్టం కింద పోలీసులు చంద్రకాంత్‌పై కేసు నమోదు చేశారు.

మరో నలుగురు బాలురపైనా లైంగిక దాడి!

సైదాబాద్: సైదాబాద్ జైలు గార్డెన్‌లోని ప్రభుత్వ బాలల సదనంలో ఒక బాలుడిపై ఔట్ సోర్సింగ్ ఉద్యోగి లైంగిక దాడి చేయడం కలకలం సృష్టించిన సంగతి విదితమే. అయితే పోలీసుల విచారణలో అతడు మరో నలుగురు బాలురిపైనా లైంగిక దాడులు చేశాడని తేలినట్లు తెలుస్తోంది. బాలుడిపై లైంగిక దాడి ఘటనను సీరియస్‌గా విచారిస్తున్న పోలీసులకు విస్తుపోయే విషయాలు వెల్లడవుతున్నామయని సమాచారం. ప్రస్తుతం సదనంలో 80 మంది బాలలు ఉండగా వారందరితో పోలీసులు ఒక్కొక్కరిగా మాట్లాడి విషయాలు రాబడుతున్నారు. ప్రస్తుతం సదనంలో కాకుండా ఇండ్లకు వెళ్లిన వారిని సైతం వారు విచారిస్తున్నారు. రెండు రోజుల క్రితం ఓ బాలుడిపై దాడి విషయం వెలుగులోకి వచ్చిన తరువాత జువైనల్ విభాగం ఉన్నతాధికారులు మహిళా సూపరింటెండెంట్ మైథిలిని దర్యాప్తు అధికారిగా నియమించారు. ఆమె పూర్తి వివరాలతో నివేదికను అధికారులకు సమర్పించారు. ఇప్పటికే బాలుడిపై దాడి ఘటనలో నిందితుడైన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రహమాన్‌ను విధుల నుంచి అధికారులు తొలిగించారు. హెడ్ సూపర్‌వైజర్ షఫీని సస్పెండ్ చేశారు. మరో ఇద్దరు ఉద్యోగులకు చార్జి మెమో జారీ చేశారు. సైదాబాద్ పోలీసుల విచారణ పూర్తయితే ప్రభుత్వ బాలల సదనంలో దాడుల విషయమై మరిన్ని వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది. బాలల సదనంలో లైంగిక దాడి ఘటనపై కేంద్ర మహిళా శిశు సంక్షేమశాఖ అధికారులు ఇక్కడి అధికారులను పూర్తి నివేదిక పంపాలని అడిగారని తెలుస్తోంది.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఈ–సిగరెట్ల పట్టివేత



శంషాబాద్‌లో పట్టుబడ్డ ఈ–సిగరెట్లు

శంషాబాద్: దుబాయ్ నుంచి పెద్ద మొత్తంలో ఈ–సిగరెట్లతో పాటు విదేశీ సిగరెట్లు తీసుకొచ్చిన ప్రయాణికులు సీఐఎస్ఎఫ్ అధికారులకు పట్టుబడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. దుబాయ్ నుంచి ఈకే–524 విమానం మంగళవారం తెల్లవారు జామున 4 గంటలకు తనిఖీలు పూర్తి చేసుకుని అరవైల్ బయటికి వచ్చిన ప్రయాణికుడి కదలికలను అనుమానించిన సీఐఎస్ఎఫ్ అధికారులు అతడిని వద్ద ఉన్న మూడు నల్లరంగు పెద్ద బ్యాగులను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించారు. అందులో 259 ఈ–సిగరెట్లతో పాటు 200 బాక్సుల విదేశీ సిగరెట్లు పట్టుబడ్డాయి. తీసుకొచ్చిన వ్యక్తి తమిళనాడు రాష్ట్రం తిరువళ్లూరు పెరుమల్పట్టుకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. తీసుకొచ్చిన సిగరెట్లను అతడి నుంచి తీసుకునేందుకు డిపార్చుర్ దగ్గర ఉన్న వ్యక్తి మహ్మద్ ఇంతియాజ్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు. సిగరెట్లతో పాటు నిందితులిద్దరిని కస్టమ్స్ అధికారులకు అప్పగించారు. ఈ మేరకు కస్టమ్స్ అధికారులు దర్యాప్తు చేపడుతున్నారు.

రూ.50 లక్షల రుణం ఇస్తామంటూ రూ.7.9 లక్షలు స్వాహా

సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన హైదరాబాద్ యూత్ కరేజ్ (హెచ్‌వైసీ) వ్యవస్థాపకుడు సల్మాన్ ఖాన్ ఫొటోను డీపీగా పెట్టుకున్న సైబర్ నేరగాళ్లు నగర వాసి నుంచి రూ.7.9 లక్షలు కాజేశారు. ఆయన నిర్వహిస్తున్న స్వచ్ఛంద సంస్థ తరఫున రూ.50 లక్షల రుణం ఇస్తున్నట్లు ఎర వేసి ఈ పని పూర్తి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. బేగంపేటకు చెందిన వ్యక్తికి (30) వాట్సాప్ కాల్ చేసిన సైబర్ నేరగాళ్లు తమ హెచ్‌వైసీ స్వచ్ఛంద సంస్థ ద్వారా రూ.50 లక్షల రుణం మంజూరు చేసినట్లు చెప్పారు. ఆ మొత్తం పొందడానికి ప్రాసెసింగ్ ఫీజుతో పాటు ఇతర ఖర్చులకు రూ.10 లక్షలు చెల్లించాలని షరతు పెట్టారు. బేరసారాల తర్వాత వివిధ దశల్లో రూ.7.9 లక్షలు కాజేశారు. మరో రూ.30 వేలు కోరడంతో అనుమానించిన బాధితుడు ఆరా తీసి తాను మోసపోయినట్లు గుర్తించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఏఏకు ప్రతిష్టాత్మక చేంజ్ మేకర్స్ గుడ్ అవార్డు



సాక్షి, సిటీబ్యూరో: అసోసియేటెడ్ అడ్వర్టయిజింగ్ ప్రై.లి. (ఏఏ)కు ప్రతిష్టాత్మక ఏషియన్ ఫెడరేషన్ ఆఫ్ అడ్వర్టయిజింగ్ అసోసియేషన్స్ (ఏఎఫ్ఏఏ) వారి అవార్డు దక్కింది. ఏఏ ఆధ్వర్యంలోని టీ–సేఫ్ అవగాహన కార్యక్రమానికి జాతీయ ప్రభుత్వ విభాగంలో 'చేంజ్ మేకర్స్ ఆఫ్ గుడ్' అవార్డు దక్కిందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. తెలంగాణ ప్రభుత్వ మహిళా భద్రతా విభాగం వారు మహిళల భద్రత, పోలీసుల సమర్థవంతమైన సేవల కోసం 'టీ–సేఫ్' క్యాంపెయిన్‌ను నిర్వహించారు.

రూ.88.45 లక్షలు సీజ్ !

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక సందర్భంగా ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించి నగదు, ఆయా వస్తువులు తరలిస్తున్న వారిని సంబంధిత అధికారులు గుర్తించి వాటిని సీజ్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. 7వ తేదీ నుంచి 14వ తేదీ వరకు ఫ్లైయింగ్ స్క్వాడ్ టీమ్స్(ఎఫ్ఎస్‌టీ), స్టాటిక్ సర్వైలెన్స్ టీమ్స్(ఎస్ఎస్‌టీ) తదితర విభాగాల అధికారులు రూ.88,45,200 నగదు స్వాధీనం చేసుకున్నారు. 255.56 లీటర్ల లిక్కర్‌ను పట్టుకున్నారు. రూ.1925ల విలువైన డ్రగ్స్ సీజ్ చేశారు. రూ.72,740 విలువైన ఫ్రీబీస్ (రేషన్ బియ్యం, ల్యాప్‌టాప్, చీరలు, కుక్కర్లు, తదితర వస్తువులు) పట్టుకున్నారు. అన్నింటినీ పరిశీలించి 48 కేసులు నమోదు చేసి 29 ఎఫ్ఐఆర్‌లు ఫైల్ చేశారు.

హెచ్‌సీఏలో నకిలీ బర్త్ సర్టిఫికెట్ల కలకలం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)పై మరో వివాదం వెలుగులోకి వచ్చింది. హెచ్‌సీఏలో నకిలీ, డబుల్ బర్త్ సర్టిఫికెట్లతో పలువురు క్రీడాకారులు ప్రవేశం పొందినట్లు ఓ బాధితుడి తండ్రి అనంత్ రెడ్డి మంగళవారం ఉప్పల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు రాచకొండ పోలీసు కమిషనర్ సుధీర్ బాబుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అండర్– 16, అండర్–19, అండర్–23 లీగ్ మ్యాచుల్లో పలువురు ప్లేయర్లు డబుల్ బర్త్ సర్టిఫికెట్లతో ఎక్కువ వయసు ఉన్నప్పటికీ లీగ్‌లో ఆడే విధంగా హెచ్‌సీఏ అవకాశం ఇచ్చిందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంపై గతంలో ఆరుగురు ప్లేయర్లను గుర్తించిన బీసీసీఐ..వారిపై నిషేధం విధించిందని ఆయన గుర్తు చేశారు. ఎక్కువ వయసు ఉన్న వారికి ఇలా అక్రమమార్గంలో లీగ్‌లో ఆడే అవకాశం ఇవ్వడం వల్ల ప్రతిభ ఉన్న నిజమైన క్రీడాకారులకు నష్టం వాటిల్లుతుందని ఆయన వాపోయారు. అవినీతికి పాల్పడుతూ టాలెంట్ లేకున్నా ప్లేయర్లను ఆడనిస్తున్న హెచ్‌సీఏ అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన సీపీకి ఫిర్యాదు చేశారు.

'గట్ హెల్త్'పై ప్రత్యేక దృష్టి

- ఏఐజీ హాస్పిటల్స్ ఛైర్మన్ డా.డి.నాగేశ్వర్‌రెడ్డి
- ఫిక్కీ లేడీస్ ఆధ్వర్యంలో హెల్త్ కాన్‌క్లేవ్



హెల్త్ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి, ఫిక్కీ లేడీస్ ప్రతినిధులు

సాక్షి, సిటీబ్యూరో: వైద్యరంగంలో ఇకపై 'గట్ హెల్త్'పై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని, ఇందులో భాగంగా వచ్చిన 'గట్ మైక్రోబయోమ్' కీలకంగా మారుతుందని ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డా.డి.నాగేశ్వర్ రెడ్డి అన్నారు. మన శరీరంలోని ప్రతి అవయవం మీద 'గట్ మైక్రోబయోమ్' ప్రభావం ఉంటుందని తెలిపారు. మనం తినే ఆహారాన్ని ఇది జీర్ణం చేసి శరీరానికి అవసరమైన పోషకాలు అందిస్తుందని ఆయన పేర్కొన్నారు. ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (ఫ్లో) హైదరాబాద్ చాప్టర్, ఏఐజీ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం గచ్చిబౌలిలోని ఆసుపత్రి ప్రాంగణంలో 'హెల్త్ కాన్‌క్లేవ్–వెల్‌నెస్ 360' పేరుతో మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డా. నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఒక వ్యక్తి మద్యం సేవించకపోయినా, డ్రంకన్ డ్రైవింగ్ కేసులో పట్టుబడ్డాడని, తర్వాత పరీక్షల్లో అతనికి 'ఆటో–బ్రూవరీ సిండ్రోమ్' అనే అరుదైన వ్యాధి ఉన్నట్లు తేలిందని, గట్ బ్యాక్టీరియా అసమతుల్యత వల్ల కడుపులోనే ఆల్కహాల్ ఉత్పత్తి అయి ఇలా జరిగినట్లు గుర్తించామన్నారు. జీర్ణక్రియ వ్యవస్థలో గట్ బ్యాక్టీరియా సమతుల్యత ఎంతో ముఖ్యమన్నారు. ఏఐజీ హాస్పిటల్స్, ఇజ్రాయెల్ న్యూట్రిషన్ ఇనిస్టిట్యూట్‌తో కలిసి 'ఇండ్–మెడ్ డైట్' ఆహారాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు వివరించారు. అనంతరం డా. శ్రీనివాస్ కిషోర్ సిస్టా మాట్లాడుతూ పురుషులతో పోల్చితే మహిళల్లో నిద్ర సమస్యల్లో తేడాలు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. ఆరోగ్యం అనేది వ్యాధి లేమి మాత్రమే కాదు..అది మన శరీరం, మనసు, ఆత్మను సమతుల్యం చేసినప్పుడే 360 డిగ్రీల వెల్‌నెస్ శక్తి అవుతుందని 'ఫ్లో' హైదరాబాద్ చైర్‌పర్సన్ ప్రతిభ కుందా పేర్కొన్నారు. ఈ కాన్‌క్లేవ్‌లో ఏఐజీ సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ చీఫ్ డా. జి.వి.రావు, అపోలో హెల్త్ సిటీ గైనకాలజిస్ట్ డా.రూమా సిన్హా, బసవతారకం ఇండో అమెరికన్ కేన్సర్ హాస్పిటల్ వైద్యుడు డా.టి.సుబ్రమణేశ్వర రావు, ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

భారతీయ విద్యా భవన్స్ మాజీ డైరెక్టర్ రామహనుమాన్ మృతి

సాక్షి, హైదరాబాద్: భారతీయ విద్యా భవన్స్ మాజీ డైరెక్టర్ రామహనుమాన్ సోమవారం మరణించారు. భవన్స్ బీ హెచ్ఈఎల్, తిరుపతి బ్రాంచీల్లో సుదీర్ఘకాలం ప్రిన్సిపాల్‌గానూ ఆయన సేవలు అందించారు. ఈ మధ్యకాలంలో ఆరోగ్యం క్షీణించడంతో చికిత్స పొందుతూ మరణించారు. రామహనుమాన్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మంగళవారం ఆయన భౌతికకాయాన్ని భవన్స్ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు సందర్శించి నివాళులర్పించారు.

మాగంటి సునీతకు మద్దతుగా ప్రచారం


ప్రచారంలో మన్నె గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి తదితరులు

వెంకటేశ్వరకాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా మంగళవారం కేశవ్‌నగర్‌కాలనీలో ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ కవితారెడ్డి ప్రచారం నిర్వహించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ అభివృద్ధికి మాగంటి గోపీనాథ్ ఎంతో కృషి చేశారని గుర్తుచేశారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్‌ఎస్ నేత


పార్టీలో చేరుతున్న ఎస్.నాను తదితరులు

శ్రీనగర్‌కాలనీ: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ ఎర్రగడ్డ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఎస్.నాను ఎర్రగడ్డలో మంగళవారం జరిగిన సమావేశంలో ఏఐసీసీ సెక్రటరీ, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రి వెంకటస్వామి, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. నానుతో పాటు పలువురు బీఆర్‌ఎస్, ఎంఐఎం నేతలకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

చంపుతానని బెదిరింపులు

వెంగళరావునగర్: యువతిని పెళ్లి చేసుకుంటానని నమ్మించి అశ్లీల వీడియోలతో బెదిరిస్తున్న యువకుడిపై మధురానగర్ పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం నాగార్జునసాగర్ ప్రాంతానికి చెందిన యువతి ప్రైవేట్ జాబ్ చేస్తోంది. ఆమె, షేక్ ముబిన్ అనే యువకుడు ప్రేమించుకున్నారు. పెళ్లికి పెద్దలు మొదట అంగీకరించకపోయినా ఆ తర్వాత ఒప్పుకున్నారు. అమ్మాయి తల్లిదండ్రులను ముబిన్ తీవ్ర పదజాలంతో వేధిస్తుండటంతో యువతి అతడిని వదిలేయాలని నిర్ణయించుకుంది. మరింత రెచ్చిపోయిన ముబిన్ ఇటీవల అశ్లీల వీడియోలు పంపాడు. ఆమెతో పాటు కుటుంబ సభ్యులను కూడా చంపుతానన్నాడు. దాంతో బాధితురాలు మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

57 క్రిటికల్ పోలింగ్ లొకేషన్లు

• అదనపు భద్రత కోరిన పోలీసులు • సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా

క్రిటికల్ పోలింగ్ లొకేషన్లు ఇవే..

పోలీస్‌స్టేషన్	మొత్తం పోలింగ్ లొకేషన్లు	క్రిటికల్ లొకేషన్లు
బోరబండ	44	27
మధురానగర్	43	18
జూబ్లీహిల్స్	9	1
ఫిలింనగర్	6	0
పంజగుట్ట	8	5
టోలిచౌకి	13	2
గోల్కొండ	7	2
సనత్‌నగర్	10	2

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతితో అనివార్యమైన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక వచ్చేనెల 11న జరగనుండగా, 14వ తేదీన ఫలితాలు వెలువడనున్నాయి. ఎన్నికల కోసం ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ మొదలుకాగా రెండు రోజుల్లోనే 22 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 21వ తేదీన నామినేషన్లకు ఆఖరు గడువు కాగా, రెండు రోజుల నుంచి నియోజకవర్గంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీల ప్రచారం ఊపందుకుంది. కాంగ్రెస్ మంత్రులు నియోజకవర్గంలో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. ఇదిలా ఉండగా నియోజకవర్గంలో పోలీసులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. నియోజకవర్గ పరిధి కిందికి వచ్చే యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్, షేక్‌పేట, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, సోమాజిగూడ డివిజన్ల పరిధిలో 407 పోలింగ్ బూత్‌లు ఉండగా 139 లొకేషన్లలో వీటిని ఏర్పాటు చేశారు. ఈ ఎన్నికల్లో మొత్తం ఓటర్లు 3,98,982 కాగా ఇందులో పురుషులు 2,07,367, మహిళలు 1,91,590 ఉన్నారు. పోలింగ్ లొకేషన్లలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా సమస్యాత్మక పోలింగ్ లొకేషన్లను గుర్తించారు. మొత్తం 139 పోలింగ్ లొకేషన్లలో 57 పోలింగ్ లొకేషన్లు సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. వివరాలను ఎన్నికల అధికారులకు పంపించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు భద్రతను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటి నుంచే ఆయా సమస్యాత్మక పోలింగ్ లొకేషన్ల పరిసరాల్లో అనుమానితుల కదలికలపై నిఘా పెట్టి జోరుగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అర్ధరాత్రి కూడా వేర్వేరు చోట్ల పోలీసులు తనిఖీలు చేస్తూ అసాంఘిక శక్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేస్తున్నారు. నియోజకవర్గ పరిధిలో ఉన్న పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇప్పటికే రౌడీషీటర్లను బైండోవర్ చేసి వారి కదలికలపై దృష్టి పెట్టారు. రాత్రిపూట పెట్రోలింగ్‌ను మరింత పెంచారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్ల వద్ద పికెటింగ్‌లు కూడా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ జాబితాను ఆయా ఠాణాలకు అందజేయడమే కాకుండా ఆ ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి.



సమస్యాత్మక పోలింగ్ కేంద్రంగా యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల

నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన డీసీపీ


విజిటర్స్ బుక్‌లో సంతకం చేస్తున్న వెస్ట్‌జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్-2లోని షేక్‌పేట మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన జూబ్లీహిల్స్ బైఎలక్షన్ నామినేషన్ కేంద్రాన్ని మంగళవారం ఉదయం వెస్ట్‌జోన్ డీసీపీ చింతమనేని శ్రీనివాస్ తనిఖీ చేశారు. పోలీసు బందోబస్తును పరిశీలించారు. ఇక్కడ ఏర్పాటు చేసిన సౌకర్యాలపై ఆరా తీశారు. బందోబస్తులో ఉన్న పోలీసులతో మాట్లాడి నామినేషన్లు వేసే సమయంలో, అభ్యర్థులు వచ్చే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంజగుట్ట ఏసీపీ, ఉప ఎన్నిక నోడల్ అధికారి మురళీకృష్ణతో ఇక్కడి ఏర్పాట్లు, సౌకర్యాలు, అభ్యర్థులకు కల్పిస్తున్న సదుపాయాలపై చర్చించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా చూడాలన్నారు. అనంతరం ఆయన విజిటర్స్ బుక్‌లో సంతకం చేశారు.

నామినేషన్ వేసిన సినీనటుడు


నామినేషన్ వేస్తున్న సినీనటుడు గొంటి శ్రీకాంత్

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఎల్లారెడ్డిగూడకు చెందిన సినీనటుడు గొంటి శ్రీకాంత్ ఎమ్మెల్యే స్వతంత్ర అభ్యర్థిగా మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఎన్నికల్లో ఇప్పటివరకు ఆయన మూడుసార్లు పోటీ పడ్డారు. తాజాగా నాల్గోసారి నామినేషన్ వేశారు. హైటెక్ లవర్స్ పేరుతో ఓ సినిమాలో హీరోగా నటించారు. వ్యవస్థను మార్చాలనే ఉద్దేశ్యంతో ప్రతిసారీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని, పోటీ చేయడం ప్రతిఒక్కరి కనీస బాధ్యత అన్నారు. ఎవరికివారు నాకెందుకులే అని అనుకోకూడదని, తాను సినిమాల్లో సమాజానికి సందేశం ఇచ్చినట్లుగానే ఎన్నికల్లో పోటీ చేయడం కూడా ఒక బాధ్యత అని చెప్పడానికే పోటీ చేస్తున్నట్లు చెప్పారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


రవాణాశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

పంజగుట్ట: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు ఆటో మెయింటనెన్స్ కోసం ప్రతి సంవత్సరం రూ.12వేలు ఇవ్వాలని ప్రొగ్రెసివ్ ఆటో, మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.లింగం గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం యూనియన్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కమిటీ ఆధ్వర్యంలో రవాణాశాఖ కమిషనర్, జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్, హైదరాబాద్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా యూనియర్ ప్రధాన కార్యదర్శి వి.ప్రవీణ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. మోటార్ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, మహాలక్ష్మి పథకం ఆటో డ్రైవర్లకు నెలకు రూ.6 వేల భృతి ఇవ్వాలని కోరారు. ప్రమాదంలో చనిపోతున్న ఆటో డ్రైవర్లకు రూ.10 లక్షలకు బీమా పెంచి రెన్యూవల్ చేయించాలన్నారు. యూనియన్ నాయకులు ఎండీ అఫ్జల్, టి.నారాయణ, బండ యాదయ్య,, శ్రీనివాస్ చారి, యూసూఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఇంటర్ డిసిప్లినరీ ఎగ్జిబిషన్



ఫిలింనగర్: జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో కళ, పుస్తకం, అంతరిక్ష అన్వేషణ, వినూత్న అభ్యాస పద్ధతులను ప్రదర్శించే ఇంటర్ డిసిప్లినరీ ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంది. సృజనాత్మకత, మేధోవృద్ధిని పెంపొందించే చక్కటి విద్యను ఈ కార్యక్రమం ద్వారా అందించారు. కళా విభాగంలో విద్యార్థుల కళాత్మక ప్రతిభ, వారి సామర్థ్యాన్ని ప్రదర్శించే పెయింటింగ్స్, కళాకృతులతో సహా విద్యార్థుల సృజనాత్మక రచనల శ్రేణిని ప్రదర్శించారు. ఈ పుస్తక ప్రదర్శన ద్వారా విద్యార్థులు, సందర్శకులకు కొత్త రచయితల పరిచయం జరిగింది. పుస్తక పఠనం పట్ల మరింత ఆసక్తి పెంచారు. అంతరిక్ష ప్రయోగశాలలో అంతరిక్ష అన్వేషణను అనుకరించే ఇంటరాక్టివ్ డిస్‌ప్లేలు, నమూనాలను ప్రదర్శించారు. పాఠశాల లైబ్రరీ ఆకట్టుకునే, సౌకర్యవంతమైన సీటింగ్ ప్రాంతాలతో, అభ్యాసానికి అనుకూల వాతావరణం కల్పించారు. కళ, సాహిత్యం, టెక్నాలజీ కలిగి ఉన్న సమగ్ర విద్యను అందించడంలో పాఠశాల అంకిత భావంతో కృషి చేస్తుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఆకృతి దివాళి లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని హోటల్ తాజ్ క్రిష్ణా వేదికగా ఆకృతి దివాళి స్పెషల్ లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ మంగళవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వాహక డైరెక్టర్ శశినాథ ఆవిష్కరించారు. ప్రదర్శనలో 76 స్టాల్స్ తమ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నాయి.



ఎరుకల సంఘ్ నూతన కమిటీ

హిమాయత్‌నగర్: రాష్ట్రంలోని ఎరుకల సమాజం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సంఘ్ నిరంతరం పోరాటాలు చేస్తామని తెలంగాణ ప్రదేశ్ ఎరుకల సంఘ్(టీపీవైఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కెంబసారం కృష్ణ తెలిపారు. ఈమేరకు నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కురాకుల విజయ్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా కుర్ర యజ్ఞేశ్, సలహాదారుగా అంగిడి బాలరాజు, కార్యదర్శిగా కుతాడి భిక్షపతి తదితరులు ఎన్నికయ్యారు.

పిల్లల్లో 35 శాతం మందికి బీపీ

అపోలో ఆయుర్వేద ఆస్పత్రి వ్యవస్థాపక, మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ వాసుదేవన్



అపోలో ఆయుర్వేద ఆస్పత్రి లోగో ఆవిష్కరిస్తున్న వ్యవస్థాపకులు

పంజగుట్ట: ప్రస్తుతం పిల్లకు మానసిక ఒత్తిడి, ఆహారంలో మార్పులు, గేమ్స్ ఆడకుండా ఫోన్, టీవీలకే పరిమితం కావడంవల్ల 10 నుంచి 12 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లల్లో 35 శాతం మందికి బీపీ వస్తోందని అపోలో ఆయుర్వేద ఆస్పత్రి వ్యవస్థాపక, మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ వాసుదేవన్ అన్నారు. హెచ్‌సీఏహెచ్ సువిటాస్‌తో భాగస్వామ్యం చేసుకుని ఆయుర్ వేద్ హెచ్‌సీఏహెచ్ సెంటర్ ఫర్ ప్రెసిషన్ ఆయుర్వేద అండ్ ఇంటిగ్రేటివ్ మెడిసిన్‌ను సోమాజిగూడలో ప్రారంభించినట్లు ఆయన ప్రకటించారు. సోమాజిగూడ పార్క్ హోటల్‌లో హెచ్‌సీఏహెచ్ సువిటాస్ సహ వ్యవస్థాపకుడు డాక్టర్ గౌరవ్ తుక్రాల్‌తో కలిసి మంగళవారం ఆస్పత్రి విశేషాలు వెల్లడించారు. ఆస్పత్రిలో ఇంటిగ్రేటివ్ న్యూరో రిహాబిలిటేటివ్ కేర్ ఏర్పాటు చేసి ఇందుకోసం 20 పడకలను సిద్ధం చేశామన్నారు. సమావేశంలో డాక్టర్ విజయ్, డాక్టర్ రాకేష్ నాయర్ పాల్గొన్నారు.

టీజీవో నగర శాఖ కార్యవర్గ సమావేశం



టీజీవో సమావేశంలో మాట్లాడుతున్న నాయకుడు

పంజగుట్ట: తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం హైదరాబాద్ జిల్లా శాఖ కార్యవర్గ సమావేశం మంగళవారం చింతల్‌బస్తీలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ సెమినార్ హాల్‌లో నిర్వహించారు. హైదరాబాద్ జిల్లా శాఖ సంఘం అధ్యక్షుడు ఎం.బి.కృష్ణ యాదవ్, కార్యదర్శి మహ్మద్ అబ్దుల్ ఖాదర్‌ల అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో టీజీవో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు జి.దీపరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2025 సర్వ సభ్యత్వ నమోదు డిసెంబర్‌లోగా పూర్తి చేయాలని, హైదరాబాద్ జిల్లా కార్యవర్గాన్ని 2026 వాల్ క్యాలెండర్, డైరీల సన్నాహక పని మొదలు పెట్టాలని సూచించారు. టీజీవో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు శ్యామ్, నాయకులు జి.ఆశన్న, ఎం.వి.రమణ, ఎస్.సురేందర్, బి.శ్రవణ్ కుమార్, రాజేందర్, ఎంజులా రెడ్డి, శ్రీనివాసులు, పి.రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీసీ జేఏసీ రాష్ట్ర బంద్‌కు సంపూర్ణ మద్దతు



పంజగుట్ట: 18వ తేదీన బీసీ జేఏసీ నిర్వహించే రాష్ట్ర బంద్‌కు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ముదిరాజ్ సంఘాల ఐక్య వేదిక కన్వీనర్ డాక్టర్ గుండ్లపల్లి శ్రీను ముదిరాజ్ ప్రకటించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో 9 తీసుకురావడాన్ని వేదిక స్వాగతిస్తోందని అన్నారు. బీసీ జేఏసీ చైర్మన్‌గా ఆర్.కృష్ణయ్యను నియమించడాన్ని స్వాగతిస్తున్నామని, కానీ జేఏసీలో అతిపెద్ద కులమైన ముదిరాజ్‌లను విస్మరించడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో వేదిక ప్రతినిధులు అల్లుడు జగన్ ముదిరాజ్, పండుగ బాలు, బోళ్ల వెంకట్, బోళ్ల శ్రీనివాస్, అంబర్‌పేట సతీష్, కనకయ్య, సాంబరాజ్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బీసీల రాష్ట్ర బంద్‌కు పలు సంఘాల మద్దతు

హిమాయత్‌నగర్: బీసీ జేఏసీ ఈ నెల 18న పిలుపునిచ్చిన 'రాష్ట్ర బంద్'కు యాదవ సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ఈ బంద్‌లో కులాలు, సంఘాలు, రాజకీయ పార్టీలకతీతంగా బీసీలందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశాయి. రాష్ట్ర బంద్‌కు అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర సమితి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి డాక్టర్ సయ్యద్ వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర తెలిపారు.

ఆరు డిగ్రీల అభ్యర్థి


పబ్బతి శ్రీకృష్ణ

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో ఓ విద్యావంతుడు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతున్నాడు. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్ద కొత్తపల్లి మండలం యాపట్ల గ్రామానికి చెందిన డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ కైత్లాపూర్‌లో ఉంటున్నారు. 2019లో జరిగిన హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటిసారి పోటీ చేశారు. తాజాగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా మంగళవారం నామినేషన్ వేశారు. శ్రీకృష్ణ ఓల్డ్‌సిటీలోని సిటీ కాలేజీలో బీఎస్సీలో డిగ్రీ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో బీఈడీ చదివారు. జేఎన్టీయూలో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ చేశారు. ఉస్మానియాలో ఎంఈడీ పూర్తి చేశారు. దూర విద్యలో ఎంఏ ఇంగ్లిష్ చదివారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే గుండెపోటు అనే అంశంపై టీసెస్ సమర్పించి ఈ ఏడాది ఫిబ్రవరిలో పీహెచ్‌డీ పట్టా కూడా పుచ్చుకున్నారు. ఆరు డిగ్రీలు పూర్తి చేసిన ఆయన ఇప్పుడు ఎల్‌ఎల్‌బీలో కూడా చేరుతున్నారు. పోటీ చేయడానికి కారణం పేదోడికి సమన్యాయం అందనందుకే అంటున్నారు. సంపన్నులు నివసిస్తున్న ప్రాంతాల్లోనే సమస్యలు పరిష్కారమవుతున్నాయని, సామాన్యుడికి అటు అధికారులు, ఇటు ఎమ్మెల్యేలు అన్యాయం చేస్తున్నారని, నాణ్యమైన ఉచిత విద్య, ఉచిత వైద్యం, ప్రాథమిక సౌకర్యాలు పేదవారి చెంతకు చేర్చడమే లక్ష్యమని వెల్లడించారు. ఆయన అఫిడవిట్‌లో తన ఆస్తి జ్యోతిరావు పూలే రాసిన గులాంగిరీ అనే పుస్తకం మాత్రమేనని స్పష్టపరిచారు. మొత్తానికి ఇన్ని డిగ్రీలు పుచ్చుకున్న శ్రీకృష్ణ పోటీ పడుతున్న వారిలో అత్యంత విద్యావంతుడిగా రికార్డుల్లోకెక్కే అవకాశాలు ఉన్నాయి.

చాయ్.. సమోసా.. నాలుగు ముచ్చట్లు


ఛాయ్ తాగుతున్న మీనాక్షి నటరాజన్, మంత్రి పొన్నం తదితరులు

శ్రీనగర్‌కాలనీ: ఏఐసీసీ సెక్రటరీ, తెలంగాణ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రి పొన్నం ప్రభాకర్, డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి మోతీనగర్ రాయుడు బిర్యానీ హోటల్ వద్ద స్థానిక నేతలు, ప్రజలతో కలిసి ఛాయ్ తాగుతూ, సమోసా తిన్నారు. అక్కడి సమస్యలను తెలుసుకుంటూ, మీటింగ్స్‌లో జరిగిన విషయాల గురించి మాట్లాడారు. కాంగ్రెస్ చేసిన అభివృద్ధిని తెలుపుతూ, స్థానికంగా ఉండే అక్కడి విశేషాలను తెలుసుకున్నారు. ఎన్‌ఎస్‌యూఐ అధ్యక్షుడు వెంకటస్వామి, నేతలు రవిగౌడ్, రమేష్‌నాయక్ పాల్గొన్నారు.

నూతన కమిటీ

హిమాయత్‌నగర్: జీఎస్టీ, ఇన్‌కమ్ ట్యాక్స్ చెల్లింపులపై సభ్యులకు జిల్లా స్థాయిలో అవగాహన సదస్సులు నిర్వహించి దేశ అభివృద్ధికి పాటుపడతామని తెలంగాణ టాక్స్ ప్రాక్టిషనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లపోలు హరినాథ్‌రెడ్డి తెలిపారు. ఇటీవల నిర్వహించిన తెలంగాణ టాక్స్ ప్రాక్టిషనర్స్ అసోసియేషన్ ఎన్నికల్లో తమ ప్యానల్ అత్యధిక మెజారిటీతో గెలిచినట్లు తెలిపారు. నూతన కమిటీని టాక్స్ ప్రాక్టిషనర్స్ హిమాయత్‌నగర్‌లో మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యవర్గంలో ఉపాధ్యక్షులుగా కె.హుస్సేన్ వలి, ఎం.రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బైర రమేష్, కోశాధికారిగా సాదు రామారావు, ఉప కార్యదర్శులుగా బాగుల శ్రీనివాస్, జి.రమేష్ తదితరులు ఎన్నికైనట్లు తెలిపారు.

ఫార్మసిస్టులకు ఎన్నో అవకాశాలు


వర్క్‌షాప్‌లో విద్యార్థులు, అతిథులు

బంజారాహిల్స్: సుల్తాన్-ఉల్-ఉలూమ్ కాలేజీ ఆఫ్ ఫార్మసీ ఆధ్వర్యంలో క్లైమెడ్ రీసెర్చ్ సొల్యూషన్స్, క్యూరియో ట్రెనింగ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సంయుక్త సహకారంతో ఫార్మాసిస్టుల కోసం 'న్యూ కెరీర్ హారిజన్స్ ఫర్ ఫార్మాసిస్ట్స్: ఎక్స్‌ప్లోరింగ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ సూపర్ స్పెషలైజేషన్ ఇన్ హెల్త్‌కేర్' అంశంపై మంగళవారం ఒక్కరోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ అనుపమ కోనేరు స్వాగతోపన్యాసం చేశారు. ఫార్మసీ రంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాముఖ్యత పెరుగుతోందని, ఫార్మాసిస్టులు ఇకపై కేవలం ఔషధ పంపిణీకి పరిమితం కాకుండా క్లినికల్, రీసెర్చ్ వ్యవస్థల్లో కీలక నిర్ణయాధికారులుగా ఎదుగుతున్నారని చెప్పారు. విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకుని, బహుళ శాస్త్ర జ్ఞాన నైపుణ్యాలను సంపాదించుకోవాలని సూచించారు. క్లైమెడ్ క్యూరియో వ్యవస్థాపకుడు, సీఈఓ డాక్టర్ అజిత్‌సింగ్ హాజరై ఫార్మ్.డి, బి.ఫార్మ్ పూర్తి చేసిన విద్యార్థులకు వివిధ కెరీర్ మార్గాలపై అవగాహన కల్పించారు. వెల్‌నెస్ హాస్పిటల్స్ క్లినికల్ రీసెర్చ్ అండ్ క్లినికల్ ఫార్మసీ హెడ్ డాక్టర్ అఖిలారెడ్డి జిల్లెల్ల హాజరై ఎంపీసీ బ్యాక్‌గ్రౌండ్ నుంచి క్లినికల్ రీసెర్చ్ నాయకత్వ స్థాయికి ఎదిగిన తన అనుభవాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రవల్లిక వుటుకూరు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తనిఖీల్లో రూ.4.46 లక్షలు స్వాధీనం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో ఫిలింనగర్ పోలీసులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కట్టుదిట్టంగా అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా షేక్‌పేట మెయిన్ రోడ్డులోని నారాయణమ్మ కళాశాల వద్ద చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. కొండాపూర్‌కు చెందిన వ్యాపారి శివజ్యోతి మంగళవారం కారులో నుంచి రూ.2.46 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. నారాయణగూడకు చెందిన శ్రీనివాసరావు అనే వ్యాపారి ఓయూ కాలనీ వైపు వెళ్తుండగా పోలీసులు తనిఖీలు చేయగా ఆయన కారులో నుంచి రూ.2 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం ఒక వ్యక్తి వద్ద రూ.50 వేలకు మించి నగదు ఉండరాదని, అంతకుమించి ఉంటే స్వాధీనం చేసుకుని రిటర్నింగ్ అధికారికి అప్పగిస్తామని ఫిలింనగర్ ఇన్‌స్పెక్టర్ సంతోషం తెలిపారు.

వైన్ షాపుల కలెక్షన్ స్వాధీనం చేసుకుంటే ఎలా..?

ఫిలింనగర్: రాత్రి వైన్‌షాపులు మూసివేసి ఆ రోజు కలెక్షన్ తీసుకుని ఇంటికి వెళ్తుంటే ఎన్నికల ప్రవర్తనా నియమావళి పేరుతో పోలీసులు తనిఖీలు చేస్తూ డబ్బులు సీజ్ చేయడం ఎంతవరకు సమంజసమని, తాము వైన్‌షాపులు, బార్లు నడుపుకోవాలా.. మూసేయాలా అని తెలంగాణ రాష్ట్ర వైన్స్ అండ్ బార్ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్యాంగౌడ్, ఉపాధ్యక్షుడు భాస్కర్ ప్రశ్నించారు. రెండు రోజుల క్రితం ఫిలింనగర్‌లోని వైన్‌షాపులో ఆ రోజు కలెక్షన్ తీసుకుని వెళ్తుండగా భాస్కర్ అనే క్యాషియర్ వద్ద నుంచి రూ.లక్ష నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. తాము ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశామన్నారు. రాత్రిపూట బార్లు, వైన్‌షాపులు మూసేసి ఆ రోజు కలెక్షన్ తీసుకెళ్తుంటే సీజ్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

సాక్షి సిటీ ప్లస్
12
హైదరాబాద్, బుధవారం,
15, అక్టోబర్, 2025

ముగిసిన మెగాథాన్ 2025



దక్కన్ ఎడిషన్‌లో విద్యార్థుల సందడి

ఆవిష్కర్తలను ఆకర్షించిన హైదరాబాద్ విద్యార్థి

రాయదుర్గం : ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లోని ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ సెల్ (ఈ–సెల్) పర్యవేక్షణలో నిర్వహించిన మెగాథాన్–2025 ముగిసింది. ట్రిపుల్ ఐటీలోని ఈ–సెల్ పదో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ మెగా హ్యాకథాన్ నిర్వహించారు. దేశవ్యాప్తంగా 62 ఉన్నత విద్యాసంస్థల నుంచి 1,100 కంటే ఎక్కువ మంది విద్యార్థులు ఈ ఇన్నోవేషన్ మారథాన్‌లో భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో విజేతలకు రూ.7 లక్షల బహుమతిని అందించారు. ఈ మెగాథాన్‌లో ప్రారంభ ఫిల్టరింగ్ రౌండ్ తర్వాత డొమైన్ నిపుణుల ప్యానెల్ ముందు హైవెలాసిటీ లైట్నింగ్ సెషన్‌లలో వారి పరిష్కారాలను పిచ్ చేయడానికి టాప్–20 జట్లను ఆహ్వానించారు. హ్యాకథాన్‌లో విజేతలకు నగదు పురస్కారం పొందారు. మెగాథాన్ విద్యార్థులకు కోడ్ చేసే అవకాశాన్ని కల్పిస్తుందని ఈ–సెల్ సమన్వయకర్తలలో ఒకరైన షేక్ కేఎన్ అక్తర్ అన్నారు. కార్యక్రమంలో పలువురు విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.




బ్యాటింగ్ మెళకువలు నేర్పే స్టిక్కర్..

సాక్షి, సిటీబ్యూరో: క్రికెట్ క్రీడాకారుల కోసం ఓ సరికొత్త కేతిక ఉత్పత్తి అందుబాటులోకి వచ్చింది. మాదాపూర్‌లోని ది టర్ఫ్ ఎడ్జ్ బై రెట్రో స్పోర్ట్స్ ఆవరణలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ప్రముఖ స్పోర్ట్స్ టెక్ కంపెనీ స్ట్రెయిట్ బ్యాట్ స్మార్ట్ స్టిక్కర్ రూపంలోని ఏఐ ఆధారిత 'స్ట్రెయిట్ బ్యాట్ ప్రో' ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ సహ వ్యవస్థాపకుడు మధుసూదన్ తమ ఉత్పత్తి విశేషాలు వివరించారు. బ్యాట్ ఆకారం లేదా బరువు మార్చకుండా, బ్యాట్ స్పీడ్, స్వింగ్ యాంగిల్, షాట్ ఇంపాక్ట్ వంటి డేటాను చూపిస్తూ విశ్లేషించే ప్రపంచంలో తొలి నెక్స్ట్–జెన్ స్మార్ట్ టెక్నాలజీగా తమ ఉత్పత్తిని పేర్కొన్నారు. తేలికైన బ్యాట్ స్టికర్ రూపంలోని ఉత్పత్తి తమ సొంత జెన్ ఏఐ టెక్నాలజీతో పనిచేస్తూ బ్యాట్ వేగం, స్వింగ్ కోణాలు, బంతి ప్రభావం వంటి వివరాలను సులభంగా అర్థమయ్యేలా అందిస్తుందన్నారు. ప్రతి ఆటగాడికీ ప్రపంచ స్థాయి విశ్లేషణను అందించడమే తమ లక్ష్యం అన్నారు.



చరిత్రకు కేరాఫ్..



నగరంలో చారిత్రక పర్యాటకం అనగానే చాలా మందికి చార్మినార్, చౌమహల్లా ప్యాలెస్, గోల్కొండ కోట.. ఇవే గుర్తుకొస్తాయి. కానీ అందరికీ తెలిసిన ఈ చారిత్రక విశేషాలు మాత్రమే కాకుండా.. కాలగమనంలో మరుగునపడిపోయిన అనేక కట్టడాలు నిశ్శబ్దంగా దర్శనమిస్తున్నాయి. కొత్త మెరుపుల మధ్య వాటి వెలుగులు మసకబారుతున్నాయి. అద్భుతమైన కట్టడాలు.. ఆకట్టుకునే విశేషాలను తడిమి చూస్తే ఎన్నో మధురానుభూతులను కల్పించే అనేక పర్యాటక విశేషాలు ప్రాచుర్యానికి నోచుకోవడంలేదు.. ఇవి తప్పక చూసి తీరాల్సిన పర్యాటక ప్రాంతాల జాబితాలో కనబడకపోవచ్చు. కానీ వాటిని సందర్శిస్తే మనకు తెలియని నగర చారిత్రక వైభవాన్ని మన కళ్ల ముందు ఉంచుతాయి.

- సాక్షి, సిటీబ్యూరో

మనసుకు టేకాఫ్..

అద్భుతమైన కట్టడాలు.. ఆకట్టుకునే విశేషాలు

- నాలుగు శతాబ్దాల నగరంలో ఎన్నో ఘనతలు
- చరిత్రతో పాటు నగర విశిష్టతను తెలిపే ప్రదేశాలు
- ప్రాచుర్యానికి నోచుకోని కొన్ని పర్యాటక విశేషాలు
- కొత్త మెరుపుల మధ్య మసకబారుతున్న పాత వెలుగులు

పర్యాటకులు, సందర్శకుల గుర్తింపుకు నోచుకోకుండా.. గోల్కొండ కోట వెనుక భాగంలో, ఆక్రమణల మధ్య మరుగున పడిన నయా కిలాకు 500 ఏళ్ల చరిత్ర ఉంది. దీనిని 1656లో షాజహాన్ పరిపాలన సమయంలో జరిగిన మొఘల్ దాడికి ప్రతిస్పందనగా నిర్మించారు. ఒకప్పుడు గోల్కొండ రక్షణ వ్యవస్థలో భాగంగా ఉండేది.. ఇప్పుడు ప్రధాన కోట కాంప్లెక్స్ నుంచి వేరుగా ఉంది. ఇందులోనే మజ్నూ, లైలా బురుజులు, హైదరాబాద్ స్థాపనకు ముందు 1561లో నిర్మితమైన ముస్తఫా ఖాన్ మసీదు, డెక్కన్ కవి పేరిట నెలకొన్న ముల్లా ఖయాలి మసీదు, ఆఫ్రికన్ సన్యాసులు నాటినదిగా చెప్పే 400 ఏళ్ల నాటి పాత బోబాబ్ చెట్టు వంటి విశేషాలెన్నో ఉన్నాయి.

బహుత్ పురానా.. ఈ ఠాణా..

పర్యాటక అర్హతలున్న పోలీస్ స్టేషన్ సైతం ఉన్న నగరం మనదే అని చెప్పొచ్చు. ఎప్పుడో 1867లో నిర్మించిన జేమ్స్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్, నగరంలోని పురాతన బ్రిటిష్ కాలపు కట్టడాలలో ఒకటి. సికింద్రాబాద్ క్లాక్ టవర్ పక్కనే ఉన్న ఇది.. బ్రిటిష్ శాసన కాలంలో కంటోన్మెంట్ ప్రాంతంలో కీలక పరిపాలనా కేంద్రంగా ఉపయోగించబడింది. ఆర్చ్‌లా మార్చిన వరండాలు, స్టోన్‌వాల్స్, కలోనియల్ శైలిని ప్రతిబింబించే నిర్మాణ పద్ధతులతో పాటు.. ప్రత్యేకమైన బ్రిటిష్ శైలి ఆర్కిటెక్చర్ గురించి తెలుసుకోవాలంటే దీన్ని సందర్శించాలని ఆర్కిటెక్ట్స్ అంటున్నారు.



అందమైన కథ.. బ్రిటిష్ రెసిడెన్సీ..

వైట్ మొఘల్ అనే పుస్తకంలో రాసిన ఓ అందమైన ప్రేమ కథకు మౌన సాక్షి గా ఈ భవనాన్ని పేర్కొంటారు. ఈస్ట్ ఇండియా కంపెనీ కార్యాలయం కోసం సుమారు 1805లో ఆర్కిటెక్ట్ సామువెల్ రస్సెల్ ఆధ్వర్యంలో నిజాంల దగ్గర బ్రిటిస్ రెసిడెంట్ అయిన జేమ్స్ అకిలిస్ కిర్క్‌పాట్రిక్ (వైట్ మఘల్ గా ప్రసిద్ధుడు) కోసం నిర్మితమైంది. దీనిని పల్లాడియన్ శైలిలో డిజైన్ చేశారు. ఈ విశాలమైన విల్లాలో ఆరు కొరింథియన్ స్తంభాలు, ద్వితీయ అంతస్తుకు తీసుకెళ్లే ద్విపాద మెట్లదారి, పెయింటింగ్స్‌తో నిండిన పైకప్పులు.. పార్కే ఫ్లోర్స్ బ్రిటిష్ సింహాల విగ్రహాలు ఆకట్టుకుంటాయి. అమెరికాలోని వైట్ హౌస్‌ని తలపించే ఈ భవనంలో చరిత్రను తెలియజేసే చిన్న మ్యూజియం కూడా ఉంది. ఈ భవనం 1949 తర్వాత కోఠి మహిళా కళాశాలలో భాగమైంది. కాలక్రమంలో ఇది శిథిలావస్థకు చేరగా దీన్ని 2022లో పునరుద్ధరించారు.

స్మృతుల నిధి.. రేమండ్ సమాధి..

ఇది చాదర్‌ఘాట్ నుంచి 3 కిలోమీటర్ల దూరంలోని హిల్స్‌పైన అస్మాన్ ఘడ్ ప్యాలెస్‌లో ఉంది. (మిచెల్ జోచిమ్ మేరీ రేమండ్) అనే ఫ్రెంచ్ జనరల్ సమాధి. ఆయన నిజాం అలీ ఖాన్ (అసఫ్ జాహ్–2) దగ్గర సేనాధిపతిగా సేవలందించారు. ఆయన్ని హిందువులు 'మూసా రామ్, ముస్లింలు', 'మూసా రహీం'గా పిలిచేవారని చెబుతారు. నిజాంలు కూడా 1940ల వరకూ ఇతని వర్ధంతి సందర్భంగా నివాళులర్పించేవారట. దీనిని 2003లో పునరుద్ధరించినా, భారత–ఫ్రెంచ్ స్నేహానికి ప్రతీకగా నిలిచే ఈ స్థలం ఇప్పటికీ పర్యాటక ఆకర్షణగా మారలేదు.





టోలి..షాన్

శతాబ్దాలకు పూర్వం 1671–72 ప్రాంతంలో మిర్ మూసా ఖాన్ మహల్దార్ నిర్మించిన టోలి మసీదు.. సుల్తాన్ అబ్దుల్లా కుతుబ్‌షా కాలానికి చెందినది. ఇది ఫ్లోరల్ స్టుకో పనితనంతో మెరిసే కళాఖండం. కర్వాన్ ప్రాంతంలో ఉన్న ఈ మసీదు పలు అద్భుత శిల్ప సౌందర్య లక్షణాలతో ఆకట్టుకుంటుంది. జాలీ స్క్రీన్స్, ఏనుగు ఆకారపు బ్రాకెట్లు ఉన్న కట్టడాలు, రెండు 60 అడుగుల మినార్‌లు, దేవాలయ ఆకార శిఖరాలు కుతుబ్ షాహీ శిల్ప కళలోని అత్యున్నత స్థాయిని సూచిస్తాయి. అయినప్పటికీ, పెద్దగా ఎవరూ పట్టించుకోకపోవడంతో క్రమంగా ప్రాభవాన్ని కోల్పోతోంది.

సాల్వ్ ఫర్ టుమారో.. ఫైనలిస్ట్ జాబితా..

టాప్ 20 జట్లకు స్థానం

సాక్షి, సిటీబ్యూరో: విభిన్న రకాల సామాజిక సమస్యలకు సాంకేతికత ఆధారంగా వైవిధ్యభరిత పరిష్కారాలను అందించే విద్యార్థులను ప్రోత్సహించేందుకు అగ్రగామి గృహోపకరణాల బ్రాండ్ శామ్‌సంగ్ నిర్వహిస్తున్న ఇన్నోవేషన్ పోటీ 'సాల్వ్ ఫర్ టుమారో' తుది దశకు చేరుకుంది. ఈ పోటీ తుది జాబితాలో 20 జట్లు స్థానం సంపాదించాయని సంస్థ నగర ప్రతినిధులు తెలిపారు. నగరంతో పాటు దేశవ్యాప్తంగా పలు పాఠశాలల విద్యార్థులు ఈ జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నారని, అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చిన నగరాల్లో రాష్ట్రంలోని మహబూబ్ నగర్ ఒకటని వివరించారు.

అతిపెద్ద ఇంటీరియర్ డెకర్ స్టూడియో..

నగరంలో 'అమెగో క్లాసిక్ హోమ్ స్టూడియో' ప్రారంభం



సాక్షి, సిటీబ్యూరో: అంతర్జాతీయ స్థాయి ఇంటీరియర్ డెకరేషన్ హంగులకు హైదరాబాద్ నగరం వేదికగా నిలుస్తోంది. ఇందులో భాగంగా ఇంటిగ్రేటెడ్ డెకర్ లైఫ్‌స్టైల్ బ్రాండ్ ఏషియన్ పెయింట్స్ ఆధ్వర్యంలో సన్ సిటీ సమీపంలోని హైదర్‌షాకోట్‌లో అతిపెద్ద 'అమెగో క్లాసిక్ హోమ్ స్టూడియో'ను ప్రారంభించింది. ఒకే చోట పూర్తి స్థాయి హోమ్ డెకర్ సొల్యూషన్స్ అందించే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేశామని సంస్థ సీఈఓ అమిత్ సింగిల్ తెలిపారు. ఈ స్టోర్‌ను 1994 నుంచి తమతో అనుబంధంగా ఉన్న అయాజ్ అలీ ఖాన్ (సోహైల్) నిర్వహిస్తున్నారని, ఈ స్టోర్ 1997లో కలర్‌వరల్డ్ మెషీన్ ఇన్‌స్టాలేషన్ నుంచి 2011లో కలర్ ఐడియాస్ స్టోర్ ఫార్మాట్ వరకూ అనేక ఆవిష్కరణలకు మార్గదర్శకత్వం వహించిందని తెలిపారు. సంప్రదాయం, ఆధునికత కలిసిన అద్భుత నగరం హైదరాబాద్ అని, అమెగో క్లాసిక్ హోమ్ స్టూడియో ఈ వేదిక అనువైనదని సంతోషం వ్యక్తం చేశారు.

దీపావళి పండుగకు నగరం ముస్తాబవుతోంది.. ముఖ్యంగా ఈ పండుగలో స్వీట్స్‌దే అగ్రభాగం.. ఈ సందర్భంగా ఇచ్చిపుచ్చుకునే గిఫ్ట్స్ ప్యాకింగ్ కూడా ప్రత్యేకతను సంతరించుకుంటుంది. ప్రతి ఒక్కరూ ఆత్మీయంగా పలుకరించుకుని స్వీట్స్, లేదా డ్రైఫ్రూట్స్ వంటి గిఫ్ట్ బాక్సులు ఇచ్చిపుచ్చుకుంటారు. ఈ నేపథ్యంలో ఈ సారి దీపావళికి అందమైన ర్యాపింగ్‌తో ఆకట్టుకునే గిఫ్ట్ ప్యాక్స్ హడావుడి మొదలైంది.. మార్కెట్‌లో వివిధ రకాల స్వీట్స్, డ్రైఫ్రూట్స్ వంటి వాటితో ఈ గిఫ్ట్ ప్యాకింగ్స్ అందుబాటులో ఉన్నాయని పలువురు మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

- సాక్షి, సిటీబ్యూరో





కుచ్ మీఠా హో జాయే..



- దీపావళికి అలరించనున్న గిఫ్ట్ ప్యాక్స్
- అదరగొట్టే డిజైన్లు.. ఆకట్టుకునే ప్యాకింగ్
- వివిధ రకాల డ్రైఫ్రూట్స్‌తో మార్కెట్లో లభ్యం
- నగరంలో జోరుగా గిఫ్ట్ బాక్సుల అమ్మకాలు

రంగు రంగుల ర్యాపింగ్, రకరకాల మోడళ్లలో గిఫ్ట్ ప్యాకింగ్ అందుబాటులో ఉన్నాయి. ఇప్పటికే పలువురు ఔత్సాహికులతో నగరంలోని బేగంబజార్ సందడిగా కనిపిస్తోంది. సంప్రదాయ వెరైటీ డిజైన్లలో తయారు చేసిన డ్రైఫ్రూట్స్, స్వీట్ బాక్సులు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ఇవి వివిధ రకాల ఆకారాల్లో, వివిధ రకాల సైజుల్లో అందుబాటులో ఉన్నాయి.

ఇమిడిపోయిన సంప్రదాయం..

దీపావళికి గిఫ్ట్ బాక్సులు ఇచ్చే సంస్కృతిని మార్వాడీలు, గుజరాతీలు ఎక్కువగా పాటిస్తారు. ఇదే పద్ధతి ప్రస్తుతం నగరంలోని ప్రజల్లోనూ క్రమంగా ఇమిడిపోయింది. దీంతో పండుగ పూట ఇంటికి వచ్చే అతిథులకు, లేదా ఇరుగు పొరుగు వారికి, మరీ ముఖ్యంగా సన్నిహితులకు ఈ గిఫ్ట్ బాక్సులు అందజేస్తుంటారు.





కొనుగోళ్లు షురూ..

ఇప్పటికే బేగంబజార్‌లో కొనుగోళ్లు షురూ అయ్యాయి. డ్రై ఫ్రూట్ మార్కెట్ కిటకిటలాడుతోంది. స్వీట్‌షాపుల నిర్వాహకులు, సాధారణ ప్రజలు కొనుగోళ్లకు వస్తున్నారు. ఆకర్షణీయమైన ప్యాకింగ్స్ అందుబాటులో ఉన్నాయి. నగరంలో ఉద్యోగులు, వ్యాపారుల్లో ఈ గిఫ్ట్స్ ఇచ్చే సంస్కృతి పెరిగిపోయింది. దీంతో గిఫ్ట్ బాక్సుల అమ్మకాలకు డిమాండ్ ఏర్పడింది.

– రాజ్‌కుమార్ టండన్, కశ్మీర్ హౌస్ యజమాని

బాక్స్‌ల ధరలు ఇలా..

సాధారణంగా ఈ గిఫ్ట్ బాక్స్‌ల ధరలు రూ.250 నుంచి రూ.2 వేల వరకూ మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. ఆకర్షణీయమైన బాక్స్‌ల్లో బాదం, కాజు, కిస్‌మిస్, పిస్తా, ఆప్రికాట్‌తో పాటు అంజీర వంటి డ్రై ఫ్రూట్స్ పెడుతుంటారు. వీటితో పాటు కొందరు వివిధ రకాల స్వీట్లు కూడా ప్యాక్ చేస్తుంటారు. ఈ బాక్స్‌ల్లో డ్రైఫ్రూట్స్ 750 గ్రాములు, 500 గ్రాములు, 250 గ్రాములు ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు.

కళాత్మక ఆత్మీయత..

పెయింట్ విత్ పప్పీస్



- 'మార్స్' ఆధ్వర్యంలో గ్లోబల్ అడాప్షన్ వీక్–2025
- పప్పీలతో చిత్రలేఖనం చేస్తూ వినూత్న కార్యక్రమం
- 'పావాసన' జంతు సంక్షేమ సంస్థతో కలిసి వర్క్‌షాప్

సాక్షి, సిటీబ్యూరో: ప్రాణుల పట్ల బాధ్యతాయుతమైన సమాజ నిర్మాణంలో ప్రతి అడుగూ విలువైనదే. ప్రపంచవ్యాప్తంగా పెంపుడు జంతు సంరక్షణ, దత్తత, మానవతా విలువలను ముందుకు తీసుకెళ్లే క్రమంలో నగర వేదికగా నిర్వహించిన 'పెయింట్ విత్ పప్పీస్' అనే వినూత్న కార్యక్రమం ఆకట్టుకుంది. ప్రముఖ గ్లోబల్ కంపెనీ 'మార్స్' ఆధ్వర్యంలోని మార్స్ గ్లోబల్ అడాప్షన్ వీక్–2025లో భాగంగా ఈ వర్క్‌షాప్ నిర్వహించింది. ఆర్ట్, ఆనందం, ఆదరణ కలగలిపిన ఈ మార్స్ వెల్‌నెస్ డ్రైవ్ మూగజీవాల పట్ల కళాత్మక ఆత్మీయతను ప్రదర్శించింది.

పాజిటివ్ వైబ్స్‌తో ఆర్ట్ థెరపీ..

ఈ ప్రత్యేక కార్యక్రమం 'పావాసన' అనే జంతు సంక్షేమ సంస్థతో కలిసి మార్స్ కార్యాలయంలో నిర్వహించింది. 100 మందికి పైగా అసోసియేట్లు ఇందులో పాల్గొని, చిన్న చిన్న పప్పీలతో కలిసి చిత్రలేఖనం చేస్తూ మానసిక విశ్రాంతి, ఆనందం, కరుణను ఒకే వేదికపై ప్రదర్శించారు. ఈ అడాప్షన్ వీకెండ్ హైదరాబాద్‌తో పాటుగా దేశవ్యాప్తంగా 11 నగరాల్లో జరిగింది. 14 ఎన్జీఓలు, వందలాది వాలంటీర్లు, వేల మంది సందర్శకులు దీనిలో భాగమయ్యారు. హైదరాబాద్‌లో బ్లూ క్రాస్, ఎన్ఎస్ఏఏఎస్ మేడ్చల్ సహకారంతో అడాప్షన్, వ్యాక్సినేషన్ డ్రైవ్ నిర్వహించారు. నిరాశ్రయ జంతువులు 'ఫరెవర్ హోమ్స్' సహకారాన్ని పొందాయి. అంతేకాకుండా మార్స్ సంస్థ తన 'టూ లీవ్స్ చేంజ్‌డ్' అనే అంతర్జాతీయ సంస్థ చొరవతో భారత్‌తో పాటు అమెరికా, యుకే, థాయ్‌లాండ్, మెక్సికో వంటి 25 దేశాల్లో ఈ మానవతా కార్యక్రమాన్ని విస్తరించింది.

ఒక పెంపుడు జంతువును దత్తత తీసుకోవడం అంటే ఆ ప్రాణికి మాత్రమే కాకుండా మన జీవితంలో మార్పుకు ఆహ్వానం పలకడమేనని మార్స్ మేనేజింగ్ డైరెక్టర్ సలీల్ మూర్తి తెలిపారు. కేవలం అవగాహన కల్పించడమే కాకుండా మూగజీవాల పట్ల దయ, సంరక్షణకు మార్గం చూపే ప్రయత్నమని పేర్కొన్నారు. కామ్ సంస్థ భాగస్వామ్యంతో చేసిన అధ్యయనంలో జంతువుల వల్ల యజమానుల్లో 88 శాతం మంది ఆందోళన, ఒత్తిడి తగ్గుతుందని వెల్లడైందని, 76 శాతం మంది మానసిక సాంత్వనను పొందుతున్నట్లు తేలిందన్నారు. ఇది సృజనాత్మకత, సేవల కలయిక అని పావాసన సహ వ్యవస్థాపకురాలు అన్నన్య అభివర్ణించారు.





మంచుకురిసే వేళలో..

మంచిర్యాల అగ్రికల్చర్/తాండూర్: వానాకాలం ముగిసి శీతాకాలం మొదలైంది. ఉదయం వేళ మంచు కమ్ముకుంటోంది. మధ్యాహ్నం ఎండ, రాత్రి మంచు, చలిగాలులు వీస్తున్నాయి. దట్టమైన పొగమంచు దుప్పటి పరిచినట్లుగా చూపరులను ఆకట్టుకుంటోంది. రోడ్లపై మంచు తీవ్రతతో వాహనదారులు లైట్లు వేసుకుని ప్రయాణం చేయాల్సి వస్తోంది.

లొంగిపోయిన మల్లోజుల

▶ మొదటి పేజీ తరువాయి

పోరాట పంథాను వీడుతున్నట్లు ఇటీవలే లేఖ విడుదల చేశారు. మావోయిస్టు పార్టీ చరిత్రలో మల్లోజుల కుటుంబానికి ప్రత్యేక స్థానం ఉంది. ఆయన సోదరుడు మల్లోజుల కోటేశ్వర్‌రావు అలియాస్ కిషన్ జీ కూడా పార్టీలో అగ్రనేత. ఆయన 2011లో పశ్చిమబెంగాల్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించారు. కిషన్‌జీ భార్య పోతుల కల్పన గతేడాది తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు.

లొంగుబాటుకు కారణాలివే..

వేణుగోపాల్‌కు ప్రస్తుతం 70 ఏళ్లు. ఆయనపై 100కుపైగా కేసులున్నాయి. అనారోగ్య, వ్యక్తిగత కారణాలతోపాటు మారుతున్న రాజకీయ పరిస్థితులు కూడా ఆయన లొంగుబాటుకు కారణమని చెబుతున్నారు. ప్రజల నుంచి రోజురోజుకూ ఆదరణ తగ్గుతుండటం, అడవులపై బలగాల పట్టు పెరిగిన కొద్దీ.. వాటిని వదిలి కొత్త ప్రాంతాలకు వెళ్లడంపై వేణుగోపాల్ విభేదిస్తూ వస్తున్నారు. సాయుధ పోరు వదిలి రాజకీయ వేదికగా ఉద్యమించాలని కొంతకాలంగా చెబుతున్నారు. ఈ విషయంపై ఆగస్టు 15న 'టెంపరరీ ఆర్మ్‌డ్ స్ట్రగుల్ అబాండెన్'పేరిట విడుదల చేసిన లేఖ సెప్టెంబర్ 17న వెలుగుచూడటం పార్టీలో కలకలం రేపింది. పార్టీలో తీవ్ర చర్చకు దారితీయడంతో ఆయుధాలు సరెండర్ చేయాలని పార్టీ ఆదేశించింది. వేణుగోపాల్ లొంగుబాటును మహారాష్ట్ర గడ్చిరోలి, ఉత్తర బస్తర్, దండకారణ్యంలోని మెజారిటీ మావోయిస్టు అనుచరగణం సమర్థిస్తోంది. కానీ, మావోయిస్టు అగ్రనేతలు పుల్లూరి ప్రసాద్, పార్టీ తెలంగాణ కమిటీ, సెంట్రల్ కమిటీ నేతలు ఆయన నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు.

తండ్రి బాటలో పోరాట మార్గం..

మల్లోజుల వేణుగోపాల్‌ది ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పెద్దపల్లి (ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా కేంద్రం). బ్రాహ్మణ కుటుంబంలో 1956లో ఆయన జన్మించారు. తండ్రి మల్లోజుల వెంకటయ్య స్వాతంత్ర్య సమరయోధుడు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కూడా పాల్గొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడిగా తామ్రపత్రం అందుకున్నారు. వెంకటయ్య 1997లో మరణించారు. తల్లి మధురమ్మ గతేడాది కాలం చేశారు. మరో సోదరుడు ఆంజనేయులు కేడీసీసీ బ్యాంకులో పనిచేసి రిటైరయ్యారు. తండ్రి బాటలోనే పేద ప్రజల హక్కుల కోసం మల్లోజుల కోటేశ్వర్‌రావు, వేణుగోపాల్ ఉద్యమించారు. జగిత్యాల జైత్రయాత్ర అనంతరం 1978లో అజ్ఞాతంలోకి వెళ్లారు. 1980లో పీపుల్స్‌వార్ ఆవిర్భావ సభ్యులుగా వ్యవహరించారు. 1986లో పెద్దపల్లిలో డీఎస్పీ బుచ్చిరెడ్డిని అప్పటి పీపుల్స్‌వార్ నక్సల్స్ కాల్చిచంపారు. ఆగ్రహించిన పోలీసులు వెంకటయ్య – మధురమ్మ ఇంటిని కూల్చివేశారు. దీంతో కొంతకాలం వారు గుడిసెలో తలదాచుకున్నారు. వేణుగోపాల్ దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీకి అధినేతగా పనిచేశారు. మహారాష్ట్ర, ఏపీ, గోవాతోపాటు పశ్చిమ కనుమల్లో పార్టీ కార్యకలాపాలు విస్తరించారు. 2010లో పార్టీ అధికార ప్రతినిధి చెరుకూరి రాజ్‌కుమార్ అలియాస్ ఆజాద్ మరణం తరువాత ఆయన స్థానాన్ని భర్తీ చేశారు. 2010లో గడ్చిరోలిలో 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్ల ఊచకోతలో ఇతనే మాస్టర్ మైండ్ అని పోలీసుల రికార్డులు చెబుతున్నా యి. 2011లో పశ్చిమబెంగాల్ పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ఆయన సోదరుడు మల్లోజుల కోటేశ్వర్‌రావు మరణించారు. ఆ తరువాత సెంట్రల్ ఇండియా అడవుల్లో పార్టీని బలోపేతం చేయడంలో వేణుగోపాల్ వ్యూహాలు రచించారు. ఆయన గడ్చిరోలి జిల్లాలో పనిచేసే సమయంలో తారక్కను వివాహమాడారు. 2018లో ఆమె మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట లొంగిపోయారు. 44 ఏళ్లపాటు అజ్ఞాతంలోనే ఉన్న ఆయన పార్టీ విధానాలతో విభేదించి జనజీవన స్రవంతిలో కలిశారు. వేణుగోపాల్ తెలుగు, హిందీ, ఇంగ్లిష్, కోయ భాషల్లో అనర్గళంగా మాట్లాడగలరని చెబుతారు. 'సాధన'అనే కలం పేరుతో గోండుల జీవితాలకు అక్షరరూపం ఇచ్చారు. సరిహద్దు, రాగో అనే నవలలు రాశారు.



మల్లోజుల వేణుగోపాల్‌రావు ఇల్లు

అడవి నుంచి అమ్మకు లేఖ

తన తల్లి మధురమ్మ అంత్యక్రియలకు రాలేకపోయిన వేణుగోపాల్.. మీడియాలో కథనాలు చూసి 'అమ్మా.. నన్ను మన్నించు'అని లేఖ రాశారు. 'నీకు, అమరుడైన నా సోదరునికి.. మన కుటుంబానికి ఏ కలంకం రాకుండా, జనానికి దూరం కాకుండా తుదివరకూ నమ్మిన ఆశయాల కోసం నిలబడతానని మరోసారి హామీ ఇస్తున్నా.. అమ్మా'అంటూ లేఖ విడుదల చేశారు. దానికి విరుద్ధంగా వేణుగోపాల్ లొంగిపోవడం చర్చనీయాంశంగా మారింది.

నానమ్మ ఉంటే సంతోషించేది



మా బాబాయ్ జనజీవన స్రవంతిలోకి రావడం సంతోషంగా ఉంది. కుటుంబం, దోస్తుల ప్రేమను దూరం చేసుకుని నమ్మిన సిద్ధాంతాలు, ఆశయాల కోసం ఇన్నేళ్లు నిస్వార్థంగా పనిచేశారు. మా నానమ్మ (మధురమ్మ) కొడుకును చివరిచూపు చూడాలని తపించింది. రెండేళ్ల క్రితం చనిపోయింది. ఇప్పుడు ఉంటే కొడుకుని చూసుకుని సంతోషపడేది.

– దిలీప్‌శర్మ, వేణుగోపాల్ అన్న కుమారుడు

వారిచేతుల్లోనే ఎదిగిన



నాకు ఐదేళ్ల వయసు ఉన్నప్పుడు వేణువాళ్ల ఇంట్లోనే తిరుగుతుండేవాడిని. కోటన్న, వేణన్న నన్ను ఎత్తుకుని ఆడించేవారు. విప్లవ బాట పట్టాక మధురమ్మ ద్వారా వారి గురించి తెలుసుకున్నా. వెంకటయ్య తాత, కిషన్ అన్న, మధురమ్మ చనిపోయినప్పుడు కూడా వాళ్లు రాలేదు. ఇప్పుడు లొంగిపోయారు. ఇక్కడకు వస్తే ఒక్కసారి చూడాలని ఉంది.

– ఠాకూర్ విజయ్‌సింగ్, పొరుగింటి వ్యక్తి

డైవర్షన్‌కే సోదాలు!

ఏ 1 జనార్ధన్‌రావుతో వీడియో కుట్రలు బూమ్‌రాంగ్

చౌకబారు వీడియోతో నవ్వులపాలైన ప్రభుత్వ పెద్దలు

దాంతో పచ్చ సిట్ ద్వారా సరికొత్త పన్నాగం

ఎంపీ మిథున్‌రెడ్డి నివాసం, కార్యాలయాల్లో సోదాలతో హల్‌చల్

సాక్షి, అమరావతి: నకిలీ మద్యం అవినీతి కూపంలో నిలువెల్లా కూరుకుపోయిన టీడీపీ పెద్దలు సరికొత్త డైవర్షన్ కుతంత్రాలకు పదును పెడుతున్నారు. బరి తెగించి నకిలీ మద్యం దందాకు పాల్పడిన వారే ఆ బురదను అందరికీ అంటించే కుట్రలు పన్నుతున్నారు. అందుకోసం టీడీపీ పెద్దల డైరెక్షన్‌లో చిత్రీకరించిన 'పొలిటికల్ సోషియో ఫాంటసీ' కుట్ర ఇప్పటికే బెడిసికొట్టింది. వైఎస్సార్‌సీపీ నేత జోగి రమేశ్‌పై దుష్ప్రచారం చేసేందుకు పన్నిన కుతంత్రం ఫలించ లేదు. దాంతో మరోసారి టీడీపీ వీర విధేయ సిట్‌ను రంగంలోకి దించి తాజాగా వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డి నివాసం, కార్యాలయాల్లో సోదాల పేరిట హల్‌చల్ చేయించారు. టీడీపీ సిండికేట్ కల్తీ మద్యం మాఫియా బాగోతం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఈ చౌకబారు ఎత్తుగడ వేసినట్లు స్పష్టమవుతోంది.

సోషియో ఫాంటసీ కుట్ర అట్టర్ ఫ్లాప్

టీడీపీ పెద్దలే సూత్రధారులుగా పచ్చ సిండికేట్ సాగిస్తున్న నకిలీ మద్యం రాకెట్ కేసును పక్కదారి పట్టించేందుకు పన్నిన పన్నాగం బెడిసికొట్టింది. అడ్డంగా దొరికిపోయిన ప్రతిసారి డైవర్షన్ రాజకీయాలకు పాల్పడే ప్రభుత్వ పెద్దలు ఈసారి మరీ చౌకబారు ఎత్తుగడ వేసి నవ్వుల పాలయ్యారు. డైవర్షన్ కుట్రలో భాగంగానే ఈ కేసులో ఏ1గా ఉన్న అద్దేపల్లి జనార్ధన్‌రావుతో చెప్పించిన వీడియో టీడీపీ పెద్దల నేలబారు రాజకీయాన్ని బయటపెట్టింది. ఏం చెప్పాలో పోలీసులే పక్కనుంచి ప్రాంప్టింగ్ అందిస్తుండగా.. జనార్ధన్‌రావు వల్లె వేసిన మాటలను చిన్న పిల్లలు కూడా నమ్మడం లేదన్నది స్పష్టమైంది. ఎల్లో మీడియా ద్వారా విడుదల చేసిన వీడియో డ్రామా టీడీపీ పెద్దల దిగజారుడుతనాన్ని బయ టపెట్టింది. పోలీసుల అదుపులో ఉన్న నిందితుడు జనార్దన్ రావుతో నిబంధనలకు విరుద్ధంగా వీడియో రికార్డ్ చేయించి విడుదల చేసినట్లు నిగ్గు తేలింది.అంతేకాదు.. ములకల చెరువులో బయట పడిన నకిలీ మద్యం మాఫియా రాష్ట్రం అంతటా విస్తరించిందన్నది తేట తెల్లమైంది. టీడీపీ నేతలు జయచంద్రారెడ్డి, సురేంద్ర నాయుడు, జనార్దన్ రావులు కేవలం పాత్రధారులేనని... ఈ వ్యవస్థీకృత దోపిడీకి కర్త, కర్మ, క్రియ అంతా ప్రభుత్వ పెద్దలేనన్నది రూఢీ అయ్యింది.

సిట్ ద్వారా మరో డైవర్షన్ డ్రామా...

ఏ 1 జనార్ధన్‌రావు వీడియో డ్రామా ఎపిసోడ్ బెడిసికొట్టడంతో ప్రభుత్వ పెద్దలు వెంటనే మరో కుట్రకు పదును పెట్టారు. ఏడాదికిపైగా రెడ్‌బుక్ రాజ్యాంగ కుట్రలు అమలు చేస్తున్న తన సిట్‌ను రంగంలోకి దింపారు. వీడియో డ్రామా ద్వారా జోగి రమేష్‌ను లక్ష్యంగా చేసుకుని భంగపడ్డ టీడీపీ పెద్దలు.. ఈసారి సిట్ ద్వారా వైఎస్సార్‌సీపీ ఎంపీ మిథున్‌రెడ్డిపై గురి పెట్టారు. ఐక్యరాజ్య సమితి సదస్సుల్లో పాల్గొనే భారత పార్లమెంటరీ బృందంలో సభ్యుడిగా మిథున్‌రెడ్డి అమెరికాలో పర్యటించేందుకు అనుమతికోరుతూ న్యాయస్థానంలో దాఖలు చేసిన పిటిషన్ విచారణకు రానున్న తరుణంలో డైవర్షన్‌తో మరోసారి కుట్రలకు తెర తీశారు. మిథున్‌రెడ్డి కుటుంబానికి చెందిన తిరుపతి, హైదరాబాద్‌లలోని నివాసాలు, కార్యాలయాల్లో సిట్ అధికారులు మంగళవారం సోదాలతో హడావుడి చేశారు. ఆయన కుటుంబ సభ్యులు, కంపెనీ ప్రతినిధులను విచారించారు. వాస్తవానికి మద్యం విధానంపై అక్రమ కేసులో ఆయన్ను గతంలోనే అరెస్టు చేసి కస్టడీకి కూడా తీసుకుని విచారించారు. ఆ అక్రమ కేసులో సిట్ అధికారులు ఎటువంటి ఆధారాలు సాధించలేకపోయారు. ఈ నేపథ్యంలో మిథున్‌రెడ్డికి న్యాయస్థానం బెయిల్ కూడా మంజూరు చేసింది. మరి ఇక ఈ కేసులో ఆయన్నుగానీ పీఎల్ఆర్ ప్రాజెక్ట్స్ ప్రతినిధులనుగానీ విచారించేందుకు ఏమీ లేదని న్యాయ నిపుణులు పేర్కొంటున్నారు.

ఇంత జరిగినా.. 'బెల్టు' తీయరా..?

రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా నకిలీ మద్యం 2024లో టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాతే మొదలైంది. ఏడాదిన్నరగా సాగుతున్న ఈ దోపిడీపై ఎక్సైజ్ శాఖ ఉదాసీనంగా వ్యవహరించడం గుట్టును బయట పెట్టింది. టీడీపీ పెద్దల కనుసన్నల్లో సీనియర్ నేతలు ప్రాంతాలవారీ పర్యవేక్షకులుగా మారి పక్కాగా దోపిడీని వ్యవస్థీకరించిన తీరే అందుకు నిదర్శనం. ఇక ఆఫ్రికా మోడల్ దందాను రాష్ట్రానికి స్వయంగా తెచ్చింది తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి, టీడీపీ నేతలు సురేంద్ర నాయుడు, అద్దేపల్లి జనార్ధన్‌రావులే కావడం గమనార్హం. ములకల చెరువు కేంద్రంగా మొదలైన ఈ మాఫియా ఏడాదిలో రాష్ట్రం అంతటా విస్తరించడం విస్మయ పరుస్తోంది. అడ్డంగా దొరికిన తరువాత ఏ1 జనార్ధన్‌రావుతో వీడియో డ్రామాకు యత్నించడం ప్రభుత్వ పెద్దల కుట్రను బట్టబయలు చేసింది. నకిలీ మద్యం మాఫియా కుట్రదారు, అంతిమ లబ్ధిదారు టీడీపీ పెద్దలేనన్న వాస్తవాన్ని ఎంతగా దాచాలని యత్నిస్తే... అంతగా ఆ అవినీతి బాగోతం బట్టబయలవుతోంది. జనార్ధన్‌రావును విదేశాల నుంచి ఆగమేఘాలపై రాష్ట్రానికి రప్పించిన టీడీపీ పెద్దలు... జయచంద్రారెడ్డిని ఎందుకు రప్పించడం లేదు? ఆయన్ను అరెస్టు చేసేందుకు ఎందుకు ప్రయత్నించడం లేదు? అని రాజకీయ పరిశీలకులు ప్రశ్నిస్తున్నారు. నకిలీ మద్యం దందా బయటపడిన తరువాత కూడా రాష్ట్రంలో ఊరూరా విస్తరించిన దాదాపు 75వేల బెల్టు షాపులను నిర్మూలించకపోవడం... ప్రజల ప్రాణాలను హరిస్తూ అక్కడ విక్రయిస్తున్న నకిలీ మద్యాన్ని జప్తు చేయకపోవడం.. పరీక్షల కోసం ల్యాబ్‌లకు పంపకపోవటాన్ని బట్టి టీడీపీ పెద్దల అండదండలతోనే పచ్చముఠాలు నకిలీ దందాతో చెలరేగుతున్నట్లు స్పష్టమైందని పేర్కొంటున్నారు.

డిస్టిలరీల మాటున నకిలీ దందా..

మాఫియాకు ప్రభుత్వ పెద్దలు వత్తాసు పలుకుతూ పోలీసులు ఈ కేసును లోతుగా దర్యాప్తు చేయకుండా కట్టడి చేస్తున్నారు. ప్రమాదకరమైన ఆ స్పిరిట్‌ను కొనుగోలు చేసేందుకు మద్యం డిస్టిలరీలు, రసాయన పరిశ్రమలకే అనుమతి ఉంది. ఆ స్పిరిట్‌లో 100% ఉండే ఆల్కహాల్‌ను 42% లోపు తగ్గించి మనుషులు వినియోగించే మద్యాన్ని తయారు చేసే సామర్థ్యం డిస్టిలరీలకే ఉంటుంది. మరి టీడీపీ సిండికేట్ ములకల చెరువుతో పాటు అనకాపల్లి, పాలకొల్లు, ఇతర ప్రాంతాల్లో నెలకొల్పిన నకిలీ మద్యం యూనిట్లకు స్పిరిట్ ఎక్కడ నుంచి సరఫరా జరిగింది? అనేది కీలకంగా మారింది. అంటే.. డిస్టిలరీలే ఆ స్పిరిట్‌ను కొనుగోలు చేసి అక్రమంగా నకిలీ మద్యం యూనిట్లకు సరఫరా చేశాయని ఎక్సైజ్ వర్గాలే అనధికారికంగా వెల్లడిస్తున్నాయి. ఇక రాష్ట్రంలో డిస్టిలరీలన్నీ టీడీపీ సీనియర్ నేతల కుటుంబాలకు చెందినవే. వాటిలో తనిఖీ చేసి రికార్డులు పరిశీలిస్తే మొత్తం బండారం బయట పడుతుంది. అందుకే ఆ డిస్టిలరీలవైపు కన్నెత్తి చూడవద్దని ప్రభుత్వ పెద్దలు పోలీసు, ఎక్సైజ్ శాఖలను ఆదేశించినట్లు తెలుస్తోంది. తద్వారా నకిలీ మద్యం మాఫియా వెనుక ఉన్న టీడీపీ బడాబాబుల బండారం బయటపడకుండా అడ్డుకట్ట వేస్తున్నారన్నది సుస్పష్టం. నకిలీ మద్యం దందాతో అమాయకుల ప్రాణాలను హరిస్తుండటంపై సర్వత్రా తీవ్ర వ్యతిరేకత పెల్లుబుకుతున్న నేపథ్యంలో టీడీపీ పెద్దలు ఇలా డైవర్షన్ డ్రామాలతో కుట్రలకు తెర తీస్తున్నట్లు రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

‘టిమ్స్’కు కార్పొరేట్ లుక్..

నగరంలోని రెండు ప్రైవేట్ ఆస్పత్రుల ఆపరేషనల్ ఫ్రేమ్‌వర్క్‌ను అధ్యయనం చేసిన ఆరోగ్యశాఖ

బెడ్ కెపాసిటీ, పేషెంట్ లోడ్ నుంచి స్టాఫింగ్, ఐటీ సేవల వరకు పరిశీలన

ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్‌కు వైద్యవృత్తితో సంబంధం లేకుండా ప్రత్యేక విభాగ ఏర్పాటుకు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్

తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(టిమ్స్) ఆస్పత్రుల్లో వైద్య సేవలు త్వరలో అందుబాటులోకి రానున్నాయి. వీటిని కార్పొరేట్ ఆస్పత్రుల తరహాలో తీర్చిదిద్దు తున్నారు. నిమ్స్ కన్నా మెరుగ్గా వైద్య సేవలతో పాటు నిర్వహణ వ్యవస్థను కూడా ఆధునీకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సనత్‌నగర్, ఎల్‌బీనగర్, అల్వాల్‌లో నిర్మిస్తున్న ‘టిమ్స్’పనులు ఈ ఏడాది చివరి నాటికి పూర్తి కానున్నాయి. ఈ మూడు ఆస్పత్రులను నగర శివార్లలో ఏర్పాటైన కుత్బుల్లాపూర్, మహేశ్వరం మెడికల్ కళాశాలలకు అనుబంధంగా ఓవైపు జనరల్ ఆస్పత్రులుగా నడిపిస్తూనే, స్పెషలైజేషన్ వైద్యానికి కేరాఫ్‌గా ‘డ్యూయల్ రోల్’లో కొనసాగించనున్నారు.

సనత్‌నగర్ టిమ్స్ గుండె సంబంధమైన వ్యాధులతోపాటు అవయవ మార్పిడికి ప్రత్యేక ఆస్పత్రిగా కొనసాగనుంది.

అల్వాల్‌లోని టిమ్స్ న్యూరో (నరాల) సంబంధమైన వ్యాధులకు, ఎల్‌బీనగర్ టిమ్స్ గ్యాస్ట్రో సంబంధమైన వ్యాధులకు స్పెషాలిటీ ఆస్పత్రులుగా కొనసాగనున్నాయి.

ఉస్మానియా, గాంధీ, ఎంజీఎంలకు భిన్నంగా ఆస్పత్రుల నిర్వహణ నుంచి వైద్యులు, సిబ్బంది నియామకం వరకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగనున్నారు.



‘ఆపరేషనల్ ఫ్రేమ్‌వర్క్’పై...

టిమ్స్‌లో కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉన్న ‘ఆపరేషనల్ ఫ్రేమ్‌వర్క్’ను సాధ్యమైనంత మేర అమలు చేసే అంశాన్ని ఆరోగ్యశాఖ సునిశితంగా పరిశీలిస్తోంది. ఇందుకోసం గచ్చిబౌలి, హైటెక్ సిటీల్లో ఉన్న రెండు మల్టీ స్పెషాలిటీ కార్పొరేట్ ఆస్పత్రుల ఫ్రేమ్ వర్క్‌పై ఆరోగ్యశాఖ అధికారులు అధ్యయనం చేశారు. ఆ రెండు 1,000 పడకల సామర్థ్యం కలవి కావడంతో అక్కడి ఓవర్‌వ్యూతోపాటు స్టాఫింగ్ ప్యాటర్న్, నాన్ మెడికల్ సర్వీసెస్, ఇతర ముఖ్యమైన అంశాలపై నివేదికలు తెప్పించి పూర్తిస్థాయిలో అధ్యయనం చేశారు. బెడ్ కెపాసిటీ, ఓపీ, ఐపీ తీరు, స్టాఫింగ్, ఐటీ, మౌలిక వసతుల వరకు అన్ని అంశాలను పరిశీలించారు. ఆస్పత్రుల నిర్వహణ వ్యవస్థ నుంచి డాక్టర్లను పక్కన బెట్టి, వైద్యులు, ప్రొఫెసర్లుగా ఉన్న నిపుణులు పూర్తిస్థాయిలో వైద్యంపైనే దృష్టి పెట్టేలా ప్రణాళిక రూపొందించారు. ఆస్పత్రి నిర్వహణ బాధ్యతలను ఎండీ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ కోర్సులు పూర్తి చేసిన వారిని నియమించడంతోపాటు ఆస్పత్రులకు అవసరమైన స్పెషలైజ్ డాక్టర్లను ప్రత్యేకంగా నియమించుకోవాలని నిర్ణయించారు. ఆస్పత్రి నిర్వహణకు అవసరమైన వేలాది మంది సిబ్బందిని ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో తీసుకోనున్నారు.

నిమ్స్ తరహాలో ఫీజుల వసూలు

➤ టిమ్స్‌లో చికిత్స పొందే రోగుల నుంచి స్వల్పంగా ఫీజులను వసూలు చేయాలని నిర్ణయించారు. ప్రత్యేక ప్రతిపత్తితో కొనసాగుతున్న నిమ్స్ తరహాలోనే ఓపీ నుంచి ఇన్‌పేషెంట్ల వరకు ఈ ఆస్పత్రులకు వచ్చే రోగులకు ఫీజులు నిర్ణయించనున్నారు. అయితే నిమ్స్ స్థాయిలో కాకుండా సామాన్యులు కూడా భరించేలా తక్కువ మొత్తంలో రోగుల నుంచి ఫీజులు వసూలు చేయడం ద్వారా వారిలో జవాబుదారీతనాన్ని పెంపొందించనున్నట్టు ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు. 1,000 పడకలు గల ఒక్కో ఆస్పత్రిలోని 350 పడకలను రెండు మెడికల్ కళాశాలలకు అనుబంధంగా కేటాయించి, మిగతా 650 పడకలకు సంబంధించి ఫీజులు వసూలు చేయనున్నారు. అవి కూడా స్పెషలైజ్ వ్యాధులకు సంబంధించి మాత్రమేనని స్పష్టం చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, జేహెచ్‌ఎస్ సేవలకు సంబంధించి నిమ్స్‌లో అమలవుతున్న విధానాన్నే ఈ టిమ్స్‌ల్లో కూడా పాటించనున్నారు.

బీజేపీ నేతను హతమార్చిన మావోయిస్టులు

చర్ల: పోలీస్ ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులు అధికార బీజేపీ నాయకుడిని హతమార్చారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లా ముజుల్‌కంకేర్ గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు పూనెం సత్యం ఇంటికి సోమవారం అర్ధరాత్రి వచ్చిన మావోయిస్టులు ఆయన్ను బయటకు పిలిచి దారుణంగా కొట్టారు. ఆ తర్వాత కత్తితో గొంతు కోసి హతమార్చారు. పోలీసులకు ఇన్‌ఫార్మర్‌గా మారి మావోయిస్టుల సమాచారాన్ని చేరవేస్తున్నాడని, గతంలో పలుమార్లు హెచ్చరించినా తీరు మార్చుకోలేదని మావోయిస్టు పార్టీ మద్దేడు ఏరియా కమిటీ పేరిట మృతదేహం వద్ద లేఖ వదిలారు.



స్వాధీనం చేసుకున్న సామగ్రి, ఆయుధాలతో పోలీసు బలగాలు..



పూనెం సత్యం (ఫైల్)

కర్రెగుట్టల్లో మావోయిస్టుల భారీ డంప్ స్వాధీనం

బీజాపూర్ జిల్లా కర్రెగుట్టల్లో మావోయిస్టుల భారీ డంప్‌ను భద్రతా బలగాలు మంగళవారం గుర్తించాయి. గత మే నెలలో మావోయిస్టుల కోసం కర్రెగుట్టల్లో 25 రోజుల పాటు ఆపరేషన్ చేపట్టగా ఆ ప్రాంతంలోని తడపల కొండల్లో సెప్టెంబర్ మొదటి వారంలో ఎఫ్‌ఓబీ క్యాంపు ఏర్పాటు చేశారు. తనిఖీల్లో భాగంగా మావోయిస్టుల రహస్య స్థావరాన్ని గుర్తించగా.. 51 లైవ్ బీజీఎల్ (బ్యారల్ గ్రెనేడ్ లాంచర్లు), 100 బండిళ్ల హెచ్‌డీ అల్యూమినియం వైరు, 50 పైపులు, 20 ఇనుప షీట్లు, 48 ఇనుప ప్లేట్లు, బీజీఎల్ తయారీలో వినియోగించే సామగ్రి, 5 ఐఈడీ (ఇంప్రూవ్ వైజ్డ్ ఎక్స్‌క్లూజివ్ డివైస్)లు లభ్యమయ్యాయి. ఐఈడీలను బీడీఎస్ (బాంబు డిస్పోజల్ స్క్వాడ్) బృందం ఆధ్వర్యాన అక్కడికక్కడే వాటిని నిర్వీర్యం చేశారు.

ఆంధ్రా పర్వతారోహకుడి అరుదైన ఘనత

ప్రపంచంలో ఎత్తైన 14 శిఖరాల్లో 9 అధిరోహణ

కోల్‌కతా: ఏపీ కర్నూల్ జిల్లాకు చెందిన పర్వతారోహ కుడుభరత్ తమ్మినేని(36) అరుదైన ఘనత సాధించారు. ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 14 శిఖరాల్లో ఒకటైన చైనాలోని మౌంట్ చో ఓయు పర్వతాన్ని (8,188 మీటర్లు) అధిరోహించారు. దీంతో భూమిపై ఎత్తైన శిఖరాలలో తొమ్మిదింటిని ఎక్కిన తొలి భారతీయుడిగా రికార్డు సృష్టించారు. సెప్టెంబర్ 30న చైనాలోని చో ఓయు బేస్ క్యాంప్‌కు చేరుకున్నాడు. అక్కడి ప్రతికూల వాతావ రణం కారణంగా పర్వతాన్ని ఎక్కే ప్రయత్నాలు విరమించుకో వాల్సి వచ్చింది. దీంతో నాటి నుంచి అక్కడే వేచి ఉన్నారు. ఎట్టకేలకు భారత కాలమానం ప్రకారం అక్టోబర్ 14న 8.55 గంటలకు శిఖరాన్ని అధిరోహించారు. దీంతో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన 14 శిఖరాల్లో తొమ్మిదింటిని విజయవంతంగా అధిరోహించి రికార్డు నెలకొల్పారు. బేస్‌క్యాంప్ నుంచి షెర్పా సహాయం లేకుండా ఎక్కడంతో ఈ విజయానికి మరింత ప్రాధాన్యత లభించింది. అంతకుముందు.., మే 2017లో మౌంట్ ఎవరెస్ట్, సెప్టెంబర్ 2018లో మౌంట్ మనస్లూ, మే 2019లో మౌంట్ లోట్సే, మార్చి 2022లో మౌంట్ అన్నపూర్ణ, మే 2023లో మకాలు, అక్టోబర్ 2024లో శిశాపాంగ్మా, ఏప్రిల్ 2025లో మౌంట్ ధౌలగిరి తదితర 8,000 మీటర్లకు పైగా ఎత్తైన శిఖరాలు అధిరోహించారు. మిగిలిన ఐదు ఎత్తైన పర్వతాలు కే2, నంగా పర్బత్, గషెర్‌బ్రుమ్ ఐ, ఐఐలు, బ్రాడ్ పీక్ పాకిస్తాన్‌లో ఉండటంతో భారత పర్వతారోహకులకు అందుబాటులో లేవు.

కుటుంబ సభ్యులతో వెంకటయ్య



అడవి నుంచి ఆత్మీయుల చెంతకు..

స్వగ్రామానికి మాజీ మావోయిస్టు వెంకటయ్య

మద్దూరు (హుస్నాబాద్): మాజీ మావోయిస్టు కుంకటి వెంకటయ్య.. తన భార్య మంజులతో కలిసి మంగళవారం రాత్రి స్వగ్రామమైన సిద్దిపేట జిల్లా దూళ్మిట్ట మండలం కూటిగల్ గ్రామానికి చేరుకున్నారు. మూడు దశాబ్దాల క్రితం ఆశయం కోసం ఆయుధం పట్టి.. అనారోగ్య సమస్యలతో ఇటీవల డీజీపీ శివధర్‌రెడ్డి సమక్షంలో వెంకటయ్య లొంగిపోవడం తెలిసిందే. 1990లో పీపుల్స్‌వార్‌లో చేర్యాల దళ సభ్యునిగా చేరి మావోయిస్టు పార్టీలో అంచెలంచెలుగా ఎదిగిన వెంకటయ్య.. ఈనెల 10న పోలీసులకు లొంగిపోయారు. 35 ఏళ్ల తర్వాత స్వగ్రామానికి చేరుకున్న ఆయనకు.. చిన్ననాటి స్నేహితులు, గ్రామస్తులు స్వాగతం పలికారు. తోబుట్టువులు, కుటుంబసభ్యులు వెంకటయ్యను ఒక్కసారిగా చూసి భావోద్వేగానికి లోనై కన్నీరు పెట్టుకున్నారు. కుటుంబ సభ్యులు మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. చాలా రోజుల తర్వాత కుటుంబ సభ్యులను కలుసుకోవడం సంతోషంగా ఉందన్నారు.

ఆర్ ఆర్ ఆర్ నం.161ఏఏ

రీజినల్ రింగురోడ్డు ఉత్తర భాగానికి కేటాయింపు?


ఆ భాగానికి కీలక ప్రాజెక్ట్ అప్రైజల్ అండ్ స్క్రూటినీ కమిటీ క్లియరెన్స్

నవంబరులో తెరుచుకోనున్న టెండర్లు

ఆ వెంటనే నిర్మాణ పనులకు శ్రీకారం

సాక్షి, హైదరాబాద్

రీజినల్ రింగురోడ్డు (ట్రిపుల్ ఆర్) ఉత్తర భాగానికి సంబంధించి కీలక పురోగతి చోటుచేసుకుంది. ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ అప్రైజల్ అండ్ టెక్నికల్ స్క్రూటినీ కమిటీ (పీఏటీఎస్‌సీ) ఆమోదించింది. ఇది ప్రధాన జాతీయ రహదారి ప్రాజెక్టులకు సంబంధించిన సాంకేతిక, ఆర్థిక సంబంధమైన సాధ్యాసాధ్యాలను అంచనా వేసి పరిశీలించి లోపాలను ఎత్తిచూపి వాటిని సరిదిద్దిన తర్వాత ఆమోదముద్ర వేస్తుంది. దాని ఆమోదం తర్వాతనే కీలక పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ అప్రైజల్ కమిటీ (పీపీపీఏసీ) ఆమోదముద్ర లభిస్తుంది. దానికి కేంద్ర కేబినెట్ ఆర్థిక వ్యవహారాల కమిటీ పచ్చజెండా ఊపుతుంది. తాజాగా రీజినల్ రింగురోడ్డు ఉత్తర భాగం సాంకేతిక, ఆర్థిక పరమైన అంశాల అప్రైజల్‌ను పూర్తి చేసుకుని పీపీపీఏసీ ఆమోదముద్రకు వెళ్లింది. త్వరలో ఆ కమిటీ కూడా సమావేశమై దీనికి తుది అనుమతి ఇవ్వనుంది. మరో పక్షం/నెల రోజుల్లో స్పష్టత రానున్నట్టు తెలిసింది. ఆ వెంటనే టెండర్లు తెరిచి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు.



దానికి ఎన్‌హెచ్ హోదా తొలగింపు

నవంబరులో ఉత్తర భాగం టెండర్లను తెరవనున్నారు. అప్పటికి రోడ్డుకు జాతీయ రహదారి నంబరు రావాల్సి ఉంది. దీంతో దీనికి ఎన్‌హెచ్ 161ఏఏ నంబరును కేటాయించనున్నారని తెలిసింది. ఎన్‌హెచ్ 161ఏఏ ఎన్ఈ (నేషనల్ ఎక్స్‌ప్రెస్‌వే)గా రికార్డుల్లో ఉంటుందని సమాచారం. ప్రస్తుతం ఆ నంబరును సంగారెడ్డి నుంచి తూప్రాన్, గజ్వేల్, భువనగిరి మీదుగా చౌటుప్పల్ వరకు ఉన్న రోడ్డుకు ఉంది. గతంలో రాష్ట్ర రహదారిగా ఉన్న ఆ రోడ్డును రీజినల్ రింగురోడ్డు ప్రతిపాదన సమయంలో జాతీయ రహదారిగా గుర్తించారు. అప్పట్లో ఆ రోడ్డును రీజినల్ రింగురోడ్డులో భాగంగా అభివృద్ధి చేయాలన్న ఆలోచన ఉండేది. కానీ, దాన్ని ఎక్స్‌ప్రెస్ వేగా నిర్మించాలని నిర్ణయించటంతో, ఉన్న పాత రోడ్డు బదులు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుగా నిర్మించాలని ఆ తర్వాత నిర్ణయించారు. ఫలితంగా ఆ రోడ్డు దీనికి సమాంతరంగా కొనసాగనుంది. అయితే రీజినల్ రింగురోడ్డు జాతీయ రహదారి ఎక్స్‌ప్రెస్‌వేగా రూపుదిద్దుకోనున్నందున, దానికి సమాంతరంగా కొనసాగే పాత రోడ్డును జాతీయ రహదారి హోదా తొలగించి తిరిగి రాష్ట్రరహదారిగా మార్చనున్నారు. అప్పుడు దానికి 161ఏఏ నంబరు తొలగిపోతుంది. దాని నిర్వహణ పూర్తిగా రాష్ట్రప్రభుత్వ అధీనంలోని ఆర్అండ్‌బీ పరిధిలోకి చేరుతుంది. ఇప్పటికే 161 నంబరుతో ప్రధాన జాతీయ రహదారి, 161ఏ నెంబరుతో మరో రోడ్డు ఉన్నందున 161ఏఏ నంబరు ఏర్పడింది. మూడు రోడ్లకు అదే నంబరు ఉండనున్నందున అయోమయం లేకుండా రీజినల్ రింగురోడ్డుకు కొత్త నంబరు కేటాయించాలన్న అభిప్రాయం కూడా ఉంది. దీనిపై తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అప్పటివరకు 161 ఏఏతోనే రీజినల్ రింగురోడ్డు కొనసాగనుంది.

జననాలు 2.52 కోట్లు.. మరణాలు 86.6 లక్షలు

దేశవ్యాప్తంగా 2023లో 2.52 కోట్ల జననాలు నమోదయ్యాయి. 2022తో పోలిస్తే ఈ సంఖ్య దాదాపు 2.32 లక్షలు తక్కువ. 2023లో 86.6 లక్షల మరణాలు నమోదయ్యాయి. మొత్తం జననాల్లో దాదాపు 75 శాతం ఆసుపత్రుల్లోనే జరగడం గమనార్హం. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని రిజిస్ట్రార్ జనరల్, జన గణన కమిషనర్ కార్యాలయం 2023 సంవత్సరానికి సంబంధించిన గణాంకాలను 'వైటల్ స్టాటిస్టిక్స్ ఆఫ్ ఇండియా' పేరిట విడుదల చేసింది.

- సాక్షి, స్పెషల్ డెస్క్



ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న కోవిడ్-19 డ్యాష్‌బోర్డ్‌లో 2025 మే 5 నాటికి మహమ్మారి వల్ల సంభవించిన మరణాల సంఖ్య 5,33,665గా ఉంది. 2022, 2023లో మరణాలలో పెద్దగా పెరుగుదల లేదని నివేదిక వెల్లడించింది. 2020తో పోలిస్తే 2021లో 21 లక్షలకు పైగా అధిక మరణాలు సంభవించాయి. 2020లో 81.2 లక్షలు, 2021లో 1.02 కోట్ల మంది కన్నుమూశారు.

కొన్ని రాష్ట్రాలే..: నిర్ణీత కాలపరిమితి అయిన 21 రోజుల్లోపు 90% కంటే ఎక్కువ జననాల నమోదును 11 రాష్ట్రాలు/కేంద్రపాలిత ప్రాంతాలు మాత్రమే సాధించాయి. వీటిలో గుజరాత్, తమిళనాడు, హరియాణా, హిమాచల్ ప్రదేశ్, గోవా, పంజాబ్ వంటివి ఉన్నాయి. ఒడిశా, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు 80–90% జననాల నమోదు చేశాయి. ఢిల్లీ, మధ్యప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక, బిహార్, రాజస్తాన్ వంటి రాష్ట్రాలలో 50–80% జననాలు మాత్రమే నిర్ణీత కాలపరిమితి లోపు నమోదయ్యాయి.

- 2022తో పోలిస్తే తగ్గిన జననాలు
- జననాల్లో అత్యధికం ఆసుపత్రుల్లోనే
- లింగ నిష్పత్తి తెలంగాణలో తక్కువే
- జనన, మరణ గణాంకాలు వెల్లడించిన కేంద్రం

మగపిల్లలే ఎక్కువ

2023 నమోదిత జనన గణాంకాలు

జననాల్లో మగపిల్లలు 52.4%, ఆడపిల్లలు 47.6%	పట్టణాల్లో 58.3%, గ్రామీణ ప్రాంతాల్లో 41.7% మంది పుట్టారు.

21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు జననాల నమోదు ప్రక్రియను 100% పూర్తి చేశాయి.

మరణాల్లో పురుషులే అధికం

మరణాల్లో 60.6% పురుషులు, 39.4% స్త్రీలు ఉన్నారు.	మరణాల్లో గ్రామీణులు 57.7%, పట్టణవాసులు 42.3% ఉన్నారు.
ఆసుపత్రుల్లో మృతి చెందినవారు (సిక్కిం మినహా) 24%	శిశువుల మరణాల్లో పట్టణాల వాటా 85.7%, గ్రామీణ ప్రాంతాల వాటా 14.3%.

విషయం	2022	2023
నమోదిత జననాలు	2,54,39,164	2,52,07,070
నమోదిత మరణాలు	86,49,930	86,59,679
నమోదిత శిశు మరణాలు	1,42,771	1,45,992
మరణాల్లో శిశువుల వాటా	1.7%	1.7%

తెలుగు రాష్ట్రాల్లో ఇలా..

రాష్ట్రం	జననాలు	మరణాలు
ఆంధ్రప్రదేశ్	7,98,255	3,67,197
తెలంగాణ	6,02,533	2,40,251

అమ్మాయిలు అధికం

2023లో.. 1,000 మంది అబ్బాయిలకు అమ్మాయిల జననాలు ఆంధ్రప్రదేశ్‌లో 931. ఈ సంఖ్య అత్యధికంగా ఉన్న రాష్ట్రాలు..

రాష్ట్రం/కేంద్రపాలిత ప్రాంతాల వారీగా అమ్మాయిలు

అరుణాచల్ ప్రదేశ్	1,085
నాగాలాండ్	1,007
గోవా	973
త్రిపుర	972
లద్దాఖ్	972

అత్యల్ప లింగ నిష్పత్తి

2023లో.. 1,000 మంది పురుషులకు స్త్రీల జననాల సంఖ్య తక్కువగా ఉన్న రాష్ట్రాలు..

జార్ఖండ్	899
బిహార్	900
తెలంగాణ	906
మహారాష్ట్ర	909
గుజరాత్	910

విదేశాల్లో జననాలు, మరణాలు

ప్రపంచ వ్యాప్తంగా 150 దేశాల్లో ఉంటున్న భారతీయులకు 2023లో మొత్తం 62,182 మంది జన్మించారు. ఇందులో సగానికిపైగా యూఏఈ, యూకే, ఖతార్‌లలోనే పుట్టడం విశేషం. విదేశాల్లోని భారతీయుల్లో 10,531 మంది మరణించారు. ఇందులో సగానికిపైగా యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఒమన్‌లలోనే సంభవించాయి.

అత్యధిక శిశు మరణాలు..: 2023లో అత్యధిక శిశు మరణాలు సంభవించిన రాష్ట్రాలు.. మహారాష్ట్ర (17,436), గుజరాత్ (13,676), హరియాణా (11,622). ఏపీలో 6,852, తెలంగాణలో 3,956 సంభవించాయి.

ఆసుపత్రుల్లో అధిక జననాలు

ప్రదేశం	జననాల శాతం
ఆసుపత్రులు	74.7
సుశిక్షితురాలు కాని స్త్రీ సమక్షంలో	9.6
డాక్టరు /నర్సు సమక్షంలో	6.2

సైబర్ సెక్యూరిటీలో డ్యూయల్ డిగ్రీ

- వీఐటీ చెన్నై–ఆస్ట్రేలియా డీకిన్ వర్సిటీ సంయుక్తంగా ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీఐటీ) చెన్నై, ఆస్ట్రేలియాకు చెందిన డీకిన్ యూనివర్సిటీ సంయుక్తంగా సైబర్ సెక్యూరిటీలో నూతన డ్యూయల్ డిగ్రీ ప్రోగాంను ప్రారంభిస్తున్నట్లు తెలిపాయి. దీంతో భారతీయ విద్యార్థులు వీఐటీ చెన్నైలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లో బీటెక్, డీకిన్ యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ ఆఫ్ సైబర్ సెక్యూరిటీ (ఆనర్స్) కోర్సులను పొందేందుకు వీలుంటుందని వెల్లడించాయి. ఈ డ్యూయల్ డిగ్రీ ద్వారా కంప్యూటర్ సైన్స్, నెట్‌వర్క్ సెక్యూరిటీ, డేటా ప్రొటెక్షన్‌లో బలమైన ఫౌండేషన్ పొంది డీకిన్ వర్సిటీలో అడ్వాన్స్‌డ్ కోర్సు వర్క్, సైబర్ సెక్యూరిటీలో పరిశోధనలు చేసేందుకు అవకాశముంటుందని పేర్కొన్నాయి. ఈ సందర్భంగా వీఐటీ వైస్ ప్రెసిడెంట్ జీవీ సెల్వం మాట్లాడుతూ వీఐటీ–డీకిన్ యూనివర్సిటీలు ఫ్యాకల్టీ, స్టూడెంట్ ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్‌పై కలిసి పనిచేస్తున్నాయన్నారు.

రూ.252 కోట్ల 'ఇందిరమ్మ' బిల్లుల చెల్లింపు

- రికార్డు స్థాయిలో సొమ్ము జమ

సాక్షి, హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు తాజా వారానికి సంబంధించి సోమవారం ప్రభుత్వం రికార్డు స్థాయిలో రూ.252.87 కోట్ల ఆర్థిక సాయాన్ని విడుదల చేసింది. వీటితో ఇప్పటి వరకు లబ్ధిదారులకు వివిధ విడతలుగా మొత్తం రూ.2233.21 కోట్లను చెల్లించినట్టయిందని గృహనిర్మాణ సంస్థ ఎండీ వీపీ గౌతం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 22,305 మంది లబ్ధిదారుల ఖాతాల్లో తాజాగా నిధులు జమయ్యాయని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం సుమారు 2.18 లక్షల ఇళ్ల నిర్మాణం వివిధ దశల్లో ఉందని వివరించారు. ఇప్పటి వరకు బేస్ మెంట్ స్థాయి నిర్మాణాలకు సంబంధించి 1,43,963 ఇళ్లకు రూ.1439.63 కోట్లు, రూఫ్ లెవల్ వరకు సంబంధించి 46,206 ఇళ్లకు రూ.462.06 కోట్లు, పైకప్పు వరకు సంబంధించి 16,576 ఇళ్లకు రూ.331.52 కోట్లు చెల్లించినట్టు ఆయన వెల్లడించారు.

మంత్రి సురేఖ ఓఎస్డీ తొలగింపు

సాక్షి, హైదరాబాద్: అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ వద్ద ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్‌డీ)గా పనిచేస్తున్న ఎన్.సుమంత్‌ను తొలగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీపీసీబీ)లో కాంట్రాక్ట్ పద్ధతిలో ఓఎస్‌డీగా చేరిన ఆయన మంత్రి పేషీలో ఓఎస్డీ హోదాలో డిప్యుటేషన్‌పై పనిచేస్తున్నారు. ఇటీవల సుమంత్ చుట్టూ కొన్ని వివాదాలు నెలకొనడంతోపాటు ఇతర ఆరోపణలు రావడంతో.. ఆయన కాంట్రాక్ట్‌ను రద్దు చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. దీంతో.. ఈ ఏడాది డిసెంబర్ 16 వరకు ఆయన కాంట్రాక్ట్ కాలం ఉండగా.. మధ్యలోనే తొలగించినట్లయింది. 2023 డిసెంబర్ 17న సుమంత్ టీపీసీబీలో ఓఎస్‌డీగా చేరగా, 2024లో ఏడాది కాంట్రాక్ట్‌ను మరో ఏడాది పొడిగించారు. అయితే తాజాగా రద్దు చేసిన సుమంత్ కాంట్రాక్ట్ వెంటనే అమల్లోకి వస్తుందని మంగళవారం రాత్రి టీపీసీబీ సభ్య కార్యదర్శి రవి గుగులోతు ఉత్తర్వులిచ్చారు. దీనికి సంబంధించిన ప్రొసీడింగ్స్ ప్రతిని అటవీశాఖ ముఖ్యకార్యదర్శి, అటవీశాఖ మంత్రి పీఎస్‌కు, టీపీసీబీ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్‌కు పంపించారు.

రేపు ఏపీకి ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ/శ్రీశైలం టెంపుల్/కర్నూలు (సెంట్రల్): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ గురువారం ఏపీలో పర్యటించనున్నారు. ప్రధాని ఉదయం 11 గంటలకు కర్నూలు చేరుకుంటారని ఆయన కార్యాలయం మంగళవారం తెలిపింది. ప్రధాని ఉదయం 11.15 గంటలకు నంద్యాల జిల్లాలోని శ్రీశైలంలోగల శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు చేస్తారు. మధ్యాహ్నం 12.15 గంటలకు శ్రీశైలంలోని ఛత్రపతి శివాజీ స్ఫూర్తి కేంద్రాన్ని సందర్శిస్తారు. 2.30 గంటలకు దాదాపు రూ.13,430 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శంకుస్థాపన చేస్తారు. కొన్ని ప్రాజెక్టులను జాతికి అంకితం చేసి, అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు.

అంబేడ్కర్ బాటలోనే పయనిస్తా

- అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



లండన్‌లో మ్యూజియమ్‌ను సందర్శించిన గుత్తా సుఖేందర్‌రెడ్డి, గడ్డం ప్రసాద్ కుమార్, బండా ప్రకాశ్

సాక్షి, హైదరాబాద్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చూపిన బాటలోనే పయనిస్తానని, ఆయన ఎప్పుడూ తనకు స్ఫూర్తి అని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. లండన్ నగరంలోని కింగ్స్ హెన్రీ రోడ్డులో బీఆర్ అంబేడ్కర్ నివసించిన గృహాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఉపయోగించిన లైబ్రరీ సందర్శించి.. అక్కడ విజిటర్స్ పుస్తకంలో పలు విషయాలు రాశారు. ఆయన ఆశీర్వాదంతోనే తాను తెలంగాణ స్పీకర్ అయ్యానన్నారు. అంబేడ్కర్ జ్ఞాపకార్థం ఆయన ఇంటిని మ్యూజియంగా మార్చి సమర్థవంతంగా నిర్వహిస్తున్న భారత ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ శాసన పరిషత్ చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, లెజిస్లేటివ్ సెక్రటరీ నరసింహాచార్యులు, అధికారులు పాల్గొన్నారు.

ఏపీ హైకోర్టుకు ముగ్గురు నూతన న్యాయమూర్తులు

- జస్టిస్ రాయ్, జస్టిస్ సుబేందు, జస్టిస్ రమేష్‌ల నియామకం



జస్టిస్ రాయ్ | జస్టిస్ సుబేందు | జస్టిస్ రమేష్

సాక్షి, న్యూఢిల్లీ, అమరావతి: ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు ముగ్గురు నూతన న్యాయమూర్తులు బదిలీపై రానున్నారు. వేర్వేరు హైకోర్టుల్లో పనిచేస్తున్న ముగ్గురు న్యాయమూర్తులను ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలన్న సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసుకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేశారు. ఈ మేరకు కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ మంగళవారం అధికారికంగా ఉత్తర్వులు జారీచేసింది. బదిలీ అయిన వారిలో గుజరాత్ హైకోర్టు నుంచి జస్టిస్ చీకటి మానవేంద్రనాథ్ రాయ్, అలహాబాద్ హైకోర్టు నుంచి జస్టిస్ దొనడి రమేష్, కలకత్తా హైకోర్టు నుంచి జస్టిస్ సుబేందు సమంత ఉన్నారు. వీరిలో జస్టిస్ రాయ్ నెంబర్ 2, జస్టిస్ రమేష్ నెంబర్ 6, జస్టిస్ సుబేందు 18వ స్థానంలో ఉంటారు. ఈ ముగ్గురూ తక్షణమే ఏపీ హైకోర్టులో బాధ్యతలు స్వీకరించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. దీంతో ఏపీ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 33కి చేరింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకి చెందిన జస్టిస్ రాయ్, జస్టిస్ రమేష్ 2023లో బదిలీ అయ్యారు. అప్పటి నుంచి వీరు గుజరాత్, అలహాబాద్ హైకోర్టుల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. అలాగే, జస్టిస్ సుబేందు సమంత ప్రస్తుతం కలకత్తా హైకోర్టు న్యాయమూర్తిగా పని చేస్తున్నారు. ఈ ముగ్గురిని ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకి బదిలీ చేస్తూ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయ్ నేతృత్వంలోని కొలీజియం ఆగస్టు 25న కేంద్రానికి సిఫారసు చేస్తూ తీర్మానం చేసిన విషయం తెలిసిందే.

హైకోర్టుకి ముగ్గురు న్యాయాధికారులు..

ఇదిలా ఉండగా.. న్యాయాధికారుల కోటా నుంచి ముగ్గురు న్యాయాధికారులు హైకోర్టు న్యాయమూర్తులుగా పదోన్నతి పొందనున్నారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం జిల్లా ప్రధాన జడ్జిగా ఉన్న గంధం సునీత, విశాఖపట్నం సేల్స్ టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్ చైర్మన్ ఆలపాటి గిరిధర్, రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ డైరెక్టర్ చింతలపూడి పురుషోత్తం హైకోర్టు న్యాయమూర్తులు కానున్నారు. వీరి పేర్లను హైకోర్టు కొలీజియం ఇటీవల సిఫారసు చేసింది. కేంద్ర హోమ్ శాఖ నుంచి ఇంటిలిజెన్స్ నివేదిక వెళ్లగానే సుప్రీం కోర్టు కొలీజియం సమావేశమై వీరి నియామకంపై నిర్ణయం తీసుకుంటుంది.

నగర వార్తలు

'ప్రజావాణి'కి 276 దరఖాస్తులు



లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 276 దరఖాస్తులు వచ్చాయి. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 95, రెవెన్యూ శాఖ 23, ఇందిరమ్మ ఇళ్లు 120, ప్రవాసీ ప్రజావాణికి 01 చొప్పున దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 37 దరఖాస్తులు అందినట్లు సీఎం ప్రజావాణి కోఆర్డినేటర్ రాకేష్ రెడ్డి తెలిపారు.

బీసీల బంద్‌కు మద్దతు ఇవ్వండి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని కోరిన బీసీ జేఏసీ



సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీకి వినతిపత్రం అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య, జాజుల తదితరులు

చిక్కడపల్లి: బీసీల 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టేకు నిరసనగా ఈ నెల 18వ తేదీన నిర్వహించతలపెట్టిన రాష్ట్ర బంద్‌కు మద్దతు ఇవ్వాలని పలు బీసీ సంఘాలు, బీసీ జేఏసీ నేతలు మంగళవారం సీపీఎం రాష్ట్ర కమిటీని కోరారు. ఈ మేరకు ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీని బీసీ జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్, వైస్ చైర్మన్ నారగోని, బీసీ జేఏసీ కోచైర్మన్ రాజారామ్ యాదవ్, కో ఆర్డినేటర్లు గుజ్జ కృష్ణ, పలు బీసీ సంఘాల నేతలు కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై జరుగుతున్న పోరాటానికి సీపీఎం కూడా మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ నెల 18వ తేదీన జరిగే బంద్‌కు సీపీఎం సహకరించాలన్నారు. ఈ సందర్భంగా జాన్‌వెస్లీ మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు తెలిపారు. రాష్ట్ర బంద్‌కు సానుకూలంగా స్పందించారు. బీసీ రిజర్వేషన్లపై కేంద్ర ప్రభుత్వం తన వైఖరి తెలియజేయాలని జాన్‌వెస్లీ డిమాండ్ చేశారు. 9వ షెడ్యూల్‌లో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని చేర్చాలన్నారు. సమావేశంలో సీపీఎం జాతీయ కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, బీసీ సంఘం నేతలు వేముల రామకృష్ణ, విక్రమ్‌గౌడ్, కనకాల శ్యామ్, ఉదయ్‌నేత, పి.శ్రీధర్, గోపి తదితరులు పాల్గొన్నారు.

నవీన్ యాదవ్ విజయం ఖాయం

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో మంత్రి పొన్నం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

వెంగళరావునగర్: కాంగ్రెస్ ప్రజాపాలనతో సంక్షేమం, అభివృద్ధి చేసుకుంటూ ముందుకు పోతున్నామని, జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఎర్రగడ్డలోని ఐ.ఎ.ప్యాలెస్, బోరబండలోని జయశంకర్ ఫంక్షన్ హాల్‌లో వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ, ఎర్రగడ్డ, బోరబండ డివిజన్ల బూత్‌స్థాయి సమావేశాలను నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ అధ్యక్షతన జరిగిన ఆయా సమావేశాల్లో మంత్రి పొన్నం మాట్లాడుతూ కంటోన్మెంట్‌లో ఉప ఎన్నిక వస్తే కాంగ్రెస్‌ను ప్రజలు గెలిపించారని, అదేవిధంగా ఇక్కడ కూడా నవీన్ యాదవ్‌ను గెలిపించాలని అన్నారు. 'గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎవరికి డబుల్ బెడ్‌రూంలు ఇచ్చారు, ఎంత మందికి రేషన్ కార్డులు పంపిణీ చేశారు' అని ప్రశ్నించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి ఏమీ లేకపోవడంతో విమర్శలతో ప్రజల వద్దకు పోతోందని అన్నారు. సోషల్ మీడియాను అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ అభ్యర్థిపై తీవ్రమైన విమర్శలు చేస్తూ ప్రజలను నమ్మించేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. నవీన్‌యాదవ్ మాట్లాడుతూ యువతకు బీఆర్ఎస్ తీరని అన్యాయం చేసిందని, తనను గెలిపిస్తే వారికి అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, వివేక్, మేయర్ విజయలక్ష్మి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ అజహరుద్దీన్, ఆర్టీసీ, గ్రంథాలయ, డైరీ కార్పొరేషన్ల చైర్మన్లు మల్‌రెడ్డి రాంరెడ్డి, అమిత్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు సి.ఎన్.రెడ్డి, విజయారెడ్డి, మాజీ కార్పొరేటర్లు జి.మురళీగౌడ్, సంజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌కు రూ.303 కోట్లు

- 'ఎలివేటెడ్' పరిహారం విడుదల చేసిన రాష్ట్ర ప్రభుత్వం



మధుకర్ నాయక్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ పరిధిలోని ఎలివేటెడ్ కారిడార్‌ల ఏర్పాటు ప్రక్రియలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎలివేటెడ్ కారిడార్‌ల కోసం కంటోన్మెంట్ నుంచి సేకరించిన భూముల పరిహారం నిమిత్తం రూ.303 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాజీవ్ రహదారి మార్గంలో ప్యాట్నీ నుంచి హకీంపేట వరకు, జాతీయ రహదారి–44 మార్గంలో ప్యారడైజ్ నుంచి బోయిన్‌పల్లి చెక్‌పోస్టు వరకు రోడ్ల విస్తరణలో భాగంగా ఆర్మీ, కంటోన్మెంట్, ప్రైవేటు స్థలాలను సేకరిస్తున్నారు. ఇందులో సుమారు 145 ఎకరాల ఆర్మీ స్థలాలకు ప్రత్యామ్నాయంగా ఇతర స్థలాలు కేటాయిస్తూ ఉండగా, కంటోన్మెంట్‌కు చెందిన 24 ఎకరాలకుగాను అంతే విలువ కలిగిన మౌలిక వసతుల కల్పనకు రూ.303 కోట్లు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది. కేంద్ర ప్రభుత్వ ఖాతాలో జమ కావాల్సిన ఈ నిధులను తమకే కేటాయించాల్సిందిగా కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్ కేంద్ర రక్షణ శాఖ పెద్దలకు విజ్ఞప్తి చేశారు. ఈ నిధులతో కంటోన్మెంట్ పరిధిలో నాలాలు, భూగర్భ డ్రైనేజీ లైన్‌ల ఆధునీకరణ చేపడతామని ప్రతిపాదించారు. ఆయా పనులను హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలోనే చేపడతామని తెలిపారు. ఈ మేరకు రక్షణ శాఖ ఆమోదం తెలిపింది. నిధులను ఎస్క్రో అకౌంట్‌లో జమ చేశాకే పనులకు టెండర్లు పిలుస్తామని కంటోన్మెంట్ బోర్డు అధికారులు నిబంధనలు పెట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత రూ.303 కోట్లను ఎస్క్రో అకౌంట్‌లో జమ చేసినట్లు సీఈఓ మధుకర్ నాయక్ తెలిపారు. తన హయాంలోనే నిధుల మంజూరు, ఎంఓయూ పూర్తి కావడం సంతోషంగా ఉందన్నారు. రక్షణ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా ఇటీవలే పదోన్నతి పొందిన ఆయన ఈ నెలాఖరులోపు బదిలీ కానున్నారు. ఇక ఎలివేటెడ్ కారిడార్‌ల కోసం సేకరించనున్న ప్రైవేటు ఆస్తుల పరిహారం వ్యవహారం తేలితే ఆయా కారిడార్‌ల నిర్మాణం వేగం పుంజుకునే అవకాశముంది.

42 శాతం రిజర్వేషన్ల సాధనకు బైక్ ర్యాలీ

ముషీరాబాద్: బీసీల 42 శాతం రిజర్వేషన్‌లపై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈ నెల 18న తలపెట్టిన బంద్‌ను విజయవంతం చేయాలని బీసీ సంఘాల జేఏసీ చైర్మన్, ఎంపీ ఆర్.కృష్ణయ్య కోరారు. ఈ మేరకు బంద్‌కు మద్దతుగా బీసీ జేఏసీ పిలుపు మేరకు మంగళవారం విద్యానగర్ బీసీ భవన్ నుంచి ఉస్మానియా యూనివర్సిటీ మీదుగా గన్‌పార్క్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఆర్.కృష్ణయ్య జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో బైక్ ర్యాలీలు నిర్వహించి బీసీ ప్రజలకు జరిగిన అన్యాయాన్ని వివరించి చైతన్యం చేయాలని పిలుపు నిచ్చారు. ఎమర్జెన్సీ మెడికల్ షాపులు తప్ప అన్ని స్వచ్ఛందంగా బంద్ చేసి బీసీ ఉద్యమంలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ఎలక్షన్ నోటిఫికేషన్ ఇచ్చిన తరువాత స్టే ఇవ్వడం సుప్రీంకోర్టు తీర్పుకు వ్యతిరేకమని పేర్కొన్నారు. రిజర్వేషన్ల కేసులో 30 బీసీ సంఘాలు ఇంప్లీడ్ పిటిషన్లు వేశారని, వాటి వాదన కూడా వినకుండా కోర్టు స్టే ఎలా విధిస్తుందని ప్రశ్నించారు. ఇది చాలా అన్యాయమని అన్నారు. ఈ ర్యాలీలో గవ్వల భరత్‌కుమార్, గుజ్జ సత్యం, టి.రాజ్‌కుమార్, రాజు నేత, అనంతయ్య, రాజేందర్, మణికంఠ, పగిళ్ల సతీష్, ప్రీతం, అరవింద్, నరేష్‌గౌడ్, రవికుమార్, రమేష్ యాదవ్, శివ, ఉత్తమ, నిఖిల్, లక్ష్మిప్రసన్న, రమాదేవి, లత, వంశీ, ప్రసన్న, రాహుల్ పాల్గొన్నారు.



బీసీ సంఘాల బైక్ ర్యాలీలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తదితరులు

అగ్రి వర్సిటీని సందర్శించిన ఆస్ట్రేలియా ప్రొఫెసర్లు

ఏజీ వర్సిటీ: ఆస్ట్రేలియాకు చెందిన ప్రపంచ ప్రఖ్యాత వెస్ట్రన్ సిడ్నీ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ల బృందం మంగళవారం ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ అల్దాస్ జానయ్య, ఇతర అధికారులతో సమావేశమయ్యారు. వ్యవసాయ విద్య, పరిశోధన రంగాల్లో కీలక భాగస్వామ్యాలపై చర్చించి అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందాల ప్రకారం వ్యవసాయ వర్సిటీ, వెస్ట్రన్ సిడ్నీ విశ్వవిద్యాలయం సంయుక్తంగా బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సును ఈ విద్యా సంవత్సరం నుంచే ప్రారంభిస్తున్నాయి. ఇందులో భాగంగా మూడేళ్లు వ్యవసాయ వర్సిటీలో నాల్గో ఏడాది వెస్ట్రన్ సిడ్నీ వర్సిటీలో చదువుకునే విధంగా డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాంపై ఒప్పందం కుదిరింది. పీజీ, పీహెచ్‌డీ కోర్సులను వెస్ట్రన్ సిడ్నీ వర్సిటీలో నేరుగా చదివే విధంగా ఒప్పందం కుదిరింది. ప్రతి ఏడాది 25 నుంచి 30 మంది విద్యార్థులు ఆస్ట్రేలియాలో నేరుగా చదువుకునే అవకాశం కలుగుతుంది. కృత్రిమ మేధా ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని తెలంగాణకు అందించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. కార్యక్రమంలో ఆ రెండు వర్సిటీల అధికారులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ప్రకారం విద్యాబోధన ప్రణాళిక

- పిల్లల హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించాలి
- అనుబంధ శాఖలు నిరంతరం పర్యవేక్షించాలి
- హైదరాబాద్ కలెక్టర్ హరిచందన



సాక్షి, సిటీబ్యూరో: నాణ్యమైన విద్యాబోధనకు క్యాలెండర్ ప్రకారం ప్రణాళిక సిద్ధం చేసి అమలు చేయాలని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో క్లాప్(సిటీ లెవల్ యాక్షన్ ప్లాన్) అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. నగరంలోని పిల్లల రక్షణ, నాణ్యమైన విద్యాబోధన, స్వచ్ఛమైన ఆహార పదార్థాలు అందించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నగరంలోని క్రిటికల్ ప్రాంతాల్లో నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచి పిల్లల హక్కులు, చట్టాలు- సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనాథ పిల్లలకు బర్త్ సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులతోపాటు ఆరోగ్యశ్రీ సేవలను అందించనున్నట్లు వివరించారు. అనాథ పిల్లల విషయంలో నిర్లక్ష్యం చేయరాదని, 12 రకాల వైద్య సేవలు, నిరంతరం హెల్త్ క్యాంపులు చేపట్టి మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. ఫోక్సో కేసుల విషయంలో బాధితులకు నష్టపరిహారం చెల్లింపులో ముందుండాలన్నారు. స్వచ్ఛంద సంస్థలు పిల్లల రక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని గుర్తు చేశారు. ఐసీడీఎస్, మెడికల్, పోలీసులు, కార్మిక శాఖల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రెటరీ అబ్దుల్ జావీద్ , డీసీపీ లావణ్య, ఆర్డీవో రామకృష్ణారావు, జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వరరావు, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటి, యూనిసెఫ్ ప్రతినిధి సోనీ జార్జి, ఫిలిప్స్, అడిషనల్ డీసీపీ మజీద్, బీసీ, ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ సంక్షేమ అధికారులు ఆశన్న, ప్రవీణ్ కుమార్, కోటాజీ, ఇలియాస్ అహ్మద్, దివ్యాంగుల శాఖ ఏడీ రాజేందర్, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ జాన్సన్, సీడబ్ల్యూసీ మెంబర్ ప్రమోద్, సీడీపీవోలు, పోలీస్ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈ-వ్యర్థాల నిర్వహణ సమష్టి బాధ్యత

- తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి



ఈ-వ్యర్థాల నిర్వహణపై జరిగిన సమావేశంలో పాల్గొన్న ఉత్పత్తిదారులు, పునరుద్ధరణదారులు

సనత్‌నగర్: ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులను దీర్ఘ కాలం బాధ్యతాయుతంగా ఉపయోగించడం వల్ల ఈ-వ్యర్థాల ఉత్పత్తిని గణనీయంగా తగ్గించవచ్చని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి(టీజీపీసీబీ) జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ డి.కృపానంద్ అన్నారు. టీజీపీసీబీ ప్రధాన కార్యాలయంలో మంగళవారం అంతర్జాతీయ ఈ-వ్యర్థాల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పునరుద్ధరణదారులు, ఉత్పత్తిదారులు, తయారీదారులతోసహా కీలక భాగస్వాములతో ప్రత్యేక సమావేశం జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన నిర్వహణ, మరమ్మతు, పునర్వినియోగం ద్వారా ఈ-పరికరాల జీవిత కాలాన్ని పొడిగించి వ్యర్థాలను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు. టీజీపీసీబీ సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ దయానంద్ మాట్లాడుతూ ప్రారంభంలోనే ఈ-వ్యర్థాలను సరిగ్గా వేరు చేయడం, అవగాహన కార్యక్రమాలు చేపట్టడం, ప్రత్యేక ఈ-వ్యర్థాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయడం వంటి చర్యలు ఈ-వ్యర్థాల నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తాయన్నారు. పరిశుభ్రమైన, పచ్చటి తెలంగాణను నిర్మించడానికి ప్రజలు, సంస్థల నుంచి భాగస్వామ్యం చాలా అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సోషల్ సైంటిస్ట్ డబ్ల్యూజీ కుమార్ మాట్లాడుతూ ఉపయోగించని వస్తువులను సరిగ్గా పారవేయడం, రీసైక్లింగ్ చేయడం ద్వారా ఈ-వ్యర్థాల ఉత్పత్తి గణనీయంగా తగ్గుతుందన్నారు. హర్ష ప్రాజెక్ట్ ఫ్యాకల్టీ ఈ-వ్యర్థాల నిర్వహణపై ప్రజంటేషన్ ఇచ్చారు.

29న తెలుగు వర్సిటీ సాహితీ పురస్కారాల ప్రదానం

నాంపల్లి: తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఉత్తమ గ్రంథాలకు తెలుగు విశ్వవిద్యాలయం 2023 సంవత్సరానికి పురస్కారాలను ప్రకటించింది. ఈ నెల 29న నాంపల్లి ప్రాంగణంలోని నందమూరి తారక రామారావు కళామందిరంలో పురస్కారాలు ప్రదానం చేస్తామని తెలిపారు. పద్య కవితలో వొజ్జల నరహరి శర్మ(ధర్మపురి వైభవం), వచన కవితా ప్రక్రియలో విశ్వర్షి వాసిలి (నేనే యౌగిక కావ్యం), గేయ కవితలో డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి (తెలంగాణ రుబాయిలు), బాల సాహిత్యంలో డాక్టర్ ఎం.హరికిషన్(చందమామ చెప్పిన కథలు), కథానిక ప్రక్రియలో డాక్టర్ టి.సంపత్ కుమార్ ('నా'నుంచి 'మన'వరకు), నవలా ప్రక్రియలో ఆచార్య పులికొండ సుబ్బాచారి(మాదిగ కొలువు), సాహిత్య విమర్శలో ఆడెపు లక్ష్మీపతి (దిక్చక్రం), నాటకం/నాటికల్లో రావుల పుల్లాచారి (రచ్చబండ), అనువాదంలో టి.సి.వసంత (మృత్యుంజయుడు), వచన రచనల విభాగంలో ఆచార్య పేట శ్రీనివాసులురెడ్డి (తిరుపతి కథలు), రచయిత్రి ఉత్తమ గ్రంథం విభాగంలో డాక్టర్ జంధ్యాల కనకదుర్గ(స్వతంత్రత నుంచి స్వాతంత్ర్యానికి) గ్రంథాలను సాహితీ పురస్కారాలకు ఎంపిక చేసినట్లు తెలుగు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. పురస్కారం కింద ఒక్కొక్కరికి రూ.20,116 నగదు అందజేసి సత్కరిస్తామన్నారు.



శ్రీలంక-న్యూజిలాండ్ మ్యాచ్ వర్షార్పణం

కొలంబో: మహిళల వన్డే ప్రపంచకప్‌లో మరో పోరు వర్షార్పణమైంది. కొలంబోలో నిరంతరాయంగా కురుస్తున్న వానలతో రెండోసారి శ్రీలంక ఖాతాలో ఫలితం తేలని మ్యాచ్ చేరింది. మంగళవారం న్యూజిలాండ్, శ్రీలంక మధ్య జరిగిన లీగ్ మ్యాచ్‌ను ఒక ఇన్నింగ్స్ తర్వాత భారీ వర్షం కారణంగా రద్దు చేయాల్సి వచ్చింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న లంక 50 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 258 పరుగులు చేసింది. నీలాక్షిక సిల్వ (28 బంతుల్లో 55 నాటౌట్; 7 ఫోర్లు, 1 సిక్స్), చమరి అటపట్టు (72 బంతుల్లో 53; 7 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించగా... హాసిని పెరీరా (44),విష్మి గుణరత్నే (42) రాణించారు. కివీస్ బౌలర్లలో సోఫీ డివైన్ 3, బ్రీ ఇల్లింగ్ 2 వికెట్లు పడగొట్టారు. అయితే లంక బ్యాటింగ్ ముగిసిన తర్వాత మొదలైన వర్షం ఆ తర్వాత కొంచెం కూడా తెరిపిని వ్వలేదు. దాంతో న్యూజిలాండ్‌కు బ్యాటింగ్ చేసే అవకాశమే రాలేదు. చివరకు అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 4న కొలంబోలోనే శ్రీలంక, ఆస్ట్రేలియా జట్ల మధ్య మ్యాచ్ కూడా ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. కొలంబోలోనే నేడు జరిగే మ్యాచ్‌లో పాకిస్తాన్‌తో ఇంగ్లండ్ ఆడుతుంది.

'ప్రపంచకప్ టోర్నీకి చాలా సమయం ఉంది'



- రోహిత్, కోహ్లి భవిష్యత్తుపై గంభీర్ వ్యాఖ్య
- రాబోయే సిరీస్‌పైనే దృష్టి పెట్టామన్న హెడ్ కోచ్


న్యూఢిల్లీ: భారత్, ఆస్ట్రేలియా మధ్య ఈ నెల 19 నుంచి మూడు వన్డేల సిరీస్ జరగనుంది. సిరీస్ ఫలితంకంటే విరాట్ కోహ్లి, రోహిత్ శర్మల గురించే ఇప్పుడు చర్చ జరుగుతోంది. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ తర్వాత మళ్లీ ఈ సిరీస్‌తోనే బరిలోకి దిగుతున్న వీరిద్దరు ఇప్పటికే రెండు ఫార్మాట్‌ల నుంచి రిటైర్ అయి ఒక్క వన్డేలే ఆడుతున్నారు. ఈ క్రమంలో రోహిత్‌ను వన్డే కెప్టెన్సీ నుంచి కూడా తప్పించారు. ఈనేపథ్యంలో తాజా చర్చపై భారత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. ఇప్పటికిప్పుడు వారిద్దరి భవిష్యత్తుపై తానేమీ చెప్పలేనని స్పష్టం చేశాడు. 'వన్డే వరల్డ్‌కప్‌కు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది. కాబట్టి భవిష్యత్తుకంటే ప్రస్తుతంపైనే దృష్టి పెట్టడం ముఖ్యమని నేను భావిస్తా. వారిద్దరు అత్యుత్తమ ఆటగాళ్లు అనడంలో సందేహం లేదు. పునరాగమనం చేస్తున్న వారి అనుభవం ఆస్ట్రేలియాలో పనికొస్తుంది. వీరిద్దరు బాగా ఆడి సిరీస్ విజయంలో భాగమవుతారని ఆశిస్తున్నా' అని గంభీర్ చెప్పాడు.

గిల్‌కు కెప్టెన్సీ అర్హత ఉంది...

భారత టెస్టు కెప్టెన్సీతో పాటు వన్డేలకు కూడా సారథ్యం వహించే సత్తా, అర్హత శుబ్‌మన్ గిల్‌కు ఉన్నాయని, ఈ హక్కును అతను సాధించుకున్నాడని గంభీర్ ప్రశంసించాడు. 'కెప్టెన్‌గా గిల్‌ను నియమించి ఎవరూ ఔదార్యం చూపించలేదు. అతడికి ఆ అర్హత ఉంది. కోచ్‌గా కూడా నేను ఈ మాట చెప్పగలను. ప్రపంచ క్రికెట్‌లో అతి కఠినమైన పర్యటనల్లో ఇంగ్లండ్ ఒకటి. అలాంటి చోట ఐదు టెస్టులూ గట్టిగా నిలబడి సిరీస్‌ను సమం చేసుకోగలగడం చిన్న విషయం కాదు. బ్యాటింగ్‌లోనూ అదరగొట్టడంతో పాటు జట్టును సమర్థంగా నడిపి వన్డేల్లోనూ సారథి కాగల హక్కును అతను సాధించాడు' అని గంభీర్ అన్నాడు. 2027 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ గురించి ఇప్పుడే మాట్లాడటం అనవసరమని, వరుసగా విజయాలు సాధించడమే తమ లక్ష్యమని అతను స్పష్టం చేశాడు. భారత జట్టు నవంబర్ 9న ఆస్ట్రేలియాతో చివరి టెస్టు ఆడనుండగా... నవంబర్ 14 నుంచి కోల్‌కతాలో దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు జరుగుతుంది. అయితే ప్రొఫెషనల్ క్రికెటర్లు తక్కువ సమయంలో పరిస్థితులకు తగినట్లుగా మార్చుకోగలరని విశ్వాసం వ్యక్తం చేసిన గంభీర్... టెస్టు టీమ్‌లో మాత్రమే సభ్యులైన ఆటగాళ్లు రంజీ ట్రోఫీలో బరిలోకి దిగాలని సూచించాడు. వెస్టిండీస్‌తో టెస్టు సిరీస్ గెలవడం పట్ల కోచ్ సంతృప్తి వ్యక్తం చేశాడు. అయితే భారత్‌లో కూడా పేస్ బౌలర్లకు కూడా కాస్త అనుకూలించే విధంగా బౌన్సీ పిచ్‌లు ఉంటే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశాడు.

హర్షిత్ రాణాపై అనవసర విమర్శలు...

భారత జట్టు తరఫున మూడు ఫార్మాట్‌లలోనూ వరుసగా అవకాశాలు పొందుతున్న పేస్ బౌలర్ హర్షిత్ రాణాపై ఇటీవల సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వస్తున్నాయి. ప్రతిభావంతుడు కాకపోయినా... ఢిల్లీకి చెందినవాడు కావడంతో పాటు గంభీర్ ఐపీఎల్ టీమ్ కేకేఆర్‌కు మెంటార్‌గా ఉన్న సమయంలో సాన్నిహిత్యం వల్లే రాణాకు జట్టులో చోటు దక్కుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భారత మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ కూడా ఇటీవల ఇదే మాట అన్నాడు. తాజా విమర్శలపై గంభీర్ తీవ్రంగా స్పందించాడు. ఈ వివాదంలో హర్షిత్‌కు అతను పూర్తి మద్దతు పలికాడు. 'యూట్యూబ్‌లో వ్యూస్ కోసం కొందరు ఒక 23 ఏళ్ల యువ ఆటగాడిని లక్ష్యంగా చేసుకున్నందుకు సిగ్గు పడాలి. రాణా తండ్రి మాజీ క్రికెటర్ కాదు. సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ కానీ ఎన్‌ఆర్‌ఐ కానీ కాదు. అతను తన ప్రతిభను నమ్ముకొనే క్రికెట్ ఆడుతున్నాడు. ఒక ఆటగాడి ప్రదర్శన బాగా లేకుండా విమర్శించవచ్చు కానీ ఇలా వ్యక్తిగత విమర్శలు చేస్తారా. కావాలంటే నన్ను విమర్శించండి. నేను దానిని భరించగలను. కానీ 23 ఏళ్ల ఆటగాడిపై ఇది మానసికంగా ఎలాంటి ప్రభావం చూపిస్తుందో ఆలోచించారా. భారత క్రికెట్ జట్టు ఎవరిదో సొంత ఆస్తి కాదు. మన జట్టు గెలవాలని భావించే అందరిది ఈ జట్టు అని మర్చిపోవద్దు' అని గంభీర్ వ్యాఖ్యానించాడు.



లాంఛనం ముగిసింది

రెండో టెస్టులో 7 వికెట్లతో భారత్ జయభేరి

వెస్టిండీస్‌పై 2-0తో సిరీస్ క్లీన్‌స్వీప్ ● కేఎల్ రాహుల్ అర్ధశతకం

న్యూఢిల్లీ: వెస్టిండీస్ మూడో **రోజు ఫాలోఆన్‌లో** రెండో ఇన్నింగ్స్‌తో మొదలుపెట్టిన **పోరాటం** నాలుగో రోజూ కొనసాగడం... **ఇద్దరి సెంచరీల** మైలురాయితో ఆతిథ్య భారత్ **ముందు లక్ష్యాన్ని** ఉంచడంతో ఈ చివరి టెస్టు **చివరి రోజుదాకా** సాగింది. మంగళవారం ఆటలో **భారత్ సులువైన** లక్ష్య ఛేదనలో మిగిలిపోయిన **లాంఛనాన్ని తొలి** సెషన్‌లోనే పూర్తి చేసింది. అలా **రెండో టెస్టులో** టీమిండియా 7 వికెట్ల తేడాతో **వెస్టిండీస్‌పై ఘనవి**జయం సాధించింది. భారత్ **రెండో ఇన్నింగ్స్‌లో** 35.2 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి **124 పరుగులు చేసి** గెలిచింది. ఓవర్‌నైట్ బ్యాటర్ **కేఎల్ రాహుల్ (108** బంతుల్లో 58 నాటౌట్; 6 ఫోర్లు, **2 సిక్స్‌లు) అర్ధ**శతకం సాధించాడు. రోస్టన్ చేజ్ **2 వికెట్లు తీయగా...** వారికెన్‌కు ఒక వికెట్ దక్కింది. **రవీంద్ర జడేజాకు** 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' లభించింది**. రెండు టెస్టుల్లో** ఆడిన ఒకే ఇన్నింగ్స్‌తో శతక్కొట్టిన **జడేజా 8 వికెట్లు** కూడా తీశాడు. కాగా ఈ రెండో **టెస్టులో 8 వికెట్లు** (5/82, 3/104) పడగొట్టిన **కుల్దీప్ యాదవ్‌కు** 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

గంటసేపు పైగా...

ఆఖరి రోజు మిగిలిపోయిన 58 పరుగులు చేసేందుకు 63/1 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ కాసేపటికే సాయి సుదర్శన్ (76 బంతుల్లో 39; 5 ఫోర్లు) వికెట్‌ను కోల్పోయింది. ఓవర్‌నైట్ బ్యాటర్ రాహుల్‌కు జతయిన కెప్టెన్ శుబ్‌మన్ గిల్ (13) కూడా వికెట్‌ను సమర్పించుకోవడంతో లాంఛనం పూర్తి చేసేందుకు భారత్ గంటసేపు పైగానే ఆడాల్సి వచ్చింది. క్రీజులోకి ధ్రువ్ జురేల్ (6 నాటౌట్; 1 ఫోర్) రాగా... 102 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్న రాహుల్ అజేయంగా నిలిచి భారత్‌ను గెలిపించాడు. కేఎల్ రాహుల్ తొలి టెస్టులో శతకంతో కదంతొక్కాడు. ఈ క్లీన్‌స్వీప్ విజయంతో టీమిండియా 'ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్' పాయింట్ల పట్టికలో 61.9 శాతంతో మూడో స్థానాన్ని పటిష్టం చేసుకుంది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: 518/5 డిక్లేర్డ్; వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్: 248; వెస్టిండీస్ రెండో ఇన్నింగ్స్: 390; **భారత్ రెండో** ఇన్నింగ్స్: యశస్వి జైస్వాల్ **(సి) ఫిలిప్ (బి)** వారికెన్ 8; రాహుల్ (నాటౌట్) **58; సాయి సుదర్శన్** (సి) షై హోప్ (బి) చేజ్ 39; గిల్ (సి) గ్రీవెస్ (బి) చేజ్ 13; ధ్రువ్ జురేల్ (నాటౌట్) 6; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం** (35.2 ఓవర్లలో 3 వికెట్లకు) 124. వికెట్ల పతనం: 1-9, 2-88, 3-108. బౌలింగ్: సీల్స్ 3-0-14-0, వారికెన్ 15.2-4-39-1, పియర్ 8-0-35-0, చేజ్ 9-2-36-2.

10 వెస్టిండీస్‌పై భారత్ వరుస సిరీస్ విజయాల సంఖ్య. దక్షిణాఫ్రికా పేరిట ఉన్న ఒకే జట్టుపై వరుస సిరీస్ విజయాల రికార్డును భారత్ సమం చేసింది. దక్షిణాఫ్రికా జట్టు కూడా విండీస్‌పై వరుసగా పది సిరీస్‌లలో గెలిచింది.

14 ఢిల్లీ గడ్డపై టీమిండియా అజేయ రికార్డు. భారత్ 1993 నుంచి ఇక్కడ ఆడిన 14 మ్యాచ్‌ల్లో ఒక్కటి కూడా ఓడలేదు. 12 టెస్టులు గెలువగా, రెండు 'డ్రా' అయ్యాయి.

122 సొంతగడ్డపై భారత్ గెలిచిన టెస్టులు. సంప్రదాయ క్రికెట్ చరిత్రలోనే ఇది మూడో అత్యధికం. ఆస్ట్రేలియా (262), ఇంగ్లండ్ (241) మాత్రమే ముందున్నాయి.

భారత్-పాకిస్తాన్ హాకీ మ్యాచ్ 'డ్రా'



జొహోర్ (మలేసియా): సుల్తాన్ ఆఫ్ జొహోర్ కప్ అండర్-21 అంతర్జాతీయ జూనియర్ హాకీ టోర్నీలో భారత్ ఖాతాలో తొలి 'డ్రా' చేరింది. చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో మంగళవారం జరిగిన మూడో లీగ్ మ్యాచ్‌ను భారత జట్టు 3-3 గోల్స్‌తో 'డ్రా'గా ముగించింది. భారత్ తరఫున అరిజిత్ సింగ్ (43వ నిమిషంలో), ఆనంద్ (47వ నిమిషంలో), మన్మీత్ (53వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. పాకిస్తాన్ తరఫున హన్నాన్ షాహిద్ (5వ నిమిషంలో) ఒక గోల్.. సుఫియాన్ ఖాన్ (39వ, 55వ నిమిషంలో) రెండు గోల్స్ చేశాడు. ఆరు జట్లు పోటీపడుతున్న ఈ టోర్నీలో భారత్ ఏడు పాయింట్లతో ఆస్ట్రేలియాతో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది.

ఆసియా కప్ ఆశలు గల్లంతు

సింగపూర్ చేతిలో ఓడిన భారత్



మార్గావ్: ఆసియా కప్-2027 ఫుట్‌బాల్ టోర్నీకి అర్హత సాధించడంలో భారత్ విఫలమైంది. క్వాలిఫికేషన్ టోర్నీలో రెండో పరాజయంతో జట్టు నిష్క్రమణ ఖాయమైంది. మంగళవారం జరిగిన గ్రూప్ 'సి' మ్యాచ్‌లో సింగపూర్ 2-1 గోల్స్ తేడాతో భారత్‌ను ఓడించింది. సింగపూర్ తరఫున సంగ్ యు యంగ్ 44వ, 58వ నిమిషాల్లో గోల్స్ నమోదు చేశాడు. భారత్ తరఫున లాలియన్‌జువల చాంగ్తే 14వ నిమిషంలో ఏకైక గోల్ సాధించాడు. గ్రూప్ 'సి'లో టీమిండియా చివరి స్థానంలో ఉంది. గ్రూప్ విజేత మాత్రమే ఆసియా కప్‌కు అర్హత సాధిస్తుంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

అందుకు తెగించే ఇక్కడ ఉన్నాను



- సిద్ధు జొన్నలగడ్డ

''నేను ఏ సినిమా చేసినా నాపై నాకే ఎక్స్‌పెక్టేషన్స్ ఎక్కువగా ఉంటాయి. ఇప్పుడే డీటీఎస్‌లో 'తెలుసు కదా' సినిమా చూశాను. చాలా ఎగ్జైట్ అయ్యాను. ఇదే ఎగ్జైట్ మెంట్‌ని ఆడియన్స్ కూడా ఫీలవుతారని అనుకుంటున్నా'' అని సిద్ధు జొన్నలగడ్డ అన్నారు. సిద్ధు జొన్నలగడ్డ హీరోగా నటించిన చిత్రం 'తెలుసు కదా'. ఈ చిత్రంలో రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటించారు. నీరజా కోన దర్శకత్వంలో టీజీ విశ్వప్రసాద్, కృతీ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 17న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం విలేకరుల సమావేశంలో సిద్ధు జొన్నలగడ్డ చెప్పిన విశేషాలు.

● 'తెలుసు కదా'లో నేను వరుణ్ పాత్రలో కనిపిస్తాను. స్క్రీన్‌పై వరుణ్ మామూలుగా కనిపిస్తున్నప్పటికీ అతని ఆలోచనలు చాలా ర్యాడికల్‌గా ఉంటాయి. ఈ క్యారెక్టరైజేషన్ చూసి, ఆడియన్స్ షాక్ అవుతారనుకుంటున్నాను. ఫస్టాఫ్‌లో శ్రీనిధి, సెకండాఫ్‌లో రాశీ క్యారెక్టర్స్ బలంగా కనిపిస్తాయి. వీరిద్దరి కంటే వరుణ్ రోల్ ఇంకా స్ట్రాంగ్‌గా ఉంటుంది. ● కొత్తవాళ్లతో వర్క్ చేయడం రిస్క్‌తో కూడుకున్న పనే. కానీ రిస్క్ ఉన్న చోటే రివార్డు కూడా ఉంటుంది. నీరజగారి ఐడియాలు బాగున్నాయి. కాకపోతే హీరో క్యారెక్టరైజేషన్‌ను కాస్త ఇంప్రూవ్ చేసిన తర్వాత షూటింగ్‌కు వెళ్లాం. డబ్బుల గురించి ఆలోచించకుండా మంచి సినిమా తీయమని ప్రోత్సహించే నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌గారు. అందుకే విజువల్‌గా 'తెలుసు కదా' స్క్రీన్‌పై పెద్ద సినిమాలా కనిపిస్తుంది. ● సినిమా మేకింగ్‌లో జోక్యం చేసుకుంటున్నానంటే నా కోసం ఎవరూ కథలు రాయలేదు. నా కథలు నేనే రాసుకున్నాను. ఫిల్మ్ మేకింగ్ గురించిన ప్రతి విషయాన్ని నేర్చుకున్నాను. ఒకవేళ సినిమా హిట్టయితే డైరెక్షన్, మ్యూజిక్, సినిమాటోగ్రఫీ, హీరో హీరోయిన్ల యాక్టింగ్... ఇలా అన్నీ బాగున్నాయి అంటారు. అదే ఫ్లాప్ అయితే నేను ఇన్వాల్వ్ అయ్యాను కాబట్టి పోయిందని నిందిస్తారు. ఇందుకు తెగించే ఇక్కడ ఉన్నాను. ● నేను హీరోగా నటించిన 'డీజే టిల్లు, డీజే టిల్లు 2' సినిమాలు సూపర్‌హిట్స్‌గా నిలిచాయి. ఈ డీజే టిల్లు క్యారెక్టరైజేషన్ 'హై' వల్ల నా సినిమాలు ఒకట్రెండు ఫలితాలు తారుమారు కావొచ్చని ముందే ఊహించాను. 'జాక్' సినిమా ఆడియన్స్‌ను మెప్పించలేకపోయింది. అప్పుడు కొరటాల శివగారు ఫోన్ చేసి, 'డీజే టిల్లు' హిట్స్‌తో ఆల్ టైమ్ 'హై' చూశావ్... 'జాక్'తో 'లో' చూశావ్. ఇక నువ్వేం చేసినా ఆ రెండింటి మధ్య చూస్తావు'' అన్నారు. ఆ మాటలు నాలో కొత్త ఆలోచనలు కలిగించాయి. ● ఇటీవల ఓ ఇబ్బందికర ప్రశ్న ఎదుర్కొన్నాను. సినిమాల్లో హీరో పోలీసాఫీసర్ అయితే రియల్‌గానూ పోలీస్‌గా ఉంటారా? హీరో డ్రగ్ ఎడిక్ట్ అయితే రియల్ లైఫ్‌లోనూ డ్రగ్ ఎడిక్టై ఉంటారా? అది సినిమా. హీరో ఆన్సర్ చేసే పొజిషన్‌లో ఉన్నాడు కదా అని ఏది పడితే అది అడిగేయడం కరెక్ట్ కాదు. ● 'తెలుసు కదా' ప్రమోషన్స్‌లో భాగంగా రవితేజగారి బయోపిక్ చేయాలని ఉందని చెప్పాను... చూడాలి. ఇక నాకు డైరెక్టర్‌గా మారే ఆలోచన కూడా ఉంది. హీరోగా నా తర్వాతి సినిమా 'బ్యాడాస్' కొత్తగా ఉంటుంది. మల్లిక్ రామ్‌తో ఓ సినిమా చేయాల్సి ఉంది.

ఫ్లాష్‌బ్యాక్‌లో యాక్షన్



● ఎన్టీఆర్

ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎన్టీఆర్ నీల్' (వర్కింగ్ టైటిల్). 'కేజీఎఫ్, సలార్' చిత్రాల తర్వాత డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న సినిమా ఇది. రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్‌పై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న పాన్ ఇండియా చిత్రమిది. ఈ సినిమాలో వచ్చే ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్స్ కోసం ఎన్టీఆర్ ఓ డిఫరెంట్ లుక్‌లోకి మారారని టాక్. ఫ్లాష్‌బ్యాక్‌లో వచ్చే పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాలు సినిమాలో హైలైట్‌గా నిలవనున్నాయట. ఇదిలా ఉంటే... ఈ సినిమాకి 'డ్రాగన్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు ఫిల్మ్ నగర్ టాక్. ఈ చిత్రం 2026 జూన్ 25న తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

'వార్ 2' రికార్డ్ : హృతిక్ రోషన్, ఎన్టీఆర్, కియారా అద్వానీ ముఖ్య తారలుగా నటించిన చిత్రం 'వార్ 2'. అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో యశ్ రాజ్ ఫిల్మ్స్‌పై ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 14న విడుదలైంది. ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్ ఓటీటీ వేదికగా ఈ నెల 6 నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. అత్యధిక మంది వీక్షించిన చిత్రాల జాబితాలో 'వార్ 2' చిత్రం టాప్‌లో ఉన్నట్లు ప్రముఖ మీడియా సంస్థ ఆర్మాక్స్ తెలిపింది. ఈ నెల 6 నుంచి 12 వరకూ 3.5 మిలియన్ల మంది వీక్షించినట్లు ఆ సంస్థ ప్రకటించింది. దీంతో గత వారం ఇండియాలోనే ఎక్కువ మంది చూసిన సినిమాగా 'వార్ 2' నిలిచింది.

కుందేలుకి కోపం వస్తే..!



● చిరంజీవి, నయనతార

''మీసాల పిల్లా నీ ముక్కు మీద కోపం కొంచెం తగ్గాలే పిల్లా... మీసాల పిల్లా నీ ముక్కు మీద కోపం కొంచెం తగ్గాలే పిల్లా... పొద్దునలేచిన దగ్గర్నుంచి డైలీ యుద్ధాలా... మొగుడు పెళ్లాలంటే కంకీ కొడవల్లా... అట్ట కస్సిర చెయ్యాలా... కారాలే నూరేలా...'' అంటూ సాగుతుంది 'మీసాల పిల్లా...' పాట. చిరంజీవి హీరోగా నటిస్తున్న 'మన శంకరవరప్రసాద్‌గారు' సినిమాలోనిది ఈ పాట. ఈ చిత్రంలో నయనతార హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఇందులో చిరంజీవి, నయనతార భార్యా భర్తలుగా కనిపిస్తారు. ఈ సినిమాలోని 'మీసాల పిల్లా...' పాట లిరికల్ వీడియోను రిలీజ్ చేశారు మేకర్స్. భీమ్స్ సిసిరోలియో స్వరపరచిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా ఉదిత్ నారాయణ్ ఆలపించారు. ''ఇట్ట దుమ్మెత్తి పొయ్యాలా దూరాలె పెంచేలా... కుందేలుకి కోపం వస్తే చిరుతకు చెమటలు పట్టేలా...' అంటూ ఈ పాట సాగుతుంది. అర్చన సమర్పణలో అనిల్ రావిపూడి దర్శకత్వంలో సాహు గారపాటి, సుస్మిత కొణిదెల నిర్మిస్తున్న 'మన శంకరవరప్రసాద్‌గారు' సినిమా వచ్చే సంక్రాంతి సందర్భంగా విడుదల కానుంది.

కబడ్డి... కబడ్డి



● ధృవ్

ప్రముఖ తమిళ హీరో విక్రమ్ తనయుడు ధృవ్ హీరోగా అనుపమా పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'బైసన్'. మారి సెల్వరాజ్ దర్శకత్వం వహించారు. పా. రంజిత్ సమర్పణలో నీలం స్టూడియోస్, అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్‌పై సమీర్ నాయర్, దీపక్ సెగల్, పా. రంజిత్, అదితీ ఆనంద్ నిర్మించిన ఈ చిత్రం తమిళంలో ఈ నెల 17న విడుదల కానుంది. తెలుగులో జగదాంబే ఫిలిమ్స్ పై బాలాజీ ఈ నెల 24న విడుదల చేస్తున్నారు. ఈ సినిమా ట్రైలర్‌ను హీరో రానా రిలీజ్ చేసి, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ– ''1990 బ్యాక్‌డ్రాప్‌లో కబడ్డి నేపథ్యంలో రూపొందిన చిత్రం 'బైసన్'. ట్రైలర్ ఎంత ఆసక్తికరంగా ఉందో సినిమా కూడా థ్రిల్లింగ్ అంశాలతో అందర్నీ ఆకట్టుకునేలా ఉంటుంది. స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్ సినిమాలకు తెలుగులో మంచి ఆదరణ దక్కుతుంది. కబడ్డి నేపథ్యంలో రాబోతున్న మా సినిమా కూడా మంచి విజయం అందుకుంటుందని నమ్ముతున్నాను'' అన్నారు.

అరి కథతో పుస్తకం తీసుకొస్తున్నాం

- జయశంకర్



● వినోద్ వర్మ, జయశంకర్

''అరిషడ్వర్గాల గురించి ఎంతోమంది గొప్పవాళ్లు చెబుతూ వచ్చారు. కానీ, వాటికి పరిష్కారం చూపించలేదు. ఈ ఆలోచనతోనే 'అరి' చిత్రాన్ని రూపొందించాను. ఈ సినిమా కథతో త్వరలోనే పుస్తకాన్ని తీసుకొస్తున్నాం'' అని దర్శకుడు జయశంకర్ చెప్పారు. వినోద్ వర్మ, అనసూయ, సాయి కుమార్, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'అరి'. రామిరెడ్డి వెంకటేశ్వర రెడ్డి (ఆర్‌వీ రెడ్డి) సమర్పణలో శ్రీనివాస్ రామిరెడ్డి, డి. శేషురెడ్డి మారంరెడ్డి, డా. తిమ్మప్ప నాయుడు పురిమెట్ల, బీరం సుధాకర్ రెడ్డి నిర్మించారు. ఏషియన్-సురేష్ డిస్ట్రిబ్యూషన్ ద్వారా ఈ నెల 10న విడుదలైంది. ఈ సినిమా సక్సెస్ మీట్‌లో జయశంకర్ మాట్లాడుతూ– ''మా సినిమాకి స్లోగా ఓపెనింగ్స్ వచ్చి పికప్ అవుతుందనుకున్నాం. అయితే శ్రీకాంత్ అయ్యంగార్ ఇష్యూ వల్ల రెండో రోజునే మా సినిమా పోస్టర్స్‌ను థియేటర్స్ దగ్గర చించివేయడం బాధగా అనిపించింది. ఆ తర్వాత ఆ వివాదం సద్దుమణిగింది. మూడో రోజు నుంచి మా సినిమాకి ప్రేక్షకుల సందడి కనిపించింది'' అని పేర్కొన్నారు. ''పేపర్ బాయ్'లో అవకాశం ఇచ్చి, నాకు గుర్తింపు తీసుకొచ్చిన జయశంకర్‌గారు ఇప్పుడు 'అరి'లో లీడ్ రోల్ ఇచ్చి మరింత గుర్తింపు తెచ్చుకునేలా చేసినందుకు థ్యాంక్స్'' అని నటుడు వినోద్ వర్మ తెలిపారు.

ఫ్యామిలీ ఆడియన్స్ చూడొచ్చు

- నిర్మాత రాజేశ్ దండ

''నిర్మాతగా 'కె-ర్యాంప్' నాకు ఆరవ సినిమా. నా గత ఐదు చిత్రాల్లో ఎక్కడా ఇబ్బందికరమైన పదాలు లేవు. ఒక్కో సినిమా కథ ఒక్కోలా ఉంటుంది. అంతే కానీ కావాలని కొన్ని పదాలు పెట్టి, ప్రేక్షకులను థియేటర్స్‌కు రప్పించాలని అనుకోను. అలాంటి సినిమాలు నేను తీయను. 'కె-ర్యాంప్' చిత్రం ఫ్యామిలీ ఆడియన్స్ చూడొచ్చు'' అని చెప్పారు నిర్మాత రాజేశ్ దండ. కిరణ్ అబ్బవరం, యుక్తీ తరేజా హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'కె-ర్యాంప్'. జైన్స్ నాని దర్శకత్వంలో రాజేశ్ దండ, శివ బొమ్మకు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో రాజేశ్ దండ మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో కిరణ్‌గారు కుమార్ అబ్బవరం అనే పాత్రలో నటించారు. ఈ సినిమా కథ విని ఎగ్జైట్ అయ్యాను. మా సినిమాకు సెన్సార్ వాళ్ళు 'ఏ' సర్టిఫికెట్ ఇచ్చింది ఇందులో ఇబ్బందికరమైన పదాలు ఉన్నాయని కాదు. ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాలు ఉన్నాయి. వీటిని చూసి ఎవరైనా ఆడియన్స్ ప్రేరణ పొందుతారేమోనని 'ఏ' సర్టిఫికెట్ ఇచ్చారు... అంతే. వల్గారిటీ లేదు. ఇక 'కె-ర్యాంప్' సినిమా కిరణ్‌గారి వన్ మ్యాన్ షోలా ఉంటుంది. ఇంట్రవెల్ బ్యాంగ్ బ్లాస్ట్ అవుతుంది. ఈ సినిమాతో నిర్మాత శివతో నాకు మంచి ప్రయాణం మొదలైంది. నా మీద నమ్మకంతో కథ వినకుండానే ఈ సినిమాలో భాగమయ్యారు శివ. ప్రస్తుతం మా బ్యానర్‌లో హీరోయిన్ సంయుక్తతో ఓ సినిమా చేస్తున్నాం. అలాగే 'అల్లరి' నరేశ్‌గారితో ఓ సినిమా ఉంది'' అని అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ''టార్గెటెడ్ ట్రోలింగ్ గురించి బన్నీ వాసుగారు మాట్లాడిన విషయాలను నేను ఫాలో కాలేదు. పూర్తి విషయాలు తెలిసిన తర్వాత స్పందిస్తాను'' అని చెప్పారు. ''కిరణ్‌గారిని ఈ సినిమాలో కొత్తగా చూస్తారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించేలా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు శివ బొమ్మకు.



● రాజేశ్ దండ, శివ బొమ్మకు

సస్పెన్స్ సీమంతం



● సుధాకర్, ఆర్పీ పట్నాయక్

''ప్రస్తుతం సమాజంలో నెలకొన్న ఓ ప్రధానమైన సమస్య నేపథ్యంలో రూపొందిన 'సీమంతం' సినిమా మంచి విజయం సాధించాలి. 'ఎద మాటున...' పాట బాగుంది. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి'' అని సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ తెలిపారు. వజ్రయోగి, శ్రేయ భర్తీ జంటగా సుధాకర్ పాణి దర్శకత్వం వహించిన చిత్రం 'సీమంతం'. ప్రశాంత్ టాటా నిర్మించిన ఈ సినిమా నవంబరు 14న విడుదల కానుంది. ఎస్. సుహాస్ సంగీతం అందించిన ఈ చిత్రం నుంచి 'ఎద మాటున...' అంటూ సాగే పాటని ఆర్పీ పట్నాయక్ రిలీజ్ చేశారు. ''సస్పెన్స్ క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'సీమంతం'. గర్భవతులపై దాడుల నేపథ్యంలో కథ సాగుతుంది'' అని యూనిట్ పేర్కొంది.

సాక్షి బిజినెస్
బుధవారం
15-10-2025

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
297	82
82,030	25,146

విదేశీ సూచీలు

నాస్‌డాక్	22,652	▽	43
డోజోన్స్	46,470	△	420
ఎఫ్‌టీఎస్‌ఈ 100	9,443	△	1
డాక్స్	24,233	▽	155
షాంఘై	3,865	▽	24
నికాయ్	46,847	▽	1,241

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	88.34	89.36
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	116.97	119.94
€	యూరో	ఎస్‌బీఐ	101.38	104.16
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.69	59.14
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	56.70	58.97
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	65.95	69.66
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.80	24.29
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.30	24.54
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.56	13.38

4 వారాల్లో లక్షల బుకింగ్స్

- 2.5 లక్షల కార్ల అమ్మకాలు
- మారుతి సుజుకీ అరుదైన రికార్డు



న్యూఢిల్లీ: ఎంట్రీ లెవల్ కార్లకు భారీగా డిమాండ్ నెలకొనడంతో మారుతీ సుజుకీ గడిచిన 4 వారాల్లో 4 లక్షల బుకింగ్స్ సాధించింది. రికార్డు స్థాయిలో 2.5 లక్షల యూనిట్లను విక్రయించింది. ''జీఎస్‌టీ రేట్ల క్రమబద్ధీకరణ తర్వాత కొత్త ధరలు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి రావడంతో ఎంట్రీ లెవల్ కార్ల అమ్మకాలు అనూహ్యంగా పెరిగాయి. గడిచిన నెల రోజుల్లో మొత్తం 4 లక్షల బుకింగ్స్ నమోదయ్యాయి. అంటే వారానికి ఒక లక్ష బుకింగ్స్. ఇదే సమయంలో 2.5 లక్షల కార్ల అమ్మకాలు జరిగాయి. కంపెనీకిది అత్యుత్తమ పండుగ సీజన్‌గా నిలిచింది'' అని మారుతీ సుజుకీ సీనియర్ అధికారి పార్థో బెనర్జీ తెలిపారు. ముఖ్యంగా చిన్న కార్ల విభాగానికి చెందిన ఆల్టో, సెలెరియో, వేగనార్, ఎస్–ప్రెస్సో మొత్తం 80,000 బుకింగ్‌లు నమోదయ్యాయని తెలిపారు. జీఎస్‌టీ 2.0 అమలు తర్వాత రేట్లు దిగి రావడంతో కంపెనీ మొత్తం అమ్మకాల్లో 16.7%గా ఉండే చిన్న కార్ల వాటా 21.5 శాతానికి పెరిగిందన్నారు. తొలిసారి కార్లను కొనేందుకు షోరూంను సందర్శిస్తున్న కస్టమర్ల సంఖ్య పెరుగుతుండటంతో వినియోగ స్వభావం ద్విచక్ర వాహనాల నుంచి కార్లకు మారే స్వభావాన్ని సూచిస్తుందన్నారు.

పసిడి పండుగ..



- బంగారం @ రూ. 1.30 లక్షలు
- మరో రూ. 2,850 అప్
- వెండి రూ. 1,85,000

న్యూఢిల్లీ: పండుగ సీజన్ సందర్భంగా కొనుగోళ్లు వెల్లువెత్తడంతో పసిడి మరో కొత్త మైలురాయి దాటింది. మంగళవారం దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 10 గ్రాముల పుత్తడి ధర మరో రూ. 2,850 పెరిగి ఏకంగా రూ. 1.30 లక్షలను అధిగమించింది. ఆలిండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం 99.9 శాతం స్వచ్ఛత గల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,30,800కి చేరింది. ఇక 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం ధర కూడా అంతే పెరిగి రూ. 1,30,200కి చేరింది. మరోవైపు, వెండి సైతం కేజీకి రూ. 6,000 ఎగిసి సరికొత్త జీవిత కాల గరిష్టమైన రూ. 1,85,000ని తాకింది. పండుగ, పెళ్లిళ్ల సీజన్ సందర్భంగా జ్యుయలర్లు, రిటైలర్ల నుంచి డిమాండ్ గణనీయంగా పెరగడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 12 పైసలు క్షీణించి 88.80కి పడిపోవడం వంటి అంశాలు పసిడి పెరుగుదలకు కారణమని ట్రేడర్లు తెలిపారు.

అటు ఫ్యూచర్స్ మార్కెట్ మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజీలో (ఎంసీఎక్స్) డిసెంబర్ కాంట్రాక్టు రూ. 2,301 పెరిగి రూ. 1,26,930కి చేరింది. ఫిబ్రవరి కాంట్రాక్టు సైతం రూ. 2,450 ఎగిసి రూ. 1,28,220 రికార్డు స్థాయిని తాకింది. పుత్తడికి దీటుగా వెండి డిసెంబర్ కాంట్రాక్టు కూడా కేజీకి రూ. 8,055 పెరిగి రూ. 1,62,700 స్థాయిని తాకింది. అంతర్జాతీయంగా కామెక్స్‌లో గోల్డ్ రేటు ఔన్సుకి (31.1 గ్రాములు) 1% పెరిగి ఆల్‌టైమ్ గరిష్టమైన 4,190 డాలర్లను తాకింది.

భౌగోళిక–రాజకీయ, ఆర్థిక అనిశ్చితులు, రేట్ల కోత అంచనాలు, ఈటీఎఫ్‌లలో పెట్టుబడుల ప్రవాహం, సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్ల కారణంగా ఈ ఏడాది ఇప్పటివరకు బంగారం ధర 60% పెరిగి కీలకమైన 4,100 డాలర్ల మార్కును దాటిందని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ అనలిస్ట్ మానవ్ మోదీ చెప్పారు. అంతర్జాతీయంగా సరఫరా కొరత వల్ల వెండి ఔన్సు ధర కూడా 52 డాలర్లను దాటిందన్నారు. వెండి ధర దేశీయంగా రూ.1,94,639కి, అంతర్జాతీయంగా 59.89 డాలర్లకు పెరగవచ్చని ఎమ్‌కే గ్లోబల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ అనలిస్ట్ రియా సింగ్ తెలిపారు.

ఎల్‌జీ.. బంపర్ లిస్టింగ్



ముంబై: దక్షిణ కొరియాకు చెందిన ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా బంపర్ లిస్టింగ్‌తో ఇన్వెస్టర్ల పంట పండింది. ఇష్యూ ధర రూ.1,140తో పోలిస్తే బీఎస్‌ఈలో 50.43 శాతం ప్రీమియంతో రూ.1,715 వద్ద షేరు అరంగేట్రం చేసింది. ఇంట్రాడేలో 52.3 శాతం ఎగబాకి రూ.1,736 గరిష్టాన్ని తాకింది. అయితే, చివర్లో కాస్త లాభాల స్వీకరణతో 48 శాతం లాభంతో రూ.1,689 వద్ద స్థిరపడింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,14,672 కోట్లుగా నమోదైంది. రూ.11,607 కోట్ల విలువైన ఈ ఐపీఓకు 54 రెట్ల అధిక స్పందన లభించిన సంగతి తెలిసిందే.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

మూడోసారి చంద్రశేఖరన్‌కే ఓటు	టెక్ మహీంద్రా లాభం డౌన్

టెక్ దిద్దే కొలువులు!

- తయారీతో పాటు ఏడు రంగాలపై ప్రభావం
- ఏఐ, రోబోటిక్స్ సహా కీలకంగా నాలుగు సాంకేతికతలు: డబ్ల్యూఈఎఫ్ నివేదిక



న్యూఢిల్లీ: రాబోయే రోజుల్లో నాలుగు కొత్త టెక్నాలజీలు అంతర్జాతీయంగా ఉద్యోగాల మార్కెట్ ముఖచిత్రాన్ని మార్చివేయనున్నాయి. కృత్రిమ మేధ (ఏఐ), రోబోటిక్స్, అడ్వాన్స్‌డ్ ఎనర్జీ సిస్టమ్స్, సెన్సార్ నెట్‌వర్క్స్ వీటిలో ఉండనున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 80 శాతం ఉద్యోగులు పని చేసే ఏడు కీలక రంగాలపై వీటి ప్రభావం గణనీయంగా ఉండనుంది. ప్రపంచ ఆర్థిక ఫోరం (డబ్ల్యూఈఎఫ్) విడుదల చేసిన ఓ నివేదికలో ఈ అంశాలు వెల్లడయ్యాయి. దీని ప్రకారం వ్యవసాయం, తయారీ, నిర్మాణం, హోల్‌సేల్..రిటైల్ వాణిజ్యం, రవాణా.. లాజిస్టిక్స్, బిజినెస్..మేనేజ్‌మెంట్, హెల్త్‌కేర్ మొదలైనవి ప్రభావిత రంగాల జాబితాలో ఉంటాయి. నవీన టెక్నాలజీలతో ఈ రంగాల్లో ఉత్పాదకత పెంచుకునేందుకు కొత్త అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. ఉత్పాదకతను పెంచుకోవాలంటే, రిస్కులను అదుపులో ఉంచుకోవాలంటే ప్రభుత్వాలు, పరిశ్రమ, డెవలపర్లు సమష్టిగా పని చేయాల్సి రానుంది. పెట్టుబడుల కోసం మూలధనాన్ని సమకూర్చుకోవడం, గ్లోబల్‌గా టెక్నాలజీ వినియోగాన్ని విస్తృత స్థాయిలో పెంచడం, అందరికీ సాంకేతికత అందుబాటులోకి వచ్చేలా చూడటంలాంటి అంశాలు కీలకంగా ఉంటాయని నివేదిక వివరించింది. 'ఇప్పుడు, రాబోయే రోజుల్లో తీసుకోబోయే నిర్ణయాలపై భవిష్యత్తులో టెక్నాలజీ బాటను నిర్దేశిస్తుంది. సానుకూల ఫలితాలను సాధించాలంటే, ఏయే టెక్నాలజీలు, ఏడు కీలక రంగాలపై ఎలాంటి ప్రభావాన్ని చూపగలవనేది తెలుసుకోవడం చాలా ముఖ్యం' అని డబ్ల్యూఈఎఫ్ హెడ్ టిల్ లియోపాల్డ్ తెలిపారు.

నివేదికలో మరిన్ని అంశాలు..

- డెస్క్ ఉద్యోగాల్లోనే కాకుండా ఇతరత్రా కొలువుల్లోనూ కొత్త టెక్నాలజీలు గణనీయంగా మార్పులు తెస్తున్నాయి. డ్రోన్ టెక్నాలజీతో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో పట్టణ ప్రాంతాల్లో డెలివరీలు చేస్తుండగా, ఘనా దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో వైద్య పరికరాలను చేరవేస్తున్నారు.
- పలు ఆఫ్రికన్ దేశాల్లో రూఫ్‌టాప్ పునరుత్పాదక విద్యుత్ సిస్టమ్‌లు అందుబాటులోకి రావడంతో, కరెంటు కోతల వల్ల సిబ్బందిని ఇంటికి పంపించివేయాల్సిన పరిస్థితి తగ్గుతోంది. దీంతో పని వేళల్లో స్థిరత్వం వచ్చింది. అలాగే ఈ విద్యుత్ వ్యవస్థను నిర్వహించే నిపుణులకు డిమాండ్ ఏర్పడింది.
- విద్యుదుత్పత్తి, నిల్వ చేసే టెక్నాలజీలు ఇటు హోల్‌సేల్ అటు రిటైల్ వ్యాపార సిబ్బంది పనితీరును కూడా మెరుగుపరుస్తున్నాయి. దక్షిణాఫ్రికా, నైజీరియా, భారత్ లాంటి దేశాల్లో టోకు వర్తకులు రూఫ్‌టాప్ సోలార్ ప్యానెళ్లు, బ్యాటరీలను ఉపయోగిస్తూ కరెంటు కోతలను అధిగమిస్తున్నారు. డీజిల్ వినియోగాన్ని తగ్గించుకుంటున్నారు. ఇలాంటి పరిణామాలతో ఎనర్జీ సిస్టం మానిటరింగ్, రిఫ్రిజిరేషన్ మేనేజ్‌మెంట్‌లాంటి విభాగాల్లో కొలువులు ఏర్పడుతున్నాయి.
- హోల్‌సేల్, రిటైల్ వ్యాపారంలో క్లిక్–అండ్–కలెక్ట్ (ఆన్‌లైన్‌లో ఆర్డరు పెట్టి, పికప్ పాయింట్‌లో సరుకులు తీసుకోవడం) ప్రక్రియలో ఏఐని వినియోగిస్తుండటం వల్ల ఆఫ్రికా, భారత్, లాటిన్ అమెరికాలో ఉద్యోగాల స్వరూపంలో మార్పులు వస్తున్నాయి.
- సెమీ–ఆటోమేటెడ్ నిర్మాణ యంత్రాల వల్ల ఉద్యోగులకు శారీరక శ్రమ భారం తగ్గి, భద్రత పెరుగుతోంది. ఏఐ డేటా ప్రాసెసింగ్‌తో రోబోటిక్స్‌ను జతపరిస్తే హెల్త్‌కేర్ రంగంలో పేషంట్ల చికిత్స, ఉద్యోగుల పనితీరు విధానాల్లో సరికొత్త మార్పులు తీసుకురావచ్చు.

రెండో రోజూ మార్కెట్ వెనక్కి..

- విదేశీ ఇన్వెస్టర్ల తాజా అమ్మకాల ప్రభావం
- ప్రపంచ మార్కెట్ల ప్రతికూలతలు కూడా..
- సెన్సెక్స్ 297 పాయింట్లు, నిఫ్టీ 82 పాయింట్లు డౌన్



ముంబై: ఆసియా, యూరప్ మార్కెట్ల బలహీన ధోరణికి తోడు విదేశీ ఇన్వెస్టర్లు మళ్లీ అమ్మకాల బాట పట్టడంతో దేశీ మార్కెట్లు రెండో రోజూ 'బేర్'మన్నాయి. మెటల్స్‌తో పాటు కొన్ని వాహన, ఫార్మా షేర్లు సూచీలను వెనక్కిలాగాయి. ముందురోజు అమెరికా మార్కెట్ల బౌన్స్‌బ్యాక్, చైనాతో టారిఫ్ వార్ విషయంలో ట్రంప్ కాస్త శాంతించేలా చేసిన వ్యాఖ్యలతో మన మార్కెట్లలో ట్రేడింగ్ సానుకూలంగానే మొదలైంది. సెన్సెక్స్ ఒక దశలో 82,573 పాయింట్ల గరిష్టాన్ని తాకినప్పటికీ.. ఆ జోరు ఎంతో సేపు నిలవలేదు. ఇంట్రాడేలో 545 పాయింట్లు కోల్పోయి 81,781 కనిష్టాన్ని కూడా తాకింది. చివర్లో కాస్త కోలుకుని 297 పాయింట్ల నష్టంతో 82,030 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా తీవ్ర ఒడిదుడుకుల మధ్య 82 పాయింట్లు పడి 25,146 వద్ద క్లోజైంది. బీఎస్‌ఈలోని అన్ని రంగాల సూచీలూ నష్టపోయాయి. మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.95 శాతం, మిడ్‌క్యాప్ సూచీ 0.74 శాతం చొప్పున క్షీణించాయి.

జీవితకాల కనిష్టానికి రూపాయి

డాలర్ మారకంలో రూపాయి విలువ 13 పైసలు బలహీనపడి జీవిత కాల కనిష్టం 88.81 వద్ద ముగిసింది. దేశీయ ఈక్విటీ మార్కెట్‌లోని ప్రతికూలతలు, అమెరికా కరెన్సీ బలపడటం రూపాయి కోతకు కారణమయ్యాయి.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం – ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం– తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం – వరల్డ్ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం – జనరల్ ఇంగ్లిష్



ఇండియన్ ఆర్మీ టీజీసీ-143 కోర్సులో ప్రవేశాలు

డెహ్రాడూన్‌లోని ఇండియన్ మిలిటరీ అకాడమి (ఐఎంఏ)లో జూలై–2026లో ప్రారంభమయ్యే 143వ టెక్నికల్ గ్రాడ్యుయేట్ కోర్సులో ప్రవేశాలకు అర్హులైన అవివాహిత పురుష అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 30.
- » **ఇంజనీరింగ్ స్ట్రీమ్:** సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ ఇతర ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లు.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి లేదా ఇంజనీరింగ్ డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
- » **వయసు:** 01.07.2025 నాటికి 20 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **స్టైపెండ్:** ట్రెనింగ్ సమయంలో నెలకు రూ.56,400.
- » **ఎంపిక విధానం:** దరఖాస్తుల షార్ట్‌లిస్టింగ్, స్టేజ్–1/స్టేజ్–2 టెస్టులు, ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 08.10.2025.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.11.2025.
- » **వెబ్‌సైట్:** https://joinindianarmy.nic.in

డీఎంహెచ్‌వో చిత్తూరులో 56 పోస్టులు

చిత్తూరులోని డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీస్ (డీఎంహెచ్‌వో) ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 56.
- » **పోస్టుల వివరాలు:** మెడికల్ ఆఫీసర్–13, స్టాఫ్ నర్స్–20, ఫైనాన్స్ అండ్ లాజిస్టిక్ కన్సల్టెంట్–01, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2–03, ఫిజియోథెరపిస్ట్(మల్టీ రిహాబిలిటేషన్ వర్కర్)–01, ఆడియో మెట్రీషియన్ అండ్ ఎన్‌పీసీడీసీఎస్–02, శానిటరీ అటెండెంట్–02,సపోర్టింగ్ స్టాఫ్–04, సెక్యూరిటీ గార్డ్–02, లాస్ట్ గ్రేడ్ సర్వీసెస్–08.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, డిగ్రీ, ఎంబీబీఎస్, సీఏ, ఎంకామ్ లేదా ఎంబీఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 42 ఏళ్లలోపు ఉండాలి.
- » **వేతనం:** నెలకు మెడికల్ ఆఫీసర్‌కు రూ.23,393, ఫిజియోథెరపిస్ట్‌కు రూ.23,494, ఆడియోమెట్రీషియన్‌కు రూ.25,526, మిగతా పోస్టులకు రూ.15,000.
- » **ఎంపిక విధానం:** విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తు ప్రారంభతేది:** 09.10.2025.
- » **దరఖాస్తులకు చివరితేది:** 22.10.2025.
- » **వెబ్‌సైట్:** https://chittoor.ap.gov.in

హెచ్‌ఏఎల్‌లో విజిటింగ్ కన్సల్టెంట్ పోస్టులు

కోర్వాలోని హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో విజిటింగ్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 02.
- » **విభాగాలు:** ఆర్థోపెడిక్, పీడియాట్రిషియన్.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఆర్థో/ ఎంఎస్/డీఎన్‌బీ/ఎండీ/ డీసీహెచ్‌లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 30.10.2025 నాటికి 65 ఏళ్ల లోపు ఉండాలి.
- » **వేతనం:** పర్ విజిట్‌కు రూ.7000.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును చీఫ్ మేనేజర్(హెచ్‌ఆర్), హెచ్‌ఏఎల్, ఏవియోనిక్స్ డివిజన్, కోర్వా, అమేథి, యూపీ–227412 చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 30.10.2025.
- » **వెబ్‌సైట్:** https://hal-india.co.in

ఐఐటీ గాంధీ నగర్‌లో జేఆర్‌ఎఫ్‌లు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) గాంధీనగర్ వివిధ విభాగాల్లో జూనియర్ రీసెర్చ్ ఫెలోలు(జేఆర్‌ఎఫ్) ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం ఖాళీల సంఖ్య:** 05.
- » **విభాగాలు:** వాటర్ రీసోర్సెస్/అగ్రికల్చర్–02, ఫారెస్ట్స్ అండ్ బయోడైవర్సిటీ–02, రెన్యూబల్ ఎనర్జీ అండ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ–01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ(ఎర్త్ సైన్సెస్/ఎన్విరాన్‌మెంటల్ సైన్సెస్/అగ్రికల్చర్ సైన్స్ హైడ్రాలజీ/క్లైమేట్ ఛేంజ్/జియో స్పేషియల్ ఇంజనీరింగ్/స్టాటిస్టిక్స్)లో ఉత్తీర్ణతతో పాటు నెట్, గేట్‌లో అర్హత సాధించి ఉండాలి.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.10.2025.
- » **వెబ్‌సైట్:** https://affairscloud.com

ఐపీపీబీలో 348 ఎగ్జిక్యూటివ్ పోస్టులు

న్యూఢిల్లీలోని ఇండియా పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (ఐపీపీబీ)లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాలో ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 348.
- » **రాష్ట్రాల వారీగా ఖాళీలు:** ఆంధ్రప్రదేశ్–08, అస్సాం–12, బీహార్–17, ఛత్తీస్‌గఢ్–09, దాద్రానగర్ హవేలి–01, గుజరాత్–29, హర్యానా–11, హిమాచల్‌ప్రదేశ్–04, జమ్మూ కాశ్మీర్–03, జార్ఖండ్–12, కర్ణాటక–19, కేరళ–06, మధ్యప్రదేశ్–29, గోవా–01, మహారాష్ట్ర–31, అరుణాచల్ ప్రదేశ్–09, మణిపూర్–04, మేఘాలయ–04, మిజోరాం–02, నాగాలాండ్–08, త్రిపుర–03, ఒడిశా–11, పంజాబ్–15, రాజస్థాన్–10, తమిళనాడు–17, తెలంగాణ–09, ఉత్తరప్రదేశ్–40, ఉత్తరాఖండ్–11, సిక్కిం–01, పశ్చిమ బెంగాల్–12.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి.
- » **వయసు:** 01.08.2025 నాటికి 20 నుంచి 35 ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.30,000.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష, విద్యార్హతల్లో సాధించిన మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 09.10.2025.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 29.10.2025.
- » **వెబ్‌సైట్:** https://ippbonline.com

సీఎస్ఐఆర్-ఐఎంఎంటీ, భువనేశ్వర్‌లో 30 సైంటిస్ట్ పోస్టులు

భువనేశ్వర్‌లోని సీఎస్ఐఆర్–ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మినరల్ అండ్ మెటీరియల్ టెక్నాలజీ(ఐఎంఎంటీ) సైంటిస్ట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 30.
- » **పోస్టుల వివరాలు:** సైంటిస్ట్–25, సీనియర్ సైంటిస్ట్–04, ప్రిన్సిపల్ సైంటిస్ట్–01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » **వయసు:** సైంటిస్ట్‌కు 32 ఏళ్లు, సీనియర్ సైంటిస్ట్‌కు 37 ఏళ్లు, ప్రిన్సిపల్ సైంటిస్ట్‌కు 45 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు సైంటిస్ట్‌కు రూ.1,24,055, సీనియర్ సైంటిస్ట్‌కు రూ.1,43,480, ప్రిన్సిపల్ సైంటిస్ట్‌కు రూ.2,21,005.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 06.10.2025
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 06.11.2025.
- » **వెబ్‌సైట్:** https://www.immt.res.in

పీజీఐఎంఈఆర్, చండీగఢ్‌లో వివిధ పోస్టులు

చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(పీజీఐఎంఈఆర్).. ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్–1, 2 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 03.
- » **పోస్టుల వివరాలు:** ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్1–01, ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్2–01, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్2–01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్–1కు 35 ఏళ్లు, ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్–2కు 40 ఏళ్లు, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్–2కు 30 ఏళ్లు.
- » **వేతనం:** నెలకు ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్–1కు రూ.67,000, ప్రాజెక్ట్ రీసెర్చ్ సైంటిస్ట్–2కు రూ.80,400, ప్రాజెక్ట్ టెక్నికల్ సపోర్ట్–2కు రూ.24,000.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 19.10.2025.
- » **ఇంటర్వ్యూ తేది:** 20.10.2025.
- » **వెబ్‌సైట్:** https://pgimer.edu.in

ఎం.డిజైన్ కోర్సుల్లో చేరుతారా..

» సీఈఈడీ 2026కు ఐఐటీ బాంబే నోటిఫికేషన్
» ఈ స్కోర్‌తో ఎం.డిజైన్, పీహెచ్‌డీల్లో ప్రవేశాలు



సీడ్ (సీఈఈడీ).. కామన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ ఫర్ డిజైన్! ప్రముఖ ఐఐటీలతో పాటు బెంగళూరులోని ఐఐఎస్సీలో మాస్టర్ ఆఫ్ డిజైన్, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష!! ఐఐటీ బాంబే ఈ పరీక్షను నిర్వహిస్తుంది. ఫలితాలు విడుదలైనప్పటి నుంచి ఒక ఏడాది పాటు సీడ్ స్కోర్ పరిగణనలో ఉంటుంది. సీడ్ స్కోర్ ఆధారంగా దరఖాస్తున్న చేసుకున్న అభ్యర్థులకు ఆయా ఇన్‌స్టిట్యూట్స్ తమ అడ్మిషన్ విధానాలకు అనుగుణంగా ప్రత్యేక ఎంపిక ప్రక్రియ నిర్వహించి ప్రవేశం కల్పిస్తాయి. సీడ్ 2026 పూర్తి వివరాలు..

ప్రవేశం కల్పించే ఇన్‌స్టిట్యూట్స్

ఐఐటీ–బాంబే, ఐఐటీ–ఢిల్లీ, ఐఐటీ–గువహటి, ఐఐటీ– హైదరాబాద్, ఐఐటీ–జోధ్‌పూర్, ఐఐటీ కాన్పూర్, ఐఐటీ–రూర్కీ, ఐఐఐటీడీఎం–జబల్‌పూర్, ఐఐఐటీడీఎం–కాంచీపురం, ఐఐఎస్సీ–బెంగళూరుల్లో ఎం.డిజైన్ కోర్సుల్లో ప్రవేశం పొందొచ్చు. అదే విధంగా డిజైన్ విభాగంలో పలు ఐఐటీలు, డిజైన్ స్కూల్స్‌లో సీడ్ స్కోర్ ఆధారంగా పీహెచ్‌డీలో అడ్మిషన్‌లో లభిస్తుంది.

అర్హతలు

- సీడ్‌కు దరఖాస్తు చేసుకునేందుకు గ్రాడ్యుయేట్ డిగ్రీ /డిప్లొమా/పోస్ట్‌గ్రాడ్యుయేట్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. 10+2 తర్వాత కనీసం మూడేళ్ల కోర్సు తప్పనిసరిగా చదివి ఉండాలని పేర్కొన్నారు. ఆయా కోర్సుల ఫైనల్ పరీక్షలను 2026 జూలైలోపు పూర్తి చేసుకోవాలి.
- అదే విధంగా పదో తరగతి తర్వాత 10+5 విధానంలో గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ కోర్సులు 2026 జూలైలోపు పూర్తి చేసుకునే వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- సీడ్ పరీక్షకు హాజరయ్యేందుకు ఎలాంటి వయోపరిమితి నిబంధన లేదు. ఎన్నిసార్లయినా పరీక్షకు హాజరుకావచ్చు.
- ఆయా ఇన్‌స్టిట్యూట్స్‌లో అర్హత ప్రమాణాలు భిన్నంగా ఉంటాయి. కాబట్టి సీడ్ స్కోర్ ఆధారంగా దరఖాస్తు చేసుకునే ముందు అభ్యర్థులు అర్హతలు పరిశీలించుకోవాలి.
- సంబంధిత ఇన్‌స్టిట్యూట్‌ల అడ్మిషన్ నోటిఫికేషన్‌కు అనుగుణంగా ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

పరీక్ష విధానం

- సీడ్ పరీక్షను రెండు పార్ట్‌లు(పార్ట్–ఎ,పార్ట్–బి)గా నిర్వహిస్తారు. పార్ట్ ఏ 150 మార్కులకు, పార్ట్ బీ 100 మార్కులకు ఉంటుంది.

పార్ట్ ఏలో మూడు సెక్షన్‌లు

- పార్ట్ ఏ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ విధానంలో జరుగుతుంది. ఈ పరీక్ష సమయం ఒక గంట. ఇందులో మూడు సెక్షన్‌లు (సెక్షన్1,2,3) ఉంటాయి. సెక్షన్1లో 8 న్యూమరికల్ ఆన్సర్ టైప్ (ఎన్ఏటీ) ప్రశ్నలు అడుగుతారు. ప్రతి సరైన సమాధానానికి 4 మార్కులు లభిస్తాయి. ఎలాంటి నెగిటివ్ మార్కుల నిబంధన లేదు. దీనికి సమాధానాన్ని వర్చువల్ కీ బోర్డు ద్వారా కంప్యూటర్ స్క్రీన్‌పై ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఈ ప్రశ్నలకు ఎలాంటి ఛాయిస్ ఉండదు.
- సెక్షన్ 2లో 10 మల్టిపుల్ సెలక్ట్ (ఎంఎస్‌క్యూ) ప్రశ్నలు అడుగుతారు. వీటికి ఒకటి కంటే ఎక్కువ సరైన సమాధానాలు ఉంటాయి. ప్రతి పూర్తి సరైన సమాధానానికి 4 మార్కులు లభిస్తాయి. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి పొరపాటు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.
- సెక్షన్3లో 26 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు(ఎంసీక్యూ) అడుగుతారు. ప్రతి సరైన సమాధానానికి 3 మార్కులు లభిస్తాయి. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి పొరపాటు సమాధానానికి అర మార్కు తగ్గిస్తారు.

వంద మార్కులకు పార్ట్-బి

- పార్ట్–ఎ పరీక్ష పూర్తి కాగానే పార్ట్–బి పరీక్ష వంద మార్కులకు నిర్వహిస్తారు. ఈ పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.
- పార్ట్–బిలో డిజైన్, డ్రాయింగ్, రైటింగ్ స్కిల్స్‌కు సంబంధించి అయిదు ప్రశ్నలు అడుగుతారు. స్కెచింగ్, క్రియేటివిటీ, ఫార్మ్ సెన్సిటివిటీ, విజువల్ సెన్సిటివిటీ, ప్రాబ్లమ్ ఐడెంటిఫికేషన్‌ల నుంచి ఒక్కో ప్రశ్న చొప్పున అడుగుతారు. అభ్యర్థి డ్రాయింగ్ నైపుణ్యాలు పరిశీలించేందుకు ఈ పరీక్ష నిర్వహిస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం: 01.10.2025
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 31.10.2025
- ఆలస్య రుసుముతో చివరి తేది: 07.11.2025
- సీడ్ 2026 పరీక్ష తేది: 18.01.2026
- వెబ్‌సైట్: www.ceed.iitb.ac.in

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా...

త్వరలో 190 కొత్త అంబులెన్స్‌లు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో త్వరలో 190 కొత్త అంబులెన్స్‌లు అందుబాటులోకి తెస్తున్నామని వైద్య శాఖ మంత్రి సత్యకుమార్ మంగళవారం తెలిపారు. కాలం చెల్లిన వాహనాల స్థానంలో వీటిని ప్రవేశపెట్టడానికి నిర్వహణ సంస్థ భవ్య హెల్త్ సర్వీసెస్ ద్వారా కొనుగోలు చేయించినట్లు చెప్పారు. వీటిని సీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి

సాక్షి, అమరావతి: విద్యా రంగంలోని సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం పాఠశాల కమిషనర్ విజయ్ రామరాజు, ఇంటర్, డిగ్రీ విద్య కమిషనర్ నారాయణ భారత్ గుప్తా, ట్రైబల్ వెల్ఫేర్ ముఖ్య కార్యదర్శి ఎంఎం నాయక్, డైరెక్టర్ భార్గవిలకు వినతి పత్రాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. గిరిజన సంక్షేమశాఖ పాఠశాలల్లో పండిట్ పీఈటీ పోస్టులు అప్‌గ్రేడ్ చేయాలన్నారు. అన్ని విభాగాల్లోని సంక్షేమ పాఠశాలల ఉపాధ్యాయుల క్లస్టర్ మీటింగ్‌లో 100% హాజరు మినహాయింపు ఇవ్వాలన్నారు. మనబడి – మన భవిష్యత్తు పాఠశాలల పనులు పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు.

యూరియా పంపిణీకి ప్రత్యేక సాఫ్ట్‌వేర్

వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ



సాక్షి, అమరావతి: ఖరీఫ్ సీజన్‌లో తలెత్తిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని రానున్న రబీ సీజన్‌లో యూరియా పంపిణీని సులభతరం చేసేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను తీసుకురానున్నట్లు వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ చెప్పారు. మంగళవారం బాధ్యతలు చేపట్టిన ఆయన.. వివిధ విభాగాధిపతులతో సమీక్ష నిర్వహించారు. సాగు విస్తీర్ణం, పంటల ఆధారంగా రైతులకు నేరుగా ఎరువులు పంపిణీ చేసేందుకని రూపొందిస్తున్న సాఫ్ట్‌వేర్ పనితీరు గురించి ఆయన ఆరా తీశారు. ఎరువుల నిల్వలు, అమ్మకాల రియల్ టైమ్ డేటా పక్కాగా ఉండేలా చూడాలన్నారు. స్థానికంగా ఎంత నిల్వ ఉంది, కేంద్రం నుంచి ఎంత రావాలి, జిల్లాలకు ఎంత కేటాయిస్తున్నాం, రోజువారీ అమ్మకాల వివరాలను క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని సూచించారు. పంటల కొనుగోలు సమయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.

విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక కమిటీ

సాక్షి, అమరావతి: సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగా విద్యార్థుల మానసిక ఆరోగ్యం, శ్రేయస్సును కాపాడేందుకు ప్రభుత్వం ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. ఇందులో ఉన్నత విద్యా కార్యదర్శి చైర్‌పర్సన్‌గా మరో 12 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ప్రైవేటు కోచింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్, విద్యార్థి సంరక్షణ నిబంధనలు, ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి సమగ్ర విధివిధానాలు రూపొందిస్తుందని పేర్కొంది. ఈ మేరకు ఉన్నత విద్య కార్యదర్శి కోనశశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

యూనివర్సిటీలను అభివృద్ధి చేయాలి

సీఎంకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని యూనివర్సిటీల అభివృద్ధికి తక్షణ చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబుకు రాసిన లేఖలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఉపాధి కోర్సులవైపు పయనించకపోవడంతో రాష్ట్రంలోని 17 విశ్వవిద్యాలయాల మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. యూనివర్సిటీల్లో అధ్యాపక, సిబ్బంది పోస్టులు భర్తీ చేసి ఉపాధి సంబంధమైన నూతన కోర్సులను ప్రవేశపెట్టాలని కోరారు.

పశుసంవర్థక సహాయకుల పోస్టులు భర్తీ చేయాలి: డీవైఎఫ్ఐ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పశుసంవర్థక సహాయకుల(ఏహెచ్‌ఏ) పోస్టులను భర్తీ చేయాలని, రైతు సేవా కేంద్రాల్లో క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. డీవైఎఫ్ఐ నాయకులు విజయవాడలోని పశుసంవర్థక శాఖ డైరెక్టరేట్ వద్ద మంగళవారం నిరసన తెలిపారు. అనంతరం రాష్ట్ర సచివాలయంలో ముఖ్య కార్యదర్శి బి.రాజశేఖర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న మాట్లాడుతూ.. దేశంలోనే ఏపీ పశు సంపదలో ముందంజలో ఉందని, పాడి పరిశ్రమను మరింత ప్రోత్సహించేలా ఏహెచ్‌ఏ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయాలన్నారు. రాష్ట్రంలో డైరీ సైన్స్, వెటర్నరీ డిప్లొమా కోర్సులను పూర్తి చేసిన నిరుద్యోగులు యాభై వేల మంది ఉన్నారని, వారికి న్యాయం చేసేలా ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయాలన్నారు.

సైబర్ నేరగాళ్లు రోజుకో సరికొత్త విధానాలతో ప్రజలను మాయ చేస్తున్నారు. ఉన్నత విద్యను అభ్యసించిన వారిని సైతం సులువుగా బురిడీ కొట్టిస్తున్నారు. ఇటీవల ఇంటి వద్ద నుంచే ఉద్యోగం చేయవచ్చునంటూ వల విసిరి రూ.లక్షలు దోచేశారు. నిరుద్యోగ యువతే లక్ష్యంగా పార్ట్‌టైమ్ జాబ్‌లంటూ మోసాలకు తెగబడ్డారు. సైబర్ నేరగాళ్ల బారిన పడిన బాధితులు లబోదిబోమంటూ మిన్నకుండిపోతున్నారు. ఎవరూ పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంతో వారి ఆగడాలు ఎక్కువయ్యాయి.



ఆశపెట్టి.. మోసగించి!

పార్ట్‌టైం జాబ్ ఆఫర్‌తో సైబర్ వల
- ఇంటి వద్దే జాబ్ అంటూ ఉచ్చు
- రూ.వేల నుంచి రూ.లక్షల్లో దోపిడీ
- సత్యసాయి జిజిల్లాలో పెరుగుతున్న ఆన్‌లైన్ జాబ్ బాధితులు

ధర్మవరం అర్బన్: ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ జాబ్ అంటూ సైబర్ నేరగాళ్లు విసిరిన వలలో సత్యసాయి జిల్లా యువత చిక్కుకుని విలవిల్లాడుతోంది. ఆన్‌లైన్ జాబ్ సైట్, సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్, పత్రికల్లో నకిలీ ప్రకటనలు నమ్మి మోసపోతోంది. వీరిలో ఎక్కువ శాతం ఇంజనీరింగ్ పట్టభద్రులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఉద్యోగులు, నిరుద్యోగులే ఉన్నారు.

ఇంట్లో ఉన్నవారే లక్ష్యం

వర్క్ ఫ్రమ్ హోం పై మక్కువ పెంచుకున్న యువతను లక్ష్యంగా చేసుకుని జాబ్ స్కామర్లు చెలరేగిపోతున్నారు. తక్కువ సమయం, తక్కువ శ్రమతో నెలకు వేలాది రూపాయలు సంపాదించే జాబ్‌లు తమ వద్ద ఉన్నాయంటూ తరచూ ఆన్‌లైన్‌లో ప్రకటనలు గుప్పించి ఆకర్షిస్తున్నారు. ఈ ప్రకటనలు నమ్మి సంప్రదిస్తే ఫీజుల రూపంలో డబ్బు కట్టించుకుని ఆ తర్వాత బోర్డు తిరగేయడం షరా మామూలైంది.

తమనే నష్టపరిచారంటూ బ్లాక్ మెయిల్

జిల్లాలో రకరకాల డేటా ఎంట్రీ స్కామ్స్ వెలుగు చూస్తున్నాయి. ఎక్కువ స్కిల్స్ అవసరం లేదని, సింపుల్‌గా డేటా ఎంట్రీ చేస్తే చాలు డబ్బు సంపాదించవచ్చని నమ్మబలుకుతారు. ముందుగా ప్రాసెసింగ్ ఫీజు, ట్రైనింగ్ ఫీజు రూపంలో పేమెంట్ చేయించుకుంటారు. డేటా ఎంట్రీ అనంతరం అందులో తప్పులున్నాయని, దాని వల్ల తమ సంస్థ నష్టపోయిందని, పరిహారం చెల్లించకపోతే లీగల్ ప్రొసీడింగ్స్‌కు వెళతామని బెదిరింపులకు దిగుతూ పెద్ద మొత్తంలో నగదు లూటీ చేస్తున్నారు.

మచ్చుకు కొన్ని..

- నెలకు రూ.60 వరకు జీతం అందిపుచ్చుకుంటున్న ధర్మవరం నియోజకవర్గంలోని ఓ ప్రభుత్వ ఉద్యోగి... తీరిక వేళల్లో ఖాళీగా ఉండడం ఇష్టం లేక వర్క్ ఫ్రమ్ హోమ్ పేరిట ఆన్‌లైన్ టాస్క్‌లో పాల్గొన్నాడు. మొదట దాదాపు రూ.15వేల వరకు నగదు అతని ఖాతాకు బదిలీ అయింది. దీంతో పూర్తిగా నమ్మి అవతలి వ్యక్తుల డిమాండ్ మేరకు నగదు బదిలీ చేస్తూ రూ.2.75లక్షల వరకు పోగొట్టుకున్నాడు. ఆ తర్వాత తాను మోసపోతున్నట్లుగా నిర్ధారించుకుని మిన్నకుండిపోయాడు.
- ధర్మవరానికి చెందిన ఓ యువకుడు ఇంజినీరింగ్ పూర్తి చేసి ఆరునెలలుగా ఇంటి వద్దనే ఖాళీగా ఉన్నాడు. ఆన్‌లైన్‌లో జాబ్ కోసం వెతుకుతూ ఓ వెబ్‌సైట్‌లో లింక్‌ను ఓపెన్ చేశాడు. కొంత డబ్బు పెట్టుబడిగా పెడితే అంతకు రెట్టింపు వస్తుందని అవతలి వ్యక్తులు నమ్మబలకడంతో తొలుత రూ.5వేలు వారి ఖాతాకు పంపాడు. అనంతరం విడతల వారీగా రూ.1.35 లక్షల వరకు నగదు బదిలీ చేసినా తనకు రిటర్న్స్ లేకపోవడంతో అవతలి వ్యక్తులను నిలదీశాడు. వారి సమాధానంతో తృప్తి చెందక ఇకపై తాను డబ్బు వేయనని తేల్చి చెప్పడంతో వెంటనే వారి నంబర్లు, వాట్సాప్ గ్రూపు బ్లాక్ చేసేశారు.
- ధర్మవరంలో నివాసముంటున్న ఓ వివాహిత డిగ్రీ వరకు చదువుకుంది. ఇంట్లో ఖాళీగా ఉండలేక పార్ట్‌టైం జాబ్ కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేస్తుంటే రోజు రెండు గంటల పాటు పనిచేస్తే రూ.250 చొప్పున నెల రోజుల తర్వాత జీతం రూపంలో బ్యాంకు ఖాతాలోకి నగదు జమ అవుతుందనే ఓ సైట్ కనిపించడంతో సంప్రదించింది. అవతలి వ్యక్తుల మాటలు నమ్మి తొలుత రూ.5వేలు చెల్లించింది. ఆ తర్వాత రోజు రూ.250 నుంచి రూ.500ల వరకు సంపాదిస్తున్నట్లు వారం రోజుల పాటు ఆన్‌లైన్ వాలెట్‌లో కనిపిస్తూ వచ్చింది. వారు విధించిన గడువులోపు మ్యాటర్ టైప్ చేసి ఇవ్వకపోతే ఎదురు డబ్బు చెల్లించాలనే నిబంధన ఉండడంతో పలుమార్లు తన ఖాతా నుంచి దాదాపు రూ.55వేల వరకు ఆమె బదిలీ చేస్తూ వచ్చింది. అయితే రెండు నెలలు గడిచినా ఆమె బ్యాంక్ ఖాతాలోకి డబ్బు జమకాకపోవడంతో మోసపోయానని గ్రహించి వెంటనే భర్తకు వివరించింది.
- ధర్మవరంలోని యాదవవీధిలో నివాసముంటున్న బీటెక్ పూర్తి చేసిన యువకుడు పార్ట్‌టైం జాబ్ కోసం ఆన్‌లైన్‌లో సెర్చ్ చేశాడు. ఇంట్లో గంటసేపు కష్టపడి డబ్బులు సంపాదించుకోవచ్చని ఓ వెబ్‌సైట్‌లో సమాచారాన్ని నమ్మి తన సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు అప్‌లోడ్ చేశాడు. ముందుగా ప్రాసెసింగ్ ఫీజు, ట్రైనింగ్ ఫీజు పేరుతో అడ్వాన్స్‌గా రూ.15వేలు సైబర్ నేరగాళ్లు తమ ఖాతాలోకి జమ చేయించుకున్నారు. అనంతరం తాము ఇచ్చిన మ్యాటర్‌ను అలాగే టైప్ చేసి పంపాలని, గంటలోపు ఎన్ని పదాలు టైపు చేస్తే అంత డబ్బు బ్యాంక్ ఖాతాలోకి జమ అవుతుందని నమ్మబలికారు. దీంతో యువకుడు టైపు చేస్తుండగా, తప్పులు ఉన్నాయని, దీంతో కంపెనీ పరువు పోయిందని, పరిహారం రూ. 2 లక్షలు చెల్లించకపోతే కోర్టుకు లాగుతామని బెదిరించారు. పక్కనే ఉన్న తమ న్యాయవాదితో మాట్లాడమంటూ మరో వ్యక్తికి ఫోన్ ఇచ్చారు. విషయాన్ని వెంటనే సదరు యువకుడు పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో అప్రమత్తమైన సైబర్ నేరగాళ్లు వారి నంబర్‌ను బ్లాక్ చేశారు.

అప్రమత్తంగా ఉండాలి



ఆన్‌లైన్‌లో వచ్చే ఉద్యోగ ప్రకటనలు చూసి మోసపోవద్దు. యువత నైపుణ్యం పెంచుకోవడానికి కోచింగ్ సెంటర్లకు వెళ్లి కొత్త కోర్సులు అభ్యసించాలి. సాధారణంగా ప్రముఖ సంస్థలు ఎప్పుడూ రిజిస్ట్రేషన్ ఫీజు, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఫీజు పేరిట నగదు వసూలు చేయవు. జాబ్ స్కామర్ల ప్రకటనల్లో, ఈ మెయిల్స్‌లో ఎక్కువగా గ్రామర్ తప్పులు ఉంటాయి. జాబ్ డిస్క్రిప్షన్ కూడా అస్పష్టంగా ఉంటుంది. క్విక్ మనీ, అన్‌లిమిటెడ్ ఎర్నింగ్స్, ఎలాంటి టెక్నికల్ స్కిల్స్ అవసరం లేదు అనే పదాలపై అప్రమత్తంగా ఉండాలి. మోసపోయామని గ్రహిస్తే సమీప పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ధైర్యంగా ఫిర్యాదు చేయాలి. **– సీఐ రెడ్డెప్ప, టూ టౌన్ పోలీస్ స్టేషన్, ధర్మవరం**

కాకినాడ సెజ్ భూములు తిరిగి రైతులకు

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

సాక్షి, అమరావతి: కాకినాడ సెజ్‌కు ఇచ్చిన భూముల్లో 2,180 ఎకరాలను తిరిగి రైతులకు ఇచ్చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తెలిపారు. సెజ్‌లో అవార్డు భూములను తిరిగి రైతులకు రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని రెవెన్యూ శాఖకు ఆదేశాలిచ్చినట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ చార్జీలు, స్టాంప్ డ్యూటీలు వసూలు చేయకూడదని ఆదేశాల్లో పేర్కొన్నట్లు వెల్లడించారు. ఉప్పాడ, కొత్తపల్లి, తొండంగి మండలాల పరిధిలో ఈ భూములు ఉన్నాయి.

రాష్ట్రంలో 16 చిత్తడి నేలల పరిరక్షణ

రాష్ట్రవ్యాప్తంగా 16 చిత్తడి నేలలను గుర్తించి వాటి పరిరక్షణకు చర్యలు చేపట్టినట్లు పవన్ తెలిపారు. మంగళగిరిలో పవన్ అధ్యక్షతన స్టేట్ వెట్ ల్యాండ్ అథారిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లా సోంపేట, కవిటి మండలాల పరిధిలో 5 వేల ఎకరాల్లో విస్తరించి వున్న చిత్తడి నేలలను అనుసంధానిస్తూ భారీ పర్యాటక ప్రాజెక్టుకు రూపకల్పన చేయనున్నట్టు తెలిపారు.

అలసిపోయా.. ఇక ఆడలేను

బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్



దొడ్డబళ్లాపురం: ఆడాలని ఉన్నా ఆరోగ్యం, శరీరం సహకరించడం లేదని, అందుకే భారమైన హృదయంతో ఆటను మానేశానని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ తెలిపారు. కర్ణాటకలోని ఉడుపి జిల్లా మణిపాల్ పట్టణంలో ఆమె మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. ఔత్సాహిక క్రీడాకారులకు తర్ఫీదు ఇచ్చేందుకు కూడా తనకు ఆసక్తి లేదన్నారు. హైదరాబాద్‌లో బ్యాడ్మింటన్ శిక్షణ ఇచ్చేందుకు మంచి అకాడమీలు ఉన్నాయని చెప్పారు. 'శిక్షణ ఇవ్వడం చాలా కష్టమైన పని. అది ఆడడం కన్నా కష్టం. 10–15 గంటలపాటు నిలబడి శిక్షణ ఇవ్వాలంటే మామూలు విషయం కాదు. అయితే పిల్లలకు ఆటల్లో ఆసక్తి కలిగించేలా పని చేస్తున్నా' అని వివరించారు. పిల్లలు సోషల్ మీడియాకు స్వస్తి చెప్పి అన్ని రకాల క్రీడల వైపు మొగ్గు చూపాలన్నారు. గతంలో తాను జీవితంలో ఎంతో ఒత్తిడికి లోనయ్యానని, 25 ఏళ్ల కుటుంబం, ఆహారం, స్నేహితులు అందరికీ దూరమైనట్లు తెలిపారు.

తిరుపతి, విశాఖలను పర్యాటక గమ్యస్థానాలుగా తీర్చిదిద్దాలి

కేంద్రానికి మంత్రి దుర్గేష్ విజ్ఞప్తి

నిడదవోలు: దేశ పర్యాటక రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలిపేందుకు కేంద్రం మరింతగా సహకారం అందించాలని, కేంద్ర ప్రభుత్వ విధానం ప్రకారం ఏపీలోని తిరుపతి, విశాఖపట్నం నగరాలను ప్రపంచ పర్యాటక గమ్యస్థానాలుగా తీర్చిదిద్దాలని కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు రాష్ట్ర పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ విజ్ఞప్తి చేశారు. షెకావత్ అధ్యక్షతన వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పర్యాటక మంత్రులతో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఏపీ తరపున దుర్గేష్ పాల్గొని ఏపీలో పర్యాటకాభివృద్ధిని వివరించారు. జాతీయ మిషన్‌లో భాగంగా సముద్రతీర, మెరైన్ గమ్యస్థానంగా విశాఖను, ఆధ్యాత్మిక, సాంస్కృతిక గమ్యస్థానంగా తిరుపతిని తీర్చిదిద్దాలని భావిస్తున్నామన్నారు. విశాఖను దేశంలోని తొలి ఓషనేరియం, మెరైన్ ఎక్స్‌పీరియన్స్ పార్క్‌గా తీర్చిదిద్దాలని ఏపీ ప్రభుత్వం సంకల్పించిందని దుర్గేష్ వెల్లడించారు.

రాజధానిలో నాలుగు కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణం

నాలుగు సంస్థలకు 2.5 ఎకరాల చొప్పున కేటాయింపు

సాక్షి, అమరావతి:రాజధాని అమరావతిలో నాలుగు కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి నిర్వహించిన టెండర్లలో వాటిని దక్కించుకున్న నాలుగు సంస్థలకు 2.5 ఎకరాల చొప్పున భూమిని ప్రభుత్వం కేటాయించింది. మందడంలో సర్వే నెంబరు 195లో జీవీ ఎస్టేట్స్, హోటల్స్–విజయ్ ఆగ్రో ప్రొడక్ట్స్(కన్సార్షియం)కు, 223 సర్వే నెంబరులో 2.5 ఎకరాలను మాలక్ష్మి ఇన్‌ఫ్రా వెంచర్స్‌కు, తుళ్లూరులో సర్వే నెంబరు 188లో ఓంశ్రీ భావన అసోసియేట్స్ ఎల్ఎల్‌పీకి, లింగాయపాలెంలో సర్వే నెంబరు 58లో వరుణ్ హాస్పిటాలిటీ సంస్థకు స్థలాలు కేటాయించింది. నిర్మాణాలను ఏడాదిలోగా పూర్తి చేయాలని ఆదేశించింది. ఈనెల 8న సీఆర్‌డీఏ 53వ సమావేశంలో చేసిన తీర్మానాన్ని ఆమోదిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

కూటమి నేతలు ధనార్జనే ధ్యేయంగా ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. లక్షలాది మందికి నీటి సరఫరా చేసే విషయంలో కాసులకు కక్కుర్తి పడి కలుషిత జలాలతో జనాలను అనారోగ్యం పాలుచేస్తున్నారు. రక్షిత మంచినీరు బదులు మురుగునీటిని సరఫరా చేస్తున్నా అటు పాలకులు, ఇటు అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



ఎస్‌పీపీ రిజర్వాయర్

ఫిల్టర్ చేయకుండా నేరుగా క్లియర్ వాటర్‌ట్యాంక్‌లోకి నీటిని వదలడంతో మురికిగా ఉన్న తాగు నీరు

ప్రాణజలం.. విషతుల్యం

- ఫిల్టర్ చేయకుండా నేరుగా తరలిస్తున్న సాగర్ జలాలు
- దుర్వాసన వెదజల్లుతున్న తాగునీరు
- బ్లీచింగ్ కూడా వేయకుండానే సరఫరా
- పట్టించుకోని పాలకులు, అధికారులు
- దర్శి ఎస్ఎస్ ట్యాంకు ద్వారా నాలుగు మండలాలకు నీటి సరఫరా
- కనీస నిబంధనలు పాటించని కాంట్రాక్టర్

దర్శి:

ప్రకాశం జిల్లా దర్శి పట్టణం నుంచి దర్శి, పొదిలి, తాళ్లూరు, ముండ్లమూరు మండలాలకు చెందిన ప్రజలకు నిత్యం సాగర్ జలాలు సరఫరా చేసేందుకు నాలుగున్నర దశాబ్దాల కిందట ఎస్‌పీపీ (నెదర్లాండ్ ఎయిడెడ్ ప్రాజెక్ట్) సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును నిర్మించారు. ఈ ప్రాంతంలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉండడంతో అప్పట్లో రూ.4 కోట్ల వ్యయంతో దీనిని నిర్మించారు. సాగర్ కాలువ నుంచి వచ్చే జలాలను స్టోరేజ్ ట్యాంకుకు మోటార్ల ద్వారా సరఫరా చేసి వాటిని శుద్ధి చేసి నియోజకవర్గంలో ప్రజలకు తాగునీరు అందించేలా ప్రణాళికలు చేశారు. ప్రారంభంలో దీని ద్వారా దర్శి, కనిగిరి, పొదిలి ప్రాంతాలకు నిత్యం రెండు లక్షల మందికి తాగునీరు అందించేవారు. 930 మీటర్ల మట్టి కట్టతో 2538 మిలియన్ లీటర్ల పరిమాణం కలిగిన సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌లో నీటిని శుద్ధి చేసేందుకు 7 శాండ్ ఫిల్టర్ బెడ్‌లు ఏర్పాటు చేశారు. 5 లక్షల లీటర్ల నీటి పరిమాణం కలిగిన క్లియర్ వాటర్ స్టోరేజ్ ట్యాంక్‌ను కూడా నిర్మించారు. ఫిల్టర్ బెడ్‌లలో శుద్ధి చేసిన జలాలను నేరుగా క్లియర్ వాటర్ ట్యాంక్‌లకు సరఫరా చేయాల్సి ఉంటుంది. ప్రారంభంలో దర్శి, పొదిలి, తాళ్లూరు, ముండ్లమూరు మండలాలకు నీటిని పంపేవారు. తర్వాత మర్రిపూడి, కనిగిరి మండలాలకు సైతం నీటిని సరఫరా చేశారు. ఈ నీటిని సరఫరా చేసేందుకు టెండర్లు నిర్వహించేవారు. కాంట్రాక్టు పొందిన వ్యక్తి నీటిని క్రమం తప్పకుండా శుద్ధి చేసి పంపిణీ చేయాల్సి ఉంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నీటి సరఫరా అంతా సక్రమంగా జరిగింది. రోజు విడిచి రోజు నీటిని పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారింది. అంతేకాకుండా నీటి శుద్ధి చేయకుండా సరఫరా చేస్తున్నారు.

సాగర్ కాలువ కట్టపై ఉన్న డంపింగ్ మురుగు వర్షాలకు సాగర్ కాలువలోకి చేరుతోంది. ఆ నీటినే నేరుగా మంచినీటి రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నానని, ఆ నీటిని కనీసం శుద్ధి చేయకుండా అలాగే నేరుగా క్లియర్ వాటర్ ట్యాంక్‌కు సరఫరా అవుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫిల్టర్ చేయకుండా నేరుగా నీటిని సరఫరా చేస్తూ తమ ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఎక్కువ మొత్తంలో డబ్బులు పెట్టి మినరల్ వాటర్ కొనుగోలు చేయలేక సాగర్ జలాలు వాసన వస్తున్నా గత్యంతరం లేక ఆ నీటిని తాగాల్సి వస్తోందని వాపోతున్నారు.



నీటిశుద్ధి కేంద్రం వద్ద పక్కన పడేసిన నీటి శుద్ధి గ్యాస్ బండలు

టెండర్ల దశలోనే తిరకాసు..

గత ప్రభుత్వంలో ఈ నీటిని శుద్ధి చేసి సరఫరా చేసేందుకు టెండర్లు పిలిచి కాంట్రాక్టరు ద్వారా నీటిని సరఫరా చేసే వారు. నీటి పంపిణీకి సంబంధించి దర్శి, ముండ్లమూరు, తాళ్లూరులకు విడివిడిగా టెండర్లు పిలిచేవారు. దర్శికి సంబంధించి రూ.2 కోట్లు, తాళ్లూరు మండలానికి రూ.76.5 లక్షలు, ముండ్లమూరు మండలానికి రూ.98 లక్షలు చెల్లించేలా టెండర్లను ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పిలిచేవారు. మొత్తంగా రూ.3.735 కోట్లకు సంబంధించిన టెండర్లను వైఎస్సార్ సీపీ హయాంలో 30 శాతం తక్కువకు టెండర్ వేసేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉన్నంత వరకూ నీటిని శుద్ధి చేస్తూ రోజు విడిచి రోజు నీటిని అందించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. టెండర్ల దశలో అంతా గోల్‌మాల్ జరిగిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఎవరూ పోటీకి రాకుండా అధికార పార్టీకి చెందిన వ్యక్తి కేవలం ఒక శాతం తక్కువ కోడ్ చేసి దక్కించుకున్నాడని ఆరోపణలు వినిపించాయి. అయితే తాను చేసే పనిలో అధిక మొత్తంలో అధికార పార్టీకి చెందిన కీలక ప్రజాప్రతినిధికి భారీగా నజరానా చెల్లించాడని సమాచారం. కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తి నీటి సరఫరాకు సంబంధించి కనీస నిబంధనలు పాటించడంలేదని తెలుస్తోంది. నీటిని శుద్ధి చేయడంలేదని, కనీసం బ్లీచింగ్ కూడా వేయకుండా అలాగే సాగర్ జలాలు గ్రామాలకు మురుగు నీరుగా సరఫరా చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కనీసం పురుగులను నిర్మూలించేందుకు గ్యాస్ లేదా బ్లీచింగ్ కూడా నీటిలో కలుపకుండా అలాగే సరఫరా చేయడంతో అందులో పురుగులు కూడా వస్తున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. మట్టిమట్టిగా నీరు రావడమే కాకుండా దుర్వాసన వస్తోందని వాపోతున్నారు. నిండుగా నీరున్నా వారానికి రెండు రోజులు మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఫలితంగా తాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కలుషిత నీరు వస్తున్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రతి రోజు నీరు సరఫరా చేయడం లేదు



ప్రతిరోజు నీరు సరఫరా చేయడం లేదు. వారంలో రెండు రోజులు మాత్రమే నీరు వస్తోంది. నీరు కూడా మురికిగా వస్తోంది. పురుగులు ఉంటున్నాయి. మాలాంటి పేదలు ఆ నీటిని ఎలా తాగాలి. నీటిని శుద్ధి చేసి అందివ్వాలి. ఈ నీళ్లు తాగి రోగాల బారిన పడుతామని భయం వేస్తోంది.
– వల్లపు గురులక్ష్మి, శివరాజనగర్

నీళ్లు వాసన వస్తున్నాయి



కొళాయిల్లో నీరు మురికిగా వస్తున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ఆ నీటిని అలాగే తాగుతున్నాం. పురుగులు కూడా వస్తున్నాయి. వారంలో రెండు రోజులే నీరు వదులుతున్నారు. శుద్ధి చేసిన నీటిని వదలాలి. కనీసం బ్లీచింగ్ కూడా నీటిలో వేయడం లేదు. చిన్న చిన్న పురుగులు నీటిలో కనిపిస్తున్నాయి. వడగట్టుకుని తాగాల్సి వస్తోంది.
– తమ్మశెట్టి కొండమ్మ, శివరాజనగర్



ఫిల్టర్ బెడ్‌లలోకి వెళ్తున్న రిజర్వాయర్‌లో సాగర్ జలాలు



సాగర్ జలాలతో నింపిన రిజర్వాయర్

సాగుబడి

చిత్త కార్తె: అక్టోబర్ 14 నుంచి



సీ ఫుడ్ హీరోలు జెజు మహిళలు!

'సముద్రం నా రెండో తల్లి'!

ఉద్యోగం కంటే ఎక్కువ.. ఒక జీవన వారసత్వం!

ర్యుజిన్ కో తన తల్లి లేదా అమ్మమ్మ అడుగుజాడల్లో నడవాలని ఎప్పుడూ అనుకోలేదు. జెజు ద్వీపం తూర్పు తీరంలో డైవ్ చేయడానికి తన తల్లి లేదా అమ్మమ్మ ఇంటి నుంచి పొద్దున్నే బయలుదేరి వెళ్లే సంగతి ఆమెకు బాల్యంలోనే తెలుసు. సీజన్ సరిగ్గా ఉన్నప్పుడు, వారు తమ కుటుంబాలను పోషించుకోవడానికి సముద్రపు అర్చిన్‌లు, అబలోన్, సముద్రపు నాచును సముద్రం లోపలి జలాలను గాలించి సేకరించేవారు. ర్యుజిన్ తన తరంలోని చాలా మంది అమ్మాయిల్లాగే కష్టపడి చదువుకుని నగరపు జీవితాన్ని గడపాలని కలలు కంది. అథ్లెటిక్స్‌లో డిగ్రీ పొందిన తర్వాత ఆమె నగరానికి వెళ్లిపోయింది. కానీ, అక్కడి జీవితంలో నిలవలేకపోయింది. ఎదురైన నిరాశ, ఆవహించిన నిస్సత్తువ ఆమెను తిరిగి ఇంటి బాట పట్టించాయి. ఇల్లు ఆమెను సముద్రం వైపు నడిపించింది. ఆ విధంగా యువ ర్యుజిన్ తన తల్లి, అమ్మమ్మలాగే ఆమె 'సముద్ర మహిళ' కావాలని నిర్ణయించుకుంది.

వేగవంతమైన ప్రపంచంలో జెజులోని హెన్యో సమాజం పర్యావరణ స్పృహతో కొనసాగుతోంది. ప్రకృతిని మనుషులు ఉపయోగించుకునే క్రమంలో పర్యావరణ పరిమితులను గౌరవిస్తుంది. పరస్పరం ఆధారపడటాన్ని విలువైనదిగా భావించే జీవన విధానాన్ని కొత్త తరాలకు చాటిచెప్పే ఉదాహరణగా నిలుస్తుంది.

'ప్రజలు ఈ పనిని '3డి ఉద్యోగం' అని పిలుస్తారు. మూడు డీలు అంటే.. డర్టీ, డేంజర్, డిమాండింగ్‌తో కూడిన పని అని చెబుతుంటారు. కానీ నా మటుకు నాకు, ఇది అత్యున్నతమైన సంతృప్తినిచ్చే పని అనిపిస్తుంటుంది' అన్నారు 42 ఏళ్ల ర్యుజిన్. 'నేను నీటి అడుగున ఉన్నప్పుడు, నేను జీవించడం గురించి మాత్రమే ఆలోచిస్తాను. అంతకుమించి అతిగా ఆలోచించడం మానేశాను' అంటారు ర్యుజిన్. 'సముద్రం నా రెండో తల్లి. నేను సముద్రపు తల్లి ఒడిలో ఈదులాడుతూ చాలా స్వస్థత పొందాను. ఈ తల్లి నాకు చాలా ఇచ్చింది..' అంటారామె ఉద్వేగంగా! 'నాకు నలుగురు పిల్లలు. ప్రతి ఉదయమూ జీవన పోరాటమే. కానీ సముద్రం వైపు వెళుతున్నప్పుడు మాత్రం నాకు ఉత్సాహంగా ఉంటుంది. ఈ రోజు సముద్రం నాకు ఏమి ఇస్తుందో అన్న ఉత్సుకత కలుగుతుంది. స్వస్థత చేకూర్చే నిరంతర ప్రవాహంలా జీవితం గడచిపోతోంది' అన్నారామె. 'జెజులో మహిళలది ఎల్లప్పుడూ కీలక పాత్రే. నాకు, హెన్యో అంటే మహిళలు. మహిళలు అంటే హెన్యో. ఇది గొప్ప గర్వకారణం...' అన్నారు.

శ్వాస పరికరాలు లేకుండా సాగర గర్భంలోకి డైవ్ చేస్తూ షెల్ ఫిష్, సీవీడ్స్ వంటి సముద్ర ఆహారాన్ని సేకరించి కుటుంబాలను పోషించుకునే మహిళా రైతుల తెగువ ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయంలో చెమటను చిందించే రైతమ్మలందరికీ స్ఫూర్తినిస్తుంది. దక్షిణ కొరియాలోని జెజు ద్వీపానికి చెందిన హెన్యో అనే మహిళా డైవర్లను 'సీ ఉమన్' అంటారు. వెయ్యేళ్ల నాటి వారసత్వ సంస్కృతి, డైవింగ్ నైపుణ్యం, సుస్థిరతలకు ప్రసిద్ధి చెందిన ఒక ప్రత్యేకమైన పాక్షిక మాతృస్వామిక సంప్రదాయం వారిది. ఇప్పటికీ 103 గ్రామాలకు చెందిన మహిళలు ఈ విధంగా ఎటువంటి యంత్రాల సహాయం లేకుండా సముద్ర గర్భంలోకి దూసుకెళ్తూ ఆహార సేకరణ చేస్తున్నారు. ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్‌ఏఓ) 'ఫుడ్ హీరోలు'గా కీర్తిస్తోంది. అంతేకాదు, అత్యంత అరుదైన ప్రపంచ వ్యవసాయ వారసత్వ సంపదగా కూడా హెన్యో సామ్రాజ్యాన్ని ఎఫ్ఏవో, యునెస్కో విశిష్ట గుర్తింపునిచ్చాయి. జెజు ద్వీపంలో పుట్టిన ఈ తరం యువతులు సైతం ఈ సంప్రదాయ వారసత్వ వ్యవసాయాన్ని కొనసాగిస్తూ ఆధునిక సాగర కన్యలుగా జీవనం సాగిస్తుండటం విశేషం. స్వేచ్ఛా డైవింగ్ ద్వారా వారు 'సముద్ర పొలాలను' పండిస్తున్న అరుదైన మహిళా ఫుడ్ హీరోలపై అక్టోబర్ 16న అంతర్జాతీయ ఆహార దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...



ప్రకృతి చిత్రమైనది. ఒక వనరు లేకపోతే మరో వనరును చూపిస్తుంది మనుషులు బతకడానికి! రిపబ్లిక్ ఆఫ్ కొరియాలోని జెజు ద్వీపం ఇందుకు ఒక ఉదాహరణ. ఒక అసాధారణ, విలక్షణ 'సముద్ర వ్యవసాయ' వారసత్వానికి కేంద్ర బిందువైంది. జెజు ద్వీపంలో ఎక్కువ భూమి నిస్సారవంతమైనది కావటంతో వ్యవసాయానికి అంతగా పనికొచ్చే స్థితిలో లేదు. ఈ భౌగోళిక బలహీనత కారణం వల్ల జెజు ప్రజలు సాంప్రదాయకంగా వరికి బదులుగా తమ మెట్ట పొలాల్లో బాగా పెరిగే చిరుధాన్యాలు, బార్లీ వంటి ధాన్యపు పంటలను పండించేవారు. ఎందుకంటే ఈ పంటలు తక్కువ వనరులతోనే ఎక్కువ మందికి ఆహార భద్రతనిచ్చే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఆ కారణంగా అక్కడి మహిళా రైతులు సముద్రంపై ఆధారపడి తమ కుటుంబాలకు ఆహారాన్ని సమకూర్చుకోవటంపై దృష్టి సారించారు. సముద్రం అడుగున ఉండే జీవులు, ఆకులు అలములను వెదికి తెచ్చుకోవటమే వారు వృత్తిగా పెట్టుకున్నారు. సుమారు వెయ్యి ఏళ్ల క్రితం నుంచి జుజు ద్వీపంలోని మహిళలు సముద్రపు నీటి లోతుల్లోకి దూకి తినదగిన ఆహారాన్ని సేకరించటం ప్రారంభించారు. ఆ క్రమంలో వారు అసాధారణమైన డైవింగ్ నైపుణ్యాలను తరతరాలుగా సంతరించుకున్నారు. ఎటువంటి శ్వాస పరికరాలు పెట్టుకోకుండా సాగర గర్భంలోకి డైవ్ చేస్తూ అట్టడుగున ఉండే షెల్ ఫిష్, సీవీడ్స్ వంటి సముద్ర ఆహారాన్ని సేకరించి కుటుంబాలను పోషించుకుంటున్నారు.

జెజు హెన్యో ఫిషింగ్ ప్రాక్టీస్ అనేది ప్రధానంగా మహిళలు నిర్వహించే సాంప్రదాయ జీవనాధార ఫిషింగ్ వ్యవస్థ.

హెన్యో అంటే కొరియన్ భాషలో 'సముద్ర మహిళ' అని అర్థం. జెజు హెన్యోలు సాధారణ పద్ధతుల్లో చేపలు పట్టరు. అలాగని మట్టిలో పంటలు పండించరు. ఈ రెండిటికి మధ్యలో పర్యావరణ హితమైన సముద్రాహార సేకరణ ద్వారా తమ సమాజానికి ఆహార, జీవనోపాధి భద్రతను సాధించగలిగారు. ఈ మహిళా డైవర్లు సగం వ్యవసాయం - సగం మత్స్యకార జీవనశైలితో కూడిన జీవనోపాధి పనిలో నిమగ్నమవుతున్నారు.

వట్టిపోతున్న సముద్రం

కనుమరుగవుతున్న వాణిజ్య అవకాశాలతో పాటు సముద్రం నుంచి జుజు మహిళా డైవర్లు పొందే ప్రతిఫలం కూడా తగ్గుతోంది. వాతావరణ మార్పుల కారణంగా జెజు సముద్ర జలాలు వేడెక్కుతున్నాయి. ఫలితంగా, ఈ ప్రాంత సముద్ర జలాల్లోకి చొచ్చుకొస్తున్న ఉపఉష్ణమండల చేపలు స్థానిక జాతులను మింగేస్తున్నాయి. అముర్ స్టార్ ఫిష్, బ్లూ-రింగ్డ్ ఆక్టోపస్ వంటి మాంసాహార జాతులు ఈ జలాలను దురాక్రమణ చేస్తున్నాయి. సముద్ర మహిళలు ఇప్పుడు అలల కింద కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్నారు.

ర్యుజిన్ సముద్రంలోకి దిగిన ప్రారంభ సంవత్సరాల్లో సమృద్ధిగా చేపలు పట్టుకోగలిగేది. కానీ ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. ఒకప్పుడు దొరికిన దానిలో పావు వంతు కంటే తక్కువ మత్స్య సంపదే ఇప్పుడు దొరుకుతోంది.

'నా నైపుణ్యాలు మెరుగుపడినప్పటికీ, సముద్రం నుంచి తక్కువగానే పట్టుకోగలుగుతున్నాను. మూడు సంవత్సరాల క్రితం నేను ఏటా 30 బస్తాల అగర్ సీవీడ్‌ను సేకరించి ఎండబెట్టగలిగాను. ఈ సంవత్సరం కేవలం ఏడు బస్తాలతో సరిపెట్టుకోవాల్సి వస్తోంది..' అన్నారు ర్యుజిన్.

ర్యుజిన్, ఆమెతో పాటు ఉండే మహిళా డైవర్లు మత్స్య సంపద అంతరించిపోకుండా అన్ని జాగ్రత్తలూ తీసుకుంటున్నారు. స్వీయ-నియంత్రణ పాటిస్తూ సముద్ర పర్యావరణ వ్యవస్థను సంరక్షించే చర్యలు చేపడుతున్నారు. హానికరమైన మత్స్య జాతుల నుంచి ఒబుంజాక్ (ఒక రకమైన అబలోన్) వంటి స్థానిక జాతులను కాపాడుతున్నారు. మహిళా డైవర్లు తాము ఆహారం కోసం వేటాడే వారిలా మాత్రమే కాకుండా సముద్ర జీవుల సంరక్షకులుగా తమను తాము భావిస్తారు. స్థానిక సముద్ర జలాలను దురాక్రమణ చేసే స్టార్ ఫిష్‌లను స్థానిక ప్రభుత్వ మద్దతుతో చంపే పని కూడా చేస్తున్నారు.

కొత్త యుగం

సవాళ్లు ఎదురవుతున్నప్పటికీ జెజు హెన్యో సంస్కృతిపై ప్రజలకు ఆసక్తి పెరుగుతోంది. 2016లో యునెస్కో జెజు హెన్యో సంస్కృతిని యావత్ మానవాళి అవ్యక్త సాంస్కృతిక వారసత్వ సంపదగా గుర్తించింది.

ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) జెజు హెన్యో మత్స్యకార వ్యవస్థను 'ప్రపంచ వ్యాప్తంగా అతిముఖ్యమైన వ్యవసాయ వారసత్వ వ్యవస్థ'గా 2023లో ప్రకటించింది. సముద్ర జీవవైవిధ్యం, హానికరం కాని రీతిలో వేట పద్ధతులు అనుసరించటం, అసాధారణమైన సామాజిక నీతి సంరక్షకులుగా హెన్యో మహిళా డైవర్లకు గల ప్రాముఖ్యతను ఎఫ్ఏఓ గుర్తించి ప్రోత్సహిస్తోంది.

జెజు ప్రత్యేక స్వయం పాలిత రాష్ట్రంలో ఏర్పాటైన హెన్యో సాంస్కృతిక వారసత్వ విభాగం డైరెక్టర్ క్యుంగ్-హో కో మాట్లాడుతూ ఈ గుర్తింపు ప్రాముఖ్యతను ఇలా వివరించారు.. 'ఇది జెజు హెన్యో వ్యవస్థను ఉన్నతీకరిస్తుంది. ఈ విలువైన వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించడానికి సహాయపడుతుంది. స్థానిక సమాజం అభివృద్ధికి దోహదపడుతుంద'ని ఆయన అన్నారు. 'కఠినమైన పని పరిస్థితులు, పర్యావరణ మార్పులు, తగ్గుతున్న సముద్ర వనరులు, వృద్ధాప్యం, కొత్తగా ఈ పనిలోకి వచ్చే వారి సంఖ్య తక్కువగా ఉండటం వంటి సవాళ్లు ఉన్నప్పటికీ, తమ జీవనోపాధిని కొనసాగించే మహిళల బలమైన ఆకాంక్షను ఎఫ్ఏవో గుర్తింపు బలోపేతం చేస్తోంది' అన్నారాయన.



హెన్యో జీవన విధానాన్ని కాపాడుకోవడానికి జెజు ప్రభుత్వం కృషి చేస్తోంది. సముద్ర మహిళల సంక్షేమం కోసం, వారి ఆదాయాన్ని పెంపొందించడానికి, వారి పని వాతావరణాన్ని మెరుగుపరచటం ద్వారా హెన్యో సంస్కృతిని సంరక్షించడానికి ఈ సంవత్సరం 2 కోట్ల అమెరికన్ డాలర్ల మేరకు ప్రభుత్వం పెట్టుబడి పెట్టిందని డైరెక్టర్ క్యుంగ్-హో కో వివరించారు. డైవింగ్ సంబంధిత గాయాలకు వైద్య ఖర్చులను ప్రభుత్వం భరిస్తోంది. అరవై, డెబ్బయి ఏళ్లు దాటిన హెన్యోలకు ఆర్థిక భత్యాలు ఇస్తున్నారు. 75 ఏళ్లు పైబడిన వారికి పదవీ విరమణ ప్రయోజనాలను అందిస్తున్నారు. హెన్యో పండుగలు, ఆచారాల ప్రోత్సహించటం, కొత్త తరం మహిళలకు హెన్యో నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వడానికి పాఠశాలలను కూడా నిర్మించటం విశేషం.

ప్రతి అక్టోబర్ 16 నాడు ప్రపంచ ఆహార దినోత్సవం జరుపుకుంటూ ప్రపంచవ్యాప్తంగా ర్యుజిన్ వంటి 'ఫుడ్ హీరో'ల గురించి గొప్పగా చెప్పుకుంటూ ఉంటాం. ఇటువంటి సంప్రదాయ విజ్ఞానంతో కూడిన గొప్ప జీవన నైపుణ్య సాంప్రదాయ వారసత్వాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరాన్ని ఈ తరం గుర్తించేలా చెయ్యటం మన కర్తవ్యం.

కనుమరుగవుతున్న వారసత్వం

హెన్యో వ్యవసాయ వారసత్వ సంప్రదాయానికి వెయ్యి సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. క్రీస్తు శకం 1,105వ సంవత్సరం నుంచి ఈ వ్యాపారాన్ని ప్రస్తావించిన రికార్డులున్నాయి. జెజు మహిళలు ఎల్లప్పుడూ ఆ ద్వీపం జీవితానికి వెన్నెముకగా ఉన్నారు. మత్స్యకారులుగా, రైతులుగా, తల్లులుగా, ఎక్కువగా వీళ్లదే ఇళ్లలో ముఖ్యమైన సంపాదనగా ఉంటుంది.

1970లలో 14,000 మంది హెన్యోలు ఉన్నారు. కానీ, 1980 తర్వాత కాలంలో చాలా మంది మహిళలు ఈ పనిని విడిచిపెట్టి పర్యాటక, టాన్జేరిన్ పరిశ్రమల్లో ఉద్యోగాల కోసం వెళ్లారు. ప్రస్తుతం 2,700 హెన్యోలు ఉన్నారు. అయితే, వారిలో చాలా మంది డెబ్బై, ఎనభై- ఏళ్ల వయస్కులే! 42 సంవత్సరాల వయస్కురాలైన ర్యుజిన్ సముద్రంలోకి వెళ్లే అతి పిన్న వయస్కుల్లో ఒకరు. ర్యుజిన్ గ్రామంలో 83 మంది చురుకైన హెన్యోలు ఉన్నారు. ఈ సంవత్సరం పది మంది పదవీ విరమణ చేయాలని ప్లాన్ చేసుకుంటున్నారు. ర్యుజిన్ తరంలో డైవర్లు పని నేర్చుకున్న వారి సంఖ్య చాలా తక్కువ. 'భవిష్యత్తులో నేను ఒంటరిగా డైవింగ్ చేయవలసి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నాను. అందుకే నేర్చుకోవాలనుకునే వారెవరినైనా స్వాగతిస్తున్నాను. నాకు తెలిసిన ప్రతి నైపుణ్యాన్నీ వారికి నేర్పుతాను' అని ర్యుజిన్ చెప్పారు.

20 మీటర్లు.. 2 నిమిషాలు...

స్వేచ్ఛా డైవింగ్ చేసే జెజు మత్స్యకార మహిళలు తమ శ్వాసను ఉగ్గబట్టుకునే సామర్థ్యం, సముద్ర జలాల్లోకి దూసుకెళ్లే నైపుణ్యం, సముద్రపు నీటి అడుగున ఏయే తావుల్లో తమకు అవసరమైన ఆహారం ఎక్కడెక్కడ ఉంటుందో గ్రహించే సంప్రదాయ విజ్ఞానం, జ్ఞాపక శక్తిని మాత్రమే ఆయుధాలుగా ఉపయోగించి సముద్రపు లోతుల్లోకి సాహసంతో దూకేస్తారు. ఆక్సిజన్ ట్యాంకులు లేకుండా వారు డైవ్ చేయగలరు. ఒకటి-రెండు నిమిషాలు తమ శ్వాసను స్తంభింపజేసుకోగలరు. ఆ కొద్ది సమయంలోనే ఐదు నుండి 20 మీటర్ల లోతుకు డైవ్ చేయగలరు. రోజుకు ఏడు గంటల పాటు సముద్రంలో గడపటం వారికి వెన్నతో పెట్టిన విద్య.

– నిర్వహణ:
పంతంగి రాంబాబు
సాక్షి సాగుబడి డెస్క్



బిజినెస్ రీల్

నేటి నుంచి అమెరికాకు పోస్టల్ సేవలు మళ్లీ షురూ



న్యూఢిల్లీ: అమెరికాకు అంతర్జాతీయ పోస్టల్ సర్వీసులను ఇండియా పోస్ట్ అక్టోబర్ 15 నుంచి (నేడు) పునఃప్రారంభిస్తున్నట్లు పోస్టల్ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ (సీబీపీ) మార్గదర్శకాల ప్రకారం భారత్ నుంచి వెళ్లే షిప్‌మెంట్స్ కన్సైన్‌మెంట్ విలువలో 50 శాతం కస్టమ్స్ డ్యూటీ వర్తిస్తుందని పేర్కొంది. పోస్టల్ ఐటమ్‌లపై ప్రొడక్టును బట్టి సుంకాలు విధించడంలాంటివి ఉండదని వివరించింది. దీనితో చిన్న వ్యాపారులు, ఈ-కామర్స్ ఎగుమతిదార్లు మొదలైన వర్గాలకు ప్రయోజనం చేకూరుతుందని పోస్టల్ శాఖ తెలిపింది.

కియా కార్లపై ఏడేళ్ల వరకు వారంటీ



న్యూఢిల్లీ: వాహనాల తయారీ సంస్థ కియా తమ కార్లపై ఎక్స్‌టెండెడ్ వారంటీ వ్యవధిని 5 ఏళ్ల నుంచి 7 ఏళ్లకు పొడిగించింది. వాహనం డెలివరీ తేదీ నుంచి ఇది వర్తిస్తుంది. పాత, కొత్త సెల్టోస్, సోనెట్, సైరోస్, కారెన్స్ వాహనదారులు కొంత అదనపు మొత్తం చెల్లించి, దీన్ని పొందవచ్చు. ఇప్పటికే 5 ఏళ్ల ఎక్స్‌టెండెడ్ వారంటీని ఎంచుకున్న వారు, మరో రెండేళ్లు పొందడానికి అదనంగా చెల్లించాల్సిన మొత్తం రూ. 32,170 (పన్నులు కాకుండా) నుంచి ప్రారంభమవుతుంది. కొత్త కస్టమర్లు ఏడేళ్ల ఎక్స్‌టెండెడ్ వారంటీ కోసం రూ. 47,249 (పన్నులు కాకుండా) చెల్లించాల్సి ఉంటుంది.

సెన్కో గోల్డ్ అండ్ డైమండ్స్ 'షగున్' కలెక్షన్



ముంబై: ధన్‌తేరస్ పండుగ సందర్భంగా సెన్కో గోల్డ్ అండ్ డైమండ్స్ 'షగున్' పేరుతో కొత్త కలెక్షన్‌ను మార్కెట్లోకి విడుదల చేసింది. పసుపు వర్ణ బంగారం, వజ్రాలు, ప్రాచీన, పోల్కీ ఆభరణాలతో తయారు చేశారు. ఈ కొత్త కలెక్షన్ ప్రచారం కోసం నటి కియారా అద్వాణీతో ఒక ప్రచార చిత్రాన్ని రూపొందించారు. పండుగ ఉత్సాహాన్ని మరింత పెంచేలా ప్రత్యేక ఆఫర్లు అందుబాటులోకి ఉన్నాయి. బంగారం ఆభరణాల కొనుగోలుపై ప్రతి గ్రాముకు రూ.700 నుంచి రూ.1,000 వరకు క్యాష్ బ్యాక్, వజ్రాల కొనుగోలుపై 15% వరకు డిస్కౌంట్, పాత బంగారం మారి ్పడిపై 100% విలువ పొందవచ్చు. శగున్ కలెక్షన్ ఆభరణాలు అన్ని సెన్కో స్టోర్లు, అధికారిక వెబ్‌సైట్‌లో లభిస్తాయి.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-10-2025

విశాఖ	520-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	530-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	515-00
వరంగల్	517-00
రిటైల్ ధర	5.75

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
MAXHEALTH	1,159.50	1.42
TECHM	1,468.90	1.24
WIPRO	247.8	1.09
APOLLOHOSP	7,752.00	1.06
ICICIBANK	1,384.80	0.39

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
DRREDDY	1,235.00	-2.17
TATASTEEL	169.32	-2.14
BAJFINANCE	1,017.00	-1.9
BEL	402.15	-1.77
TRENT	4,604.00	-1.66

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,826
ఎన్ఎస్ఈ	1,09,665
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,87,503
ఎఫ్ఐఐ	- 1,509
డీఐఐ	+ 3,661

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	58.76 (రాత్రి 11.30కు)	$ 59.49 (క్రితం ముగింపు)
బ్రెంట్	62.45 (రాత్రి 11.30కు)	$ 63.32 (క్రితం ముగింపు)

మూడోసారి చంద్రశేఖరన్‌కే ఓటు

టాటా ట్రస్ట్స్ సిఫారసు



న్యూఢిల్లీ: టాటా గ్రూప్ కంపెనీల ప్రమోటర్, ప్రధాన ఇన్వెస్ట్‌మెంట్ హోల్డింగ్ కంపెనీ టాటా సన్స్‌కు చైర్మన్‌గా మూడోసారి ఎన్.చంద్రశేఖరన్ ఎంపిక కానున్నట్లు తెలుస్తోంది. ఇందుకు తాజాగా టాటా ట్రస్ట్స్ సిఫారసు చేసినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. టాటా సన్స్ ఈక్విటీ మూలధనంలో 66 శాతం వాటా కలిగిన టాటా ట్రస్ట్స్ బోర్డు నియామకాలు, పాలనా సంబంధ అంశాలలో రెండుగా చీలిపోయిన నేపథ్యంలో చంద్రశేఖరన్‌కు బాధ్యతలు అప్పగించనుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. వివిధ దాతృత్వ ట్రస్ట్‌ల సమాహారమైన టాటా ట్రస్ట్స్ చంద్రశేఖరన్‌వైపు ఎప్పుడు మొగ్గు చూపిందీ వెల్లడికానప్పటికీ దీనిపై టాటా సన్స్ స్పందనను గమనించవలసి ఉన్నట్లు పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

గత వారం సమావేశంలో

టాటా ట్రస్ట్స్ గత వారం నిర్వహించిన బోర్డు సమావేశంలో సాధారణ అంశాలపైనే చర్చించినట్లు తెలుస్తోంది. 180 బిలియన్ డాలర్ల విలువైన వ్యాపార సామ్రాజ్యం కలిగిన టాటా సన్స్ కార్యకలాపాలకు విఘాతం కలగకుండా చూసే ఉద్దేశ్యంతో వివాదాస్పద అంశాల జోలికిపోలేదని సంబంధిత వర్గాలు తెలియజేశాయి. వెరసి మూడోసారి చైర్మన్‌గా చంద్రశేఖరన్‌కు బాధ్యతలు అప్పగించేందుకు సిఫారసు చేసినట్లు వెల్లడించాయి. దీనిపై టాటా సన్స్ బోర్డు నిర్ణయం తీసుకోవలసి ఉన్నట్లు పేర్కొన్నాయి. అయితే 65 ఏళ్ల వయసు దాటనున్న చంద్రశేఖరన్ ఎగ్జిక్యూటివ్‌గా పదవిని నిర్వహిస్తారా లేక టాటా గ్రూప్ నిబంధనల ప్రకారం నాన్‌ఎగ్జిక్యూటివ్‌గా బాధ్యతలు తీసుకుంటారా అనేది వేచిచూడవలసి ఉన్నట్లు ఆ వర్గాలు తెలియజేశాయి. 2022 ఫిబ్రవరిలో ఐదేళ్ల కాలానికి చైర్మన్‌గా చంద్రశేఖరన్‌ను రెండోసారి టాటా సన్స్ ఎంపిక చేసుకుంది. దీంతో 2027 ఫిబ్రవరివరకూ ఆయన బాధ్యతలు నిర్వహించనున్నారు. అయితే టాటా సన్స్‌లో 18.4 శాతం వాటా కలిగిన షాపూర్‌జీ పల్లోంజీ కుటుంబం ఈ అంశంపై ఓటింగ్‌కు దూరంగా ఉండటం గమనార్హం! 2016 అక్టోబర్‌లో టాటా సన్స్‌లో చేరిన చంద్రశేఖరన్ 2017 జనవరిలో చైర్మన్‌గా ఎంపికయ్యారు. తదుపరి అప్పటి చైర్మన్ సైరస్ మిస్త్రీకి ఉద్వాసన పలికాక 2017 ఫిబ్రవరిలో అధికారికంగా బాధ్యతలు చేపట్టారు.

తగ్గిన ఆహార ధరలు

- టోకు ద్రవ్యోల్బణం 0.13 శాతం
- సెప్టెంబర్‌లో నమోదు



న్యూఢిల్లీ: ఆహారోత్పత్తుల ధరలు, తయారీ వస్తువుల ధరలు శాంతించడంతో టోకు ద్రవ్యోల్బణం సెప్టెంబర్ మాసంలో 0.13 శాతానికి పరిమితమైంది. టోకు ధరల ఆధారిత సూచీ (డబ్ల్యూటీఐ) ఈ ఏడాది ఆగస్ట్‌లో 0.52 శాతంగా ఉంటే, గతేడాది సెప్టెంబర్‌లో 1.91 శాతంగా ఉండడం గమనార్హం.

- ఆహార వస్తువుల్లో మైనస్ 5.22 శాతం ప్రతికూల ద్రవ్యోల్బణం నమోదైంది. ఆగస్ట్‌లో ఇది 3.06 శాతంగా ఉంది.
- ముఖ్యంగా కూరగాయల ధరలు తగ్గాయి. ఈ విభాగంలో మైనస్ 24.41 శాతం ప్రతికూల ద్రవ్యోల్బణం నెలకొంది. ఆగస్ట్‌లో ఇది 14.18 శాతంగా ఉంది.
- తయారీ వస్తువుల విభాగంలో 2.33 శాతానికి ద్రవ్యోల్బణం శాంతించింది. ఆగస్ట్‌లో ఇది 2.55 శాతంగా ఉంది.
- ఇంధనం, విద్యుత్ విభాగంలోనూ మైనస్ 2.58 శాతం ద్రవ్యోల్బణం నెలకొంది. ఆగస్ట్‌లో ఇది 3.17 శాతంగా ఉంది.

కనిష్ట స్థాయిలోనే కొంత కాలం

అంతర్జాతీయంగా కమోడిటీల ధరలు గణనీయంగా తగ్గడంతో, టోకు ద్రవ్యోల్బణం దీర్ఘకాలం పాటు కనిష్ట స్థాయిల్లోనే కొనసాగొచ్చని బార్‌క్లేస్ ఇండియా ముఖ్య ఆర్థికవేత్త ఆస్తా గుడ్వాణీ అభిప్రాయపడ్డారు.

రత్నాభరణాల ఎగుమతులు సానుకూలమే

- కలిసొచ్చిన పండుగల డిమాండ్
- సెప్టెంబర్ నెలలో 25,737 కోట్లు
- ఆరు నెలల్లో 3 శాతం వృద్ధి
- అమెరికాకు 40 శాతం డౌన్



ముంబై: అమెరికా నుంచి టారిఫ్ పరమైన సవాళ్లు నెలకొన్నప్పటికీ, పండగలు, వివాహ సీజన్ డిమాండ్ కలసిరావడంతో సెప్టెంబర్‌లో రత్నాభరణాల పరిశ్రమ మంచి పనితీరు సాధించింది. క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే 6.55 శాతం అధికంగా 2,914 మిలియన్ డాలర్ల (రూ.25,737 కోట్లు) మేర ఎగుమతులు నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే నెలలో ఎగుమతులు రూ.22,925 కోట్లుగా ఉన్నాయి. ఈ వివరాలను రత్నాభరణాల ఎగుమతుల ప్రోత్సాహక మండలి (జీజేఈపీసీ) విడుదల చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల కాలంలో ఎగుమతులు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూసినప్పుడు 3.66 శాతం పెరిగి 14.09 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో 13.60 బిలియన్ డాలర్ల మేర ఎగుమతులు జరిగాయి. 50 శాతం ప్రతీకార సుంకాల ఫలితంగా అమెరికాకు మాత్రం ఎగుమతులు గణనీయంగా తగ్గాయి. ఆరు నెలల కాలంలో యూఎస్‌కు ఎగుమతులు 40 శాతం క్షీణించి 2,770 మిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. కట్ చేసిన, సానబెట్టిన వజ్రాల ఎగుమతులు అయితే 54 శాతం తగ్గి 1,175 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. భారత రత్నాభరణాల ఎగుమతులకు అమెరికా చాలా కాలం నుంచి కీలక మార్కెట్‌గా ఉండగా, ప్రతీకార సుంకాలతో ఈ పరిస్థితిలో మార్పు కనిపిస్తోంది.

బలమైన డిమాండ్ కొనసాగుతుంది..

ఏప్రిల్–సెప్టెంబర్ మధ్యకాలంలో కట్, పాలిష్డ్ వజ్రాల ఎగుమతులు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 6 శాతం మేర పెరిగి 1,368 మిలియన్ డాలర్లుగా ఉన్నాయి. బంగారం ఆభరణాల ఎగుమతులు 2.4 శాతం పెరిగి 1,092 మిలియన్ డాలర్లకు చేరాయి. ''2025–26 మొదటి అర్ధభాగంలో పరిశ్రమ కోలుకుందన్న దానికి సంకేతాలు కనిపిస్తున్నాయి. కీలక మార్కెట్లు యూఏఈ, హాంగ్‌కాంగ్, యూకేలో రత్నాభరణాల ఉత్పత్తులకు డిమాండ్ బలపడింది. ఈ మార్కెట్లకు ఎగుమతులు స్థిరంగా పెరుగుతున్నాయి. రానున్న వివాహాల సీజన్ సమయంలో ప్రవాస భారతీయులు ఉన్న చోట డిమాండ్ పెరుగుతుందని అంచనా వేస్తున్నాం. కనుక ఈ వృద్ధి మరో త్రైమాసికం పాటు స్థిరంగా కొనసాగుతుంది''అని జీజేఈపీసీ చైర్మన్ కిరీట్ భన్సాలీ తెలిపారు. అమెరికా మార్కెట్‌కు ఎగుమతి చేసే తయారీదారులు సమస్యలను ఎదుర్కొంటున్నందున ప్రభుత్వంతో సంప్రదింపులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ రంగం స్థిరత్వం కోసం ఉపశమన చర్యలను ఆశిస్తున్నట్టు తెలిపారు. ప్రభావిత కార్మికుల కుటుంబాలకు రాయితీపై రుణాలు, వ్యక్తిగత రుణాల పునరుద్ధరణ, ఒక్కో కుమార్తెకు రూ.1,000 చొప్పున విద్యా సాయం, ఆయుష్మాన్ భారత్ పథకం కింద కార్మికులను తాత్కాలికంగా చేర్చాలని కోరినట్టు చెప్పారు.

ఈపీఎఫ్ పూర్తి ఉపసంహరణకు
మరింత కాలం
ఈపీఎఫ్‌వో సెంట్రల్ బోర్డు నిర్ణయం



న్యూఢిల్లీ: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) దీర్ఘకాలం పాటు ఉపాధి లేకుండా కొనసాగిన సందర్భాల్లోనే సభ్యులు తుది పరిష్కారాన్ని ఎంపిక చేసుకునేందుకు, భవిష్యనిధి ఖాతాలోని మొత్తాన్ని వెనక్కి తీసుకునేందుకు అనుమతించింది. 12 నెలలుగా ఉద్యోగం లేని వారు ఈపీఎఫ్ తుది పరిష్కారానికి దరఖాస్తు చేసుకోవచ్చు. 36 నెలల పాటు ఉద్యోగం లేకుండా కొనసాగితే అప్పుడు భవిష్య నిధితోపాటు పెన్షన్ ఖాతాలో ఉన్న మొత్తాన్ని ఉపసంహరించుకోవచ్చని ఈపీఎఫ్‌వో ప్రకటించింది. ఈపీఎఫ్‌వో సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపింది. ప్రస్తుతం రెండు నెలలుగా ఉద్యోగం లేకుండా ఉన్న వారు నిధులను ఉపసంహరించుకునేందుకు అనుమతి ఉంది. దీంతో చాలా మంది 2 నెలల తర్వాత ఖాతాను ఖాళీ చేస్తున్న నేపథ్యంలో.. వారి భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఈపీఎఫ్‌వో తెలిపింది.

క్యూ2 ఫలితాలు

టెక్ మహీంద్రా లాభం డౌన్



- క్యూ2లో రూ. 1,195 కోట్లు
- షేరుకి రూ. 15 డివిడెండ్

న్యూఢిల్లీ: ఐటీ సర్వీసుల దిగ్గజం టెక్ మహీంద్రా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జూలై–సెప్టెంబర్‌లో నికర లాభం 4 శాతంపైగా క్షీణించి రూ. 1,195 కోట్లకు పరిమితమైంది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 1,250 కోట్లు ఆర్జించింది. అయితే ఈ ఏడాది క్యూ2(రూ. 1,141 కోట్లు)తో పోలిస్తే లాభం స్వల్పంగా పుంజుకుంది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 13,351 కోట్ల నుంచి రూ. 13,995 కోట్లకు బలపడింది. ఇతర ఆదాయం 40 శాతం తగ్గి రూ. 522 కోట్లకు పరిమితంకాగా.. గత క్యూ2లో తెలంగాణలోని భూమి విక్రయం ద్వారా రూ. 450 కోట్లమేర వన్‌టైమ్ ఆర్జన నమోదైంది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 15 చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది.

ఆర్డర్లు అప్

సమీక్షా కాలంలో 57 శాతం అధికంగా 81.6 కోట్ల డాలర్ల విలువైన కొత్త ఆర్డర్లు పొందినట్లు టెక్ మహీంద్రా ఎండీ, సీఈవో మోహిత్ జోషీ వెల్లడించారు. ఈ ఏడాది ద్వితీయార్ధం నుంచి ఐటీ సరీ్వసుల్లో వృద్ధి కనిపించనున్నట్లు తెలియజేశారు. 2025 సెప్టెంబర్30కల్లా 1,559 మంది ఉద్యోగులు తగ్గడంతో మొత్తం సిబ్బంది సంఖ్య 1.52 లక్షలకు చేరినట్లు వెల్లడించారు. అయితే అవకాశాలున్నచోట ఉద్యోగ కల్పన చేపట్టనున్నట్లు జోషి పేర్కొన్నారు. ఆదాయంలో 45 శాతం వాటా ఆక్రమించే యూఎస్‌లో హెచ్1బీ వీసా కలిగిన కంపెనీ ఉద్యోగులు 1 శాతమేనని, దీంతో వీసా ఫీజు పెంపు ప్రభావం నామమాత్రమేనని వివరించారు.

ఫలితాల నేపథ్యంలో టెక్ మహీంద్రా షేరు బీఎస్ఈలో 1.2% లాభపడి రూ. 1,468 వద్ద ముగిసింది.

భారత జీడీపీ అంచనాలు పెంచిన ఐఎంఎఫ్

6.6 శాతానికి సవరణ



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత్ జీడీపీ 6.6 శాతం వృద్ధిని నమోదు చేస్తుందని అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) తాజా అంచనా ప్రకటించింది. గత అంచనా అయిన 6.4 శాతాన్ని ఎగువకు పెంచింది. 2026–27 ఆర్థిక సంవత్సరం వృద్ధి అంచనాలను 0.20 శాతం తగ్గిస్తూ 6.2 శాతంగా ఉండొచ్చని తెలిపింది. అమెరికా టారిఫ్‌ల ప్రభావాలకు మించి మొదటి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) బలమైన వృద్ధి నమోదు కావడాన్ని తమ అంచనాల పెంపునకు కారణంగా పేర్కొంది. జూన్ త్రైమాసికంలో జీడీపీ 7.8 శాతం వృద్ధి చెందడం గమనార్హం. ప్రపంచ వృద్ధి 2024లో నమోదైన 3.3 శాతం నుంచి 2025లో 3.2 శాతానికి, 2026లో 3.1 శాతానికి తగ్గుతుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. వర్ధమాన, అభివృద్ధి చెందిన దేశాల ఆర్థిక వృద్ధి సైతం 2024లో నమోదైన 4.3 శాతం నుంచి 2025లో 4.2 శాతానికి, 2026లో 4 శాతానికి పరిమితమవుతుందని పేర్కొంది.

కెఫిన్ టెక్ చేతికి అసెంట్ ఫండ్

51 శాతం వాటా కొనుగోలు



న్యూఢిల్లీ: గ్లోబల్ అసెట్ మేనేజర్స్‌కు ఇన్వెస్టర్, ఇష్యూవర్ సొల్యూషన్స్ అందించే కెఫిన్ టెక్నాలజీస్ తాజాగా అసెంట్ ఫండ్ సర్వీసెస్(సింగపూర్) పీటీఈ లో 51 శాతం వాటా కొనుగోలుని పూర్తి చేసింది. ఇందుకు 3.5 కోట్ల డాలర్లు(రూ. 310 కోట్లు) వెచ్చించింది. దీంతో వేగవంత వృద్ధిలో ఉన్న గ్లోబల్ ఫండ్ అడ్మినిస్ట్రేటర్.. అసెంట్‌కు ఏకైక ప్రమోటర్‌గా కెఫిన్ అవతరించింది. 2025 జూలై31తో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో అసెంట్ 1.75 కోట్ల డాలర్ల ఆదాయం సాధించింది. నిర్వహణలోని ఆస్తుల విలువ 26 బిలియన్ డాలర్లకు చేరాయి. 640 గ్లోబల్ ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్‌కు సేవలు అందిస్తోంది. అసెంట్ కొనుగోలుతో గ్లోబల్ ఫండ్ అడ్మినిస్ట్రేటర్ పరిశ్రమలో కెఫిన్ టెక్నాలజీస్ కార్యకలాపాలు విస్తరించనున్నాయి. వెరసి 2025 సెప్టెంబర్‌కల్లా కెఫిన్ టెక్ నిర్వహణ(అడ్మినిస్ట్రేషన్)లోని గ్లోబల్ అసెట్స్(ఏయూఏ) 340 బిలియన్ డాలర్లను తాకనున్నాయి. కాగా.. అసెంట్‌లో మిగిలిన 49 శాతం వాటాను కెఫిన్ టెక్ 2028 మొదలు మూడేళ్లలో సొంతం చేసుకోనుంది. ఇందుకు నిధులను అంతర్గత వనరుల ద్వారా సమకూర్చుకోనుంది.

ఈ వార్తల నేపథ్యంలో కెఫిన్ టెక్ షేరు బీఎస్ఈలో 3% క్షీణించి రూ. 1,111 వద్ద ముగిసింది.

ఎల్‌టీ ఫుడ్స్ చేతికి హంగేరీ సంస్థ

గ్లోబల్ గ్రీన్ యూరప్ కొనుగోలుకి సై



న్యూఢిల్లీ: ఎఫ్ఎంసీజీ దేశీ దిగ్గజం ఎల్‌టీ ఫుడ్స్ హంగేరీకి చెందిన గ్లోబల్ గ్రీన్ యూరప్ కేఎఫ్‌టీలో పూర్తి వాటా కొనుగోలు చేయనుంది. ఇందుకు 2.5 కోట్ల యూరోలు(రూ. 256 కోట్లు) వెచ్చించనుంది. గ్లోబల్ గ్రీన్‌లో 100 శాతం వాటా సొంతం చేసుకోవడం ద్వారా యూరోపియన్ ప్యాకేజ్డ్ ఫుడ్ మార్కెట్లో కార్యకలాపాలు విస్తరించనుంది. దావత్, రాయల్ బ్రాండ్లతో కంపెనీ బాస్మతి బియ్యం విక్రయించే సంగతి తెలిసిందే. కాగా.. ఈక్విటీ వాటా కొనుగోలులో భాగంగా ముందస్తుగా 6 మిలియన్ యూరోలు చెల్లించనుంది. మరో 1.8 మిలియన్ యూరోలను పనితీరు ఆధారంగా రెండేళ్ల కాలంలో చెల్లించనుంది. ఒప్పందంలో భాగంగా గ్లోబల్ గ్రీన్ ఇంటర్నేషనల్(యూకే) తోపాటు పంపిణీ సంస్థలు కలిగిన గ్రీన్‌హౌస్ అగ్రార్ కేఎఫ్‌టీని సైతం కొనుగోలు చేయనుంది. లక్షిత కంపెనీ రుణాలను సైతం సొంత అనుబంధ సంస్థ ఎల్‌టీ ఫుడ్స్ యూరప్ హోల్డింగ్స్ ద్వారా స్వీకరించనుంది.

ఈ వార్తల నేపథ్యంలో ఎల్‌టీ ఫుడ్స్ షేరు బీఎస్ఈలో 2% పుంజుకుని రూ. 408 వద్ద ముగిసింది.

సైయెంట్ డీఎల్ఎం లాభం రూ. 32 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో సైయెంట్ డీఎల్ఎం రూ. 32.2 కోట్ల లాభం నమోదు చేసింది. ఆదాయం 20 శాతం క్షీణించి రూ. 311 కోట్లుగా నమోదైంది. భారీ ఆర్డరును పూర్తి చేయడంతో డిఫెన్స్ విభాగం 90 శాతం క్షీణించగా, ఏరోస్పేస్ విభాగం 47 సాతం, ఇండస్ట్రియల్..మెడ్-టెక్ సెగ్మెంట్లు వరుసగా 256 శాతం, 114 శాతం పెరిగాయి. సమీక్షాకాలంలో కొత్తగా రెండు గ్లోబల్ క్లయింట్లు జతకాగా మొత్తం ఆర్డర్ల పరిమాణం రూ. 497.7 కోట్లకు చేరింది. ప్రథమార్థంలో రూ. 1,000 కోట్ల పైగా ఆర్డర్లు వచ్చినట్లు సంస్థ తెలిపింది. మరిన్ని భారీ డీల్స్‌పై చర్చలు తుదిదశలో ఉన్నట్లు కంపెనీ ఎండీ రాజేంద్ర వెలగపూడి తెలిపారు.

బీఎస్ఈలో మంగళవారం కంపెనీ షేరు సుమారు 4 శాతం క్షీణించి రూ. 467.40 వద్ద క్లోజయ్యింది.

ఇరెడా లాభం హైజంప్

క్యూ2లో రూ. 549 కోట్లు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ సంస్థ ఇండియన్ రెనెవబుల్ ఎనర్జీ డెవలప్‌మెంట్ ఏజెన్సీ(ఇరెడా) ఈ ఆర్థిక సంవత్సరం(2025–26) రెండో త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. జూలై–సెప్టెంబర్‌లో స్టాండెలోన్ నికర లాభం 41 శాతం జంప్‌చేసి రూ. 549 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో రూ. 388 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 26 శాతం ఎగసి రూ. 2,,057 కోట్లను తాకింది. లోన్ బుక్ 31 శాతం వృద్ధితో రూ. 84,477 కోట్లకు చేరింది. రుణ మంజూరీ మరింత అధికంగా 145 శాతం జంప్‌చేసి రూ. 21,408 కోట్లను తాకింది. ఈ బాటలో రుణ విడుదల 81 శాతం ఎగసి రూ. 8,062 కోట్లుగా నమోదైంది. సెప్టెంబర్‌కల్లా కంపెనీ నెట్‌వర్త్ 38 శాతం బలపడి రూ. 12,920 కోట్లకు చేరింది.

ఫలితాల నేపథ్యంలో ఇరెడా షేరు బీఎస్ఈలో 3 శాతం లాభపడి రూ. 154 వద్ద ముగిసింది.

మొబైల్ ఫోన్ల ఎగుమతులు.. రెట్టింపు

- సెప్టెంబర్‌లో 1.8 బిలియన్ డాలర్లు
- ఆరు నెలల్లో 13.5 బిలియన్ డాలర్లు
- 70 శాతం అమెరికా మార్కెట్‌కే



న్యూఢిల్లీ: మొబైల్ ఫోన్ల ఎగుమతులు సెప్టెంబర్ నెలలో జోరుగా సాగాయి. క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే 95 శాతం అధికంగా 1.8 బిలియన్ డాలర్ల విలువైన ఎగుమతులు నమోదైనట్టు ఇండియా సెల్యులర్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) ప్రకటించింది. ''సాధారణంగా ఆగస్ట్, సెప్టెంబర్ నెలల్లో ఎగుమతులు స్తబ్దుగా ఉంటుంటాయి. ఉత్పత్తి, సీజన్‌వారీ రవాణా పరిస్థితులు ఇందుకు కారణం. అయినప్పటికీ ఎగుమతులు పటిష్టంగా నమోదు కావడం అన్నది దేశీయంగా బలమైన ఎకోసిస్టమ్ (తయారీ) ఏర్పడినట్టు తెలియజేస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు మొబైల్ ఫోన్ల ఎగుమతులు 13.5 బిలియన్ డాలర్లుగా ఉండొచ్చని అంచనా వేస్తున్నాం. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఎగుమతులు 8.5 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అంటే 60 శాతం అధిక ఎగుమతులు జరిగినట్టు తెలుస్తోంది. దేశ మొబైల్ ఫోన్ల పరిశ్రమ తయారీ, సామర్థ్యం, విశ్వసనీయతను పెంచుకుంటున్నట్టు అర్థమవుతోంది. అంతర్జాతీయంగా పోటీపడేందుకు ఇవి కీలక ఆయుధాలు'' అని ఐసీఈఏ పేర్కొంది.

అమెరికాకు మూడింతలు

భారత్ నుంచి అమెరికా మార్కెట్‌కు ఏప్రిల్–సెప్టెంబర్ కాలంలో 9.4 బిలియన్ డాలర్ల మొబైల్ ఫోన్ల ఎగుమతులు జరిగాయి. క్రితం ఏడాది ఇదే కాలంలో 3.1 బిలియన్ డాలర్ల ఎగుమతులతో పోల్చి చూస్తే మూడింతలయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో మొబైల్ ఫోన్ల ఎగుమతుల్లో 70 శాతం మేర (9.4 బిలియన్ డాలర్లు) అమెరికా మార్కెట్‌కే వెళ్లడం గమనార్హం. క్రితం ఏడాది ఇదే కాలంలో మొత్తం ఎగుమతుల్లో అమెరికా మార్కెట్‌కు వెళ్లిన మొత్తం 37 శాతంగా ఉంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద (2025–26) మొబైల్ ఫోన్ల ఎగుమతులు 35 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చని ఐసీఈఏ అంచనా వేసింది. క్రితం ఆర్థిక సంవత్సరంలో ఎగుమతులు 24.1 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ''మొబైల్ ఫోన్ పరిశ్రమలో తదుపరి దశ వృద్ధి అన్నది ఇప్పటి వరకు సాధించిన సామర్థ్యాలు, పోటీతత్వాన్ని కొనసాగించడంపైనే ఆధారపడి ఉంటుంది. విడిభాగాల తయారీ ద్వారా మన సామర్థ్యాలను మరింత పెంచుకోవాల్సిన అవసరం ఉంది''అని ఐసీఈఏ చైర్మన్ పంకజ్ మొహింద్రూ పేర్కొన్నారు.

దేశవాళీ ధమాకా

నేటి నుంచి రంజీ ట్రోఫీ సీజన్ ప్రారంభం

యువ ఆటగాళ్లపైనే అందరి దృష్టి ● రెండో అవకాశం కోసం సీనియర్ల యత్నం



బెంగళూరు: ప్రతిష్టాత్మక దేశవాళీ క్రికెట్ టోర్నమెంట్ రంజీ ట్రోఫీ 91వ సీజన్‌కు నేడు తెరలేవనుంది. ఎలైట్ గ్రూప్‌లో 32 జట్లు, ప్లేట్ గ్రూప్‌లో 6 టీమ్‌లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయి. మొత్తం 138 మ్యాచ్‌లు జరగనుండగా... రెండు దశల్లో మ్యాచ్‌లు నిర్వహించనున్నారు. ఒకప్పుడు భారత జట్టులో చోటు దక్కించుకునేందుకు రంజీ ట్రోఫీలో రాణించడం తప్పనిసరి కాగా... ఇప్పుడు జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించే ఆటగాళ్లు వీలు ఉంటే దేశవాళీల్లో ఆడాలని బీసీసీఐ సూచించింది. ఈ ఏడాది దక్షిణాఫ్రికాతో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్ మినహా... టీమిండియా సుదీర్ఘ ఫార్మాట్‌లో మ్యాచ్‌లు ఆడేది లేదు. ఈ నేపథ్యంలో రంజీ ట్రోఫీ ప్రదర్శనతో ఇప్పటికిప్పుడు జాతీయ జట్టులో చోటు దక్కించుకోవడం కష్టమే అయినా... సెలెక్టర్ల దృష్టిని ఆకర్షించేందుకు ఇది చక్కటి వేదిక కానుంది. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా రంజీ ట్రోఫీని రెండు దశల్లో నిర్వహించనున్నారు. నేటి నుంచి నవంబర్ 19 వరకు తొలి దశ మ్యాచ్‌లు జరగనుండగా... ఆ తర్వాత నవంబర్ 26 నుంచి డిసెంబర్ 18 వరకు సయ్యద్ ముస్తాక్ అలీ టి20 టోర్నమెంట్ జరగనుంది. అనంతరం డిసెంబర్ 26 నుంచి జనవరి 18 వరకు విజయ్ హజారే ట్రోఫీ వన్డే టోర్నమెంట్ నిర్వహించనున్నారు. ఆ తర్వాత రంజీ ట్రోఫీ రెండో దశ మ్యాచ్‌లు జరుగుతాయి. వచ్చే ఏడాది ఫిబ్రవరి 24న ఫైనల్‌తో సీజన్ ముగియనుంది. మొత్తం 32 జట్లను 4 గ్రూప్‌లుగా విభజించారు. ఎనిమిదేసి జట్లు ఉన్న ఒక్కో గ్రూప్‌లో అత్యుత్తమ ప్రదర్శన చేసిన రెండు జట్లు క్వార్టర్ ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. పలువురు సీనియర్ ఆటగాళ్లు భారత జట్టులో తిరిగి చోటు దక్కించుకునేందుకు... యువ ఆటగాళ్లు తమ సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. గాయం నుంచి కోలుకున్న స్టార్ వికెట్ కీపర్ రిషభ్ పంత్ తిరిగి మైదానంలో అడుగు పెట్టనుండగా... 42 సార్లు చాంపియన్ ముంబై జట్టు మరో ట్రోఫీ ఖాతాలో వేసుకోవాలని చూస్తోంది. కరుణ్ నాయర్ తిరిగి కర్ణాటక జట్టులో చేరగా... తొమ్మిదేళ్ల తర్వాత జలజ్ సక్సేనా కేరళ నుంచి మహారాష్ట్రకు మారాడు. పృథ్వీ షా మహారాష్ట్రకు ప్రాతినిధ్యం వహించనుండగా... ఆంధ్ర క్రికెటర్ హనుమ విహారి త్రిపుర తరఫున బరిలోకి దిగనున్నాడు. ఇలాంటి మరికొన్ని ఆసక్తికర విషయాలను పరిశీలిద్దాం...

→ ఇంగ్లండ్ పర్యటనలో భాగంగా మాంచెస్టర్ టెస్టులో క్రిస్ వోక్స్ వేసిన బంతికి గాయపడిన పంత్ అప్పటి నుంచి బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో చికిత్స తీసుకుంటున్నాడు. రంజీ ట్రోఫీ తొలి పోరులో ఢిల్లీ జట్టు హైదరాబాద్‌తో తలపడనుండగా... ఢిల్లీ సెలెక్టర్లు 24 మందితో ప్రకటించిన జట్టులో పంత్‌ను ఎంపిక చేయలేదు. దీన్ని బట్టి అతడు ఇంకా పూర్తిగా కోలుకోనట్లు తెలుస్తోంది. ఈ నెల ఆఖరులో హిమాచల్ ప్రదేశ్‌తో జరిగే మ్యాచ్ వరకు పంత్ జట్టులో చేరొచ్చు. వచ్చే నెల 14 నుంచి ప్రపంచ చాంపియన్ దక్షిణాఫ్రికాతో టీమిండియా టెస్టు సిరీస్ ఆడనుంది. దానికి ముందు పంత్ పూర్తి ఫిట్‌నెస్ సాధిస్తాడని సెలెక్టర్లు ఆశిస్తున్నారు.

→ డిఫెండింగ్ చాంపియన్ విదర్భ జట్టు తొలి పోరులో నాగాలాండ్‌తో తలపడనుంది. దేశవాళీల్లో స్టార్ ఆటగాళ్లతో నిండి ఉన్న విదర్భ రంజీ ట్రోఫీతో పాటు... ఇటీవల ఇరానీ కప్‌ను సైతం కైవసం చేసుకొని జోరు మీదుంది. గత సీజన్ రన్నరప్ కేరళ, సౌరాష్ట్ర, ఢిల్లీ, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర, ముంబై జట్లు కూడా టైటిల్‌పై కన్నేశాయి.

→ గత సీజన్‌లో ముంబై జట్టుకు రహానే కెప్టెన్‌గా వ్యవహరించగా... ఇప్పుడు ఆ బాధ్యతలు శార్దుల్ ఠాకూర్ తీసుకున్నాడు. భారత టెస్టు జట్టులో పునరాగమనంపై ఇంకా ఆశలు పెట్టుకున్న రహానే... ప్లేయర్‌గా కొనసాగనున్నాడు. సహచరుడు పుజారా కెరీర్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన కామెంటేటర్ అవతారమెత్తగా... రహానే మాత్రం ఇంకా పోరాడేందుకు సిద్ధమయ్యాడు.

→ గత సీజన్‌లో రంజీ మ్యాచ్‌లు ఆడేందుకు పెద్దగా ఆసక్తి చూపక బీసీసీఐ ఆగ్రహానికి గురైన వికెట్ కీపర్ ఇషాన్ కిషన్... ఈ సీజన్‌లో జార్ఖండ్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. మధ్యప్రదేశ్ జట్టుకు సారథ్యం వహిస్తున్న రజత్ పాటీదార్ దులీప్ ట్రోఫీ, ఇరానీ కప్‌లో చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. మరి వీరిద్దరూ రంజీ సీజన్‌లో తమ జట్లను ఎలా నడిపిస్తారో చూడాలి.

→ సుదీర్ఘ కాలంగా భారత రిజర్వ్ ఓపెనర్‌గా జట్టుతో పాటు ఉన్న బెంగాల్‌కు చెందిన అభిమన్యు ఈశ్వరన్ కూడా తన బ్యాట్ పవర్ చూపేందుకు రెడీ అవుతున్నాడు.

→ రవిచంద్రన్ అశ్విన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకగా... తదుపరి తరం స్పిన్నర్ ఎవరనేది రంజీ ట్రోఫీ ద్వారా తేలనుంది. గత సీజన్‌లో రికార్డు స్థాయిలో 69 వికెట్లు పడగొట్టిన విదర్భ స్పిన్ ఆల్‌రౌండర్ హర్ష్ దూబేపై అందరి దృష్టి నిలవనుంది. రాజస్తాన్‌కు చెందిన మానవ్ సుతార్, ముంబై ఆఫ్ స్పిన్నర్ తనుశ్ కొటియాన్ ఎలాంటి ప్రదర్శన కనబరుస్తారో చూడాలి.

→ సీజన్ ఆరంభానికి ముందు పలువురు యువ ఆటగాళ్లు ఆకర్షిస్తున్నారు. స్మరణ్ (కర్ణాటక), ఆండ్రె సిద్ధార్థ్ (తమిళనాడు), యశ్ ధుల్ (ఢిల్లీ), ప్రియాన్ష్ ఆర్య (ఢిల్లీ), వైభవ్ సూర్యవంశీ (బిహార్), ఆయుశ్ మాత్రే (ముంబై), దానిశ్ మాలేవార్ (విదర్భ) వంటి వాళ్లు ఇప్పటికే మంచి గుర్తింపు తెచ్చుకోగా... దాన్ని కొనసాగించాలని భావిస్తున్నారు.

→ గత రంజీ సీజన్‌లో తన వేగంతో ఆకట్టుకున్న కేరళ పేసర్ ఎడెన్ టామ్‌తో పాటు, గుర్‌నూర్ బ్రార్, గుర్‌జపనీత్ సింగ్‌పై సెలెక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టనున్నారు.

→ దేశవాళీల్లో రాణించడం ద్వారానే ఎనిమిదేళ్ల తర్వాత తిరిగి జాతీయ జట్టులో చోటు దక్కించుకున్న కరుణ్ నాయర్ స్ఫూర్తిగా... పలువురు ఆటగాళ్లు రెండో అవకాశం కోసం ఎదురుచూస్తున్నారు. ముంబైకర్ సర్ఫరాజ్ ఖాన్, రుతురాజ్ గైక్వాడ్, రజత్ పాటీదార్, ఇషాన్ కిషన్, పృథ్వీ షా ఇందులో ఉన్నారు. ఈ సీజన్‌లో పరుగుల వరద పారించి తిరిగి సెలెక్టర్ల దృష్టిలో పడాలని చూస్తున్నారు.

→ 38 ఏళ్ల జలజ్ సక్సేనా ఈ సీజన్‌లో మహారాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నాడు. గత తొమ్మిది సీజన్‌లుగా కేరళ తరఫున ఆడిన జలజ్ రాకతో... మహారాష్ట్ర బ్యాటింగ్ లైనప్ మరింత పటిష్టమైంది. టీమిండియా ప్లేయర్ జితేశ్ శర్మ విదర్భ నుంచి బరోడాకు మారాడు.

→ రెండేళ్లుగా టెస్టు జట్టులో చోటు దక్కించుకోలేక పోతున్న సీనియర్ పేసర్ మొహమ్మద్ షమీ తనలో సత్తా తగ్గలేదని నిరూపించుకునేందుకు సిద్ధమయ్యాడు. ఈ ఏడాది చాంపియన్స్ ట్రోఫీలో చివరిసారిగా టీమిండియాకు ప్రాతినిధ్యం వహించిన షమీ... పునరాగమనంపై ఆశలు పెట్టుకున్నాడు.

ఢిల్లీ X హైదరాబాద్

ఆసియా కప్ ఫైనల్లో పాకిస్తాన్‌పై వీరోచిత ఇన్నింగ్స్‌తో టీమిండియాను గెలిపించిన ఠాకూర్ తిలక్ వర్మ... హైదరాబాద్ రంజీ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. గ్రూప్ 'డి'లో భాగంగా బుధవారం మొదలుకానున్న మ్యాచ్‌లో ఢిల్లీతో హైదరాబాద్ తలపడనుంది. హైదరాబాద్ వేదికగా జరగనున్న ఈ పోరులో తిలక్‌తో పాటు తన్మయ్ అగర్వాల్, అభిరత్ రెడ్డి, హిమతేజ, మిలింద్, రాహుల్ సింగ్, రోహిత్ రాయుడు, తనయ్ త్యాగరాజన్ రాణించాలని టీమ్ మేనేజ్‌మెంట్ ఆశిస్తోంది. మరోవైపు ఢిల్లీ జట్టు యువ ఆటగాళ్లతో నిండి ఉంది. ఆయుశ్ బదోనీ సారథ్యంలోని ఢిల్లీ జట్టులో యశ్ ధుల్, ప్రియాన్ష్ ఆర్య, అనూజ్ రావత్, నితీశ్ రాణా, నవ్‌దీప్ సైనీ కీలకం కానున్నారు.



తిలక్ వర్మ

ఉత్తరప్రదేశ్ X ఆంధ్ర

గ్రూప్ 'ఎ'లో భాగంగా బుధవారం ప్రారంభం కానున్న మ్యాచ్‌లో ఉత్తరప్రదేశ్‌తో ఆంధ్ర జట్టు తలపడనుంది. కాన్పూర్ వేదికగా జరగనున్న ఈ మ్యాచ్‌లో మెరుగైన ప్రదర్శన చేయాలని ఆంధ్ర జట్టు భావిస్తోంది. కెప్టెన్ రికీ భుయ్, వికెట్ కీపర్ శ్రీకర్ భరత్, షేక్ రషీద్, అశ్విన్ హెబ్బర్, సత్యనారాయణ రాజు, చీపురుపల్లి స్టీఫెన్, విజయ్, శశికాంత్ ఆంధ్ర జట్టుకు కీలకం కాగా... ఉత్తరప్రదేశ్ జట్టు కరణ్ శర్మ, ఆర్యన్ జుయల్, ప్రియమ్ గార్గ్, విప్‌రాజ్ నిగమ్, శివమ్ మావి, రింకూ సింగ్‌పై ఆశలు పెట్టుకుంది.

రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్‌ల వివరాలు

గ్రూప్ 'ఎ': ఆంధ్ర, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, నాగాలాండ్, ఒడిశా, విదర్భ, జార్ఖండ్, బరోడా.

గ్రూప్'బి': కర్ణాటక, సౌరాష్ట్ర, చండీగఢ్, మహారాష్ట్ర, గోవా, పంజాబ్, కేరళ, మధ్యప్రదేశ్.

గ్రూప్ 'సి': గుజరాత్, అస్సాం, ఉత్తరాఖండ్, సర్వీసెస్, త్రిపుర, రైల్వేస్, బెంగాల్, హరియాణా.

గ్రూప్ 'డి': హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, పుదుచ్చేరి, ఛత్తీస్‌గఢ్, జమ్మూ కశ్మీర్, రాజస్తాన్, హిమాచల్‌ప్రదేశ్.

జ్ఞానదత్తు ముందంజ

మూడో రౌండ్‌లోకి తన్వీ, ఉన్నతి



తన్వీ శర్మ



ఉన్నతి



జ్ఞానదత్తు

గువాహటి: ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారులు తమ జోరు కొనసాగించి మూడో రౌండ్‌కు చేరుకున్నారు. భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న హైదరాబాద్ ప్లేయర్ టంకర తలశిల జ్ఞానదత్తుతోపాటు రౌనక్ చౌహాన్, సూర్యాక్ష్ రావత్, హమర్ లాల్‌థాజువాలా తమ ప్రత్యర్థులను ఓడించి ముందంజ వేశారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో జ్ఞానదత్తు 15–10, 15–13తో జోక్విమ్ మెండోంకా (బ్రెజిల్)పై, రౌనక్ 15–3, 15–6తో ధిసాత్ రూపథుంగ (శ్రీలంక)పై, సూర్యాక్ష్ 15–5, 15–8తో ఎరోల్ (టర్కీ)పై, లాల్‌థాజువాలా 15–11, 15–5తో రిలాన్ టాన్ (అమెరికా)పై గెలుపొందారు. మహిళల సింగిల్స్ విభాగంలో హైదరాబాద్ అమ్మాయి వెన్నెల కలగోట్ల రెండో రౌండ్‌లో నిష్క్రమించగా... టాప్ సీడ్ తన్వీ శర్మ, ఉన్నతి హుడా, రక్షిత శ్రీ మూడో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. రెండో రౌండ్ మ్యాచ్‌ల్లో తన్వీ కేవలం 11 నిమిషాల్లో 15–2, 15–1తో విక్టోరియా కలెట్కా (పోలాండ్)పై, ఉన్నతి 15–8, 15–9తో లియు హోయ్ (హాంకాంగ్)పై, రక్షిత శ్రీ 15–5, 15–9తో లూసీ యాంగ్ (కెనడా)పై నెగ్గగా... వెన్నెల 6–15, 5–15తో టాన్‌రుగ్ సెహెంగ్ (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో అరిగెల భార్గవ్ రామ్–గొబ్బూరు విశ్వతేజ్ (భారత్) జంట 15–7, 15–6తో ఆంద్రెజ్ మాసెక్–ఆంద్రెజ్ సుచి (స్లోవేకియా) జోడీపై గెలిచింది.



కేప్ వెర్డె సంచలనం

ప్రపంచకప్ ఫుట్‌బాల్ టోర్నీకి తొలిసారి అర్హత సాధించిన ఆఫ్రికా దేశం

ప్రాయ (కేప్ వెర్డె): కేవలం 5 లక్షల 25 వేల జనాభా కలిగిన ఆఫ్రికా దేశం కేప్ వెర్డె అద్భుతం చేసింది. వచ్చే ఏడాది అమెరికా, కెనడా, మెక్సికోలలో జరిగే ఫుట్‌బాల్ ప్రపంచకప్ టోర్నీకి కేప్ వెర్డె అర్హత సాధించింది. ఆఫ్రికా జోన్ గ్రూప్ 'డి'లో భాగంగా ఇస్వాతిని జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కేప్ వెర్డె 3–0 గోల్స్ తేడాతో గెలిచింది. తద్వారా గ్రూప్ 'డి' విజేత హోదాలో ప్రపంచకప్ టోర్నీ బెర్త్‌ను ఖరారు చేసుకుంది. ఐస్‌లాండ్ తర్వాత ప్రపంచకప్ టోర్నీకి అర్హత పొందిన అతి తక్కువ జనాభా కలిగిన దేశంగా కేప్ వెర్డె గుర్తింపు పొందింది. 2018లో ఐస్‌లాండ్ జట్టు (3 లక్షల 25 వేల జనాభా) ప్రపంచకప్ టోర్నీకి తొలిసారి అర్హత పొందింది. 2026 ప్రపంచకప్ టోర్నీలో తొలిసారి 48 దేశాలు పాల్గొంటుండగా... ఆఫ్రికా జోన్‌కు 9 బెర్త్‌లు కేటాయించారు. ఆఫ్రికా జోన్ నుంచి ఇప్పటి వరకు అల్జీరియా, కేప్ వెర్డె, ఈజిప్ట్, ఘనా, మొరాకో, ట్యూనిషియా జట్లు అర్హత సాధించాయి. మరో మూడు బెర్త్‌లు ఖరారు కావాల్సి ఉన్నాయి.

'నా ఫిట్‌నెస్ గురించి నేనే చెప్పాలా'

సెలక్టర్లపై షమీ విమర్శలు



కోల్‌కతా: పేస్ బౌలర్ మొహమ్మద్ షమీ చివరిసారిగా చాంపియన్స్ ట్రోఫీలో వన్డేలు ఆడాడు. ఈ టోర్నీలో వరుణ్ చక్రవర్తితో సమంగా అత్యధిక వికెట్లు (9) తీసిన భారత బౌలర్‌గా జట్టు విజయంలో అతనూ కీలక పాత్ర పోషించాడు. అయితే ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు మాత్రం అతనికి జట్టులో చోటు దక్కలేదు. పైగా షమీ ఫిట్‌నెస్‌పై తమకు ఎలాంటి సమాచారం లేదని కూడా సెలక్షన్ కమిటీ చైర్మన్ అజిత్ అగార్కర్ వ్యాఖ్యానించాడు. దీనిపై ఇప్పుడు షమీ తీవ్రంగా స్పందించాడు. నేటి నుంచి ఉత్తరాఖండ్‌తో జరిగే రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో బెంగాల్ తరఫున షమీ బరిలోకి దిగుతున్నాడు. 'జట్టులో ఎంపిక నా చేతుల్లోనే లేదనేది వాస్తవం. అయితే నేను ఫిట్‌గా లేకపోతే ఇప్పుడు రంజీ ట్రోఫీలో ఆడకపోయేవాడిని. దీనిపై మాట్లాడి వివాదాస్పదం చేయదల్చుకోలేదు. కానీ నాలుగు రోజులు మ్యాచ్‌లు ఆడగలిగినప్పుడు వన్డే కూడా ఆడగలిగేవాడిని. నా ఫిట్‌నెస్ గురించి సమాచారం ఇవ్వడం లేదా అడగడం అనేది నా పని కాదు. జాతీయ క్రికెట్ అకాడమీకి వెళ్లి సన్నద్ధం కావడమే నా పని. ఫిట్‌నెస్ గురించి తమకు ఎవరు సమాచారం ఇవ్వాలి, ఎవరు ఇవ్వలేదు అనేది తెలుసుకోవడం సెలక్టర్ల పనే తప్ప నాది కాదు' అని షమీ వ్యాఖ్యానించాడు. శస్త్రచికిత్స తర్వాత బోర్డు నిబంధనల ప్రకారం తాను పూర్తి ప్రక్రియను అనుసరించినట్లు గుర్తు చేసిన షమీ... రంజీ ట్రోఫీలో సత్తా చాటేందుకు సిద్ధమని వెల్లడించాడు.

పోరాడి ఓడిన ఆయుశ్



ఒడెన్స్: డెన్మార్క్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో తొలి రోజు భారత క్రీడాకారులు నిరాశపరిచారు. పురుషుల సింగిల్స్‌లో ప్రపంచ 30వ ర్యాంకర్ ఆయుశ్ శెట్టి... మహిళల సింగిల్స్‌లో ప్రపంచ 46వ ర్యాంకర్ అన్‌మోల్ ఖరబ్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు. 77 నిమిషాల పోరులో ఆయుశ్ 19–21, 21–17, 15–21తో ప్రపంచ 15వ ర్యాంకర్ టోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో... అన్‌మోల్ 9–21, 14–21తో ఏడో సీడ్ పుత్రి కుసుమ వర్ధాని (ఇండోనేసియా) చేతిలో ఓడిపోయారు. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో పృథ్వీ కృష్ణమూర్తి రాయ్–సాయిప్రతీక్ ద్వయం 13–21, 17–21తో లియు కువాంగ్ హెంగ్–యాంగ్ పో హాన్ (చైనీస్ తైపీ) జంట చేతిలోఓటమి పాలైంది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో సెల్వం కవిప్రియ–సిమ్రన్ ద్వయం 4–21, 11–21తో గాబ్రియేలా–స్టెఫానీ (బల్గేరియా) జంట చేతిలో... రుతపర్ణ–శ్వేతాపర్ణ జంట 23–21, 17–21, 15–21తో జూలీ మాక్ఫర్సన్–కియారా టొరాన్స్ (స్కాట్లాండ్) జోడీ చేతిలో ఓడిపోయాయి.

ఫైరేట్స్‌పై జెయింట్స్ గెలుపు



న్యూఢిల్లీ: ప్రొ కబడ్డీ లీగ్ (పీకేఎల్–12)లో టాప్–8 స్థానాలతో ప్లే ఆఫ్స్ లక్ష్యంగా గుజరాత్ జెయింట్స్ శ్రమించింది. మంగళవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో గుజరాత్ 40–32 స్కోరుతో మూడు సార్లు చాంపియన్ అయిన పట్నా పైరేట్స్‌పై విజయం సాధించింది. ఆరో నిమిషంలో సబ్‌స్టిట్యూట్ అయిన రెయిడర్ హిమాన్షు సింగ్ (11) వచ్చిరాగానే పాయింట్ల పనిపట్టాడు. 21 సార్లు కూతకెళ్లిన అతను 11 సార్లు పాయింట్లతో వచ్చాడు. అతనితో పాటు ఆల్‌రౌండర్లు మొహమ్మద్ రెజా (8), నితిని పన్వార్ (5), రెయిడింగ్ రాకేశ్ (4) రాణించడంతో గుజరాత్ క్రమం తప్పకుండా స్కోరు చేసింది. పట్నా జట్టులో రెయిడర్ మన్‌దీప్ కుమార్ (12) ఒంటరి పోరాటం చేశాడు. 16 సార్లు రెయిడ్‌కు వెళ్లిన మన్‌దీప్ 12 సార్లు విజయవంతంగా పాయింట్లు తెచ్చిపెట్టాడు. రెయిడర్ అయాన్ (5), డిఫెండర్లు నవ్‌దీప్, అంకిత్ చెరో 4 పాయింట్లు చేసి రాణించారు. రెండో మ్యాచ్‌లో యూపీ యోధాస్ 32–31తో తమిళ్ తలైవాస్‌పై గెలుపొందింది. యోధాస్ తరఫున రెయిడర్లు గుమన్ సింగ్ (8), గగన్ గౌడ (6), డిఫెండర్ హితేశ్ (7) అదరగొట్టారు. తలైవాస్ జట్టులో కెప్టెన్ అర్జున్ దేశ్వాల్ (7), డిఫెండర్లు సాగర్ రాఠి (5), రోనక్ (4) రాణించారు. నేటి నుంచి ఈ నెల 23 తేదీ వరకు రోజూ మూడు మ్యాచ్‌లు జరుగనున్నాయి. ఈరోజు జరిగే మ్యాచ్‌ల్లో తెలుగు టైటాన్స్‌తో బెంగాల్ వారియర్స్, జైపూర్ పింక్‌పాంథర్స్‌తో పుణేరి పల్టన్, గుజరాత్ జెయంట్స్‌తో తమిళ్ తలైవాస్ తలపడనున్నాయి.

దక్షిణాఫ్రికా లక్ష్యం 277

● రెండో ఇన్నింగ్స్‌లో ప్రస్తుతం 51/2
● పాకిస్తాన్‌తో తొలి టెస్టు



ముత్తుస్వామి

లాహోర్: పాకిస్తాన్‌తో జరుగుతున్న తొలి టెస్టులో దక్షిణాఫ్రికా ముందు 277 పరుగుల లక్ష్యం నిలిచింది. లాహోర్ స్టేడియంలో ఇప్పటి వరకు అత్యధిక ఛేదన 208 పరుగులు (1961లో ఇంగ్లండ్) కాగా... ఇప్పుడు రికార్డు లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన ప్రపంచ టెస్టు చాంపియన్ దక్షిణాఫ్రికా... మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెండో ఇన్నింగ్స్‌లో 22 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 51 పరుగులు చేసింది. కెప్టెన్ మార్క్‌రమ్ (3), ముల్డర్ (0) అవుట్ కాగా... రికెల్టన్ (76 బంతుల్లో 29 బ్యాటింగ్; 3 ఫోర్లు), టోనీ డి జోర్జి (44 బంతుల్లో 16 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. చేతిలో 8 వికెట్లు ఉన్న సఫారీ జట్టు లక్ష్యానికి ఇంకా 226 పరుగుల దూరంలో ఉంది. మరో రెండు రోజుల ఆట మిగిలి ఉన్న ఈ మ్యాచ్‌లో బుధవారం సఫారీ జట్టు ఎలాంటి ప్రదర్శన కనబరుస్తుందనేది కీలకం. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 216/6తో మంగళవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 84 ఓవర్లలో 269 పరుగులకు ఆలౌటైంది. దీంతో పాకిస్తాన్ జట్టుకు 109 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించినట్టైంది. టోనీ డి జోర్జి (171 బంతుల్లో 104; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) సెంచరీతో రాణించాడు. పాకిస్తాన్ బౌలర్లలో నోమన్ అలీ 6 వికెట్లు పడగొట్టగా.. సాజిద్ ఖాన్ 3 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పాకిస్తాన్ పూర్తిగా తడబడింది. దక్షిణాఫ్రికా స్పిన్నర్లు సెనురణ్ ముత్తుస్వామి (5/57), సిమోన్ హార్మర్ (4/51) మాయాజాలానికి పాక్ 46.1 ఓవర్లలో 167 పరుగులకే ఆలౌటైంది. అబ్దుల్లా షఫీక్ (41; 6 ఫోర్లు), బాబర్ ఆజమ్ (42; 5 ఫోర్లు), సౌద్ షకీల్ (38; 7 ఫోర్లు) కాస్త పోరాడారు. ఓవరాల్‌గా మంగళవారం ఇరు జట్ల స్పిన్నర్లు సత్తా చాటడంతో... ఒకే రోజు 16 వికెట్లు నేలకూలాయి.

పిల్లికి చెలగాటం.. సైప్రస్‌కి ప్రాణ సంకటం

సైప్రస్‌లో పిల్లుల దండయాత్ర

జనాభాకు సరిసమానంగా పిల్లులు
లెక్క తేల్చడానికి అధికారుల పరుగులు

నికోసియా (సైప్రస్): తూర్పు మధ్యధరా సముద్రంలోని చిన్న ద్వీప దేశం సైప్రస్‌లో, సుమారు 10 లక్షల జనాభా ఉంటే, ఇంచుమించు అంతే సంఖ్యలో వీధి పిల్లులు ఉన్నాయిట. అయితే పిల్లుల ప్రేమికులు మాత్రం.. అబ్బే! మా లెక్క ప్రకారం ఇంకా లక్షల్లో ఎక్కువగానే ఉన్నాయంటున్నారు. అంటే, ఒకరికి ఒక పిల్లి చొప్పున పంచుకోవచ్చు అన్నమాట! సైప్రస్ ప్రజలు ఎవరింటికి వెళ్లినా 'ఇది మా పిల్లి, మా పిల్లి' అని గర్వంగా చెప్పుకోవచ్చు!

ఫ్యామిలీ ప్లానింగ్ చేసినా పుట్టుకొస్తున్నాయ్

సెప్టెంబర్ చివర్లో పార్లమెంటరీ కమిటీకి ఒక చేదు నిజం తెలిసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న పిల్లుల కుటుంబ నియంత్రణ కార్యక్రమం.. ఈ పిల్లుల దండు ముందు దిగదుడుపే అని! 'పిల్లుల నియంత్రణ కార్యక్రమం బావుంది కానీ, దాన్ని ఇంకా విస్తరించాలి'.. అన్నారు పర్యావరణ కమిషనర్ అంటోనియా థియోడోసియూ. ఎందుకంటే, రూ.100,000 యూరోల (సుమారు రూ.88 లక్షలు) బడ్జెట్‌తో ఏటా కేవలం రెండువేల పిల్లులకే శస్త్రచికిత్సలు చేస్తున్నారు. అంటే, ఒక పిల్లిని పట్టుకుని శస్త్రచికిత్స చేసే లోపే, పది కొత్త పిల్లులు పుట్టేస్తున్నాయన్నమాట! అందుకే పిల్లుల సంఖ్య విషయంలో సైప్రస్‌కు ప్రపంచవ్యాప్తంగా ఓ 'ప్రత్యేకమైన' పేరు వచ్చిందని కమిషనర్ గారు వాపోయారు.

పైసలు కాదు.. ప్లాను కావాలి బాబూ ప్లాను!

'పిల్లుల సమస్య' పరిష్కారానికి నిధులు పెంచాలని డిమాండ్ చేయగానే, పర్యావరణ మంత్రి మరియా పనాయోటో అక్టోబర్ 4న.. అంటే ప్రపంచ జంతు దినోత్సవం రోజు బడ్జెట్‌ను 300,000 యూరోలకు (సుమారు రూ.2.65 కోట్లకు) పెంచుతున్నట్టు ప్రకటించారు. ఈ వార్త విన్న పిల్లుల ప్రేమికులు తెగ పరవశించిపోయారు. కానీ, పార్లమెంటరీ ఎన్విరాన్‌మెంట్ కమిటీ చైర్మన్ చారాలంబోస్ థియోపెంప్టూ మాత్రం గట్టి వార్నింగ్ ఇచ్చారు. 'డబ్బుతోనే అంతా అయిపోదు. ఒక పక్కా ప్లాన్ ఉండాలి. ప్లాన్ లేకుండా కళ్లు మూసుకుని ఆపరేషన్లు చేసుకుంటూ పోతే లాభం లేదు!'.. అన్నారు. అంటే, ఎక్కడ పిల్లులు ఎక్కువగా ఉన్నాయి? వాటిని ఎలా పట్టుకోవాలి? అనేదానిపై పక్కా ప్రణాళిక లేకపోతే, డబ్బు పిల్లుల పాలవుతుందన్నమాట!

ఇలాగైతే శానా కష్టమబ్బా..

వీటి సంఖ్య ఇలాగే పెరిగిపోతూ ఉంటే.. ద్వీపంలో పర్యావరణానికే కాదు, వాహనాలు రాకపోకలు సాగించే రద్దీ రహదారులపై.. ఆహారం, ఆశ్రయం కోసం సంచరించే పిల్లులకు కష్టమేనని అధికారులు ఎంతో బాధపడిపోతున్నారు.

పిల్లులకు పెద్ద ఫ్లాష్ బ్యాక్

నిజానికి, సైప్రస్ ఏనాటినుంచో పిల్లులను ప్రేమించే దేశం. నడిచే దారుల పక్కన పిల్లుల కోసం ఏర్పాటు చేసిన ఫుడ్ డిస్పెన్సరీలు, చిన్న చిన్న ఇళ్లు ఇక్కడ సర్వసాధారణం. 9,500 సంవత్సరాల నాటి నియోలిథిక్ గ్రామంలో.. మనిషి అస్థిపంజరం పక్కనే పిల్లి అస్థిపంజరాన్ని కనుగొన్నారంటే, పిల్లి, మనిషి బంధం ఎంత పురాతనమైనదో అర్థం చేసుకోవచ్చు.

పాముల్ని చంపడానికి రెండు పడవుల్లో పిల్లులు

ఇక నాలుగో శతాబ్దంలో, లెజెండ్ సెయింట్ హెలెన్.. పాములను తరిమేయడానికి ఏకంగా రెండు పడవల్లో పిల్లులను తీసుకెళ్లిన చరిత్ర కూడా ఉంది. ఇదంతా చూస్తుంటే.. ఈ పిల్లుల దండయాత్ర వెనక వేల సంవత్సరాల చరిత్ర ఉందన్నమాట! 'సెయింట్ నికోలస్ ఆఫ్ ది క్యాట్స్' పేరిట పిల్లుల రక్షణ కేంద్రం నిర్వహిస్తున్న ఒక మఠం ఇప్పటికీ ఉంది.

తెగతింటూ.. ఒళ్లు పెంచి

పర్యాటకం సైప్రస్‌కు అతి ముఖ్యమైన ఆదాయ వనరు. సంవత్సరానికి లక్షల మంది పర్యాటకులు వస్తారు. ఇక్కడి పిల్లులు ఇప్పుడు ప్రధాన ఆకర్షణ! రెస్టారెంట్ల దగ్గర హాయిగా తిరుగుతూ, పర్యాటకులు పెట్టిన లెఫ్ట్‌ఓవర్స్ తిని.. తెగ బలిసిపోతున్న ఈ పిల్లుల బతుకు ఎంత అదృష్టం కదా.

ఎంత 'క్యాటు' ప్రేమయో..

పిల్లుల జనాభా పెరగడానికి రెండు ప్రధాన కారణాలున్నాయి. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో అడ్డు అదుపు లేని సంతానోత్పత్తి, సాధారణ ప్రజలు పుట్టిన పిల్లి పిల్లలకు కూడా శ్రద్ధగా ఆహారం, సంరక్షణ ఇవ్వడం వల్ల అవి బతుకుతున్నాయి.. అంటున్నారు వెటర్నరీ అసోసియేషన్ అధ్యక్షుడు డెమెట్రిస్ ఎపమినోండాస్.



నికోసియాలోని స్ట్రావొలొస్ పార్కులో చేరిన పిల్లుల గుంపు

పిల్లుల లెక్క తేల్చండి..

ప్రభుత్వ కార్యక్రమం ప్రకారం, మున్సిపాలిటీలకు నిధులు ఇస్తారు. అవి ప్రైవేట్ వెటర్నరీ వైద్యులకు డబ్బులిచ్చి, పిల్లుల సంరక్షణ బృందాలు తీసుకొచ్చిన పిల్లులకు శస్త్రచికిత్స చేయిస్తారు. 'ఈ కార్యక్రమం అవసరమైన దానికంటే చాలా తక్కువగా' ఉందని అధికారులు కూడా ఒప్పుకుంటున్నారు. అందుకే, ఎక్కడ పిల్లులు గుంపులు గుంపులుగా ఉన్నాయో నివేదిక ఇవ్వమని స్థానిక పాలనా యంత్రాంగాన్ని అడిగారట.

అసలీ ఆడ పిల్లులున్నాయే..

ఆడ పిల్లులను పట్టుకోవడం కష్టం కాబట్టి, వాటికి శస్త్రచికిత్సలు తక్కువగా జరుగుతున్నాయట. 'నిధులు మూడు రెట్లు పెంచినా లాభం లేదు. నిపుణులైన సంరక్షణ బృందాలను రంగంలోకి దించి, పిల్లులను రౌండప్ చేయాలి!' అని లార్నాకా పిల్లుల అభయారణ్యం నడుపుతున్న ఎలియాస్ డెమెట్రియు వాదిస్తున్నారు. మరో స్వచ్ఛంద సంస్థకు చెందిన ఎలీని లాయిజిడౌ అయితే.. తాము 397 పిల్లులను పట్టుకోవడం సముద్రంలో ఒక చిన్న నీటి చుక్క లాంటిదేనని వ్యాఖ్యానించారు.

మై హూనా..

వెటర్నరీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎపమినోండాస్ మాత్రం చాలా ఆశాజనకంగా ఉన్నారు. కేవలం నాలుగేళ్లలోనే ఈ పిల్లుల సంఖ్యను నియంత్రించవచ్చు అంటున్నారు. 'అధికారులు ఒక ఏకీకృత ప్లాన్‌ను తయారుచేసి, ప్రైవేట్ క్లినిక్‌ల ద్వారా ఉచితంగా ఆపరేషన్లు చేయించాలి. ప్రజలకు ఈ ప్రక్రియ సులభంగా ఉంటే, వారు తమ పిల్లులకు శస్త్రచికిత్స చేయించడానికి మరింత ఉత్సాహం చూపిస్తారు'.. అన్నారాయన. 'పిల్లులు ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించాలి. వాటిని పట్టుకుని నిర్దేశిత వెటర్నరీ క్లినిక్స్‌కి తరలించాలి. ప్రజలు పెద్ద పిల్లుల గుంపులను గుర్తించడానికి ఒక స్మార్ట్‌ఫోన్ అప్లికేషన్ తయారు చేయాలి'.. అని ఆయన సూచించారు.

బాబ్బాబు.. ఏదో ఒకటి చేయండి

ఈ మొత్తం ఖర్చు ప్రభుత్వాన్నే భరించాల్సిన అవసరం లేదు. ప్రజలు, వ్యాపార సంస్థలు విరాళాలు ఇచ్చేందుకు ఒక ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయవచ్చని వెటర్నరీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎపమినోండాస్ సలహా ఇచ్చారు. ఇక ఖర్చు విషయానికి వస్తే... వీధి పిల్లికి ఆపరేషన్ ఖర్చు 55 యూరోలు (సుమారు రూ.4,800), అదే పెంపుడు పిల్లికి అయితే 120 యూరోలు (సుమారు రూ.10,500) అవుతుందట. ఏదేమైనా, పరిష్కారాలు ఉన్నాయని క్యాట్ అలర్ట్ చీఫ్ లాయిజిడౌ గట్టిగా చెప్పారు. మరి ఈ పిల్లుల దండుకు సైప్రస్ అధికారులు ఎప్పుడు కళ్లెం వేస్తారో చూడాలి!



చాంపియన్ షిప్ సాధించిన ఆనందంలో బ్రాండన్ డాసన్

బాహుబలి గుమ్మడి!

1,064 కిలోల గుమ్మడి • కాలిఫోర్నియా ఇంజనీర్ రికార్డు

హాఫ్ మూన్ బే: ఒకటి కాదు రెండు కాదు.. ఏకంగా 2,346 పౌండ్లు (1,064 కిలోలు)! ఇదండీ మ్యాటర్. ఓ మామూలు సెడాన్ కారు బరువు లేదా ఏనుగులో సగం బరువున్న గుమ్మడికాయను పెంచాడు కాలిఫోర్నియా ఇంజనీర్. ఇంకేముందీ.. అతనికి 20,000 పౌండ్లు (సుమారు రూ.16 లక్షలు) బహుమతి ఖాయం! శాంటా రోసాకు చెందిన బ్రాండన్ డాసన్ అనే ఇంజనీర్.. ఏటా జరిగే వరల్డ్ చాంపియన్‌షిప్ గుమ్మడికాయల తూకం పోటీలో ఈసారి దుమ్ము రేపాడు. అంత బరువున్న గుమ్మడికాయను చూసి, 'అసలు ఇతను ఇంజనీరా? లేక గుమ్మడికాయల ఫ్యాక్టరీ ఓనరా?' అని అందరూ నోరెళ్లబెట్టారు.

'నా గుమ్మడికాయ బరువు సరిపోక పోయినా పర్లేదు, కానీ, నా గుండె బరువు ఈసారి విజయం సాధించింది'.. అన్నట్టు డాసన్ ఫుల్ ఖుషీగా ఉన్నాడు. గతేడాది కేవలం 6 పౌండ్ల తేడాతో ఓడిపోయాడట. 'గతేడాది ఓటమికి ఈసారి ఇంత పెద్ద గుమ్మడికాయతో ప్రతీకారం తీర్చుకున్నాను'.. అని డాసన్ విజయ గర్వంతో అన్నాడు. నిజానికి, ఈయన రివియన్ ఆటోమోటివ్‌లో ఇంజనీర్. కారు తయారీలో వాడే 'కచ్చితత్వం' టెక్నిక్‌ను గుమ్మడికాయ పెంపకానికి వాడతాడట. 'మా కారుకి పట్టినన్ని నీళ్లు, ఎండ ఈ గుమ్మడికాయకి అవసరమయ్యాయి'.. అని సరదాగా వ్యాఖ్యానించాడు. ఈయన గుమ్మడికాయ రోజుకు 70 పౌండ్ల చొప్పున పెరిగిందట. ఆ వేగాన్ని చూసి, 'అసలు ఈ గుమ్మడికాయ నా కారుకంటే వేగంగా పెరుగుతోంది'.. అని డాసన్ అబ్బురపడ్డాడు. కేవలం తనే కాదు, తన రెండేళ్ల కొడుకు, నాలుగేళ్ల కూతురు కూడా ఈ గుమ్మడికాయను పెంచడంలో భాగమయ్యారట. 'రోజూ వచ్చి, 'డాడీ! ఈ గుమ్మడికాయ ఇంకా పెద్దదైందా?' అని అడుగుతారు. ఆ బరువుకి వాళ్లు భయపడటం లేదు, దాన్ని కింద పడకుండా చూడటానికే వాళ్లు భయపడుతున్నారు!' అని నవ్వుతూ చెప్పాడు. పోటీ తర్వాత డాసన్ ఆ పెద్ద గుమ్మడికాయపై తన ఇద్దరు పిల్లలను కూర్చోబెట్టి ఫొటో దిగాడు. ఆ గుమ్మడికాయ కిరీటంలాగా ఉంది, పిల్లలు రాజు, రాణిగా కనిపిస్తున్నారు. 'ఇంత బరువున్న కిరీటాన్ని మోయాలంటే ఈ గుమ్మడికాయ రాజు నలిగిపోతాడేమో!' అని జనం నవ్వుకున్నారు. మొత్తానికి, ఇంజనీరింగ్ జ్ఞానాన్ని తోట పనికి వాడితే.. అది మామూలు విజయం కాదు, ఏకంగా 'బరువైన విజయం' ఇచ్చిందని డాసన్ నిరూపించాడు!

హమాస్ ప్రత్యర్థుల ఊచకోత

కనీసం 50 మందిని చంపేసినట్లు సమాచారం

గాజా: ఇజ్రాయెల్ బందీల విడుదల అనంతరం హమాస్ సాయుధ గ్రూపు చూపు ఇప్పుడు ప్రత్యర్థి వర్గాలపై పడింది. గాజా ప్రాంతంపై పట్టు తిరిగి సాధించేందుకు విరోధి సాయుధ శ్రేణులను ఏరి పారేసే పనికి పూనుకుంది. ఈ పరిణామం అమెరికా మధ్యవర్తిత్వంతో నెలకొన్న కాల్పుల విరమణ మనుగడపై కొత్త అనుమానాలను తెరపైకి తెస్తోంది. ఇప్పటికైనా శాంతి నెలకొందని సంతోష పడుతున్న పాలస్తీనియన్లను హమాస్ వైఖరి భయపెడుతోంది. హమాస్ ఫైరింగ్ స్క్వాడ్ తాజాగా ప్రత్యర్థి వర్గాలకు చెందిన 8 మందిని కాల్చి చంపినట్లు సమాచారం. మొత్తమ్మీద 50 మందిని ఇప్పటి వరకు మట్టుబెట్టి ఉంటుందని వైనెట్ వార్తా సంస్థ తెలిపింది. అంతర్గత భద్రతను హమాస్ చూసుకుంటుందని ట్రంప్ ప్రకటించిన కొద్దిసేపట్లోనే ఈ పరిణామాలు చోటుచేసుకున్నట్లు ఆ సంస్థ వ్యాఖ్యానించింది. కళ్లకు గంతలు కట్టి, బంధించిన వారిని ముసుగులు ధరించిన హమాస్ సభ్యులు దాదాపు బహిరంగంగానే కాలుస్తున్నట్లుగా ఉన్న వీడియోను షఫఖ్ న్యూస్ ప్రసారం చేసింది. దీనిపై స్పందించిన హమాస్..ఇజ్రాయెల్ బలగాలకు సహకరించడంతోపాటు నేర కార్యకలాపాల్లో పాల్గొన్నందుకే వీరిని శిక్షించామని తెలిపింది. అయితే, హమాస్ చర్యలు గాజాలోని డొగ్‌ముష్ వంటి గ్రూపులతో హింసాత్మక ఘర్షణలకు దారి తీస్తున్నాయి. డొగ్‌ముష్ వర్గం గాజాలోని అత్యంత శక్తివంతమైన సాయుధ గ్రూపుల్లో ఒకటి. హమాస్ భద్రతా విభాగంతో జరిగిన కాల్పుల్లో డొగ్‌ముష్‌కు చెందిన 52 మంది చనిపోయారని వైనెట్ పేర్కొంది. ఈ పోరులో 12 మంది హమాస్ సాయుధులు కూడా ప్రాణాలు కోల్పోయారు. వీరిలో హమాస్ సీనియర్ నేత బస్సెమ్ నయీమ్ కుమారుడు కూడా ఉన్నట్లు వైనెట్ పేర్కొంది. ప్రత్యర్థుల ప్రాంతాల్లోకి గుట్టుచప్పుడు కాకుండా అంబులెన్సుల్లో వెళ్లిన హమాస్ శ్రేణులు శత్రు సంహారం చేస్తున్నారని తెలిపింది. పౌరుల ప్రాణాలకు ప్రమాదం కలిగించేలా వ్యవహరిస్తోందంటూ హమాస్‌పై విమర్శలు వస్తున్నాయి.

కొన్ని గ్రూపులకు ఇజ్రాయెల్ సాయం

అత్యంత అధునాతన, భారీ ఆయుధాలు కలిగిన డొగ్‌ముష్‌కు ఎప్పట్నుంచో హమాస్‌తో విభేదాలున్నాయి. ఈ గ్రూపునకు ఇజ్రాయెల్ మద్దతుందనే అనుమానాలు కూడా ఉన్నాయి. రఫాలోని యాసెర్ అబూ షబాబ్ సారథ్యంలోని గ్రూపు సహా గాజాలోని పలు ముఠాలకు పరిమితంగా సాయం, ఆయుధాలు అందిస్తున్నట్లు ఇజ్రాయెల్ ఇటీవల ప్రకటించడం గమనార్హం. ఇటీవల హమాస్ శ్రేణులు యాసెర్ అబూ షబాబ్ సన్నిహితుడొకరిని చంపేసినట్లు ప్రకటించుకున్నాయి. షబాబ్‌ను వదిలేది లేదని కూడా తెలిపాయి. హమాస్‌లోని యారో యూనిట్ హింసాత్మక ప్రతీకార చర్యల్లో ఆరితేరిందని నిపుణులు అంటున్నారు. ఇన్నాళ్లూ సొరంగాల్లో రహస్యంగా నక్కుతూ పనిచేసిన హమాస్ సాయుధులు ఇప్పుడు తమ శత్రువుల అంతం చూసే పనిలో నిమగ్నమైనట్లు చెబుతున్నారు. శాంతి ఒప్పందాన్ని అనుసరించే ఉద్దేశం హమాస్ లేనట్లు కనిపిస్తోందంటున్నారు. 'ఆయుధాలను ఉంచుకోవాలనే ఉద్దేశంతోనే హమాస్ ఇప్పటికీ ఉంది. నిరాయుధీకరణ రెండో దశ చర్చలు ప్రారంభమయ్యేటప్పటికి గాజాపై పట్టు నిలుపుకోవాలనే పట్టుదలతో ఉంది' అని విశ్లేషకులు అంటున్నారు.

అధ్యక్ష ఎన్నికల్లో గెలుపు నాదే

- ప్రకటించుకున్న కామెరూన్ ప్రతిపక్ష నేత బకరీ
- తోసిపుచ్చిన అధికార సీపీడీఎం పార్టీ

యవండే: ఆఫ్రికా దేశం కామెరూన్ అధ్యక్ష పదవికి ఆదివారం జరిగిన ఎన్నికల్లో గెలుపు తమదేనని ప్రతిపక్ష పార్టీ అభ్యర్థి ఇస్సా టిచిరొమా బకరీ(76) ప్రకటించుకున్నారు. నాలుగు దశాబ్దాలుగా పదవిలో కొనసాగుతున్న అధ్యక్షుడు పాల్ బియా(92) ఓటమిని ఒప్పుకోవాలని మంగళవారం ఆయన పిలుపునిచ్చారు. 'మా గెలుపు స్పష్టమైంది. దీనిని గౌరవించాలి. లేకుంటే దేశం సంక్షోభంలో చిక్కుకుంటుంది' అని పేర్కొన్నారు. దేశ స్వతంత్ర ఎన్నికల కమిటీ, రాజ్యాంగ న్యాయస్థానం ఎన్నికల ఫలితాలను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. అధికారికంగా ఈ నెల 26వ తేదీన ఫలితాలు వెలువడుతాయి. బకరీ ప్రకటనను అధ్యక్షుడు బియా సారథ్యంలోని కామెరూన్ పీపుల్స్ మూవ్‌మెంట్ పార్టీ(సీపీడీఎం) ఖండించింది. పోలింగ్ కేంద్రాల నుంచి ఫలితాలు వెలువడక మునుపే గెలిచినట్లు ఎలా ప్రకటిస్తారని బకరీని ప్రశ్నించింది. రాజ్యాంగ కౌన్సిల్ మాత్రమే ఫలితాలను ప్రకటిస్తుందని, అనధికారికంగా ఫలితాలను ప్రకటించడాన్ని తీవ్రమైన నేరంగా పరిగణిస్తామని పరిపాలన శాఖ మంత్రి హెచ్చరించారు.

సుప్రీంలో నేడు వాంగ్‌చుక్ కేసు విచారణ

పిటిషనర్ కోరిక మేరకు వాయిదా వేసిన కోర్టు

- హెబియస్ కార్పస్ పిటిషన్ వేసిన గీతాంజలి ఆంగ్మో
- వాంగ్‌చుక్ వల్ల ప్రజాభద్రతకు ముప్పుందనే అరెస్టు చేశాం
- ఆయనను జైల్లో ఏకాంతంగా నిర్బంధించలేదు
- కోర్టుకు తెలిపిన అధికార యంత్రాంగం

న్యూఢిల్లీ: లద్దాఖ్ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను జాతీయ భద్రతా చట్టం (ఎన్ఎస్ఏ) కింద అరెస్టు చేయటాన్ని సవాలు చేస్తూ ఆయన సతీమణి గీతాంజలి ఆంగ్మో దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు బుధవారం విచారణ జరుపనుంది. లద్దాఖ్‌కు రాష్ట్రహోదా ఇవ్వాలని, దానిని రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలని కొంతకాలంగా వాంగ్‌చుక్ నాయకత్వంలో ఆందోళనలు జరుగుతున్నాయి. గత నెల 24న లేహ్‌లో నిర్వహించిన నిరసన ప్రదర్శన హింసాత్మకంగా మారటంతో నలుగురు చనిపోయిన విషయం తెలిసిందే. అందుకు వాంగ్‌చుక్‌ను బాధ్యుడిని చేస్తూ ఎన్ఎస్ఏ కింద అరెస్టు చేసి రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జైల్లో ఉంచారు. ఈ అరెస్టును సవాల్ చేస్తూ ఆంగ్మో ఈ నెల 6న సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. తన భర్తను వెంటనే కోర్టుముందు హాజరుపర్చాలని, ఆయనపై మోపిన అభియోగాలను ఎత్తివేసి, విడుదల చేయాలని కోరారు. ఈ పిటిషన్‌ను మంగళవారం విచారించాల్సి ఉన్నప్పటికీ పిటిషనర్ తరఫు న్యాయవాది కపిల్‌సిబాల్ వాయిదా కోరటంతో జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్వీ అంజరియాలతో కూడిన ధర్మాసనం బుధవారానికి వాయిదా వేసింది. ఈ కేసులో కేంద్రానికి, లద్దాఖ్ పాలనాయంత్రాంగానికి ఈ నెల 6నే కోర్టు నోటీసులు జారీచేసింది.

వాంగ్‌చుక్‌తో శాంతిభద్రతలకు ప్రమాదం

వాంగ్‌చుక్ కార్యకలాపాలు లద్దాక్ భద్రతకు ముప్పు కలిగించేలా ఉన్నందునే ఆయన అరెస్టుకు ఆదేశాలిచ్చామని లేహ్ జిల్లా మేజిస్ట్రేట్ (డీఎం) సుప్రీంకోర్టుకు తెలిపారు. ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేశారు. వాంగ్‌చుక్‌ను చట్టవ్యతిరేకంగా అరెస్టు చేయలేదని స్పష్టంచేశారు. వాంగ్‌చుక్‌పట్ల అన్యాయంగా ప్రవర్తించారన్న ఆరోపణలను తోసిపుచ్చారు. ఎన్ఎస్ఏను మోపటంపై రాష్ట్రపతికి గీతాంజలి ఆంగ్మో లేఖ రాశారని.. కానీ, చట్టంలోని సెక్షన్ 10 ప్రకారం ఎవరైతే నిర్బంధించబడతారో వారికే ఇలా లేఖ రాసే అధికారం ఉంటుందని పేర్కొన్నారు. కాగా, సోనమ్‌వాంగ్‌చుక్‌ను జైల్లో ఒంటరిగా బంధించారన్న ఆరోపణలను జోధ్‌పూర్ జైలు సూపరింటెండెంట్ ఖండించారు. ఆయనకు జైల్లో చట్టప్రకారం అన్ని వసతులు కల్పించినట్లు తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. విజిటర్లను కలిసేందుకు కూడా అనుమతి ఇస్తున్నట్లు వెల్లడించారు. రాజస్తాన్ జైలు రూల్స్–2022లోని రూల్ 538 ప్రకారం ఎన్ఎస్ఏ కింద అరెస్టయిన వ్యక్తులు స్థానిక పోలీసులు సమక్షంలోనే విజిటర్స్‌తో మాట్లాడాల్సి ఉంటుందని స్పష్టంచేశారు.

పాతాళంలో దాక్కున్నా వదలం

- భూమిపై ఉగ్రవాదులకు ఎక్కడా సురక్షితంగా ఉండలేరు
- ఆపరేషన్ సిందూర్‌తో ఆ విషయాన్ని నిరూపించాం
- ఎన్ఎస్‌జీ 41వ వ్యవస్థాపక దినోత్సవంలో కేంద్రమంత్రి అమిత్ షా

మనేసర్ (హరియాణా): ఆపరేషన్ సిందూర్ ద్వారా పాకిస్తాన్‌లోని ఉగ్రవాద ప్రధాన కేంద్రాలు, స్థావరాలు, లాంచ్‌పాడ్‌లను ధ్వంసం చేసి.. ఇక వారికి ఎక్కడా సురక్షిత ప్రాంతం అనేది లేకుండా చేశామని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఉగ్రవాదులు పాతాళంలో దాక్కున్నా మన సైనిక బలగాలు వేటాడుతాయని స్పష్టంచేశారు. నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్' (ఎన్ఎస్‌జీ) 41వ వ్యవస్థాపక దినోత్సవంలో మంగళవారం ఆయన మాట్లాడారు. 'పాకిస్తాన్ లోని ఉగ్రవాద ప్రధాన కేంద్రాలు, శిక్షణ స్థావరాలు, లాంచ్‌పాడ్లను ధ్వంసం చేయగలమని ఆపరేషన్ సిందూర్ నిరూపించింది. పహెల్గాం దాడికి కారణమైన ఉగ్రవాదులను మన భద్రతా దళాలు ఆపరేషన్ మహదేవ్ ద్వారా అంతమొందించాయి. ఈ రెండు ఆపరేషన్లు మన భద్రతాబలగాలపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంచాయి. ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో ఉగ్రవాదుల పట్ల ఏమాత్రం కనికరం లేని విధానాన్ని అమలుచేస్తున్నాం. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని తొలగించినప్పటి నుంచి సర్జికల్ స్ట్రైక్స్, ఎయిర్ స్ట్రైక్, ఆపరేషన్ సిందూర్ వరకు గమనిస్తే.. మన భద్రతా బలగాలు ఉగ్రవాదులు ఏ మూలలో దాక్కున్నా అంతమొందించగలవని అర్థమవుతుంది. ఉగ్రవాదుల నుంచి దేశాన్ని రక్షించేందుకు 2019 నుంచి కేంద్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంది. చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం, ఎన్ఐఏ చట్టం, మనీలాండరింగ్ నిరోధక చట్టం వంటివి అందులో భాగమే. కొత్త క్రిమినల్ లాలో ఉగ్రవాదాన్ని మొదటిసారి నిర్వచించి, గతంలో ఉన్న లొసుగులను తొలగించాం. ఇప్పటివరకు 57 మంది వ్యక్తులు, సంస్థలను చట్టవ్యతిరేకమైనవిగా ప్రకటించాం' అని అమిత్ షా వివరించారు. ఉగ్రవాదులు ఏరివేతలోనే కాకుండా మతపరమైన స్థలాలు, దేశ అంతర్గత జలమార్గాలు, పార్లమెంటు తదితర 770 ప్రాంతాల్లో ఎన్ఎస్‌జీ నిఘా కొనసాగిస్తోందని ప్రశంసించారు. ఆయా ప్రాంతాల 3డీ మోడళ్లను కూడా రూపొందిస్తున్నామని ఎన్ఎస్‌జీ డైరెక్టర్ జనరల్ బ్రిఘు శ్రీనివాసన్ తెలిపారు.

టిక్కెటివ్వలేదని సీఎం నివాసం వద్ద ధర్నా

పట్నా: బిహార్ అధికార జేడీయూ ఎమ్మెల్యే గోపాల్ మండల్ తనకు పార్టీ టిక్కెట్ ఇవ్వలేదంటూ మంగళవారం సీఎం నితీశ్ కుమార్ నివాసం ఎదుట ధర్నాకు దిగారు. నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందిన మండల్ భాగల్పూర్ జిల్లా గోపాల్‌పూర్ సీటునే మళ్లీ కోరుతున్నారు. అన్ని స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన సీఎం నితీశ్ సారథ్యంలోని జేడీయూ, మండల్ సహా నలుగురు సిట్టింగ్‌లకు టిక్కెట్లు ఇవ్వలేదని నేతలు తెలిపారు. దీంతో, మండల్ తన మద్దతుదారులతో సీఎం నివాసం వద్దకు వచ్చారు. నినాదాలు చేస్తూ లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించగా భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. కొద్దిసేపు అక్కడే బైఠాయించిన మండల్ అతడి అనుచరులను భద్రతాధికారులు పంపించివేశారు.

ఉక్రెయిన్ ఆస్పత్రిపై రష్యా దాడి

కీవ్: ఉక్రెయిన్‌లోని రెండో అతిపెద్ద నగరం ఖార్కివ్‌లోని ప్రధాన ఆస్పత్రిపై రష్యా సోమవారం అర్ధరాత్రి గ్లైడ్ బాంబులు, డ్రోన్లతో భారీ దాడులకు దిగింది. ఈ దాడుల్లో పలువురు పౌరులు తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఆస్పత్రిలోని 50 మంది రోగులను వేరే చోటుకు తరలించామన్నారు. నగరంలోని చాలా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని చెప్పారు. అయితే, రష్యా తమ ఇంధన వ్యవస్థలనే లక్ష్యంగా చేసుకుని ఈ దాడికి దిగిందని అధ్యక్షుడు జెలెన్‌స్కీ ఆరోపించారు. రష్యా లాంగ్ రేంజ్ క్షిపణుల దాడులను ఎదుర్కొనేందుకు మరిన్ని గగనతల రక్షణ వ్యవస్థలను, సమర్థవంతమైన ఎదురు దాడులకు టొమహాక్ క్షిపణులను సరఫరా చేయాలని మరోసారి అమెరికాను, పశ్చిమదేశాలను ఆయన కోరారు. ఈ విషయమై చర్చించేందుకు శుక్రవారం వాషింగ్టన్‌లో అధ్యక్షుడు ట్రంప్‌ను కలువనున్నట్లు తెలిపారు. ఇలా ఉండగా, ఈ ఏడాది మొదటి అర్ధ భాగంలో ఉక్రెయిన్‌కు పశ్చిమదేశాలు అందించిన సాయంతో పోలిస్తే, జూలై, ఆగస్టుల్లో అందించిన సాయం 43 శాతం మేర తగ్గిపోయిందని విశ్లేషకులు చెబుతున్నారు.

బీజేపీకి కలిసి రానున్న సజ్జాద్ లోనె నిర్ణయం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో నాలుగు రాజ్యసభ స్థానాలకు త్వరలో జరిగే ఎన్నికల్లో బీజేపీ ఒక సీటును గెలుచుకునే అవకాశం కన్పిస్తోంది. అధికార నేషనల్ కాన్ఫరెన్స్‌కు వ్యతిరేకంగా పీపుల్స్ కాన్ఫరెన్స్ పార్టీ చీఫ్ సజ్జాద్ లోనె తీసుకున్న నిర్ణయమే దీనికి కారణం. వచ్చే రాజ్యసభ ఎన్నికల్లో తమ పార్టీ ఓటింగ్‌లో పాల్గొనడం లేదని ఆయన మంగళవారం ప్రకటించారు. నేషనల్ కాన్ఫరెన్స్ బలపరిచే నాలుగు అభ్యరుల్లో ఏ ఒక్కరినీ తాము బలపర్చబోమని ఆయన స్పష్టం చేశారు. 'మీరు మమ్మల్ని శాసించకండి. మేం ఎవరికి ఓటేయాలో నిర్ణయించాల్సింది మీరు కాదు. మీరేమీ యువరాజు కాదు'అంటూ ఆయన సీఎం ఒమర్ అబ్దుల్లానుద్దేశించి మీడియాతో వ్యాఖ్యానించారు. కశ్మీర్ అసెంబ్లీ బలాబలాలను బట్టి అధికార నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థులు ముగ్గురూ సునాయాసంగా విజయం సాధిస్తారు. బీజేపీ అభ్యర్థి సత్ శర్మ గెలవాలంటే ముగ్గురు బీజేయేతర ఎమ్మెల్యేలు ఓటింగ్‌లో పాల్గొనరాదు లేదా ఆయనకు ఓటేయాల్సి ఉంటుంది. ఈ ఎన్నికల్లో నాలుగు సీట్లకు గాను బీజేపీ మూడింట్లో పోటీ చేస్తోంది. ఈ రాజ్యసభ ఎన్నికలు జమ్మూకశ్మీర్ రాజకీయ పార్టీలు బీజేపీకి మిత్రులా, శత్రువులా తేల్చేస్తాయంటూ సోమవారం సీఎం ఒమర్ వ్యాఖ్యానించారు. దీనికి స్పందించిన సజ్జాద్ లోనె..కాంగ్రెస్ పార్టీకి రాజ్యసభ సీటును కేటాయించకపోవడం వెనుక బీజేపీతో కలిసి కుట్ర చేయలేదని రుజువు చేయాలంటూ సీఎంకు ఆయన సవాల్ విసిరారు.

బంగ్లాదేశ్‌లో అగ్ని ప్రమాదం..16 మంది మృతి

ఢాకా: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో మంగళవారం సంభవించిన ఘోర అగ్ని ప్రమాదంలో 16 మంది చనిపోయారు. రూప్‌నగర్ ప్రాంతంలో ఉన్న షా ఆలం కెమికల్ గోదాములో మధ్యాహ్నం 12 గంటల సమయంలో ప్రారంభమైన మంటలు ఆ పక్కనే ఆనుకుని ఉన్న అన్వర్ ఫ్యాషన్ గార్మెంట్స్ ఫ్యాక్టరీకి వ్యాపించాయి. దుస్తుల ఫ్యాక్టరీ నుంచి 16 మృతదేహాలను వెలికి తీసినట్లు అధికారులు తెలిపారు. వీరంతా విషవాయువులను పీల్చడంతోనే ప్రాణాలొదిలినట్లు భావిస్తున్నామన్నారు. అస్వస్థతకు గురైన పలువురు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. నాలుగంతస్తుల దుస్తుల ఫ్యాక్టరీలో మంటలను ఆర్పివేశామని, రసాయనాల మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. మరణాలు పెరిగే అవకాశముందన్నారు.

బిహార్ ఎన్నికల వేళ ఈసీ కీలక ఆదేశాలు

న్యూఢిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ కేంద్ర ఎన్నికల కమిషన్(ఈసీ) అన్ని రాజకీయ పార్టీలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత 48 గంటల వరకు(సైలెన్స్ పీరియడ్) ఎలాంటి బల్క్‌ఎస్ఎంఎస్‌లు, ఆడియో మెసేజ్‌లు పంపరాదని ఈసీ రాజకీయ పార్టీలను హెచ్చరించింది. అలాగే టీవీ, కేబుల్ నెట్‌వర్క్‌లు, రేడియోల్లో, సినిమా హాళ్లో ఎన్నికలకు సంబంధించి రాజకీయ ప్రకటనలు చేయరాదని ఆదేశాలు జారీ చేసింది. పోలింగ్‌ప్రాంతంలో ఆడియో, విజువల్‌డిస్‌ప్లేలు నిషేధించినట్లు పేర్కొంది. సోషల్‌మీడియా ప్రభావం తీవ్రంగా ఉన్న ప్రస్తుత తరుణంలో, అభ్యర్థులు నామినేషన్‌దాఖలు చేసేటప్పుడు వారి అధికారిక సోషల్ మీడియా ఖాతాల వివరాలను పొందుపరచాలని ఆదేశించింది. ముందస్తు అనుమతులు తప్పనిసరి: రాజకీయ ప్రచార ప్రకటనలకు పార్టీలు తప్పనిసరిగా ముందుస్తు అనుమతులు తీసుకోవాలని ఈసీ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రాజకీయ పార్టీలకు, పోటీ చేసే అభ్యర్థులకు ఈసీ మార్గదర్శకాలు జారీ చేసింది. అభ్యర్థులు సోషల్ మీడియాతో సహా ఎలక్ట్రానిక్ లేదా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఏదైనా రాజకీయ ప్రకటనలు ప్రచురించడానికి లేదా ప్రసారం చేయడానికి ముందు మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ) నుంచి ముందస్తు ధృవీకరణ పొందడం తప్పనిసరి అని తెలిపింది. ధృవీకరణ ప్రక్రియను పర్యవేక్షించడానికి జిల్లా, రాష్ట్రస్థాయిలో పలుమీడియా సర్టిఫికేషన్, ఎంసీఎంసీలను ఏర్పాటు చేసినట్లు ఈసీ పేర్కొంది.

సైమన్ కమిషన్‌లో సభ్యుల సంఖ్య ఎంత?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

భారత రాజ్యాంగ పరిణామ క్రమం

1. రాజ్యాంగ భావనను తొలిసారి శాస్త్రీయంగా వివరించిన తత్వవేత్త ఎవరు?
   1) సోక్రటీస్ 2) అరిస్టాటిల్
   3) మాకియవెల్లి 4) రూసో
2. కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) ప్రపంచంలో మొదటి లిఖిత రాజ్యాంగం - అమెరికా
   బి) ప్రపంచంలో మొదటి అలిఖిత రాజ్యాంగం - బ్రిటన్
   1) ఎ సరైంది 2) బి సరైంది
   3) ఎ, బి సరైనవి 4) ఏదీకాదు
3. రాజ్యాంగ పాలన ప్రజల్లో చైతన్యానికి, స్ఫూర్తి నింపడానికే తప్ప నియంత్రణకు, బానిసత్వానికి సంకేతం కాదని పేర్కొన్న రాజనీతిజ్ఞుడు ఎవరు?
   1) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్
   2) ఉడ్రో విల్సన్
   3) అరిస్టాటిల్ 4) లాక్
4. ఫోర్త్ ఎస్టేట్‌కు సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   1) బ్రిటన్ పార్లమెంట్‌లో సభ్యుడు ఎడ్‌బర్గ్ ఈ పదాన్ని తొలిసారి ప్రయోగించాడు
   2) ప్రభుత్వ అంగాలైన శాసన నిర్మాణ శాఖను మొదటి ఎస్టేట్‌గా, కార్యనిర్వాహక శాఖను రెండో ఎస్టేట్‌గా, న్యాయశాఖను మూడో ఎస్టేట్‌గా వ్యవహరిస్తారు
   3) పత్రికలను లేదా ఎలక్ట్రానిక్ మీడియాను ఫోర్త్ ఎస్టేట్‌గా వ్యవహరిస్తారు
   4) పైవన్నీ సరైనవే
5. రెగ్యులేటింగ్ చట్టం - 1773కి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) భారతదేశానికి సంబంధించిన తొలి లిఖిత చట్టం
   బి) ఈ చట్టాన్ని 1773 మే 18న అప్పటి బ్రిటిష్ ప్రధాని లార్డ్ వార్త్ బ్రిటిష్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాడు
   సి) బెంగాల్ గవర్నర్ హోదాను గవర్నర్ జనరల్ ఆఫ్ బెంగాల్‌గా మర్చారు
   డి) ఈ చట్టం ప్రకారం మొదటి గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్
   1) ఎ, బి మాత్రమే సరైనవి
   2) బి, డి, మాత్రమే సరైనవి
   3) ఎ, బి, సి, డి 4) ఏదీకాదు
6. రెగ్యులేటింగ్ చట్టం - 1773కి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) ఈ చట్టం ఆధారంగా 1774లో కలకత్తాలోని ఫోర్ట్ విలియంలో సుప్రీంకోర్టును ఏర్పాటు చేశారు
   2) ఒక ప్రధాన న్యాయమూర్తి, ముగ్గురు సాధారణ న్యాయ మూర్తులు ఉన్నారు
   3) మొదటి ప్రధాన న్యాయమూర్తి సర్ ఎలిజా ఇంపే
   4) పైవన్నీ సరైనవే
7. రెగ్యులేటింగ్ చట్టం-1773లోని లోపాలను సవరించడానికి బ్రిటిష్ పార్లమెంట్ పిట్స్ ఇండియా చట్టాన్ని ఎప్పుడు చేసింది?
   1) 1780 2) 1784 3) 1793 4) 1833
8. దేశంలో మొదటిసారిగా ద్వంద్వ పాలనకు నాంది ప్రస్తావన చేసిన చట్టం ఏది?
   1) రెగ్యులేటింగ్ చట్టం - 1773
   2) రెగ్యులేటింగ్ చట్టం -1784
   3) భారత కౌన్సిళ్ల చట్టం - 1909
   4) రెగ్యులేటింగ్ చట్టం - 1861
9. పిట్స్ ఇండియా చట్టం-1784కి సంబంధించి కింది వాటిలో సరైంది?
   1) ఈ చట్టం ప్రకారం ఇండియాలోని పరిపాల నాంశాలను రెండు రకాలుగా వర్గీకరించారు
   2) రాజకీయ వ్యవహారాలు- బోర్డ్ ఆఫ్ కంట్రోలర్, వాణిజ్య వ్యవహారాలు కోర్ట్ ఆఫ్ డైరక్టర్స్
   3) గవర్నర్ కార్యనిర్వాహక మండలి సంఖ్య నాలుగు నుంచి మూడుకు తగ్గించారు
   4) పైవన్నీ సరైనవే
10. చార్టర్ చట్టం-1793 చేసినప్పుడు గవర్నర్ జనరల్ ఎవరు?
   1) వారెన్ హేస్టింగ్స్ 2) కారన్ వాలీస్
   3) విలియం బెంటింక్ 4) ఎవరూకాదు
11. భారత్‌లో క్రైస్తవ మిషనరీలు, చర్చిలు, క్రైస్తవ మిషనరీ హాస్టళ్లను ఏ చట్టం ద్వారా నెలకొల్పారు?
   1) రెగ్యులేటింగ్ చట్టం -1773
   2) రెగ్యులేటింగ్ చట్టం -1784
   3) రెగ్యులేటింగ్ చట్టం -1793
   4) రెగ్యులేటింగ్ చట్టం -1813
12. పన్నులు విధించడానికి, అవి చెల్లించడానికి, చెల్లించని వారిపై చర్యలను తీసుకొనే అధికారాన్ని స్థానిక సంస్థలకు ఏ చట్టం ద్వారా కల్పించారు?
   1) రెగ్యులేటింగ్ చట్టం -1813
   2) భారత కౌన్సిళ్ల చట్టం - 1909
   3) భారత కౌన్సిళ్ల చట్టం - 1919
   4) భారత ప్రభుత్వ చట్టం - 1935
13. చార్టర్ చట్టం-1813కి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) భారతీయ విద్యాభివృద్ధికి ఒక లక్ష రూపాయాలతో నిధి ఏర్పాటు చేశారు
   2) సివిల్ సర్వెంట్లకు శిక్షణా సదుపాయాన్ని కల్పించారు
   3) ఈ చట్టం ద్వారా మత మార్పిడులకు అవకాశం ఏర్పడింది
   4) మత నియోజక వర్గాలను ఏర్పాటు చేశారు
14. చార్టర్ చట్టం-1833కి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) బెంగాల్ గవర్నర్ జనరల్ హోదాను ఇండియన్ గవర్నర్ జనరల్‌గా మార్చారు
   బి) తొలి ఇండియన్ గవర్నర్ జనరల్ విలియం బెంటింక్
   1) ఎ సరైంది, బి సరికాదు
   2) ఎ సరైంది కాదు, బి సరైంది
   3) ఎ, బి రెండూ సరైనవే
   4) ఎ, బి రెండూ సరైనవి కాదు
15. చార్టర్ చట్టం-1833 ప్రకారం భారతీయ లా కమిషన్ అధ్యక్షుడు ఎవరు?
   1) లార్డ్ మెకాలే 2) లార్డ్ కారన్ వాలీస్
   3) లార్డ్ మింటో 4) ఎవరూ కాదు
16. 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని ఉద్దేశించి 'బానిసత్వానికి ఒక నూతన చట్టాన్ని భారతదేశంపై రుద్దారు. ఇంజన్ లేకుండా గట్టి బ్రేకులున్న యంత్రం' అని వ్యాఖ్యానించిన వారు?
   1) జవహర్ లాల్ నెహ్రూ
   2) గాంధీజీ 3) జిన్నా



   4) సుభాష్ చంద్రబోస్
17. చార్టర్ చట్టాల్లో చివరిది ఏది?
   1) చార్టర్ చట్టం - 1853
   2) చార్టర్ చట్టం - 1833
   3) చార్టర్ చట్టం - 1813
   4) చార్టర్ చట్టం - 1793
18. జతపరచండి.
   జాబితా-I
   i) సివిల్ ప్రొసిజర్ కోడ్
   ii) ఇండియన్ పీనల్ కోడ్
   iii) క్రిమినల్ ప్రొసిజర్ కోడ్
   iv) POTA చట్టం
   జాబితా-II
   a) 1859 b) 1860
   c) 1861 d) 2002
   1) i-a, ii-b, iii-c, iv-d
   2) i-d, ii-c, iii-b, iv-a
   3) i-b, ii-a, iii-d, iv-c
   4) i-c, ii-d, iii-a, iv-b
19. భారత ప్రభుత్వం చట్టం - 1858 (కౌన్సిల్ చట్టాలు)లో పొందుపరిచిన అంశం ఏది?
   1) గవర్నర్ జనరల్ ఆఫ్ ఇండియా హోదాను వైస్రాయ్ ఆఫ్ ఇండియాగా మార్చారు
   2) తొలి వైస్రాయ్ లార్డ్ కానింగ్
   3) బోర్డ్ ఆఫ్ కంట్రోల్ రద్దు
   4) పైవన్నీ
20. భారత ప్రభుత్వ చట్టం - 1935కి సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
   1) సమాఖ్య వ్యవస్థ ప్రతిపాదన
   2) ఆర్‌బీఐ ఏర్పాటు
   3) ఫెడరల్ న్యాయస్థానం ఏర్పాటు
   4) సార్వజనీన ఓటు హక్కు
21. పిట్స్ ఇండియా చట్టం-1784 ద్వారా ప్రవేశపెట్టిన బోర్డ్ ఆఫ్ కంట్రోల్/ కోర్ట్ ఆఫ్ డైరక్టర్స్ అనే ద్వంద్వ పాలన ఏ చట్టం ద్వారా రద్దయింది?
   1) భారత కౌన్సిల్ చట్టం -1858
   2) కౌన్సిళ్ల చట్టం - 1861
   3) కౌన్సిళ్ల చట్టం - 1792
   4) భారత కౌన్సిళ్ల చట్టం-1909
22. భారత కౌన్సిళ్ల చట్టం - 1858 ప్రకారం వైస్రాయ్ పదవీకాలం ఎన్నేళ్లు?
   1) 3 2) 5 3) 1 4) 4
23. భారత కౌన్సిళ్ల చట్టం -1858 సారాంశాన్ని వైస్రాయ్ లార్డ్ కానింగ్ ఏ నగరంలో చదివి వినిపించాడు?
   1) ఢిల్లీ 2) ఆగ్రా
   3) అలహాబాద్ 4) లండన్
24. పోర్ట్‌పోలియో విధానం ప్రవేశపెట్టిన వైస్రాయ్ ఎవరు?
   1) లార్డ్ కానింగ్ 2) మింటో
   3) విలియం బెంటింక్ 4) వేవేల్
25. ఇండియా పాలన బ్రిటిష్ చక్రవర్తి లేదా రాణి ఆధీనంలో వచ్చినట్లు బ్రిటిష్ విక్టోరియా రాణి ఎప్పుడు ప్రకటన చేసింది?
   1) 1857 నవంబర్ 1 2) 1857 డిసెంబర్ 1
   3) 1858 అక్టోబర్ 11 4) 1858 నవంబర్ 1
26. భారత వైస్రాయ్/ గవర్నర్ జనరల్‌కు ఆర్డినెన్స్ జారీ చేసే అధికారం కల్పించిన చట్టం?
   1) రెగ్యులేటింగ్ చట్టం - 1861
   2) భారత ప్రభుత్వ చట్టం -1935
   3) భారత కౌన్సిళ్ల చట్టం - 1909
   4) రెగ్యులేటింగ్ చట్టం - 1858
27. 1860లో బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పద్ధతి ఏది?
   1) పోర్ట్‌పోలియో పద్ధతి 2) బడ్జెట్ పద్ధతి
   3) 1, 2 4) ఏదీకాదు
28. బ్రిటిష్ ప్రభుత్వం సివిల్ సర్వీస్‌ల వయోపరిమితిని 1878లో 19 ఏళ్లకు తగ్గించింది. మళ్లీ ఏ సంవత్సరం నుంచి దాన్ని 24 సంవత్సరాలకు పెంచారు?
   1) 1892 2) 1905 3) 1895 4) 1891
29. మతతత్వ నియోజక వర్గాల పితామహుడిగా ఎవరిని పిలుస్తారు?
   1) వారన్ హేస్టింగ్స్ 2) లార్డ్ కానింగ్
   3) విలియం బెంటింక్ 4) లార్డ్ మింటో
30. మత ప్రాతిపదికన తొలిసారి నియోజకవర్గ గణాల ఏర్పాటుకు అవకాశం కల్పించిన చట్టం?
   1) భారత కౌన్సిళ్ల చటం-1919
   2) భారత ప్రభుత్వ చట్టం - 1935
   3) భారత కౌన్సిళ్ల చటం-1909
   4) భారత స్వాతంత్ర్య చట్టం-1947
31. భారత కౌన్సిళ్ల చట్టం-1909కి సంబంధించి కింది వాటిలో సరైంది ఏది?
   ఎ) ఈ చట్టాన్ని మింటో - మార్లే సంస్కరణలు అని పేర్కొంటారు
   బి) అప్పటి గవర్నర్/ వైస్రాయ్ లార్డ్ - మింటో, భారత వ్యవహారాల కార్యదర్శి - మార్లే
   సి) గవర్నర్ కార్యనిర్వాహక మండలిలో తొలిసారి భారతీయులకు సభ్యత్వాన్ని కల్పించారు
   డి) సభ్యత్వాన్ని పొందిన తొలి భారతీయుడు సత్యేంద్ర ప్రసాద్ సిన్హా
   1) ఎ, బి సరైనవి 2) బి, సి సరైనవి
   3) సి, డి సరైనవి 4) ఎ, బి, సి, డి
32. భారత కౌన్సిళ్ల చట్టం - 1909ను ఉద్దేశించి హిందువులకు, ముస్లింలకు మధ్య వేర్పాటు బీజాలు వేసి, వారి మధ్య అడ్డుగోడలు సృష్టించిందని, భారత విభజనకు నాంది పలికిందని వ్యాఖ్యానించింది ఎవరు?
   1) డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 2) గాంధీజీ
   3) జవహర్‌లాల్ నెహ్రూ 4) ఎవరూకాదు
33. 1919 చట్టానికి సంబంధించి కింది వాటిలో సరైనవి ఏవి?
   ఎ) 1919భారత ప్రభుత్వ చట్టాన్ని మాంటేగు - ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణలు అని పేర్కొంటారు
   బి) నాటి భారత కార్యదర్శి మాంటేగు
   సి) నాటి భారత వైస్రాయ్ ఛేమ్స్‌ఫర్డ్
   డి) ఈ చట్టాన్ని 1919లో రూపొందించినప్పటికీ 1921 నుంచి అమల్లోకి వచ్చింది
   1) ఎ, బి, సి, డి 2) ఎ, డి
   3) ఎ, బి, సి 4) పైవేవీకాదు
34. మాంటెగు - చెమ్స్‌ఫర్డ్ సంస్కరణలు -1919కు సంబంధించి కింది వాటిలో సరైంది?
   1) రాష్ట్రస్థాయిలో ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టారు
   2) దేశంలో మొదటిసారిగా ద్విసభా పద్ధతిని ప్రవేశపెట్టారు
   3) భారత హైకమిషనర్ అనే పదవిని సృష్టించారు
   4) పైవన్నీ సరైనవే
35. ఏ కమిటీ సూచన మేరకు భారత్‌కు విడిగా ఒక పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటు చేశారు?
   1) లీ కమిషన్ 2) సైమన్ కమిషన్
   3) క్రిప్స్ కమిషన్ 4) ఏదీకాదు
36. మత ప్రాతినిధ్యం ప్రకారం సిక్కులకు, క్రిస్టియన్లకు, ఆంగ్లో ఇండియన్లకు, ఐరోపా వారికి ప్రత్యేక నియోజక వర్గాలను ఏ చట్టం ప్రకారం ప్రకటించారు?
   1) భారత కౌన్సిళ్ల చట్టం - 1909
   2) భారత కౌన్సిళ్ల చట్టం -1919
   3) భారత ప్రభుత్వ చట్టం-1935
   4) భారత స్వాతంత్ర్య చట్టం - 1947
37. '1919 సంస్కరణలు అసంతృప్తి, నిరాశతోపాటు సూర్యుడులేని ఉదయం'గా ఉందని అభిప్రాయపడింది ఎవరు?
   1) బాలగంగాధర్ తిలక్
   2) బిపిన్ చంద్రపాల్
   3) లాలా లజపతిరాయ్
   4) అరవింద ఘోష్
38. ఏ సంస్కరణలను బ్రిటిషర్లు ప్రకటించి ఉండాల్సింది కాదని, ఏ చట్టాన్ని భారతీయులు స్వీకరించడం తగదని శ్రీమతి అనీబిసెంట్ ఏ చట్టాన్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు?
   1) భారత కౌన్సిళ్ల చట్టం - 1919
   2) భారత కౌన్సిళ్ల చట్టం -1909
   3) భారత ప్రభుత్వ చట్టం-1935
   4) భారత స్వాతంత్ర్య చట్టం - 1947
39. సైమన్ కమిషన్‌ను బ్రిటిష్ ప్రధాని బాల్విన్ ఎప్పుడు ప్రకటించాడు?
   1) 1927 జనవరి 2) 1927 ఆగస్టు
   3) 1927 నవంబర్ 4) 1927 డిసెంబర్
40. సైమన్ కమిషన్ భారతదేశానికి ఏ సంవత్సరంలో వచ్చింది?
   1) 1927 2) 1928
   3) 1929 4) 1930
41. సైమన్ కమిషన్‌ను భారతీయులు ఎందుకు వ్యతిరేకించారు?
   1) ఈ కమిటీలో సభ్యులందరూ భారతీయులు అయినందుకు
   2) ఈ కమిటీలో సభ్యులందరూ బ్రిటిషర్లు కావడం వల్ల
   3) ఈ కమిటీలోని సభ్యులందరూ మహిళలు కావడం వల్ల
   4) ఈ కమిటీలో సభ్యుడిగా గాంధీజీ ఉండటం వల్ల
42. సైమన్ కమిషన్‌ను ఇంగ్లండ్ ప్రభుత్వం ఎందుకు నియమించింది?
   1) భారతదేశానికి స్వాతంత్ర్యం ఇవ్వడానికి
   2) భారత ప్రభుత్వం చట్టం 1919లో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సంస్కరణలను సమీక్షించడానికి
   3) రాజ్యాంగ పరిషత్ ప్రతిపాదనను పరిశీలించడానికి
   4) డొమినియన్ ప్రతిపత్తిని సమీక్షించడానికి
43. సమాఖ్య అనే పదాన్ని తొలిసారి సూచించింది?
   1) సైమన్ కమిషన్ 2) మకల్ కమిషన్
   3) మౌంట్ బాటెన్ కమిషన్
   4) ఏదీకాదు
44. సైమన్ కమిషన్‌లో సభ్యుల సంఖ్య ఎంత?
   1) ఒక అధ్యక్షుడు, ఆరుగురు సభ్యులు
   2) ఒక అధ్యక్షుడు, ఐదుగురు సభ్యులు
   3) ఒక అధ్యక్షుడు, ఏడుగురు సభ్యులు
   4) ఒక అధ్యక్షుడు, ముగ్గురు సభ్యులు
45. మోతీలాల్ నెహ్రూ నివేదిక ఏ సంవత్సరంలో వెలువడింది?
   1) 1927 2) 1928
   3) 1959 4) 1930
46. రాష్ట్రాల్లో ఉన్న ద్వంద్వ పాలనను రద్దుచేసి కేంద్రంలో ద్వంద్వ ప్రభుత్వాన్ని ప్రవేశపెట్టిన చట్టం ఏది?
   1) భారత కౌన్సిళ్ల చట్టం - 1909
   2) భారత కౌన్సిళ్ల చట్టం - 1919
   3) భారత ప్రభుత్వ చట్టం - 1935
   4) భారత స్వాతంత్ర్య చట్టం - 1947
47. ఏ చట్టం ద్వారా బర్మా (మయన్మార్)ను భారతదేశం నుంచి వేరు చేశారు?
   1) 1858 చట్టం 2) 1909 చట్టం
   3) 1935 చట్టం 4) 1919 చట్టం

సమాధానాలు

1) 2 2) 3 3) 3 4) 4 5) 3
6) 4 7) 2 8) 2 9) 4 10) 2
11) 4 12) 1 13) 4 14) 3 15) 1
16) 1 17) 1 18) 1 19) 4 20) 4
21) 1 22) 2 23) 3 24) 1 25) 4
26) 1 27) 3 28) 1 29) 4 30) 3
31) 4 32) 3 33) 1 34) 4 35) 1
36) 2 37) 1 38) 1 39) 3 40) 2
41) 2 42) 2 43) 1 44) 1 45) 2
46) 3 47) 3

'కనికట్టు' విద్యను ప్రదర్శించే జానపదులు?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
తెలుగు

జానపద సాహిత్యం

డీఎస్సీలో 'జానపద సాహిత్యం' తప్పనిసరి అంశం. లాంగ్వేజ్ పండిట్-తెలుగు, స్కూల్ అసిస్టెంట్ -తెలుగు ఇలా పరీక్షల స్వభావాన్ని బట్టి మార్కుల ప్రాధాన్యముంటుంది. అభ్యర్థులు ఈ విభాగంలో మార్కులు సాధించాలంటే డా॥ జి.ఎస్. మోహన్ **'జానపద విజ్ఞానాధ్యయనం'**, ఆర్వీయస్ సుందరం **'ఆంధ్రుల జానపద విజ్ఞానం'** గ్రంథాలను సేకరించి అధ్యయనం చేయాలి. ప్రత్యేకంగా నోట్స్ తయారు చేసుకోవాలి. అప్పుడే మంచి స్కోరు సాధించవచ్చు. ఈ విభాగంలో ప్రత్యేకించి 'జానపద సాహిత్య పరిచయం - లక్షణాలు - వర్గీకరణ - జానపద సాహిత్య సేకరణలో తెలుగువారి కృషి - పాశ్చాత్యుల కృషి - జానపద సాహిత్య విశేషాలు - జానపద కళారూపాలు - జానపద కళాకారులు, వారి వాద్య విశేషాలు - జానపద సాహిత్యంపై వచ్చిన పరిశోధనలు' మొదలైన అంశాలను క్షుణ్నంగా అధ్యయనం చేయాలి.

రిచర్డ్ ఎం. డార్సన్ 1972లో 'ఫోక్‌లోర్ అండ్ ఫోక్‌లైఫ్' గ్రంథ ఉపోద్ఘాతంలో జానపద విజ్ఞానాన్ని నాలుగు విధాలుగా వర్గీకరించారు. అవి..

1. **మౌఖిక జానపద విజ్ఞానం:** జానపద గేయాలు, కథా గేయాలు, జానపద పురాణాలు, ఇతిహాసాలు, గద్య కథనాలు, సామెతలు, పొడుపు కథలు, మాండలికాలు, నుడికారాలు, తిట్లు, ఒట్లు మొదలైనవన్నీ ఈ విభాగంలోకి వస్తాయి.
2. **సాంఘిక జానపదాచారాలు:** పుట్టుక, వివాహం, మరణం తదితరాంశాలకు సంబంధించిన ఆచారాలు, కుటుంబం, సంబంధ బాంధవ్యాలు, పండుగలు, వినోదాలు, ఆటలు, జానపద వైద్యం, మతం, నమ్మకం మొదలైనవన్నీ ఈ విభాగంలో చేరతాయి.
3. **వస్తు సంస్కృతి:** భౌతిక జీవితానికి సంబంధించిన అన్ని వస్తువులే కాకుండా కళారూపాలు కూడా వస్తు రూపంలో ఉంటే ఈ విభాగంలోనే చోటు పొందుతాయి. చిత్రకళ, వాస్తుకళ, వివిధ వృత్తుల పరికరాలు, దుస్తులు, అలంకరణ, ఆభరణాలు, ఆహార సామగ్రి, పూజా సామగ్రి, శిలా విగ్రహాలు, దారు విగ్రహాలు తదితర వస్తు రూపాంశాలెన్నో ఈ విభాగంలో వస్తాయి.
4. **జానపద కళలు:** సంగీతం, నృత్యం, అభినయం ఉండే ప్రదర్శన కళలన్నీ ఈ విభాగంలో చేరతాయి. గాత్ర సంగీతం, వాద్య సంగీతం, తోలు బొమ్మలాటలు, యక్షగానం, వీధి భాగోతం, కోలాటం, పగటి వేషాలు, బహురూపుల గారడీ విద్యలు మొదలైనవి ఈ విభాగంలో వస్తాయి.

జానపద సాహిత్యాన్ని ఎవరు ఎలా పిలిచారు

1. దేశిసారస్వతం	- శ్రీపాద గోపాల కృష్ణమూర్తి
2. ప్రజావాఙ్మయం	- ఖండవల్లి లక్ష్మీరంజనం
3. పదవాఙ్మయం	- తల్లావఝ్జుల శివశంకర శాస్త్రి
4. మధుర గీతాలు	- వేటూరి ప్రభాకర శాస్త్రి
5. అనాదృత వాఙ్మయం	- మల్లంపల్లి సోమశేఖర శర్మ

భిక్షకులు - ఆశ్రయం

1. పిచ్చుకుంట్లు	- రెడ్డి కులాశ్రితులు
2. వీరముష్టివారు	- వైశ్యాశ్రితులు
3. భట్రాజులు	- క్షత్రియాశ్రితులు
4. విప్రవినోదులు	- బ్రాహ్మణాశ్రితులు

జానపద సిద్ధాంతాలు - ప్రతిపాదకులు

1. మానవ శాస్త్రీయ- ఆంధ్రూల్యాంగ్ సిద్ధాంతం
2. భారతమూల- థియొడర్ బెన్ఫె సిద్ధాంతం
3. వలసవాదం - థియొడర్ బెన్ఫె
4. ఇండో -యూరోపి - గ్రిమ్ సోదరులు యన్ సిద్ధాంతం
5. స్వప్నమూల - లుడ్విగ్, లైస్నర్ సిద్ధాంతం
6. చారిత్రక భౌగోళిక - ఫిన్నిస్ (ఫిన్నిస్ వాదం) సిద్ధాంతం

జానపద సాహిత్యం- పరిశోధనలు

1. జానపద గేయ సాహిత్యం - బిరుదురాజు రామరాజు
2. జానపద గేయగాథలు - నాయని కృష్ణకుమారి
3. జానపద కళాసంపద - తూమాటి దోణప్ప
4. జానపద కళారూపాలు - మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
5. తోలుబొమ్మలాట - మొదలి నాగభూషణశర్మ
6. వీరగాథ వాఙ్మయం- తంగిరాల సుబ్బారావు
7. యక్షగాన వాఙ్మయం - ఎస్వీ జోగారావు
8. జానపద కథా స్రవంతి - కె.సుమతి
9. జానపద సాహిత్యం - పురాగాథలు - రావి ప్రేమలత
10. తెలుగు సామెతలు - చిలుకూరి నారాయణరావు
11. స్త్రీల రామాయణ పాటలు - శ్రీపాద గోపాలకృష్ణమూర్తి

మాదిరి ప్రశ్నలు

1. 'Folk Lore' అంటే?
   1) జానపదుల అధ్యయనం
   2) జానపద విజ్ఞానం
   3) జానపద సాహిత్యం
   4) జానపదుల మూఢనమ్మకం
2. జానపద గేయాల ప్రధాన లక్షణాలు?
   1) లిఖిత ప్రచారం, ఏక కర్తృకం
   2) మౌఖిక ప్రచారం, జ్ఞాత కర్తృకం
   3) ఆశురచన, అనామక కర్తృతం
   4) అకృతక శైలి, గానయోగ్యతారాహిత్యం
3. ఆంధ్రుల జానపద సాహిత్య సేకరణలో తీవ్ర కృషి చేసినవారు?
   1) ఆర్వీయస్ సుందరం
   2) నేదునూరి గంగాధరం
   3) జి.ఎస్.మోహన్
   4) బిరుదురాజు రామరాజు
4. 'జానపద వాఙ్మయోద్ధారక' బిరుదాంకితులు?
   1) నేదునూరి గంగాధరం
   2) బిరుదురాజు రామరాజు
   3) తంగిరాల సుబ్బారావు
   4) ఆర్వీయస్ సుందరం
5. శారద కాంధ్రు ఏ ప్రాంతానికి చెందినవారు?
   1) తెలంగాణ 2) కోస్తాంధ్ర
   3) రాయలసీమ 4) బీదర్
6. 'తోలుబొమ్మలాట' జానపద విజ్ఞానంలో ఏ విభాగానికి చెందింది?
   1) మౌఖిక జానపద విజ్ఞానం
   2) సాంఘిక జానపదాచారాలు
   3) వస్తు సంస్కృతి
   4) జానపద కళలు
7. తెలుగు జానపద సాహిత్యాన్ని మానవశాస్త్ర దృష్టితో పరిశీలించిన తొలి మహిళా పరిశోధకురాలు?
   1) నాయని కృష్ణకుమారి
   2) కుసుమ కుమారి
   3) డి. లలిత కుమారి
   4) రావి ప్రేమలత
8. యక్షగానం దేనికి సంబంధించింది?
   1) జానపద కళ 2) శిల్పకళ
   3) నాట్య కళ 4) అదృశ్య కళ
9. 'పసిడిపలుకులు', 'మిన్నేరు', 'సెలయేరు' జానపద రచనలు ఎవరు చేశారు?
   1) బిరుదురాజు రామరాజు
   2) ఆర్వీఎస్ సుందరం
   3) నేదునూరి గంగాధరం
   4) జి.ఎస్. మోహన్
10. జానపద సాహిత్య స్వరూపం ఎవరి రచన?
   1) నేదునూరి గంగాధరం
   2) ఆర్వీఎస్ సుందరం
   3) జి.ఎస్. మోహన్
   4) బిరుదురాజు రామరాజు
11. 'జానపద కళాసంపద' పేరుతో ఎనిమిది ఉత్తమ వ్యాస సంపుటాలను ఎవరు వెలువరించారు?
   1) నేదునూరి గంగాధరం
   2) ఆర్వీఎస్ సుందరం
   3) తంగిరాల సుబ్బారావు
   4) తూమాటి దోణప్ప
12. జానపద కళారూపాలపై విశిష్ట గ్రంథం రాసిందెవరు?
   1) యస్వీ జోగారావు
   2) మొదలి నాగభూషణ శర్మ
   3) శ్రీపాద గోపాలకృష్ణమూర్తి
   4) మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి
13. సంగీత, నృత్య ప్రధానమైన దేశీ రూపకం?
   1) కోలాటం 2) తప్పెటగుళ్లు
   3) యక్షగానం 4) బుర్రకథ
14. ఏ ప్రక్రియకు ప్రాచీన రూపంగా 'కొర వంజిని' ని పేర్కొంటారు?
   1) కథా కావ్యం 2) యక్షగానం
   3) చారిత్రక కావ్యం 4) ఇతిహాసం
15. జానపదుల కథల మీద విశేషంగా కృషి చేసిన పాశ్చాత్యుడు?
   1) రిచర్డ్ ఎం. డార్సన్
   2) స్టిత్ థాంప్సన్
   3) జె.ఎ.బోయల్
   4) సి.పి. బ్రౌన్
16. తెలుగులో జానపద గేయాలను ప్రచురించిన వారిలో మొదటివారు?
   1) నేదునూరి గంగాధరరావు
   2) నందిరావు చలపతిరావు
   3) జె.ఎ.బోయల్ 4) సి.పి. బ్రౌన్
17. తోలుబొమ్మలాట, వీధి భాగవతం అనేవి ఏ కళలలోకి వస్తాయి?
   1) జానపద కళలు 2) నృత్య కళలు
   3) నాటక కళలు 4) సంగీత కళలు
18. వంతపాట గల కళారూపమేది?
   1) హరికథ 2) బుర్రకథ
   3) తోలుబొమ్మలాట 4) ప్రహసనం
19. కృష్ణ చెంచులక్ష్మీ సంవాదం, గంగా గౌరీ సంవాదం అనే జానపద గేయాల్లో ఉన్న రసమేది?
   1) శృంగారం 2) హాస్యం
   3) కరుణ 4) అద్భుతం
20. 'జానపద గేయవాఙ్మయ పరిచయం' ఎవరు రచించారు?
   1) ఆచార్య నాయని కృష్ణకుమారి
   2) ఆచార్య బి. రామరాజు
   3) ఆచార్య యస్వీ జోగారావు
   4) హరి ఆదిశేషువు
21. 'ఆంధ్రుల జానపద విజ్ఞానం' రచయిత?
   1) ఆర్వీయస్ సుందరం
   2) బి. రామరాజు
   3) తంగిరాల సుబ్బారావు
   4) యస్వీ జోగారావు
22. 'తెలుగు హరికథా సర్వస్వం' జానపద పరిశోధన గ్రంథం ఎవరిది?
   1) తూమాటి దోణప్ప
   2) బిరుదురాజు రామరాజు
   3) తంగిరాల సుబ్బారావు
   4) ఆర్వీయస్ సుందరం
23. తెలుగులో జానపద గేయాల్లో పల్నాటి వీర చరిత్ర కథాగేయాన్ని ఎవరు సేకరించారు?
   1) సి.పి. బ్రౌన్ 2) జె.ఎ.బోయల్
   3) మెకంజీ 4) కాంప్‌బెల్
24. జుట్టు పోలిగాడు, కేతిగాడు, బంగారక్క పాత్రలున్న కళారూపం?
   1) ఒగ్గు కథ 2) తోలు బొమ్మలాట
   3) వీధి భాగోతం 4) పగటి వేషాలు
25. గోండుల నృత్య విశేషం?
   1) బంజారా 2) మామిడి
   3) గుస్సాడి 4) లంబాడీ
26. జానపద కళాకారులగు బవనీల వాద్య విశేషం?
   1) డమరుకం 2) తప్పెట
   3) గంట, శంఖం 4) జమిడిక
27. 'కనికట్టు' విద్యను ప్రదర్శించే జాన పదులు?
   1) బుడబుక్కలోళ్లు 2) బవనీలు
   3) కాటిపాపలు 4) బైరూపులోళ్లు
28. వీరగాథ చిత్రానికి ఇది ఉదాహరణ?
   1) సర్వాయి పాపడి కథ
   2) బాలనాగమ్మ కథ
   3) కాటమరాజు కథ
   4) బొబ్బిలి కథ
29. బ్యాలడ్ అనే పదం ఏ భాష నుంచి వచ్చింది?
   1) గ్రీకు 2) లాటిన్
   3) ఇంగ్లిష్ 4) ఫ్రెంచ్
30. జానపద సంగీతం దేనిలో అంతర్భాగం?
   1) వస్తు సంస్కృతి
   2) ప్రదర్శన కళలు
   3) మౌఖిక సాహిత్యం
   4) జానపద ఆచారం
31. కెప్టెన్ ఎం.డబ్ల్యు.కార్ రచించిన గ్రంథం?
   1) పసిడి పలుకులు
   2) ఆంధ్ర లోకోక్తి చంద్రిక
   3) లోకోక్తి ముక్తావళి
   4) తెలుగు సామెతలు
32. జానపద విజ్ఞాన వస్తు ప్రదర్శనశాలల వల్ల ప్రయోజనం?
   1) జానపద గేయ సేకరణ
   2) సంస్కృతి పరిరక్షణ
   3) ఆచారాల సంరక్షణ
   4) వీధిగాథల సంగ్రహణ
33. తత్త్వాలు పాడే వీధి గాయకుల వాయిద్యం?
   1) తంబూర 2) ఏకతార
   3) మద్దెల 4) పిల్లనగ్రోవి
34. ఆర్.ఎస్. బాగ్స్ జానపద విజ్ఞాన వర్గీకరణలో 'V' అనే అక్షరం దేన్ని సూచిస్తుంది?
   1) పొడుపు కథ 2) వాక్కు
   3) నమ్మకం 4) సామెత

సమాధానాలు

1) 2; 2) 3; 3) 2; 4) 1; 5) 1;
6) 4; 7) 1; 8) 1; 9) 3; 10) 2;
11) 4; 12) 4; 13) 3; 14) 2; 15) 2;
16) 3; 17) 1; 18) 2; 19) 2; 20) 4;
21) 1; 22) 1; 23) 1; 24) 2; 25) 3;
26) 4; 27) 3; 28) 1; 29) 2; 30) 2;
31) 2; 32) 2; 33) 1; 34) 4.

నాజీ పార్టీ వ్యవస్థాపకుడిగా ఎవరిని పేర్కొంటారు?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

వరల్డ్ హిస్టరీ



మాదిరి ప్రశ్నలు

1. 'పునరుజ్జీవనోద్యమ సాహిత్య పిత'గా ఎవరిని పేర్కొంటారు?
   1) గిట్టో 2) బొకాషియో
   3) పెట్రార్క్ 4) డ్యూరర్
2. జతపరచండి.
   జాబితా - I
   i) కాక్స్‌టన్ ii) జాన్ గూటన్‌బర్గ్
   iii) ఛాసర్ iv) డాంటే
   జాబితా - II
   ఎ) జర్మనీలో ముద్రణా యంత్రం నెలకొల్పాడు
   బి) ఇంగ్లండ్‌లో ముద్రణా యంత్రం నెలకొల్పాడు
   సి) దివైన్ కామెడీ గ్రంథం రాశాడు
   డి) ఆంగ్ల కవితాపిత
   1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
   2) i- డి, ii- బి, iii- సి, iv-ఎ
   3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
   4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
3. 'ఈ విశ్వాన్ని సృష్టించిందీ, నడిపిస్తున్నదీ మేధస్సే' అని వ్యాఖ్యానించిన వారు?
   1) థామస్ అక్వినాస్ 2) ఫ్రాన్సిస్ బేకన్
   3) జాన్ గూటన్ బర్గ్ 4) గెలీలియో
4. జతపరచండి.
   జాబితా - I
   i) విప్లవాల మాత ii) పార్లమెంట్‌ల మాత
   iii) ఐరోపా జబ్బు మనిషి iv) దైవ శాపగ్రస్థ దేశం
   జాబితా - II
   ఎ) జర్మనీ బి) టర్కీ
   సి) ఇంగ్లండ్ డి) ఫ్రాన్స్
   1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
   2) i- డి, ii- సి, iii- బి, iv-ఎ
   3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
   4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
5. వ్లాదిమిర్ ఇల్విచ్ ఉల్యనోవ్ అనేది ఎవరి అసలు పేరు?
   1) లెనిన్ 2) స్టాలిన్
   3) టాట్కీ 4) మొదటి జేమ్స్
6. ఆంగ్లేయ మహా విప్లవం ఎప్పుడు సంభవించింది?
   1) క్రీ.శ. 1666 2) క్రీ.శ. 1676
   3) క్రీ.శ. 1688 4) క్రీ.శ. 1698
7. పార్లమెంట్ అనే పదానికి మూలమైన 'పార్లీ' అనే పదానికి అర్థం?
   1) చర్చలు, సంప్రదింపులు
   2) రాయడం, వ్యాఖ్యానించడం
   3) ఆసక్తి, పరిశీలన 4) ఆదాయం, వ్యయం
8. కింది వాటిలో ఇంగ్లండ్ 'బిల్ ఆఫ్ రైట్స్'లో ఉండే అంశం ఏది?
   1) పార్లమెంట్ అనుమతి లేనిదే పన్నులు వసూలు చేయకూడదు
   2) పార్లమెంట్‌ను ఎన్నుకోవాలి, తరచూ సమావేశాలు నిర్వహించాలి
   3) శాంతి నెలకొన్న తరుణంలో పార్లమెంట్ అనుమతి లేకుండా శాశ్వత సైన్యాన్ని పోషించకూడదు
   4) పైవన్నీ సరైనవే
9. జతపరచండి.
   జాబితా - I
   i) లాంగ్ పార్లమెంట్ (ఇంగ్లండ్)
   ii) మొదటి చార్లెస్ (ఇంగ్లండ్) పాలనాకాలం
   iii) లెనిన్ (రష్యా) పాలనాకాలం
   iv) 15వ లూయీ (ఫ్రాన్స్) పాలనాకాలం
   జాబితా - II
   ఎ) 1625 - 1649 బి) 1640 - 1660
   సి) 1715 - 1774 డి) 1917 - 1924
   1) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
   2) i- డి, ii- సి, iii- బి, iv-ఎ
   3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
   4) i- బి, ii- ఎ, iii- సి, iv-డి
10. అమెరికాలో సంపూర్ణ స్వాతంత్ర్య ప్రకటన చేసిన ప్రాంతం ఏది?
    1) ఫిలడెల్ఫియా 2) జార్జియా
    3) న్యూయార్క్ 4) వర్జీనియా
11. బ్రెజిల్ పోర్చుగల్ నుంచి ఎప్పుడు స్వాతంత్ర్యం పొందింది?
    1) 1813 2) 1822
    3) 1833 4) 1843
12. 'ప్రపంచ కార్మికులారా ఏకంకండి. పోరాడితే పోయేదేమీ లేదు. బానిస సంకెళ్ల తప్ప' అని పిలుపునిచ్చిందెవరు?
    1) ఫ్రెడరిక్ ఏంజెల్ 2) కారల్ మార్క్స్
    3) బెనిటో ముస్సోలిని
    4) నెపోలియన్ బోనాపార్టే
13. వర్జీనియాలోని యార్క్‌టౌన్ ద్వీపకల్పం వద్ద అమెరికా సేనలకు లొంగిపోయిన బ్రిటిష్ సైన్యాలకు నాయకుడు ఎవరు?
    1) వారన్ హేస్టింగ్స్ 2) వెల్లస్లీ
    3) రాబర్ట్ క్లైవ్ 4) కారన్ వాలీస్
14. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) న్యూడీల్ పథకం - ఎఫ్.డి. రూజ్‌వెల్ట్ (అమెరికా)
    2) నూతన ఆర్థిక విధానం - లెనిన్ (రష్యా)
    3) రక్తపాత విధానం - ఆటోవాన్ బిస్మార్క్ (జర్మనీ)
    4) కాల్బర్టిజం - నెక్కర్ (ఫ్రాన్స్)
15. రెండో నల్లమందు యుద్ధానికి తక్షణ కారణం ఏది?
    1) లోర్చాయారో నౌక ఉదంతం
    2) చైనా మకావో ఓడరేవును మూసి వేయడం
    3) ఇంగ్లండ్‌లో చైనా వారు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం
    4) చైనా భూగర్భంలో తలపెట్టిన రైలు మార్గ నిర్మాణం
16. 'విముక్తినిచ్చిన జార్' అని ఎవరిని అంటారు?
    1) జార్ మొదటి అలెగ్జాండర్
    2) జార్ మొదటి నికోలస్
    3) జార్ మూడో అలెగ్జాండర్
    4) జార్ రెండో అలెగ్జాండర్
17. నాజీ పార్టీ స్థాపకుడు ఎవరు?
    1) అడాల్ఫ్ హిట్లర్ 2) డ్రెక్లర్
    3) రిబ్బెన్ ట్రాప్ 4) వాన్‌రూన్
18. గ్రంథం, దాని రచయితకు సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
    జాబితా - I
    i) మైన్‌కాంఫ్
    ii) ఎ స్టడీ ఆఫ్ ఫిజికల్ కల్చర్
    iii) సోషల్ కాంట్రాక్ట్
    iv) స్పిరిట్ ఆఫ్ లాస్
    జాబితా - II
    ఎ) మాహాబ్స్‌టుంగ్ బి) అడాల్ఫ్ హిట్లర్
    సి) మాంటెస్క్యూ డి) రూసో
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
    3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
    4) i- బి, ii- ఎ, iii- సి, iv-డి
19. కింది వాటిలో సరైన జత ఏది?
    1) ఇండల్జెన్సెస్ - పాప పరిహార పత్రాలు
    2) లెజాఫేర్ - జోక్యం చేసుకోకు
    3) అపార్థీడ్ - వర్ణ వివక్ష
    4) పైవన్నీ సరైనవే
20. యూరప్‌లో ఆచరణలో ఉన్న 'పుట్టింగ్ ఔట్ పద్ధతి' అంటే?
    1) ముడి సరుకులను వృత్తి పని వారికి అప్పగించి పని చేయించడం
    2) ఓడరేవులను కార్మికులకు అప్పగించడం
    3) సముద్రాలపై వ్యాపార గుత్తాధిపత్యం కలిగి ఉండటం
    4) వ్యవసాయాన్ని వాణిజ్యీకరణ చేయడం
21. 'ది ప్రిన్స్' గ్రంథ రచయిత ఎవరు?
    1) మాఖియవెల్లి 2) రాఫెల్
    3) డ్యూరర్ 4) ఎరాస్మస్
22. జతపరచండి.
    జాబితా - I
    i) దైవ దత్తాధికార సిద్ధాంతం అనుసరించిన వారు
    ii) మానవుడు సమాజం అనే సంకెళ్లలో బంధించబడ్డాడు అని వ్యాఖ్యానించిన వారు
    iii) 'వర్గ పోరాటపు రికార్డే చరిత్ర' అని పేర్కొన్నవారు
    iv) 'నేనే రాజ్యం' అని వ్యాఖ్యానించిన వారు
    జాబితా - II
    ఎ) 14వ లూయీ బి) కారల్ మార్క్స్
    సి) రూసో డి) మొదటి జేమ్స్
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- డి, ii- సి, iii- బి, iv-ఎ
    3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
23. 'రాజుల్లో సూర్యుడు' అని పేరొందిన వారెవరు?
    1) 4వ హెన్రీ 2) 14వ లూయీ
    3) 15వ లూయీ 4) 16వ లూయీ
24. 'ఫ్రెంచ్ ఈస్టిండియా కంపెనీ'ని ఎప్పుడు స్థాపించారు?
    1) 1664 2) 1654
    3) 1668 4) 1678
25. పవిత్ర రోమన్ సామ్రాజ్యాన్ని విచ్ఛిన్నం చేసిందెవరు?
    1) 16వ లూయీ
    2) నెపోలియన్ బోనాపార్టే
    3) 7వ హెన్రీ 4) రెండో ఛార్లెస్
26. జతపరచండి.
    సంవత్సరం
    i) 1865 ii) 1869
    iii) 1898 iv) 1929
    ప్రాధాన్యం
    ఎ) ప్రపంచ ఆర్థిక మాంద్యం
    బి) అబ్రహం లింకన్ హత్య
    సి) చైనాలో వంద రోజుల సంస్కరణలు
    డి) సూయజ్ కాలువ తెరవడం
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- డి, iii- సి, iv-ఎ
    3) i- ఎ, ii- బి, iii- సి, iv-డి
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
27. 'ఉదయించే సూర్యుడి భూమి'గా పేరొందిన దేశం?
    1) జర్మనీ 2) జపాన్
    3) ఇంగ్లండ్ 4) ఫ్రాన్స్
28. 'కార్బొనారీ' అంటే?
    1) బొగ్గు కాల్చేవారు 2) స్వేచ్ఛాపుత్రులు
    3) పన్నులు చెల్లించేవారు
    4) విద్యార్థులు
29. జతపరచండి.
    జాబితా - I
    i) ది మోనాలిసా చిత్రం
    ii) ప్రైస్ ఆఫ్ పాలీ గ్రంథం
    iii) గైడ్ టు జాగ్రఫీ
    iv) ది లాస్ట్ జడ్జిమెంట్ చిత్రం
    జాబితా - II
    ఎ) టాలమీ బి) మైఖెలాంజిలో
    సి) ఎరాస్మస్ డి) లియోనార్డో డావెన్సీ
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- డి, iii- సి, iv-ఎ
    3) i- డి, ii- సి, iii- ఎ, iv- బి
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
30. కింది వాటిలో హిట్లర్ స్థాపించనిది ఏది?
    1) గెస్టే పో (రహస్య పోలీస్ దళం)
    2) పీపుల్స్ అబ్జర్వర్ (పత్రిక)
    3) రెడ్ షర్ట్స్ (ఎర్ర చొక్కాల దళం)
    4) ఎలైట్ గార్డ్స్ (అత్యున్నత రక్షక దళం)
31. జతపరచండి.
    ప్రముఖుడు
    i) బెనిటో ముస్సోలిని ii) హిట్లర్
    iii) జోసెఫ్ మాజినీ iv) ఆలీవర్ క్రాంవెల్
    బిరుదు
    ఎ) ఫ్యూరర్ బి) ఇల్‌డ్యూస్
    సి) లార్డ్ ప్రొటెక్టర్ డి) ఇటలీ జాతీయోద్యమ ప్రవక్త
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- డి, iii- సి, iv-ఎ
    3) i- డి, ii- సి, iii- ఎ, iv- బి
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
32. 'అన్ని సముద్రాలు కలిసే ఉన్నాయి' అనే విషయాన్ని తొలిసారి తన భౌగోళిక యాత్రల ద్వారా వివరించిందెవరు?
    1) ఫెర్డినాండ్ మాజిలాన్
    2) క్రిస్టఫర్ కొలంబస్
    3) వాస్కోడిగామా 4) ఫ్రెడరిక్ బార్బోసా
33. 'రినైజాన్స్' అనేది ఏ భాషాపదం?
    1) ఫ్రెంచ్ 2) జర్మన్
    3) గ్రీక్ 4) స్పానిష్
34. మధ్యయుగం నాటి ఐరోపా వాస్తు శైలిని ఏమంటారు?
    1) సమురాయ్ 2) పైటా
    3) మీర్ 4) గోథిక్
35. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) నిజమైన క్రైస్తవుడు - జాన్ కాల్విన్
    2) మత సంస్కరణోద్యమానికి వేగు చుక్క - జాన్ విక్లిఫ్
    3) ది నావిగేటర్ - హెన్రీ
    4) ఆధునిక జస్టీనియన్ - లూయీ ఫిలిప్
36. 1830 నాటికి ప్రపంచంలోనే తొలి రైలు ఏయే ప్రాంతాల మధ్య నడిచింది?
    1) మాంచెస్టర్ - బ్రిస్టల్
    2) బ్రిస్టల్ - లివర్‌పూల్
    3) లివర్‌పూల్ - మాంచెస్టర్
    4) స్టాకేటన్ - డార్లింగ్‌టన్
37. జతపరచండి.
    జాబితా - I
    i) మరమగ్గం ii) ఆవిరి యంత్రం
    iii) వాటర్ ఫ్రేమ్ iv) స్పిన్నింగ్ మ్యూల్
    జాబితా - II
    ఎ) రిచర్డ్ ఆర్క్‌రైట్
    బి) శామ్యూల్ క్రాంప్టన్
    సి) ఎడ్మండ్ కార్ట్‌రైట్ డి) జేమ్స్‌వాట్
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- డి, iii- సి, iv-ఎ
    3) i- సి, ii- డి, iii- ఎ, iv-బి
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
38. ఫ్రాన్స్ జాతీయ దినోత్సవాన్ని ఎప్పుడు నిర్వహించుకుంటారు?
    1) జూన్ 14 2) జూలై 14
    3) ఆగస్టు 14 4) సెప్టెంబర్ 14
39. 'ఫ్రెంచ్ విప్లవానికి బైబిల్' అని ఏ గ్రంథాన్ని అంటారు?
    1) సోషల్ కాంట్రాక్ట్
    2) వెల్త్ ఆఫ్ నేషన్స్
    3) స్పిరిట్ ఆఫ్ లాస్
    4) ప్రిన్సిపియా మ్యాథమెటికా
40. ఫ్రాన్స్‌లో బానిసత్వాన్ని అధికారికంగా ఎప్పుడు రద్దు చేశారు?
    1) 1789 2) 1794
    3) 1796 4) 1799
41. ఐక్య జర్మనీ తొలి రాజధాని ఏది?
    1) బెర్లిన్ 2) ఫ్రాంక్‌ఫర్ట్
    3) బాండెన్‌బర్గ్ 4) ఉర్టెంబర్గ్
42. బోయర్ల యుద్ధం ఎప్పుడు జరిగింది?
    1) 1899–1902 2) 1905–1909
    3) 1907–1911 4) 1909–1912
43. సెయింట్ పీటర్స్‌బర్గ్ ప్రాంతం పేరు ఏమని మార్చారు?
    1) లెనిన్ గ్రాడ్ 2) స్టాలిన్ గ్రాడ్
    3) కెరెన్స్కీ గ్రాడ్ 4) టాట్స్కీ గ్రాడ్
44. జతపరచండి.
    జాబితా-I
    i) 1921 ii) 1945
    ii) 1920 iv) 1949
    జాబితా-II
    ఎ) ఉత్తర అట్లాంటిక్ రాజ్యాల సంధి వ్యవస్థ (NATO)
    బి) నానాజాతి సమితి (LN)
    సి) నూతన ఆర్థిక విధానం (NEP)
    డి) ఐక్యరాజ్య సమితి (UNO)
    1) i- ఎ, ii- సి, iii- బి, iv-డి
    2) i- బి, ii- డి, iii- సి, iv-ఎ
    3) i- సి, ii- డి, iii- బి, iv- ఎ
    4) i- బి, ii- ఎ, iii- డి, iv-సి
45. 'విద్య కావాలని మన సేద్యగాళ్లు అడిగిన రోజున నీ స్థానంలో నీవు నా స్థానంలో నేను ఉండం' అని వ్యాఖ్యానించిన వారెవరు?
    1) మేరీ ఆంటువానెట్ 2) అలెగ్జాండ్రియా3) రెండో క్యాథరిన్ 4) మొదటి ఎలిజబెత్
46. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) గులాబీల యుద్ధం - 1453 -1485
    2) శతవర్ష సంగ్రామం - 1337–1437
    3) ట్యూడర్ వంశ పాలనాకాలం - 1485–1603
    4) స్టువర్ట్ వంశ పాలనాకాలం - 1603–1688
47. పిలిగ్రిమ్ ఫాదర్స్ (ప్యూరిటన్లు) ఏ నౌకలో మెసాచూసెట్స్ చేరుకున్నారు?
    1) గ్లోబ్ 2) శాంటా
    3) మే ఫ్లవర్ 4) నినా
48. 'ఆసియా ఆసియా వాసులకే' అని నినదించిన దేశం?
    1) జపాన్ 2) చైనా
    3) భారత్ 4) శ్రీలంక
49. ఫ్రాన్స్ నుంచి అమెరికా కొనుగోలు చేసిన భూభాగం ఏది?
    1) న్యూయార్క్ 2) ఫిలడెల్ఫియా
    3) లూసియానా 4) వర్జీనియా
50. రెండో నల్లమందు యుద్ధానంతరం చైనా, ఇంగ్లండ్ చేసుకున్న సంధి?
    1) నాన్ కింగ్ సంధి 2) పెకింగ్ సంధి
    3) పోర్ట్స్ మౌట్ సంధి 4) బీజింగ్ సంధి

సమాధానాలు

1) 3	2) 4	3) 1	4) 2	5) 1
6) 3	7) 1	8) 4	9) 1	10) 1
11) 2	12) 2	13) 4	14) 4	15) 1
16) 4	17) 2	18) 2	19) 4	20) 1
21) 1	22) 2	23) 2	24) 1	25) 2
26) 2	27) 2	28) 1	29) 3	30) 3
31) 4	32) 1	33) 1	34) 4	35) 4
36) 3	37) 3	38) 2	39) 1	40) 2
41) 1	42) 1	43) 1	44) 3	45) 3
46) 2	47) 3	48) 1	49) 3	50) 2

What did the government do right?

BANK EXAMS

GENERAL ENGLISH



Model Questions

Directions (Q.No. 1-5): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error, if any, will be in one part of the sentence. Mark the number of that part with error as your answer. If there is 'No error', mark (5) as your answer.

1. Many economists and expert committees (1)/ have in the past argued that the RBI is holding (2)/ much higher capital than required (3)/ to cover all its risks and contingency. (4)/ No error (5)
2. Harmanpreet became the first Indian woman cricketer to score a century in T-20 Internationals. (1)/ Earlier this year, she is embroiled in controversy (2)/ after the Punjab government withdrew her DSP rank (3)/ saying her degree had been found to be fake. (4)/ No error (5)
3. Sri Lankan President Maithripala Sirisena on Sunday stoutly defended his controversial move (1)/ to dissolve the parliament, saying it was taken to prevent clashes (2)/ between rival lawmakers (3)/ and also blamed Speaker for not accepting his presidential powers. (4)/ No error (5)
4. The Election Commission on Friday imposed a three-month-long ban (1)/ on holding exit polls (2)/ beginning November 12 (3)/ in the five poll-bound states include Telangana. (4)/ No error (5)
5. The National Flag will fly at half-mast throughout the country on Monday (1)/ to pay homage Union minister Ananth Kumar (2)/ who died in the early hours. (3)/ The Central government will also accord a state funeral to the senior BJP leader. (4)/ No error (5)

Directions (Q.No. 6-10): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

6. She looked at him, and laughed; a cold laugh, ____, yet not bitter.
   1) Disdainful 2) respectful
   3) deferential 4) referential
   5) reverent
7. My brother was ____; he has attached himself to the retinue of a wealthy Baroness.
   1) Servile 2) imply
   3) comply 4) entail
   5) authoritative
8. Punishment is ____in deterring from crime only if it be certain and ____.
   1) Useless, slow
   2) futile, leisurely
   3) ineffectual, dawdling
   4) vain, sluggish
   5) efficacious, speedy
9. The Trump administration's ____ indifference to European concerns boils the blood of even the most ____ of Eurocrats.
   1) simple, bustling
   2) basic, docile
   3) ambiguous, serene
   4) undetectable, quite
   5) Apparent, placid
10. The hotel's shabby, outdated exercise room was its ____ attempt at a health spa.
    1) hefty 2) paltry
    3) substantial 4) generous
    5) considerable

Directions: (Q.No. 11 - 15) Which of the phrases (1), (2), (3), and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error mark (5) No correction required as your answer.

11. <u>She recommended that John should take the ferry.</u>
    1) She recommended that John takes the ferry.
    2) She recommended that John is taking the ferry.
    3) She recommended that John has taken the ferry.
    4) She recommended that John take the ferry.
    5) No correction required
12. After the attack on the World Trade Center, the President ordered intelligence agencies <u>should prepare lists of who were America's most wanted terrorists.</u>
    1) would do the preparation of lists of America's most wanted terrorists
    2) preparing lists of most wanted terrorists in America
    3) the preparing of a list of the most wanted terrorists in America
    4) to prepare lists of the most wanted terrorists in America
    5) No correction required
13. The exhibit, created by painstaking craftsmanship in the jungles of Burma, consisted of hundreds of paintings, <u>each painting a tiny etched landscape inside its</u> own ceramic work of pottery.
    1) all the paintings a tiny etched landscape inside their
    2) all the paintings a tiny etched landscape inside its
    3) every painting a tiny etched landscape inside their
    4) each painting a tiny etched landscape inside their
    5) No correction required
14. More than one hundred years ago, students of ornithology reported that hummingbirds can hover <u>as insects flitting gracefully from one flower to another.</u>
    1) like insects flitting gracefully from one flower to another
    2) as insects do that flit gracefully from one flower to others
    3) like insects do that flit gracefully from one flower to others
    4) as do insects that flit gracefully from one flower to some other one
    5) No correction required
15. Forced to cut back their stock, automobile dealers in the area have cut prices; <u>have been priced to sell, and they are</u>
    1) are priced to sell, and they have
    2) are priced to sell, and they do
    3) are being priced to sell, and have
    4) had been priced to sell, and they have
    5) No correction required

Directions (Q.No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A) The jump in the ranking, from 100 to 77, is correlated with an improvement in the ratings, a jump of 6.6 per cent over last year.
B) Such questions are critical to help evolve a more focussed set of policy priorities for India.
C) What was even more interesting was that construction permits and cross-border trade were two aspects that showed maximum improvement.
D) What did the government do right? If business has become so much easier, why don't we see a boom in new businesses and investment?
E) The improvement in India's "Doing Business" rankings was quite a surprise, and among the few pleasant ones in recent weeks.
F) This is the second year that India has seen a massive jump in the same ratings with its ranking going up by 23 places this year, on top of 30 places last year.

16. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C
    4) D 5) E
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D
    4) F 5) E
18. What is the SECOND sentence after rearrangement?
    1) A 2) B 3) D
    4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C
    4) D 5) E
20. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C
    4) D 5) F

KEY

1) 4	2) 2	3) 3	4) 4	5) 2
6) 1	7) 1	8) 5	9) 5	10) 2
11) 4	12) 4	13) 5	14) 2	15) 2
16) 1	17) 2	18) 3	19) 5	20) 3